ఆర్షవిద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# SRIMADBHAGAVADGITA - FIRST SHATKAM

# శ్రీమద్భగవద్గీత – మొదటి షట్కము

## స్వామి పరమార్థానంద

శ్రీభగవాన్ ఉవాచ
అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥

## స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

## వారి ఆశీస్సులతో

## తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

Second edition – Guru Purnima, 03 July Year 2023    1000 copies
For Copies
Arsha Vidya Tarangini
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy
http://telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

Title – BHAGAVADGITA – FIRST SHATKAM

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP – Sri S Rajendra Kumar 98661 15622

Printed at
Sai Sri Printers
8-3-945, # 21 Pancom Business Centre
Ameerpet, Hyderabad - 500073
e-mail: saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222    Price Rs. 900

# బ్రహ్మయజ్ఞం

ఆర్ష విద్యా తరంగిణి సభ్యులు మావద్ద శ్రద్ధా భక్తులతో ఆత్మవిద్యను అధ్యయనం చేస్తూ, ఆన్‌లైన్‌లో మననం చేసుకుంటూ, తాము నేర్చుకున్న జ్ఞానాన్ని నిదిధ్యాసనద్వారా, జీవితంలో రంగరించుకుంటూ జ్ఞాననిష్ఠలో నిలుస్తున్నారు. రీకాప్‌లకు నేనంటే నేను అని పోటిపడి వేదాంతశాస్త్రాన్ని ఔపోసన పడుతున్నారు. వీరంతా బ్రహ్మవిద్యమీద ఎంతో మక్కువ చూపుతూ, అతిరహస్యమైన బ్రహ్మవిద్యను శీఘ్రంగానే అందుకుంటున్నారు. మన సభ్యులే కాకుండా శాస్త్రంమీద పట్టు ఉన్న ఔత్సాహికులెందరో ఉన్నారు.

భగవద్గీత మొదటి షట్కం రెండవ ముద్రణ అనే ఈ బ్రహ్మయజ్ఞానికి ఇతోధికంగా సహకరించిన వారు –

శ్రీ ఈమని వెంకట్ గారు
శ్రీ కోనేరు రామకృష్ణ గారు
శ్రీమతి యలవర్తి శారద గారు
డా॥ నాయని ఇందిర గారు
శ్రీమతి నున్న సీతా రత్నం గారు
శ్రీమతి కొల్లా ఉషారాణి గారు
శ్రీమతి గంటి సుభద్ర గారు
శ్రీమతి కావలిపురపు సూర్యకుమారి గారు
శ్రీమతి చలసాని రాజ్యలక్ష్మి గారు
శ్రీమతి ప్రాతూరి సత్యవాణి గారు
శ్రీమతి నెమలికంటి హేమమాలిని గారు
శ్రీమతి ఉపాధ్యాయుల సీత గారు
శ్రీమతి నాయని ఉష గారు
శ్రీమతి గరిమెళ్ళ సుమిత్ర గారు
శ్రీమతి గోపరాజు అనూరాధ గారు
శ్రీ ముంజులూరి వెంకట జోగారావు గారు
శ్రీ తల్లపనేని మాలకొండయ్య గారు

శ్రీ అయినంపూడి రూప్ కుమార్ గారు
శ్రీ నాయని రవికిషోర్ గారు
శ్రీ బొంత వెంకట నరసింహమూర్తి గారు
శ్రీ పిరాట్ల సత్యనారాయణ శాస్త్రి గారు
శ్రీమతి మల్లాది శిరీష కుమారి గారు
శ్రీ పిరాట్ల కృష్ణకాంత్ గారు
శ్రీ సర్వేశ్వరకుమార్ గారు
శ్రీ సత్తిరాజు విశ్వనాథ్ గారు
శ్రీమతి వడ్లమాని గిరిజ గారు
శ్రీమతి కోకా నళిని గారు
శ్రీమతి గోనెళ్ళ భారతి గారు
శ్రీమతి రావులపర్తి రాజేశ్వరి గారు
శ్రీమతి పాపినేని శారద గారు
శ్రీమతి తాతినేని స్వర్ణలత గారు
శ్రీమతి గూడ సుందరి గారు
శ్రీమతి వేములపల్లి చూడామణి గారు
శ్రీమతి జాస్తి సరోజిని గారు

శ్రీమతి అంబటి ప్రసన్నలక్ష్మి గారు
శ్రీమతి వలిపే వరలక్ష్మి గారు
శ్రీమతి మానేపల్లి మీనాక్షి గారు
శ్రీమతి గుంటక విష్ణుప్రియ గారు
శ్రీమతి పొదిల యమున గారు
శ్రీమతి ఉయ్యూరు సాయిలక్ష్మి గారు
శ్రీమతి జే సీతా మహాలక్ష్మి గారు
శ్రీమతి ఆగేపాటి రమాదేవి గారు
శ్రీమతి అల్లు పద్మ గారు
శ్రీమతి దండు రమావతి గారు
శ్రీమతి వల్లంకొండ ఉమారాణి గారు
శ్రీమతి బైరెడ్డి రాధిక గారు
డా॥ బోయినేపల్లి యాదగిరి రావు గారు
శ్రీమతి కానాల సుమంగళి గారు
శ్రీ బోయినేపల్లి అనిల్ చంద్ర గారు
శ్రీమతి ఉప్పులూరి అనుపమ గారు
శ్రీమతి బోయినేపల్లి అవంతి గారు
శ్రీమతి యశోద గారు
శ్రీమతి నిమ్మగడ్డ భవాని గారు
శ్రీమతి పేరూరి కృష్ణవేణి గారు
శ్రీమతి భాగవతుల లక్ష్మి గారు
శ్రీమతి శ్రీగిరిరాజు శశిరేఖ గారు

శ్రీమతి నాయని లక్ష్మీకుమారి గారు
శ్రీమతి తురగా పద్మావతి గారు
శ్రీమతి వక్కలగంటి శోభావతి గారు
శ్రీమతి తాతా భవాని గారు
శ్రీమతి మొగిలిశెట్టి రేణుక గారు
శ్రీమతి వెనిగళ్ళ లక్ష్మిప్రభావతి గారు
శ్రీమతి కుర్నాల లక్ష్మి గారు
శ్రీ కేదారశెట్టి సుబ్బారావు గారు
శ్రీ అమర విజయానంద కుమార్ గారు
డా॥ చీదెళ్ళ జ్ఞానేశ్వర్ గారు
శ్రీ పి. వి. ఏ. పి. స్వామి గారు
శ్రీ జీ వి రామకృష్ణ రాజు గారు
డా॥ రాచకొండ నరసింహ శర్మ గారు
శ్రీ చెరుకూరి సుబ్రహ్మణ్యం గారు
శ్రీ తిరుమలశెట్టి మధుసూధన రావు గారు
శ్రీ కాశీబట్ట కృష్ణశాస్త్రి గారు
శ్రీ ఎన్ చౌదరి గారు
శ్రీ నంబూరి సదాశివరావు గారు
శ్రీమతి నంబూరి సరస్వతి గారు
శ్రీమతి ఉల్లి శ్రీలక్ష్మి గారు
శ్రీమతి మాదిరెడ్డి నిర్మల గారు
శ్రీమతి రత్నమాల గారు

వీరంతా సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని, వీరికి, వీరి పిల్లలకూ, మనవళ్ళకూ, మనవరాళ్ళకూ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను, వైదికజీవనాన్ని మరింత సమృద్ధిగా ఇవ్వమని ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# ఎందరో మహానుభావులు

ఈ బ్రహ్మయజ్ఞానికి ఎందరో సహాయసహకారాలందించారు. స్వామీజీల, స్వామినీల ప్రోత్సాహం, పాఠకుల నిరంతర ఆదరణ చెప్పనలవికాదు. ఈ పుస్తకంలో దోషాలు లేకుండా దిద్దిపెట్టిన వారు –

1. **శ్రీ దేసు కృష్ణచైతన్య గారు**
2. **శ్రీ మూల్పూరి విష్ణుప్రసాదు గారు**
3. **శ్రీమతి దేవరకొండ అరుణ యశోద గారు**
4. **శ్రీ గరిగిపాటి సత్యనారాయణ మూర్తి గారు**
5. **శ్రీ తిరుమలశెట్టి రామమోహన్ రావు గారు**
6. **శ్రీ పిరాట్ల వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ శాస్త్రి గారు**
7. **శ్రీ కర్పూరపు శ్రీధర్ గారు**

ప్రింటింగ్‌కు సహాయపడుతున్న **శ్రీవీరమాచనేని వెంకట కృష్ణారావు గారు**, తప్పులు లేకుండా డీటీపి చేస్తున్న **సిరిపురపు రాజేంద్ర కుమార్ గారు** వీరందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు, శతకోటివందనాలు.

**రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బ్రహ్మయజ్ఞం | 3 |
| 2. | ముందుమాట | 7 |
| 3. | స్వామీజీ గంగా ప్రవాహానికి పట్టిన దోసిలి | 11 |
| 4. | స్పందనలు | 15 |
| 5. | గీతా మాహాత్మ్యమ్ | 27 |
| 6. | ధ్యానశ్లోకాలు - వివరణ | 38 |
| 7. | మొదటి అధ్యాయము - అర్జున విషాదయోగము | 53 |
| 8. | మొదటి అధ్యాయము - సారాంశము | 122 |
| 9. | రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము | 132 |
| 10. | రెండవ అధ్యాయము - సారాంశము | 309 |
| 11. | మూడవ అధ్యాయము - కర్మయోగము | 318 |
| 12. | మూడవ అధ్యాయము - సారాంశము | 442 |
| 13. | నాల్గవ అధ్యాయము - జ్ఞానకర్మసన్న్యాసయోగము | 449 |
| 14. | నాల్గవ అధ్యాయము - సారాంశము | 553 |
| 15. | ఐదవ అధ్యాయము - కర్మసన్న్యాసయోగము | 559 |
| 16. | ఐదవ అధ్యాయము - సారాంశము | 634 |
| 17. | ఆరవ అధ్యాయము - ఆత్మసంయమయోగము | 642 |
| 18. | ఆరవ అధ్యాయము - సారాంశము | 783 |

# ముందుమాట

॥ ఓం శ్రీ సాయినాథాయ నమః ॥

ఓం సద్గురుభ్యో నమః । ఓం శ్రీకృష్ణపరమాత్మనే నమః । ఓం భగవద్గీతాయై నమః ।

మొదట నేను ఏయే గురువులనుండి భగవద్గీతను నేర్చుకున్నానో వారందరి గురించి చెప్పి వారందరు నా జీవితాన్ని ఎలా తీర్చిదిద్దారో తెలియజేస్తాను.

1952లో మద్రాసులో శ్రీ స్వామి చిన్మయానందజీ జ్ఞానయజ్ఞానికి నాకు ఇంగ్లీషు తెలియకపోయినా, అర్థం కాకపోయినా ఆ సమయంలో యాగశాలలో ఒక గదిలో అఖండ హరేరామ సంకీర్తన చేయటం చూసి క్రమం తప్పక రోజూ వెళ్ళి కూర్చునేదాన్ని. అప్పుడు నాకు 7 సంవత్సరాలే అయినా, భాష రాకపోయినా స్వామీజీ వాగ్ధాటికి, వాక్ప్రవాహానికి ముగ్ధురాలనయిపోయాను. ఎన్నటికైనా గీతార్థాన్ని తెలుసుకోవాలనుకున్నాను.

దీనికసలు బీజం అప్పటికే మా నాయనమ్మగారు రోజూ సాయంత్రాలు గీతలోని 12, 15 అధ్యాయాలు పారాయణ చేయించడం. నా మనస్సులో ఇలా గడగడా చదవటం ఎందుకు? వాటి అర్థం తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగింది. ఆ యజ్ఞంలోనే పూజ్యశ్రీ దయానందస్వామి వారు చిన్మయానందజీని చూసారట. కొద్ది రోజుల్లోనే వారి ఉపన్యాసాలను విని, వారికి Stenographer గా అన్నీ record చేసుకున్నారట. నా పూర్వపుణ్యం వలన నేను కూడా అందులో పాల్గొనడం జరిగింది.

పెద్దయ్యాక వివాహానంతరం గృహస్థాశ్రమ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆ అనుభవాలతో భావపరిణతి చెందడానికి అవకాశం కలిగింది. తరువాత అనుకోని పరిస్థితుల వలన, జిజ్ఞాస పెరిగింది. ఆ సమయంలో పై గురువులిద్దరి చేత పొవాయ్‌లో జరిగిన 3 సం॥రాల కోర్సులో చదివి, చిన్మయ విజ్ఞానమందిరం, హైదరాబాద్‌లో ఆచార్యులుగా ఉన్న శ్రీ స్వరూపానంద సరస్వతిగారి దగ్గర భగవద్గీత నేర్చుకున్నాను. శంకరభాష్యం, శంకరానందీయం ఉపయోగించి భగవద్గీత పూర్తిగా నేర్పించారు. స్వరూపానందజీ నన్ను అనేక విధాలుగా ఉత్సాహపరిచి, కోపించి, నాచే నాలుగుసార్లు అనేకులకు గీతని బోధించేలా చేశారు. దీనివలన ఒక్కొక్కసారీ భగవద్గీతను క్రొత్తకోణంలో చూడడం నేర్చుకున్నాను. తర్వాత నేను ఋషీకేష్‌కి వెళ్ళినప్పుడు పూజ్యశ్రీ దయానందజీ బోధను క్రమంతప్పకుండా 3 నెలలు విన్నప్పుడు నాకర్థమైంది చాలా తక్కువని అనిపించింది, ఇంకా స్వామీజీ వారివద్ద శ్రవణం చెయ్యాలని అడిగాను. స్వామీజీ ఒప్పుకుని ఆనైకట్టి గురుకులానికి రమ్మన్నప్పుడు చాలా సంతోషంతో గురుకులానికి వెళ్ళాను. స్వామీజీ introductionలో మనుష్యులకు guilt and hurt ముఖ్య సమస్య అని "guilt అంటే ఎందుకు చేయకూడనిది చేశాను, ఎందుకు చేయవలిసినది చేయలేదు అన్న బాధ ఇంకా hurt అంటే పరులు నాకెందుకు ఇలా బాధ కలిగించారు, వారు నాకు చేయవలిసినది చేయలేదు అన్న బాధ", **'కిమహంసాధు నాకరవమ్, కిమహం పాపమకరవమితి'** జ్ఞానికి భయం ఉండదని, ఎందుకంటే తను కర్త, భోక్తను కాదని సందేహరహితంగా తెలుసుకున్నందు వలన అని వివరించినప్పుడు అర్థమయి ఆ తైత్తిరీయ ఉపనిషద్ తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాను.

2003లో ఋషికేశ్‌లో 3 సం॥ కోర్సుని పూజ్య దయానంద సరస్వతి స్వామీజీ, స్వామి బ్రహ్మవిద్యానందజీ ఆచార్యులుగా ప్రారంభించినప్పుడు నేను అందులో చేరి 3 సం॥లు సంస్కృతము, శంకరభాష్యంతో అనేక ఉపనిషత్తులను నేర్చుకున్నాను. భగవద్గీత కూడా వారి వద్ద నేర్చుకున్నాను. కోర్సు పూర్తవగానే పూజ్య దయానంద స్వామీజీ హైదరాబాదు వెళ్ళి నేర్చుకున్న విద్యని జిజ్ఞాసువులకు పంచమని నాకు సందేహనివృత్తి కలిగేలా, స్పష్టతకోసం చేయమన్నారు. అదెంతో ఉపయోగకరమయింది.

ఋషికేశ్‌నుండి వచ్చినప్పటినుండి శ్రీ స్వామీ పరమార్థానందజీ గారి పూర్తి గీత, వారం వారం online లో వచ్చే ఉపనిషత్తు (భాష్యంతో) వదలక విని రాసుకున్నాను. గీత పరిచయంలో స్వామీజీ సంసారమనే భవరోగానికి రాగము, శోకము, మోహము – ఈ మూడు లక్షణాలు అనీ, వాటి రోగనివారణకు భగవద్గీత ప్రశమనాన్ని చూపుతుందని చెప్పిన మాటలు నా హృదయంలో నాటుకున్నవి.

ఎంతో దర్పంతో, ఉత్సాహంతో శత్రువులైన కౌరవులను నాశనం చేయాలని వచ్చిన అర్జునుడు శ్రీకృష్ణుని (అప్పటికి భగవంతునిగా కాక, రథసారథి వలె) రెండు సైన్యాలకు మధ్య నిలపమని, తాను ఎవరెవరితో యుద్ధం చేయాలో చూడవలెనని ఆదేశించాడు. తాను వనవాసకాలంలో నేర్చుకున్న అస్త్ర, శస్త్ర ప్రయోగం జరుపుటకు చాలా ఉత్సాహముతో తాను సంపాదించిన పాశుపతాస్త్రము, తక్కిన దేవతలందరినుంచి పొందిన అస్త్రశస్త్రాలతో శత్రువులను వధించుటకు ఉబలాటం కనబరిచాడు. తీరా ఇరుసైన్యాల మధ్యనుంచి చూచినపుడు, రెండువైపులా తనకు అందరూ తనవారినిగా జూచి, తాను ఎవరి సుఖంకోసం ఇంత విధ్వంసం జరపడానికి యుద్ధభూమికి వచ్చాడో, వారందరూ ఎదుట కనబడ్డారు. ముఖ్యంగా తనని అతిగా ప్రేమించిన తాత భీష్మాచార్యులు, తన కన్నపుత్రునికన్నా అధికంగా విద్యనిచ్చిన ద్రోణాచార్యులను చూచి, వారినెలా తను వధించగలడని రాగముచేత శోకములో మునిగిపోయాడు.

ఎప్పుడయితే రాగము, శోకము వలన మన బుద్ధిని అజ్ఞానం, మోహం కమ్మేస్తుందో మన బుద్ధి యుక్తాయుక్త వివేకాన్ని కోల్పోతుంది. అందుకే అర్జునుడు తన స్వధర్మమయిన క్షత్రియధర్మాన్ని వదిలి, పరధర్మమైన భిక్షాటన, అంటే సన్న్యాస ఆశ్రమాన్ని స్వీకరిస్తానన్నాడు. అంటే ధర్మాధర్మాల విషయంలో కలిగిన సందిగ్ధమే మోహం. మొదటి అధ్యాయంలో ఈ విధంగా రాగ, శోక, మోహాలు సంసారదుఃఖాలకు కారణమని తెలియజేస్తూ, అర్జునుణ్ణి శ్రీకృష్ణుడు మాట్లాడనిచ్చాడు. తాను మధ్యలో మాట్లాడక అర్జునుని ఆలోచనా విధానంలోని తప్పు తానే తెలుసుకునేటట్లు చేశాడు. అప్పుడు అర్జునుడు దానిని గుర్తించి, తన మోహాన్ని గుర్తించి, శ్రీకృష్ణుని భగవంతునిగా గుర్తించి 'నేను నీకు శిష్యునిగా నమస్కరిస్తున్నాను. నీకు శరణమయిన నాకు శ్రేయస్సును (అంటే సర్వులూ కోరుకునే అత్యంత దుఃఖనివృత్తి, పరమానంద ప్రాప్తి అయిన) మోక్షాన్ని ప్రసాదించమని కోరుతున్నాను' అని ప్రార్థించాడు. కృష్ణుడు వెంటనే మోక్షం గురించి మాట్లాడక, దుఃఖంచేత ఆలోచించలేని అర్జునుణ్ణి అనదగని మాటలతో మేల్కొలిపి, శరణు పొందినవానికి ఆత్మజ్ఞానం బోధించ మొదలుపెట్టాడు. 2వ అధ్యాయం 11వ శ్లోకంలో తను శోక అనర్హమైన విషయాలకు శోకిస్తున్నాడని, పండితులు – అంటే ఆత్మజ్ఞానం కలిగినవారు అలా దుఃఖించరని తెలుపుతూ, ఆత్మ అంటే ఏమిటన్న ప్రశ్నకు బీజరూపంగా జవాబునిచ్చాడు. ఈ శ్లోకంనుంచే

వ్యాసమహర్షి శ్రీకృష్ణుని శ్రీభగవాన్ ఉవాచ అని జగద్గురువుగా పేర్కొన్నారు. 2వ అధ్యాయంలో శ్లోకం 12 నుండి 25 వరకు ఆత్మ లక్షణాలను తెలియజేశారు. ఉన్నదంతా ఒకేఒక సత్యం అని అద్వైతాన్ని బోధించుట మొదలుపెట్టారు. ఆత్మ సత్యమని 12, 13 శ్లోకాల్లో, నిత్యమని, దాని వినాశనాన్ని ఎవరు చేయలేరని, శరీరము అన్తవన్తములే గానీ (మిథ్యారూపం) **శరీరి అయిన ఆత్మ నిత్యమని**, ఎవరైనా ఈ ఆత్మని హన్తా (కర్తా) లేక హననక్రియకు(కర్మ) అనుకుంటే ఇరువురికీ ఆత్మ గురించి తెలియదని బోధించారు. ఎందుకంటే – ఆత్మ చంపబడదు, చంపదు. ఆత్మ ఎప్పుడూ పుట్టలేదు లేక పుట్టి శరీరము నశించినపుడు ఆత్మ మళ్ళీ పుట్టదు.

నీవు ఆత్మ అనుకుంటే అది సత్యం, నిత్యం, అకర్తా, అభోక్తా, అవికారి కనుక నీవు అనవసరంగా దుఃఖిస్తున్నావు. నీవు దేహానివి అంటే స్థూల, సూక్ష్మ శరీరానివని అనుకుంటే, ఎల్లప్పుడూ పుట్టి మరణించేటటువంటి స్వరూపము కలిగినవాడివగుటచే మిథ్యా శరీరాన్ని గూర్చి దుఃఖింప పనిలేదు. ఈ విధంగా దుఃఖకారణం లేదని నిరూపించి, ఆత్మస్వరూపాన్ని తెలియజేశారు.

ఈ విషయం వినడానికి బాగున్నా, మనం కోరుకుంటున్నది అదే అయినా అంతఃకరణ శుద్ధి లేకపోతే అర్థం చేసుకోవడం కష్టమని, 2వ అధ్యాయం 27వ శ్లోకం నుంచి 3, 4 అధ్యాయాలలో కర్మయోగాన్ని వివరించారు. పూజ్యశ్రీ దయానందజీ, **సుఖదుఃఖే సమేకృత్వా –** కర్మఫలాన్ని సమత్వబుద్ధితో స్వీకరించినపుడు, కర్మలు చేస్తున్నప్పుడు మన రాగద్వేషాలననుసరించి కాక, ఈశ్వరుడే అన్ని నియతులని తెలుసుకుని ఆ ఆయా పరిస్థితులలో ఏది ధర్మమో అది చేయడమే ఈశ్వరార్పణం అని చెబుతూ కర్మలు చేసేటప్పుడు **యోగః కర్మసు కౌశలం** అని, కర్మఫలాలు వచ్చినప్పుడు ప్రసాదరూపంలో సమత్వంతో స్వీకరించడమే కర్మయోగమని తెలియచేశారు. ఆ సాధనతో మన రాగద్వేషాల ప్రకారం కాక, ధర్మనియతి ప్రకారం చేయడమే అంతఃకరణ శుద్ధి కలుగచేస్తుంది. అటువంటి మనసులో గురువుగారు చెప్పిన శాస్త్రం తానే ఆత్మ–బ్రహ్మగా తెలుసుకోవచ్చని తెలియజేశారు. ఈ జ్ఞానం వలన మిథ్యా (అధ్యాస) తొలగి, స్వరూపాన్ని బ్రహ్మగా తెలుసుకోవడమే మోక్షమని తెలియజేశారు.

4–6 అధ్యాయాలలో అంతరంగ, బహిరంగ సాధనలు తెలియజేసి శ్రీకృష్ణుడు అర్జునుని ద్వారా మనలను కూడా ముక్తులు చేశారు. ఇంతవరకు 'త్వం' పదవిచారము చేశారు. ఇక 'తత్' పదవిచారణ మొదలవుతుంది. భగవంతుని స్వరూపం తెలియడానికి శాస్త్రమే శరణ్యం. **'శాస్త్రయోనిత్వాత్'** అనే బ్రహ్మసూత్రం ద్వారా దానిమీద ఆధారపడే ఈశ్వర స్వరూపాన్ని మనకు 7 నుండి 12 అధ్యాయాల వరకు వివరించారు. ఈ జ్ఞానం ద్వారా భక్తుడు ఎటువంటి మనస్సుతో ఉంటాడో, అజ్ఞానులకు మార్గదర్శకంగా ఉంటాడో, **అద్వేష్టా సర్వభూతానాం** (12.13) నుండి అధ్యాయం చివరివరకు పరమభక్తుని వర్ణిస్తూ, ఇవన్నీ జ్ఞానీభక్తునికి సహజ లక్షణాలు కనుక, ముముక్షు అయిన సాధకులకు ఈ లక్షణాలన్నీ సాధనలని శ్రీశంకరాచార్యులు వివరించారు. కనుక ఈ 8 శ్లోకాలలోని విలువలు మనందరం పాటించాలి.

ఇలా 'త్వం'పద, 'తత్'పద లక్ష్యాల వివరణ మొదటి రెండు షట్కాలలో చేసి, 'అసి'పదం గురించి అంటే 7–12 అధ్యాయాలలో తెలిపిన ఈశ్వరునికన్నా, 2–6 అధ్యాయాలలో తెలియజేసిన ఆత్మ అభిన్నమని తెలియజేస్తున్నారు. కాని ముందుగా అమానిత్వాది గుణాలు ఉన్నప్పుడే బ్రహ్మాత్మైక్య జ్ఞానం కలుగుతుందని,

అమానిత్వం మొదలైన 20 విలువలను తెలియజేశారు. ఈ విలువలే జ్ఞానసాధనలని, ఇవి లేకపోతే ఉన్నదంతా అవిద్యయే అని తెలియజేశారు.

క్షేత్రం, క్షేత్రజ్ఞులు ఎవరు? అన్ని క్షేత్రాలలోనున్న క్షేత్రజ్ఞుడను తానే అని తెలియజేసి, సర్వాత్మభావాన్ని తెలియజేశారు 13వ అధ్యాయంలో. 14వ అధ్యాయంలో గుణత్రయాలైన సత్త్వ, రజో, తమోగుణాలు అందరి అంతఃకరణాల్లో ఉంటాయని, ఏ గుణం ప్రాధాన్యంగా ఉన్నప్పుడు మనమెలా ప్రవర్తిస్తామో, ఎలా సత్త్వగుణాన్ని పెంపొందించుకోవాలో వివరించారు. మనస్సులో సత్త్వగుణము ఉన్నప్పుడే జ్ఞానం, సంతోషం కలుగుతుంది కనుక ముముక్షువులకు ఎటువంటి ఆహారవ్యవహారాలుండాలో తెలియజేశారు.

మళ్ళీ 15వ అధ్యాయంలో జ్ఞానాన్ని చెప్పారు. శ్రీకృష్ణుడు ఆత్మ చైతన్యరూపంలో తానే అందరి హృదయాలలో ఉన్నానని, తననుంచే అన్ని ఆలోచనలు, జ్ఞానం, అపోహనం అంటే మరపు కనుక అవి తనకు భిన్నంగా లేవని తెలియజేశారు. సర్వవేదాల ద్వారా తెలుసుకోవలసింది తానేననీ, తానే **వేదాంతకృత్, వేదవిత్** అని తెలియజేశారు.

16వ అధ్యాయంలో ఏవి దైవీగుణాలో, ఏవి ఆసురీగుణాలో వివరించి, ఆసురీగుణాలు ఉన్నప్పుడు మానవులు ఎలా ప్రవర్తిస్తారో వివరించారు. దాని వలన విజృంభించే కామ, క్రోధ, లోభాలు నరకానికి ద్వారాలని, వాటిని త్యజించాలని చెప్పారు. చివరగా మనం ఏ కార్యాలు ఎలా చేయాలో, ఎలా చేయగూడదో తెలుసుకోవడానికి శాస్త్రం ప్రమాణమని, కాబట్టి శాస్త్రం చెప్పిన విధానాన్ని తెలుసుకుని మనందరం కర్మ చేయాలని ముగించారు.

17వ అధ్యాయంలో శ్రద్ధ యొక్క ప్రాముఖ్యత **"శ్రద్ధామయోఽయం పురుషః యో యత్ శ్రద్ధః స ఏవ సః"** వాక్యం ద్వారా తెలియజేసి సాత్త్వికశ్రద్ధని పెంపొందించుకోమని చెప్పారు.

18వ అధ్యాయంలో అర్జునుడు మళ్ళీ త్యాగం గొప్పదా, సన్న్యాసం గొప్పదా అని అడిగినప్పుడు ఇంతవరకు చెప్పిన విషయాలనే మరోమారు ఉటంకిస్తూ అర్జునుడు **'నష్టోమోహః స్మృతిర్లబ్ధా'** నీ మాటలనే ఆచరిస్తాను. అనేంతవరకు బోధించాడు. మనందరం కూడా ఈ భగవద్గీతని మళ్ళీమళ్ళీ అంటే **పౌనఃపున్యేన శ్రవణం** చేస్తూ మనమే మోక్షస్వరూపులమని తెలుసుకుని, మళ్ళీ మళ్ళీ ఆనందిద్దాము. ఆనందమే మన స్వరూపంగా తెలుసుకుందాము. వ్యాసుని ప్రసాదంచేత సంజయుడు ధృతరాష్ట్రుని వద్దే కూర్చున్నా, యుద్ధభూమిలో జరిగిన విషయాలు, వారి సంభాషణలను విని ఆనందించాడు. మనం కూడా ఆ సంవాదాన్ని మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటూ ఆనందిద్దాము.

నాకు పూర్తి గీతను సింహావలోకనం చేసుకునే అవకాశమిచ్చిన శ్రీ రాఘవరావు గారికి, రాజ్యశ్రీ గారికి అనేకమార్లు గీత చదివించిన నా స్నేహితులందరికీ నా కృతజ్ఞతలు, **'గీతాసుగీతా కర్తవ్యాకిమన్యైః శాస్త్రవిస్తరైః'** అన్నట్లు మనందరం గీతను మళ్ళీమళ్ళీ చదువుతూ దానిలోని గూఢార్థాలను తెలుసుకునేలా శ్రీకృష్ణపరమాత్మ మనందరినీ ఆశీర్వదించాలని ప్రార్థిస్తూ ఈ ముందుమాటను పూర్తి చేస్తున్నాను.

**ఓం నమో భగవతే వాసుదేవాయ!**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ।**

**స్వామిని శివాత్మానంద సరస్వతి, హైదరాబాద్**

# స్వామీజీ గంగా ప్రవాహానికి పట్టిన దోసిలి

**అనంతశాస్త్రం బహువేదితవ్యమ్ అల్పశ్చ కాలో బహవశ్చ విఘ్నః**
**యత్సారభూతం తదుపాసితవ్యం హంసోయథా క్షీరమివాంభు మిశ్రః**

శాస్త్రం అనంతంగా ఉంది, నేర్చుకోవాల్సింది చాలా ఉంది; సమయం చాలా తక్కువ ఉంది; ఆటంకాలు ఎన్నో వస్తున్నాయి. అన్నీ అధ్యయనం చేసే తీరిక లేకపోతే, ఒక్క భగవద్గీతను అధ్యయనం చేస్తే చాలు. ఎందుకంటే శాస్త్రాల సారాన్ని భగవద్గీతలో చూస్తాము.

మనుష్యులు బాహ్యాముఖంగా పరుగులు తీస్తున్నారు. వారి కోరికలు అనంతంగా ఉన్నాయి. వారికి క్షణం తీరికలేదు అని 1200 సంవత్సరాల క్రితమే శంకరాచార్యులవారు వర్ణించారు. అంటే 21వ శతాబ్దంలో మనుష్యులు ఎలా ప్రాపంచిక విషయాలలో పడి కొట్టుమిట్టాడుతుంటారో, ఆయన 8వ శతాబ్దంలోనే వర్ణించారు. ఎంత ఆశ్చర్యమో చూడండి.

ఇప్పటి కాలమాన పరిస్థితుల్లో, ఈ పరుగుపందెంలో పాల్గొనే హడావుడిలో చాలామంది ఆధ్యాత్మిక చింతన వైపు మొగ్గు చూపటం లేదు. ఈ పరుగుపందెంలో భాగంగా విశాలమైన ఇల్లు, పడవంత కారు, బోలెడు నౌకర్లు ఉండవచ్చేమో కాని, మనస్సు మాత్రం శూన్యంగా ఉండే ప్రమాదముంది. మనస్సు శూన్యంగా ఉండటానికి కారణం – మనలో ఉన్న మలం, విక్షేపం, ఆవరణం.

* * *

కోపంతో ఎగసిపడే అర్జునుడు, శోకంతో కృంగిపోతున్నాడు. బుద్ధి ప్రధానంగా ఉన్న అర్జునుడు మనస్సు చేసే గారడీకి లొంగిపోతున్నాడు. యోధుడైన అర్జునుడు సంసారి అయిపోతున్నాడు. ఇది మొదటి దశ. సంసారం అంటే ఏమిటి? రాగం, శోకం, మోహం. అర్జునునికి రాగం కొత్తగా యుద్ధభూమిలో పుట్టుకురాలేదు. రాగం ఉన్నట్టు మనకు తెలియదు. అందువల్ల రాగాన్ని తగ్గించుకోవటం చాలా కష్టం. మనకసలు ఒకరిమీద రాగం ఉందని కాని, వారితో బంధం చాలా పెనవేసుకుని ఉందని కాని తెలియనే తెలియదు. తెలిసేసరికి చెయ్యిదాటి పోవటంతో ఏమీ చేయలేము.

* * *

ఇప్పుడు చెప్పండి, అజ్ఞానాన్ని తొలగించటానికి ఎన్ని మార్గాలున్నాయి? నాలుగా, రెండా, ఒకటా? ఒక్కటే మార్గముంది. అజ్ఞానం సంసార కారణం కాబట్టి, జ్ఞానమార్గం మాత్రమే దానికి నివృత్తి. అందువల్ల కర్మయోగంవల్ల మోక్షం వస్తుంది; భక్తియోగంవల్ల మోక్షం వస్తుంది; రాజయోగంవల్ల మోక్షం వస్తుంది – ఇవేవీ గురువైన కృష్ణపరమాత్మ ఒప్పుకోడు. శాస్త్రమైన వేదాంతం ఒప్పుకోదు. **మోక్షానికి అనేక మార్గాలున్నాయి అనేది వేదానికి భిన్నం.** భగవద్గీత అనేక మార్గాలను ఒకేసారి చెబుతోంది అనేది పొరపాటు. **భగవద్గీత మోక్షం పొందటానికి ఒకటే మార్గముంది – అది జ్ఞానమార్గం అని చెబుతున్నది.** అనేక మార్గాలు దేనికి ఉన్నాయి? చిత్తశుద్ధి పొందటానికి. కాని మోక్షం పొందటానికి మాత్రం ఒకటే మార్గం ఉంది.

## వ్యక్తి ఆత్మ-అనాత్మల మేలు కలయిక - విశ్లేషణ

దీనికి చేయి-కాంతి ఉదాహరణ చూద్దాము.

మీరు చేతిని చూపించి ఇక్కడేముంది అని అడిగితే -

1. చేయి ఉంది
2. చేయి + కాంతి ఉంది
3. అన్నింటినీ ప్రకాశింపజేసే కాంతి ఉంది.

ఇప్పుడు ఆత్మ-అనాత్మలకు అన్వయించి చూద్దాము. నేను ఎవరిని అని అడిగితే -

1. నేను శరీరాన్ని
2. నేను శరీరం + చైతన్యాన్ని
3. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.

* * *

మాయకూ బ్రహ్మకూ మధ్య ఫ్యాషన్ పెరేడ్ పెడితే మాయే గెలుస్తుంది. ఎందుకంటే బ్రహ్మకన్నా మాయ ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటుంది. ఆధ్యాత్మికతకన్నా ప్రాపంచికత ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటుంది. అందువల్ల ఎవరైనా గీతాబోధకు వెళుతున్నావా, ఇప్పటినుంచీ ఎందుకు, తాతయ్య అయ్యాక వెళ్ళవచ్చులే అని నాలుగుసార్లు చెపితే ఆ ప్రలోభంలో పడిపోతాము.

* * *

జ్ఞానయోగం గొప్పదా, కర్మయోగం గొప్పదా? ఈ రెండింటినీ ఎన్నడూ ఒకదానితో ఒకటి పోల్చకూడదు. కర్మయోగం ముందు పాటించి, అధికారిత్వం పొంది, అప్పుడు జ్ఞానయోగానికి రావాలి. ఇదెలా ఉందంటే - ప్రైమరీ స్కూలుకు వెళతావా, సెకండరీ స్కూలుకు వెళతావా అని అడిగినట్టుంది. కర్మయోగంవల్ల మోక్షం ఎన్నడూ రాదు. కాని అదే సమయంలో కర్మయోగమే జ్ఞానయోగానికి సంసిద్ధులను చేస్తుంది.

అంతేకాదు, కర్మను మానటంవల్ల మోక్షం రాదు; కర్మ మానటం అసాధ్యం, కర్మ మానటం చాలా ప్రమాదకరం కూడా అని మూడు అంశాలు చెప్పాడు కృష్ణపరమాత్మ కర్మ గురించి.

* * *

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ - గీత 3.30**

మొత్తం కర్మయోగాన్ని ఒక్క శ్లోకంలో కుదించాడు. ఈ కర్మయోగం జ్ఞానికా, అజ్ఞానికా? అజ్ఞానికే. అర్జునుడు అజ్ఞాని కిందికే వస్తాడు. ఇందులో కర్మయోగానికి ఐదు సూత్రాలు చూస్తాము. అవి -

| | |
|---|---|
| **అధ్యాత్మ చేతసా** | – వివేకబుద్ధి |
| **మయి సర్వాణి కర్మాణి సన్న్యస్య** | – ఈశ్వరార్పణ బుద్ధి |
| **నిరాశీః** | – ప్రసాదబుద్ధి |
| **నిర్మమః** | – అమానిత్వబుద్ధి |
| **విగతజ్వరః** | – సమత్వబుద్ధి |

(శ్లోకంలోని పదాల వరుసక్రమం మార్చాము).

* * *

ఆత్మను అనాత్మలను విడదీసి చూశాక, నాలో ఆత్మ ఉందని చెప్పే బదులు నేను ఆత్మను అని చెప్పగలగాలి. ఇది మొదటి దశ. నేను ఆత్మను అంటే అనేక ఆత్మలు ఉన్నట్టు అర్థం వస్తుంది. ఆత్మ సర్వవ్యాపకం. ఒక మాలలో అనేక పువ్వుల వెనుక ఒకటే దారం ఉన్నట్టుగా, అనేక శరీరాలలో ఒకటే ఆత్మ ఉంది. నిజానికి శరీరాలన్నీ ఆత్మలోనే ఉన్నాయి. ఇది రెండవ దశ.

కానీ ఇక్కడితో మన బోధ పూర్తికాలేదు. బ్రహ్మ సత్యం, జగన్మిథ్య అనే విషయాన్ని జీర్ణించుకుంటేనే వేదాంతబోధ పూర్తి అవుతుంది. కాని ఇది ఎలా జీర్ణించుకోగలము?

* * *

**భావాత్ అద్వైతం సదా కుర్యాత్ క్రియాత్ ద్వైతం న కర్హిచిత్**

భావంలో ఎప్పుడూ అద్వైతంలో ఉండాలి, వ్యవహారంలో ద్వైతం చూపాలి అని శంకరులవారు అద్భుతంగా చెప్పారు. గురువు దగ్గర అద్వైతశాస్త్రం అధ్యయనం చేశాక, శిష్యుడు వెళ్ళి ఇప్పుడు మనమిద్దరం సమానమే. ఇంతవరకూ నేను మీకు నమస్కారాలు పెట్టాను. ఇప్పుడు మార్పుకోసం మీరెందుకు నాకు నమస్కారం పెట్టకూడదు అన్నాడనుకోండి. ఎలా ఉంటుంది? వ్యవహారంలో గురువు గురువే, శిష్యుడు శిష్యుడే. ఆభరణాలు అన్నింటిలో బంగారమే ఉందనే సమదర్శనం కలిగినా నగను మెడలోనే వేసుకుంటారు, గాజును చేతికే వేసుకుంటారు. దీన్నే వ్యావహారిక భేదం అంటారు లేదా జ్ఞానం అంటారు.

* * *

**మా ఫలేషు కదాచన** – కాని కర్మఫలంమీద నీకు ఎన్నటికీ అధికారం లేదు. '**మా**' అంటే లేదు. అధికారం లేదు. కర్మఫలంమీద నీకు ఎన్నటికీ అధికారం లేదు అనేసరికి, కొంతమంది దీన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. అంటే భగవానుడు ముందే మన తలరాతను నిర్ణయించేశాడు. మనం ఏం చేసినా లాభం లేదు. కానున్నది కాకమానదు. విధి **బలీయం** అంటారు వీరు. వీరికి ఆధారం ఈ వాక్యం. విధిని నమ్ముతారు.

కర్మ చేయటానికి అధికారం ఉంది, కర్మఫలంలో అధికారం లేదు అని కృష్ణపరమాత్మ చెప్పటంలో అర్థం– కర్మ చేసే చోట బుద్ధిని ఉపయోగించి, తెలివైన మార్గం ఎన్నుకోవాలి. ఫలం వచ్చేచోట కూడా బుద్ధిని ఉపయోగించినా తెలివి ఒక్కటే ఫలాన్నివ్వదు, దానితోపాటు అనేక అంశాలు కలిసివున్నాయి అని గ్రహించాలి. బుద్ధిని ఉపయోగించి ఎన్నుకోగలిగిన పరిస్థితుల్లో, దాన్ని ఉపయోగించుకోవాలి. భగవంతుడిచ్చిన హక్కును

ఎందుకు వదులుకోవాలి? హక్కు ఉన్నచోట వాడాలి. హక్కు లేని చోట, బాధ్యతగా ఒప్పుకోవాలి. ఎక్కడ హక్కు ఉందో, ఎక్కడ బాధ్యతగా ఒప్పుకోవాలో తెలుసుకోవాలి.కర్మఫలం విషయంలో నీకు అధికారం లేదు అంటే **బొత్తిగా అధికారం లేదు అనికాదు అర్థం, నీకు మాత్రమే అధికారం లేదు** అని అర్థం.

* * *

భగవద్గీత బోధ టీవీలో న్యూస్ చదివే పద్ధతిలో ఉంటుంది. న్యూస్‌లో ఏం చేస్తారు? ముందు హెడ్‌లైన్స్ చెప్పి, తర్వాత ఆ విషయాలన్నీ వివరంగా చెప్పి, మళ్ళీ హెడ్‌లైన్స్‌తో ముగిస్తారు. భగవద్గీత కూడా అంతే. రెండవ అధ్యాయంలో భగవద్గీత సారాంశం అంతా చెప్పి 3–17 అధ్యాయాల్లో వాటిని వివరించి, మళ్ళీ 18వ అధ్యాయంలో సారాంశాన్ని చెప్పాడు. దీన్ని సంక్షేప, విస్తార, సంక్షేప పద్ధతి అంటారు.

అలా కర్మయోగం, జ్ఞానయోగాల గురించి రెండవ అధ్యాయంలో టూకీగా చెప్పాడు. ఇప్పుడు వాటిని విస్తారంగా చెప్పాలి. మూడవ అధ్యాయంలో కర్మయోగం గురించి విస్తారంగా చెపితే; నాలుగు, ఐదు అధ్యాయాల్లో జ్ఞానయోగం గురించి విస్తారంగా చెబుతాడు. జ్ఞానయోగం అర్థం చేసుకోవటం కొంచెం కష్టం కాబట్టి దానికి రెండు అధ్యాయాలను కేటాయించాడు.

* * *

ప్రతి అధ్యాయాన్ని ఇలా విభజిస్తారు. ఉదా: ఆరవ అధ్యాయాన్ని ప్రధానంగా ఆరు భాగాలుగా విభజించారు.

1. **బహిరంగ సాధనలు** – **శ్లోకాలు 1–9, 16,17**
2. **అంతరంగ సాధనలు** – **శ్లోకాలు 10–15**
3. **ధ్యాన స్వరూపం** – **శ్లోకాలు 18–32**
4. **ధ్యానఫలం** – **శ్లోకాలు 18–32**
5. **ధ్యాన ప్రతిబంధకాలు** – **శ్లోకాలు 33–36**
6. **యోగభ్రష్టుడు** – **శ్లోకాలు 37–45**

* * *

స్వామీజీ అంటే పరమార్థానంద స్వామీజీ. ఆయన బోధ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఒక అంశాన్ని లోతుగా విశ్లేషిస్తారు; క్లిష్టమైన విషయాన్ని చాలా స్పష్టంగా అర్థమయ్యేలా చెబుతారు; కృష్ణపరమాత్మ చెప్పిన బోధను జీవితానికి ఎలా అన్వయించు కోవాలో చూపుతారు; ముఖ్యమైన కాన్సెప్టులను పాయింట్లుగా ముందు చెప్పి, మళ్ళీ వాటిని వివరిస్తారు.

**స్వామీజీ గంగా ప్రవాహానికి పట్టిన దోసిలి ఈ ముందుమాట**

**– మద్దూరి రాజ్యశ్రీ**

# అక్షరమే ఆయన శ్వాస

అక్షరమే ఆయన శ్వాసగా, ఎమెస్కో రూపశిల్పిగా
అక్షరాలా ఇంటింటా స్వంత గ్రంథాలయం నెలకొల్పి
అక్షరలక్షల సాటి ఎమెస్కో పాకెట్ బుక్స్‌కు శ్రీకారం చుట్టి
అక్షరమక్షరమూ సరస్వతిని తలపించే సాంప్రదాయ సాహితి నొసగి
అక్షరాభిషేకంలో అకస్మాత్తుగా అంతిమశ్వాస విడిచి
అక్షరసీమలో అజరామృతంగా ఆచంద్రతారార్కం వెలుగుతున్న
అక్షరశిల్పి మా నాన్నగారు శ్రీ యం.యన్. రావు గారికి నా అక్షర నివాళులు

యం.యన్.రావు గారిగా ప్రసిద్ధి చెందిన మా నాన్నగారి పూర్తి పేరు మద్దూరి నరసింహారావు గారు. ఆయన పేరులోనే నరసింహం ఉన్నాడు కాని ఆయన ఉగ్రరూపం దాల్చగా మేమెవరం చూసింది లేదు. ఆయన చదివింది మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో. ఆ రోజుల్లో **జెంటిల్మెన్ ఆఫ్ క్రిస్టియన్ కాలేజీ** అనేవారు. ఆ జెంటిల్మెన్ పదానికి అక్షరాలా సరిపోతారు.

అందరికీ 'మా ఆవిడ రెండవ క్వాలిఫికేషన్ సెన్సార్ బోర్డ్ మెంబర్,' అని గర్వంగా చెప్పేవారు. 'అదేమిటి అలా చెబుతున్నారు,' అని మేము అడిగితే, 'అప్పుడు వారు మొదటి క్వాలిఫికేషన్ ఏమిటి అని అడగాలి కదా,' అనేవారు. ఆడపిల్లలు కాలేజీ మొహం ఎరగని రోజుల్లో మా అమ్మ బియ్యే మాథమాటిక్స్ చదివి, అందులో గోల్డ్‌మెడల్ పొందింది. ఆ విషయం గొప్పగా చెప్పేవారు. ఆవిడ చదువును, తెలివితేటలను చూసే ఆవిడను పెళ్ళి చేసుకున్నారు. మా అమ్మ పేరు లీలావతి. ఆ రోజుల్లో మాథ్స్‌లో ఛాయిస్ వదలకుండా అన్ని ప్రశ్నలకూ జవాబులిస్తే నూటికి నూటఇరవై (120/100) ఇచ్చేవారట. అలా మా అమ్మకు ఎప్పుడూ మార్కులు వచ్చేవి.

వారిద్దరికీ మేము నలుగురు పిల్లలం. మా అందరినీ సమానంగా చూసేవారు. మా నాన్నకు నేను ఇంట్లో సెక్రటరీని. ఆయన పర్సనల్‌గా రాసే ఉత్తరాలన్నీ నాకు డిక్టేట్ చేసేవారు. అంతేకాదు, ఆయన **'పబ్లిషింగ్ మాన్యువల్'** అని ఒక పుస్తకం రాశారు. దాన్ని యూనివర్శిటీలో టెక్స్ట్‌బుక్‌గా పెట్టారు. అది రాసేటప్పుడు నన్ను తెల్లవారుఝామున లేపి, నాచేత రాయించేవారు. అలాగని ఎన్నడూ బలవంతం పెట్టలేదు. ఎప్పుడైనా నా మొహం నిద్రమత్తుగా కనిపిస్తే, 'పోయి పడుకో,' అనేవారు. సృజనాత్మకత అంటే ఎలా ఉంటుందో, ఒక విషయాన్ని ఎలా వివరించాలో ఆ విధంగా నాలో బీజం వేశారు.

అంతేకాదు, ఎమెస్కో పాకెట్ బుక్స్‌లో పబ్లిష్ చేయమని అనేక రచయితల/రచయిత్రుల నవలలు వచ్చేవి. వాటిని ఎవరైనా చదివి ఆ నవల సారాంశం రాసి, దాన్ని పబ్లిష్ చేయవచ్చో లేదో రాయాలి. దాన్ని రీడర్స్ రిపోర్ట్ అంటారు. నాచేత అది రాయించి, నేను రాసిన మొట్టమొదటి రిపోర్టే చాలా బాగుందని, కేవలం కథలాగా రాసి ఊరుకోకుండా ఆ నవలలోని పాత్రల మనస్తత్వ విశ్లేషణ ద్వారా కథను వివరించానని మెచ్చుకున్నారు. అలా నేనంటూ స్వంతంగా ఏదైనా రాయటానికి శ్రీకారం చుట్టించారు.

నేను మద్రాసులో బియ్యే చదివే రోజుల్లో తెలుగు మేడమ్ సరిగ్గా చెప్పటం లేదని నేను మాటవరసకి చెపితే, నాకు తెలుగు పండితునిచేత తెలుగు చెప్పించారు. నాకు తెలుగులో గోల్డ్‌మెడల్ వచ్చింది.

**ఏరించారు సాహిత్యసీమలో అక్షరసుమాలను**
**ఔపోసన పట్టించారు నాకు అక్షరబ్రహ్మాజ్ఞానాన్ని**

మేము పెరిగింది తమిళనాడులో అయినా, తేటతేనియ తెలుగుకు నిలయమైన కృష్ణాజిల్లా తెలుగుభాషకు దూరమవకుండా, ఆ భాషను మాకు ఉగ్గుపాలతో పట్టింది మా అమ్మ. తెలుగు, ఆంగ్లభాషలను నేర్పటమే కాదు, విద్యయొక్క విలువ నేర్పించి, మేము నలుగురం ఎమ్మే/ఎమ్మెసీలు చదివేలా చేసింది. నేను ఎమ్మే ఇంగ్లీషు లిటరేచర్ చదివాను. ఇంగ్లీషు లిటరేచర్‌కు మూడు, నాలుగు పుస్తకాలు రిఫర్ చేసి, నోట్సు రాసుకోవాలి. బియ్యే మాథ్స్ చదివిన ఆవిడ, నాకు ఎమ్మే ఇంగ్లీషులో నోట్స్ రాసిపెట్టిందంటే మా అమ్మ మేధస్సు ఎంత గొప్పదో చూడండి. అమ్మ అహర్నిశలూ మా బాగోగుల కోసమే, ముఖ్యంగా మా చదువుల కోసమే పాటుపడేది.

రైలింజనులోకి తీసుకువెళ్ళి, విమానం కాక్‌పిట్‌లోకి తీసుకువెళ్ళి, క్వీన్ ఎలిజెబెత్‌ను చూపించి, అలా కొత్త విషయం ఏదైనా ఉంటే అదేమిటో నేర్చుకుని, దాని లోతులు కొలవాలనే తపనకు ఆవిడే శ్రీకారం చుట్టింది. ఆ కుతూహలమే మావారు నిరంతరం పరమార్థానంద స్వామీజీ బోధలను వింటుంటే, అదేమిటో వినాలని నన్ను ప్రేరేపించింది. కుతూహలం కొద్దీ విన్న నేను, వేదాంతం లోతులు కొలవటానికి తపన చూపించానంటే మా అమ్మే కారణం.

అంతేకాదు, ఆవిడ సినిమా సెన్సార్‌బోర్డ్ మెంబర్‌గా ఆ సినిమాను విశ్లేషించి, ఆ కథ తీరుతెన్నులను, అందులోని లోటుపాట్లను, టైటిల్ జస్టిఫికేషన్‌ను చర్చించేది. ఇప్పుడు చూస్తున్న సన్నివేశంనుంచి రాబోయే సన్నివేశాన్ని ఎలా ఊహించాలో నేర్పింది. ఆ విధంగా విశ్లేషణకు బీజం వేసింది మా అమ్మ లీలావతిదేవి మాకు.

**ఉంటేచాలు విశ్లేషణాత్మక బుద్ధి, తీవ్రజిజ్ఞాస**

**పొందవచ్చు బ్రహ్మవిద్య కూడా బ్రహ్మాండంగా!!**

అందరూ ఇన్నేసి పుస్తకాలు ఎలా రాయగలుగుతున్నావు అని అడుగుతుంటే, ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఇది నా తల్లిదండ్రులు పెట్టిన భిక్షే అని అర్థమైంది. బుడిబుడి అడుగులు వేయించి, చిట్టిపొట్టి మాటలు నేర్పి, చిన్నిచిన్ని భక్తిశ్లోకాలు రంగరించిపోసిన మా అమ్మకు తన చిన్నారి ఇవాళ నలుగురికి అద్వైత వేదాంతాన్ని బోధిస్తున్నదని తెలిస్తే ఆవిడ ఆనందాన్ని మాటల్లో కొలవగలనా?

పబ్లిషర్ అయిన మా నాన్న, నా పుస్తకాలు ఇన్ని (జైకో పబ్లికేషన్స్‌లో కూడా కొన్ని పబ్లిష్ అయ్యాయి) పబ్లిష్ అవుతున్నాయని తెలిస్తే ఎంత మురిసిపోతారో కదా!

**– మద్దూరి రాజ్యశ్రీ**

# కృష్ణం వందే జగద్గురుమ్

**య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి।**
**భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః॥ గీత 18-68**
**న చ తస్మాన్ మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః। గీత 18-69**

శ్రీకృష్ణపరమాత్మ గీతను బోధించే ఆచార్యుడంటే తనకు అందరికన్నా చాలా ఇష్టమని, అతను తననే పొందుతాడని, అందులో ఏ మాత్రం సందేహం లేదనీ చెప్పాడు. ఇది అక్షరసత్యం. మావారు రాఘవరావుగారు గీతాబోధ మూలం ఒక సత్సంగంలోను, గీతాభాష్యం ఇంకొక సత్సంగంలోనూ బోధిస్తున్నారు. ఉపనిషత్తులకు పుస్తకరూపాన్ని ఇచ్చినట్టుగానే, భగవద్గీతను కూడా పుస్తకరూపంలోకి తీసుకువద్దామన్న సత్సంకల్పం కలిగింది మా ఇరువురికీ.

ఆ సంకల్పం కలగటమే ఆలశ్యం, పనులు ఎంత చకచకా జరిగిపోయాయంటే, అది నేను మాటలలో వర్ణించలేను. భగవద్గీతకు శ్రీకారం చుట్టాలి అనుకున్న మరుక్షణం అది రాయటానికి వీలుగా మా అమ్మాయి నుంచి, విష్ణుప్రసాదుగారినుంచి బోలెడు పుస్తకాలు, పెన్నులు వచ్చాయి. మా పబ్లిషరు శ్రీకృష్ణారావుగారి చెవిన వేస్తే ఆయన అప్పటికప్పుడు దానికి కావల్సిన ప్రణాళికలన్నీ వేసేశారు. ఆ పుస్తకం ఆకారం, దాని తీరు తెన్నులు అన్నీ చర్చించటమే కాక, మాకొక డీటీపి ఆపరేటరును కూడా సమకూర్చారు. ఆ డీటీపి ఆపరేటరు, శ్రీ రాజేంద్ర కుమార్ గారు, తప్పులు లేకుండా టైపుచేసే నైపుణ్యం కలవారు. భగవద్గీతను మూడు షట్కాలుగా ప్రచురించాలని నిశ్చయించుకున్నాము. భగవద్గీత ప్రచురిస్తున్నామని వినగానే మా సత్సంగ్ సభ్యులు, ఇది చాలా ఖర్చుతో కూడిన విషయమని, పోటీలుపడి ధనం సమకూర్చారు. అన్నింటినీ మించి కృష్ణపరమాత్మే స్వయంగా, మా ఇంట్లో పెయింటింగ్ రూపంలో, మా అల్లుని మిత్రుడు ద్వారా వేంచేసి మా గోడను అలంకరించాడు. అది ప్రత్యేకించి కాఫీపొడరుతో చేసిన అరుదైన చిత్రము.

చివరగా కోవిడ్ భయం రాజ్యమేలుతున్న ఈ లాక్‌డౌన్ సమయంలో, మా ఇంట్లో కొలువైన శ్రీకృష్ణపరమాత్మ నా చెయ్యి పట్టుకుని ఏకబిగిన అలవోకగా అనేక అధ్యాయాలు రాయించేశాడు. అంతేకాదు, మావారిచేత ఇంగ్లీషులో ఆన్‌లైనులో భగవద్గీత చెప్పిస్తున్నాడు.

దానికి తోడు ఆర్ష అవినాష్ బృందం ఇంగ్లీషులో పెట్టిన భగవద్గీత ప్రసంగం రెఫరెన్సు ఉండనే ఉంది. ఇన్ని విధాల కృష్ణపరమాత్మ తన కరుణాకటాక్షాలను కురిపిస్తుంటే, ఇంక వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరమే లేకపోయింది.

ఎవరికైనా దైవకృప, గురుకృప కావాలి అంటారు. మా దంపతులకు ఆ రెండూ మిన్నగా ఉన్నాయి. అందువల్లనే ఈ బృహత్కార్యాన్ని చేయగలుగుతున్నాము. భగవద్గీతను పరమార్థానందస్వామి బోధనలను ఆధారంగా చేసుకుని పొందుపరుస్తున్నాము. ఆ మాట గురువుగారికి చెప్పి ఆయన దీవెనలను కోరితే ఆయన రెండు చేతులూ ఎత్తి నిండు మనస్సుతో మీ ప్రయత్నంలో తప్పకుండా సఫలీకృతులవుతారని దీవించారు.

**– మద్దూరి రాజ్యశ్రీ**

# నా స్పందన

భగవద్గీత మనకు సాక్షాత్తూ భగవంతుని ముఖంనుంచి జాలువారిన మోక్షశాస్త్రం. అర్జునుణ్ణి మిషగా పెట్టుకొని శ్రీకృష్ణపరమాత్మ యావత్ మానవాళికి భగవద్గీత రూపంలో దివ్యమైన బోధచేసి మహోపకారం చేశాడు. అర్జునుడు శాస్త్రం తెలిసినవాడు; ధర్మమేమిటో, అధర్మమేమిటో స్పష్టంగా తెలిసినవాడు. కాని యుద్ధరంగంలో పరమపూజ్యులైన తన తాతగారిని, గురువుగారిని చూడగానే నీరుగారిపోయాడు. వీరిని చంపబోతున్నాను అనే ఆలోచనతో తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది.

పైగా, 'ఇది హింస, రక్తపాతానికి దారి తీస్తుంది,' అనడం మొదలు పెట్టాడు. పూర్తిగా మోహంలో పడిపోయాడు. ధర్మాధర్మవివేకం కోల్పోయాడు. భగవద్గీత ఐదువేల సంవత్సరాల క్రితంది. అయినా ఈ రోజుకూ మన సమస్యలను పరిష్కరించగల శక్తి సామర్థ్యాలు కలది. భగవద్గీత నిత్యపారాయణం మన మనస్సును ప్రక్షాళనం చేయగలదు. గీతను అర్థసహితంగా అధ్యయనము చేస్తే ఈశ్వరస్వరూపము, జీవస్వరూపము తెలుస్తుంది. స్వరూపతః జీవుడే ఈశ్వరుడు అని నిర్ధారణ అవుతుంది. ఆ స్వరూపనిష్ఠలో ఉంటే జీవన్ముక్తి, విదేహముక్తి రెండూ కలుగుతాయి. జీవించి ఉన్నంత కాలం అంతరస్స్వేచ్ఛ, ఆనందము, భద్రత, శాంతి కలిగి, ఎటువంటి ఒడిదుడుకులు, ఆందోళన, మానసిక తాపము లేకుండా హాయిగా ఉంటుంది. ప్రసంగవశాత్తు గీతలో అనేక ముఖ్యాంశాలు వస్తాయి. ఆహారనియమాలు, మితమైన నిద్ర, మనోసంయమనం, ఇంద్రియసంయమనం ఇలా ఎన్నో, అవి మన జీవితాన్ని దిశానిర్దేశం చేస్తాయి. గీత అక్షరాలా ఆచరణీయమైన గ్రంథము. భగవద్గీతను అందుకున్నవారి జీవితం ఒక నందనవనంలా ఉంటుంది.

నేను భగవద్గీతను దాదాపు పదిమంది మహాత్ములనుంచి గ్రహించాను. స్వామీ పరమార్థానందవారు చెప్పిన భగవద్గీత సామాన్యులకు కూడా చాలా సులభంగా అర్థమయ్యేలా ఉంటుంది. ఇది మన తెలుగు సోదరులకు అందించాలనే తపనతో, స్వామివారి ముందు మా కోరికను విన్నవించుకున్నాము. వారు సహృదయంతో రెండు చేతులూ ఎత్తి మనసారా దీవించారు. వారి దీవెన, దైవకృప ఫలితమే ఈ రోజు పుస్తకంగా మనముందున్న భగవద్గీత. దీనిలో శ్లోకము, శ్లోకం గురించిన విస్తారమైన వివరణతో పాటు, పదచ్ఛేదము, ప్రతిపదార్థము, అన్వయము కూడా పొందుపరిచాము. ఇది అధ్యయనానికే కాక తిరిగి పాఠముగా చెప్పడానికి కూడ వీలుగా ఉంది. నేను దీనితోనే మళ్ళీ నోట్సు రాసుకోకుండా సులభంగా పాఠం చెప్పగలుగుతున్నాను. స్వామి పరమార్థానందజీ భగవద్గీతను రెండు విధాలుగా చెబుతారు. మొదటిది మూలము, రెండవది భాష్యము. మూలములో శంకరహృదయం సూక్ష్మంగా తెలుస్తుంది. భాష్యం ఇంకా విస్తారంగా ఉంటుంది. ఇది స్వామీజీ బోధించిన భగవద్గీత మూలమునకు తెలుగు అనువాదము.

ఈ జన్మలో దైవప్రసాదంగా ఈ అపురూపమైన మానవశరీరం మనకు దక్కింది. ఇది ఉండగానే శాస్త్రాధ్యయనము చేసి ఆత్మనిష్ఠలో ఉండి జీవన్ముక్తులమయ్యి మరుజన్మ లేకుండా చేసుకుందాము. ఈ గ్రంథము గీతను బోధించే వారికి, స్వాధ్యాయనము చేసేవారికి చాలా అనుకూలంగా ఉంది. ఇది ప్రతి ఆస్తికుని వద్ద తప్పని సరిగా ఉండవలసిన పుస్తకరాజము.

**దుర్లభం త్రయమే వైతత్ దైవానుగ్రహహేతుకమ్।**

**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః॥** – వివేకచూడామణి

నిజంగా ఎన్ని జన్మల పుణ్యఫలమో స్వామి పరమార్థానందవారు మనకు గురువుగా లభించడం. స్వామీజీ మోక్షం ఇక్కడే ఇప్పుడే అని మాటిమాటికి చాటి చెప్పడమే కాకుండా అక్షరాలా నిశ్చయజ్ఞానాన్ని కలుగజేసి జీవన్ముక్తిని చవిచూపిస్తారు.

వీరు బోధించిన భగవద్గీత మృదుమధుర ద్రాక్షపాకంలాగా, హృదయానికి హత్తుకునేలాగా ఉంటుంది. వీరు విషయాన్ని క్రమబద్ధీకరించి, చక్కటి విశ్లేషణలతో అతి సులభంగా అందరికీ అర్థమయ్యే రీతిలో, తరగతిగదిలో పాఠంలాగా బోధిస్తారు. ఎన్నిసార్లు విన్నా ఇంకా ఇంకా వినాలనిపిస్తుంది.

సాధారణంగా గీతాబోధ శ్రవణానందాన్ని, మానసోల్లాసాన్ని కలుగచేస్తుంది. అందులోనూ వీరు పాఠం చెప్పాక, అందులో విషయాలన్నీ మళ్ళీ తిరిగి చెప్పగలము. ఇంత అమోఘంగా బోధ చేయడం స్వామీజీకే చెల్లింది. దీనికి ప్రత్యక్ష నిదర్శనం మేము కూడా పాఠం చెప్పటమే. స్వామీజీ పాఠమే మేమూ యథాతథంగా తెలుగులో చెబుతున్నాము, అది విని మా సభ్యులు రోజూ తడుముకోకుండా తిరిగి చెబుతున్నారు.

సుస్పష్టంగా గీతలోని అద్వైతామృతవర్షాన్ని మనపై విశేషంగా కురిపించి మనను కృతార్థులను చేస్తున్నారు. వీరు చెప్పిన ఈ గీతాబోధ తెలుగులోకి అనువాదంగా రావటం తెలుగువారందరికీ ఒక గొప్ప వరము. **జ్ఞానమువల్లనే మోక్షము** అనే విషయమును తేటతెల్లము చేస్తూ, కర్మ+ఉపాసన ద్వారా జ్ఞానయోగ్యతను పొంది, శ్రోత్రియుడూ బ్రహ్మ నిష్ఠుడైన గురువును ఆశ్రయించి, ఆత్మబోధను గ్రహించమంటాయి ఉపనిషత్తులు. స్వామి పరమార్థానందవారు అనన్య గురువులు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు. వారి శిష్యులమైన మనం ఎంతో అదృష్టవంతులం. వేదాంతంలోని చాలా చాలా క్లిష్టమైన అంశాలు, ఉదాహరణకు– మూడు సత్యాలు, అధ్యారోపము – అపవాదము, వివర్త ఉపాదానము, నిర్గుణ బ్రహ్మ, ఆత్మ, మాయా ఉపాధి – ఇలా ఎన్నో సృజనాత్మకంగా, చక్కటి ఉదాహరణలతో, చాకచక్యంతో, సుళువుగా అర్థమయ్యేలా బోధించే నేర్పుకలవారు. చైతన్యలక్షణాలు గురించి చెపుతూ చేయి–కాంతి అంటూ, విసుగూ విరామం లేకుండా చిరుదరహాసంతో చెబుతారు. వీరు తాత్పర్యనిర్ణయంలో దిట్ట; కాన్సెప్టులు రంగరించి పోయటంలో అందెవేసిన చెయ్యి.

స్వామీజీ బోధించని వేదాంత గ్రంథము లేదనే చెప్పవచ్చు. వీరి ప్రసంగాలు అన్నీ పరిగణిస్తే వేలకొలది గంటలు ఉన్నాయి. బహుశః ఈ అంశము గిన్నీస్ బుక్‌లో రికార్డు చేయదగినది. కోవిడ్ కారణంగా ఆన్ లైన్‌లో వివేకచూడామణి బోధించారు స్వామీజీ . కోవిడ్ కాలంలో కొంత మంచి కూడా జరిగింది. మన సభ్యులు వివేకచూడామణి చాలా ఉత్సాహంగా ఉత్కంఠతో విన్నారు. విని వాటిమీద వాట్సాప్‌లో ప్రశ్నలు వేసుకుని, పోటీలుపడి మరీ సమాధానాలిచ్చారు.

నేను పూర్ణుడను, ఆనందము నా స్వరూపము, నాకు ఏ వెలితిలేదు. స్వరూపతః నేనే పరమాత్మను అనే నిశ్చయాత్మకబుద్ధిని కలుగచేస్తారు. వీరి బోధలతో ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ప్రభావితమయి, జీవన్ముక్తులౌతున్నారు. వీరి శిష్యగణం అన్ని దేశాల్లో వ్యాపించి ఉన్నారు. అవును! స్వామీజీ గురించి ఎంత చెప్పినా చాలదు.

ఇక ఈ భగవద్గీత అనువాదకురాలు మద్దూరి రాజ్యశ్రీ, అంటే నా భార్యామణి గురించి. సృష్టి కార్యంకోసం ప్రజాపతులను బ్రహ్మ సృష్టించాడు. అటువంటి ప్రజాపతులలో కర్దముడు ఒకడు. ఆయన సత్సంతానము కలగాలని, అనుకూలవతి అయిన భార్యను ప్రసాదించమని బ్రహ్మకోసం పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆ తపః ఫలితమే దేవహూతి. కాని నాకు భగవత్ కృపవల్ల, తపస్సు చేయకుండానే అనుకూలవతి, సంస్కారవతి అయిన రాజీ(రాజ్యశ్రీ)ని భార్యగా ప్రసాదించాడు. ఇంక నా ఆధ్యాత్మిక జీవనానికి అడ్డుగోడలు లేవు. సాధారణంగా పుణ్యంకొద్దీ పురుషుడు అంటారు. నా విషయంలో పుణ్యంకొద్దీ నారి అయింది.

అలనాటి పుస్తకప్రచురణ సంస్థ ఎమెస్కో వ్యవస్థాపకులు, ఎం ఎన్ రావ్ గారి ముద్దు బిడ్డ తాను. బియ్యేలో తెలుగులో గోల్డు మెడల్ గ్రహీత, దానికి తోడు ఎమ్మే ఇంగ్లీషు ప్రెసిడెన్సీ కాలేజీ చెన్నై నుంచి. అటు ఇంగ్లీషులో, ఇటు తెలుగులో సవ్యసాచిలా అనువాదాలు, స్వంత రచనలు 65 పైనే చేసింది. వారి సంస్థలో బాలాంత్రపు నళీనికాంతరావుగారితో సహసంపాదకురాలిగా పనిచేసింది. వందలాది నవలలకు బ్యాక్ కవర్ పేజి మేటర్ రాసింది. www.telugubhakti.com, https://arshaavinash.in, కౌముదిలో, ఎన్నో రచనలు ప్రచురించబడ్డాయి.

మంతెన సత్యనారాయణరాజుగారి నాచురోపతి పుస్తకాలు ఇంగ్లీషులోకి అనువదించింది. వారు అనువాద సరస్వతి బిరుదుతో మొమెంటో బహుకరించారు. పుస్తకప్రపంచములో, శ్రీపీఠములో, ఆంధ్రభూమి వార్తాపత్రికలో, అనేక శీర్షికలు నిర్వహించింది. అందులో కొన్ని ముఖ్యమైనవి – ఎక్కాలే అక్కరలేని లెక్కలు, ఆలిస్ ఇన్ వండర్ లాండ్, మానవీయ విలువలు, యువగీత, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ త్రూ గీత, ఆధ్యాత్మిక కథలు.

రాజీ అనువాదాలు చాలా సరళమైన రీతిలో, అందరికీ అర్థమయ్యే భాషలో, తెలుగు నానుడితో, ఒరిజనల్‌కు ధీటుగా ఉంటూ ఇంకా ఇంకా చదివింపచేస్తాయి. జైకో పబ్లిషింగ్ హౌస్ వారికి, మంజుల్ పబ్లిషింగ్ హౌస్ వారికి 25 పుస్తకాలు దాకా ఇంగ్లీషునుంచి తెలుగుకు అనువాదాలు చేసింది. రాబిన్ శర్మ సెల్ఫ్‌హెల్ప్ మెనేజ్‌మెంటు పుస్తకాలు, వేదగణితం, రామాయణం, చాణక్య అర్థశాస్త్రం, షేక్స్‌పియర్ కథలు, పాజిటివ్ థింకింగ్ ఇలా ఎన్నో పుస్తకాలు అనువదించింది. ఇంటరు విద్యార్థులకు వీలుగా వినూత్న పద్ధతులతో ఏష్ట్ ఇంగ్లీషు గ్రామర్ అని ఆమె పుస్తకం ప్రచురితమైంది.

**మోక్షశాస్త్రమైన ఈ భగవద్గీతను, స్వామి పరమార్థానందవారు చెప్పిన పద్ధతిలోనే, అంటే ఎక్కడా స్వామీజీ బోధను పలుచన చేయకుండా, స్వంత భావాలు చొప్పించకుండా, యథాతథంగా పదిలంగా మనస్సుకు హత్తుకునేలా రాజీ వివరించింది.** ఇది ఒక **Magnum Opus.**

నాకు తెలిసి తెలుగులో ఇంత సులభమైన శైలిలో, లోతైన అర్థాలతో, ఆంతర స్వేచ్ఛను కలుగచేసే భగవద్గీత గ్రంథము మరొకటిలేదు. ఇది అందరూ తప్పక చదవవలిసిన గ్రంథము. ఇది ఆచరణీయ గ్రంథము. దీన్ని చదివి, శ్రీకృష్ణపరమాత్మ వివరించిన విధంగా జీవితాన్ని మలుచుకుని ప్రయోజనాన్ని పొందుతారని ఆశిస్తున్నాను.

ముందు ఎస్పీ ఎమ్ హెచ్ కళాశాల, మచిలీపట్నంలో లెక్చరర్‌గా; తరువాత నాగార్జునా జూనియర్ కాలేజీ హైదరాబాద్‌లో ముప్పయి సంవత్సరాలు ఇంగ్లీషు హెడ్‌గా పనిచేసింది. ఇంటర్వ్యూలో యూనివర్సిటీ నుంచి వచ్చిన సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ ఈమె మీకు మంచి ఎస్సెట్ అవుతుందన్నారుట. అక్షరాలా అది నిజమని వారి కరస్పాండెంట్

కమ్ ప్రిన్స్‌పాల్ జగన్మోన రెడ్డిగారు తరచూ చెప్పేవారు. కాలేజీలో అజాతశత్రువుగా అందరికీ తలలో నాలుకలా వ్యవహరించింది.

ఇక టీచింగ్‌లో తనదైన నవ్యతతో, ఛలోక్తులతో, భాషమీద మంచి పట్టుతో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠం చెప్పేది. ఒక మంచి లెక్చరర్‌గా విద్యార్థుల మనసులలో నిలిచిపోయింది. దానికి తార్కాణం ఎం ఎస్ టీమ్స్‌లో బోధించిన మాండూక్యోపనిషత్, బ్రహ్మసూత్రాలు కూడా. ఇంతవరకు అపజయం చవిచూడని తను మాండూక్యోపనిషత్, బ్రహ్మసూత్రాలు చెప్పడంలో, అపజయాన్ని ఎదురుచూడాల్సి వస్తుందేమోనని శంకించాను. తన సామర్థ్యం శంకించికాదు. వీటిని అర్థం చేసుకోవటానికి చాలా తార్కికమైన సూక్ష్మబుద్ధి ఉండాలి. కాని మాండూక్యోపనిషత్తును ఎన్నో పట్టికల ద్వారా వివరించి, తురీయానికి తొమ్మిది మెట్లు ఎక్కించేసింది.

బ్రహ్మసూత్రాల్లో అనేక వాదోపవాదాలు ఉంటాయి. చివరిరోజు 45 మంది సభ్యులతో, సూత్రధారి, పూర్వపక్షి, సిద్ధాంతుల పాత్రలతో నాటకీయంగా ఒక చిన్న ప్రదర్శన కూడ చేయించింది. రాజీకి అంత రసవత్తరంగా చెప్పగలిగిన సామర్థ్యం ఉంది.

అలుపు సొలుపు లేకుండా, రోజంతా అనువాదాలతో మునిగి తేలుతూ ఉంటుంది. అవికాక తన రీడింగ్, టీవీ చూడడం, ఇంటి పనులు, వంట, నిత్యపూజ, పారాయణం, ఫోన్లు చేయడం ఇలా ఎన్నో ఉన్నాయి. వీటిని కూడా ఏదీ వదలకుండా చాకచక్యంతో చేసుకుపోతుంది. ఎక్కడా దేనికీ లోటు చేయకుండా జీవితాన్ని ఎలా ఆనందంగా గడపాలో బాగా తెలుసు, రాజీకి.

దైవకృప, శాస్త్రకృప, గురుకృప ఉంటే సాధించలేనిది ఏమి ఉండదు. మన ఆర్ష విద్యా తరంగిణి తరఫున మొత్తం ప్రస్థానత్రయం (భగవద్గీత, దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు – చతుస్సూత్రి) గ్రంథరూపంలో ముద్రించ గలుగుతున్నాము. ఇవే కాక అద్వైత వేదాంత పరిచయము(తత్త్వబోధ), దృగ్దృశ్యవివేకము, భజగోవిందము అనే ప్రకరణగ్రంథములు, వేదాంత జీవనవిధానము, కైవల్యోపనిషత్ అనే గ్రంథాలు కూడా వచ్చాయి. చివరిదైన మాండూక్యోపనిషత్ సర్వాంగ సుందరంగా అలంకరించుకుని, గీతా జయంతికి, మీముందుకు రాబోతున్నది.

సాధకుల విశేష ఆదరణతో వీటిలో చాలా గ్రంథాలు పునర్ముద్రణకు నోచుకున్నాయి, ఈ భగవద్గీత మొదటి షట్కముతో సహా. ఈ అనువాదాలకు పాఠకులనుంచి మంచి స్పందన, స్వామీజీలనుంచి, స్వామినులనుంచి అమితమైన ప్రోత్సాహం, దీవెనలు అపారంగా లభిస్తున్నాయి.

ఈ బృహత్కార్యానికి ఆర్థిక సహకారం అందిస్తున్న వారికి, సంస్కృతం దిద్దిపెడుతున్న చైతన్యగారికి, అక్షరదోషాలు లేకుండా ప్రూఫ్‌రీడింగ్ చేస్తున్నవారందరికి, పేరుపేరునా శతథావందనాలు. మేము ఏమి తలపెట్టినా మాకు అనేక రకాలుగా అండదండలు మా ప్రాణమిత్రులు విష్ణుప్రసాదుగారు. వారికి కృతజ్ఞతాభివందనములు. ఆ భగవంతుడు వీరికీ, వీరి కుటుంబాలకూ ఆయురారోగ్యాలు, జ్ఞానప్రాప్తికలుగచేయుగాక.

ఎందరో మహానుభావులు అందరికీ శతకోటి వందనములు.

ప్రణామములతో,
**మీ రాఘవరావు**

# శ్రీ గురుభ్యో నమః

**శ్రీకృష్ణపరమాత్మనే నమః**

**"ఓం సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై।**
**తేజస్వినా వధీత మస్తు మా విద్విషావహై॥**
**ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః"**

మానవజన్మము పొందుట అతి దుర్లభము. అటువంటి జన్మమెత్తినందులకు తమ విలువైన సమయమును వృథా చేయకుండా జీవిత తుచ్ఛభోగములకొరకు వెంపర్లాడక, వ్యర్థము చేయకుండుట మానవునికి సమున్నత లక్ష్యము కావలెను.

లౌకిక సుఖములు: ఇవి ఇహలౌకికములైననూ, పారలౌకికములైనను అవి అశాశ్వతములు – కృత్రిమములు. కనుక మానవులు వానియందు విరక్తితో నుండుట, భగవదనుగ్రహప్రాప్తికి, సంసారార్ణవమును తరించుట మొదటి ఆవశ్యకము.

శ్రీకృష్ణభగవానుడే స్వయముగా అర్జునునకు శ్రీమద్భగవద్గీతను ఐదువేల సంవత్సరములకు పూర్వము ఉత్కృష్టమైన రణరంగమున ఆందోళనతోనున్న అర్జునునకు బోధించి, కార్యోన్ముఖుని చేసెను. ఇది సాక్షాత్తూ భగవంతుని దివ్యవాక్కు. దీని మహిమ అపారము, మహాగంభీరము, మహానిగూఢము కూడ. అందులకే ఇది పరమరహస్యగ్రంథమని పిలువబడినది. దీనిని మాటలలో వర్ణించుటకు సామాన్యులకు సాధ్యము కాదు. జీవిత పర్యంతము అభ్యసించవలసిన గ్రంథరాజము. కనుక చదువరులకు వారి భక్తిశ్రద్ధలకు అనుగుణముగా వారి స్థాయి, వారి జ్ఞాన పరిపక్వమునకు తగ్గట్లు కొత్తగా అర్థమగుచూ, నిగూఢమైనది కూడ తేలికగా అర్థమై, చంచల మనస్కులకు స్వాంతన చేకూర్చును.

శ్రీవ్యాసభగవానుడే శ్రీమద్భగవద్గీతను **"యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాత్ వినిః సృతా"** గీత శ్రీ పద్మనాభుడైన విష్ణుభగవానుని ముఖారవిందమునుండి వెలువడినదని నుడివియున్నారు.

అర్జునునితో **"అశోచ్యానన్వశోచస్త్వం"** శోకింపదగని వారికోసం శోకించుచున్నావని మొదలుపెట్టి మానవులు కర్మలు, స్వధర్మములు ఆచరించవలెను, కాని కర్మజన్యములగు ఫలితములందు ఆసక్తి లేక భగవదర్పణకుగాను కర్మలు ఆచరించవలెను అని కృష్ణపరమాత్మ బోధించెను. కర్మఫలితములను ఈశ్వర ప్రసాదమని భావింపవలెను. ఇది సాధకుని హృదయమున భగద్విషయక భక్తిచేత పూర్ణచిత్తమై సాధకము కాగలదు. నమ్రత భావమే అతి ముఖ్యసాధనము. భక్తి, కర్మ, ధ్యాన, రాజయోగములన్నింటికి జ్ఞానమే పరకాష్ఠ. అది అంతర్లీనమై, అర్హతకు తగ్గట్లు ఫలితమొసగును.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥** – 18.66

సమస్త సంశయములను త్యజించి నన్నే (నాస్వరూపుము నందే) నీవు శరణు పొందుము. సర్వపాపముల నుండి నిన్ను విముక్తుని చేసెదను. శోకింపకుము.

శ్రీభగవద్గీత భక్తి, కర్మ, జ్ఞాన, వైరాగ్య, మోక్ష సాధన గ్రంథరాజము. భయశోకవివర్జితం, సంసార మల నాశనం, పూర్వజన్మకృత పాపవినాశనమ్. పునర్జన్మ వర్జితం, సర్వవేద ఉపనిషత్తుల సారము, స్వచ్ఛమైన పితికిన ఆవుపాలవలె, గంగాస్నానము వలె సర్వశ్రేష్ఠము.

దేవదేవుడైన శ్రీకృష్ణపరమాత్మయే నిత్యుడని, ఆదిపురుషుడని, పరమసత్యస్వరూపుడని నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు వంటి మహామహులే నిర్ధారించియున్నారు. వారు గ్రహించినవన్నియూ సత్యమే అని శ్రీకృష్ణభగవానుడే స్వయముగా ఒప్పుకొనియున్నాడు. "సర్వమేతత్ ఋతం మన్యే". వీరు చెప్పినవన్నీ శాస్త్ర సమ్మతమేనన్నాడు.

శ్రీభగవద్గీత శ్రీకృష్ణభగవానుని వేదజ్ఞానపు పూర్ణస్వరూపమని, నిరాకారుడని, దివ్యపురుషుడని ధృవీకరించి యున్నది.

**నిత్యో నిత్యానాం, చేతనశ్చేతనానామేకో బహూనాం యో విదధాతి కామాన్‌।** – కఠ. 2.2.13

అనిత్యవస్తువులోను, నిత్యవస్తువులలోను, చేతన ప్రాణులలో చైతన్యముగా ఉన్నాడని వచించియున్నది.

శ్రీభగవద్గీతయందు చర్చించబడిన ఐదు మూల అంశములు – 1) ఈశ్వరుడు, 2) జీవుడు, 3)జగత్తు 4) బంధము 5) మోక్షము.

మా గురుదంపతులు శ్రీ కస్తూరి వీరరాఘవరావుగారు, శ్రీమతి మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీగార్లు ఆదర్శదంపతులు, నిష్ఠాగరిష్ఠులు, నిస్వార్థపరులు, సౌశీల్యురు. ఈ పుణ్యదంపతులు పూజ్యశ్రీ దయానందసరస్వతి స్వామీజీ – ఋషీకేశ్, వారి శిష్యులైన పూజ్యశ్రీ పరమార్థానంద స్వామీజీ – చెన్నై, వద్ద శిష్యరికముతో అనేక సంవత్సరముల పాటు ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత బోధనలు పొందిరి. తమ గురువుగారి ప్రసంగభాష్యములకు ముగ్ధులై శ్రీ పరమార్థనంద స్వామీజీ ఆంగ్ల ప్రవచనములను విని తెనుగున అనువదించిరి. వీరు అనువదించినది పదకొండు ఉపనిషత్తులు, ప్రకరణ గ్రంథములైన తత్త్వబోధ, భజగోవిందము, దృగ్దృశ్యవివేకము, వేదాంతజీవనవిధానము. ఈ పుస్తకములను తెలుగు పాఠకుల కొరకు బహుసరళ తెలుగు భాషలో ప్రచురించి యున్నారు. ఇవేకాక పూజ్య గురు సతీమణి మద్దూరి రాజ్యశ్రీగారు విడిగా 25 పుస్తకములు ఆంగ్లభాషనుండి తెనుగునకు అనువదించియున్నారు. ఉపనిషత్తు పుస్తకములు ప్రచురించడమే కాక, వీరిరువురు హైదరాబాద్‌లోని దయాసత్సంగ్–అమీర్‌పేటలోను, ఆర్ష ఆనందకుటీర్–అపర్ణ సరోవర్–నల్లగండ్లలోను, వేదాంత సీనియర్ సిటిజన్ అసోసియేషన్–అపర్ణ కమ్యూన్‌లోను, దాదాపు 200కు పైగా సభ్యులతో కూడిన సత్సంగములకు ఉచితముగా, నిస్వార్థముగా ఉపనిషత్తులను, భగవద్గీతను, ప్రకరణములను తెలుగులోను, ఆంగ్లములోను బోధించుచున్నారు. ఇదియును కాక కరోనా పరిస్థితివల్ల దాదాపు దేశవిదేశాలలో 90 సభ్యులకు ఆన్‌లైన్ ద్వారా ప్రస్థానత్రయమగు

శ్రీమద్భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలను బోధనలు చేస్తూ వారి గురుదేవుల మన్ననలు పొందుచున్నారు. వీరు రచించిన పుస్తకములు ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యము. ఒకదానిని మించి మరొకటిగా పాఠకులకు అనిపించును.

అద్వైతమాధుర్యముల ప్రసంగములే కాక మా గురువులు శ్రీభగవద్గీత మూలమునకు మూడు షట్కములలో కర్మషట్కము(1–6 అధ్యాయాలు), ఉపాసనషట్కము (7–12 అధ్యాయాలు), జ్ఞానషట్కము (13–18 అధ్యాయాలు) ప్రచురించారు. ఇప్పుడు మొదటి షట్కము మళ్ళీ పునర్ముద్రణకు వచ్చింది.

నా 22వ యేటనే గురోపదేశము (పూజ్య కీ॥శే॥ నిత్యానందుల స్వామీజీ వారు–కపిలకృష్ణ మఠము–చెన్నై) పొంది ధ్యాన, రాజ, కుండలినీ యోగములు అభ్యసించిననూ ఉద్యోగవత్తిడి, తరచుగా ప్రదేశములు మార్పుల కారణముగా వాటిని పెంపొందించలేక పోయిననూ, సత్సంగ సాంగత్యము మాత్రము వీడకయుంటిని. కాని మనస్సున మాత్రము వేదశాస్త్రముపై అధ్యయనము చేయవలెనను ఆర్తి మిగిలిపోయినది.

ఈ తరుణమున వేదాంత సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్ శ్రీ సిరిగిరి ప్రభాకర్‌గారు, గురుదంపతులగు పూజ్యులు రాఘవరావు, రాజ్యశ్రీగార్లను జ్ఞానభిక్ష పెట్టమని అభ్యర్థించగా, వారి వినయ అభ్యర్థనకు అనుగుణముగా మా గురుదంపతులు ప్రసంగించుటకు ఒప్పుకొనిరి. శ్రీ సిరిగిరి ప్రభాకర్‌గారికి మా హృదయపూర్వక ధన్యవాదములు. అప్పటినుంచి ఇప్పటివరకు సుమారు 3 సంవత్సరములుగా నిర్విరామంగా దాదాపు 9 ఉపనిషత్తులు, ప్రకరణ గ్రంథములు, ఆత్మబోధనలు జరుగుచున్నవి.

ఈ స్పందన వ్రాయమని కోరిన మా గురుదంపతులకు పాదాభివందనములు.

పూజ్య గురుదంపతుల బోధనాశైలి ప్రత్యేకము. వీరిరువురు స్వతహాగా కాలేజీల్లో సీనియర్ లెక్చరర్లుగా పనిచేసి పదవీ విరమణ పొందినవారైనందువలన బోధనాశైలి సత్సంగ సభ్యులకు అందరికి బహు సులభతరముగా, బాగుగా అర్థమగునట్లు, ఒక ప్రణాళిక ప్రకారము కొనసాగించుచున్నారు. ముందుగా అద్వైత వేదాంత పరిచయము, శాంతి మంత్రములు, తదుపరి ముండక, కఠ, కేన, ప్రశ్న, ఈశావాస్య, ఐతరేయ, తైత్తిరీయ, ఛాందోగ్య, కైవల్య ఉపనిషత్తులు బోధించి ప్రకరణ గ్రంథములైన దృక్‌దృశ్య వివేకము, అపరోక్షానుభూతి, భజగోవిందము బోధించి, స్వాధ్యాయముకోసం శ్రీరుద్రం, పురుషసూక్తం, గణపతి అథర్వ శీర్షం మొదలగు పారాయణాలు విపులంగా బోధించి, తాము తెనిగించిన "వేదాంత జీవన విధానమును" సత్సంగ సభ్యులకు బాగుగ బోధపరచియున్నారు.

**తచ్చింతనం తత్కథనమ్ అన్యోన్యం తత్ప్రబోధనమ్**
**ఏతదేక పరత్వం చ, త దభ్యాసం విదుర్బుదాః –** యోగవాసిష్టమ్

చింతనం, ఒకరికి చెప్పుట, పరస్పరబోధనము, మననం – ఇదే బ్రహ్మాభ్యాసమని వసిష్టమహర్షి శ్రీరామునికి బోధించినట్లు మా గురుదంపతులు బ్రహ్మాభ్యాసమును మా సత్సంగ సహాధ్యాయులచే చేయించుచున్నారు. ఇటువంటి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులైన గురువులు దొరకడం, సాంగత్యం, సఖ్యత మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాము.

నీ పాదకమల సేవయు. నీ పాదార్చకులతోడి నెయ్యము, నిరంతర అపారభూతదయయూ తామసమందార నాకు దయసేయ గదరే

ఇక గురుదంపతుల మాటలలో మనము శ్రీమద్భగవద్గీతను అధ్యయనము చేద్దాం –

**"మోక్షమూలం గురోర్కృప"**

ధర్మపరిరక్షణ, ధర్మవ్యాప్తికి నిర్విరామముగా కృషిచేస్తూ, దినకృత్యములతో, గృహస్థాశ్రమము నందుండే అద్వైత వేదాంత సిద్ధాంతములను ఔపోసన పట్టి, దానిని నిస్వార్థముగా ఇతరులకు పంచిపెట్టుచున్న మా గురుదంపతులకు సర్వ అభీష్టములు నెరవేరాలని, సకల ఆయురారోగ్యములు కలగాలని ఆ దేవదేవుని మనసారా వేడుకుంటున్నాను.

**"గురోః పరతరం నాస్తి సత్యం సత్యం న సంశయః**
**గురోః పాదోదకం పీత్వా గురోర్నామ సదా జపేత్"**

కృష్ణం వందే జగద్గురుమ్

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

ఓం తత్ సత్

ఇట్లు
సుధీజన విధేయుడు
**కృష్ణ శెవ్వాన (కలం పేరు)**
**(S.R. కృష్ణారావు)**
**వేదాంత సీనియర్ సిటిజన్ – అపర్ణా కమ్యూన్**

నల్లగండ్ల, హైదరాబాద్
30.8.2020

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । గణేశాయనమః ।
సరస్వత్యైనమః । శ్రీ గురుభ్యోనమః ।
హరిః ఓమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# శ్రీమద్భగవద్గీత

## గీతా మాహాత్మ్యమ్

మన భారతీయ సంస్కృతి వైదిక శాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని ఏర్పడింది. అందువల్ల మన సంస్కృతిని వైదిక సంస్కృతి అని అనవచ్చు. వైదిక సంస్కృతి అంటే ధర్మపరమైన సంస్కృతి. అందువల్ల వైదిక సంస్కృతిని ఆధారంగా చేసుకున్న జీవన విధానం ధర్మంతో పెనవేసుకుని ఉంటుంది. అంటే దేవునితో అనుసంధానం చెంది ఉంటుంది. అందువల్ల మన సంస్కృతిలో భగవంతుడు చాలా ముఖ్యమైన పాత్ర వహిస్తాడు. పొద్దున్న లేస్తూనే, మన జీవితం దైవచింతనతో మొదలవుతుంది. దేవునికి సుప్రభాతం పాడటంతో మొదలైన దినచర్య అక్కడితో ఆగదు. మనం రోజులో అడుగడుగునా భగవంతునితో అనుసంధానం చెందుతాము.

దంతధావన చేసేటప్పుడు, పూర్వం పందుంపుల్ల వాడేవారు కాబట్టి, వృక్షాలకు దేవత అయిన వనస్పతి దేవతకు ప్రార్థన చేసేవారు. 'ఓ దేవా, నువ్వు నా దంతాలను శుభ్రం చేసేటప్పుడు, అక్కడితో ఆగకుండా, నా మనస్సును కూడా శుభ్రం చేయి.'

స్నానం చేసేటప్పుడు, దాన్ని భగవంతునికి చేసే అభిషేకంగా భావించాలి. అలాగే వస్త్రాలంకరణ చేసుకునేటప్పుడు, రేవతీ దేవతలకు ప్రార్థన చేయాలి. భోజనం చేసేటప్పుడు, ప్రసాదబుద్ధితో స్వీకరించాలి. అలా రోజంతా రాత్రి పడుకునేదాకా, పడుకునే ముందు, భగవన్నామస్మరణ చేస్తూనే ఉండాలి.

ఆ మాటకొస్తే, మన దినచర్యే కాదు, మన పుట్టుకనే దైవపూజతో మొదలవుతుంది. గర్భాదానమంత్రాల్లో తండ్రి తనను సాక్షాత్తూ పరమేశ్వరునిగా భావిస్తాడు, తల్లి పాలు ఇచ్చేటప్పుడు, తండ్రి సరస్వతీ కృపను కోరుతూ ప్రార్థన చేస్తాడు. సీమంతం, బారసాల వేడుకలు కూడా దైవచింతనతో పెనవేసుకున్నవే. అవన్నీ పెరిగే పుత్రుడు సంస్కారవంతంగా పెరగాలని చేసే ప్రార్థనలు. మరణించేటప్పుడు చేసే కర్మను అంత్యేష్టి కర్మ అంటారు. చివరకు దాన్ని కూడా యజ్ఞంలా భావిస్తారు. జీవించి ఉన్నన్నాళ్ళూ గృహస్థు అనేక యజ్ఞాలు అగ్నిదేవతకు చేస్తే, అతని మరణానంతరం, అతని పుత్రుడు, అదే అగ్నిదేవతకు తన తండ్రిని ఆహుతిగా వేస్తాడు. ఆ విధంగా తల్లిగర్భంలో రూపుదిద్దుకునే ముందునుంచీ, ఆఖరిశ్వాస వదిలేవరకూ, భగవంతునితో అనుసంధానం చెందుతాం మనం. పొద్దున్న లేచినది మొదలు, రాత్రి పడుకునే వరకూ, దైవచింతనతో పెనవేసుకుని ఉంటుంది మన దినచర్య.

ఎందుకు ఇంతలా దైవచింతనతో పెనవేసుకుని ఉండాలి మన జీవితం? ఎందుకంటే మన ప్రాథమిక అనుబంధం భగవంతునితోనే ఉంది అంటుంది శాస్త్రం. భగవంతుడు మన సృష్టికర్త, మనం ఆయననుంచి ప్రాణం పోసుకున్న జీవులం. అంటే భగవంతుడు కారణం, మనం కార్యం. అందువల్ల తండ్రీ–కొడుకుల అనుబంధరీత్యా, కార్య–కారణ సంబంధరీత్యా మనకు భగవంతునితో అనుబంధం ఉంది. మన తల్లిదండ్రులతో

మన అనుబంధం ఈ జన్మకే పరిమితం. పూర్వజన్మలో తల్లిదండ్రులెవరో తెలియదు, మరుజన్మ అంటూ ఉంటే అప్పుడు తల్లిదండ్రులెవరు అవుతారో తెలియదు. అసలు మనము మనుష్యులుగానే పుడతామో లేదో తెలియదు. కాని భగవంతుడు తండ్రిగా, మనం పిల్లలుగా – మనది జన్మజన్మల అనుబంధం. జన్మజన్మలే కాదు, ప్రళయం తరువాత జరిగే సృష్టిలోనూ ఈ అనుబంధం కొనసాగుతూనే ఉంటుంది. ఎప్పటికీ కార్య–కారణ అనుబంధం ఉంటుంది. అదే మానవమాత్రులతో అనుబంధాలు తీసుకుంటే, కొన్ని అనుబంధాలు మరీ తాత్కాలికం. గాలి వీస్తే వీగిపోతాయి మరికొన్ని. ఒకవేళ ఎక్కువ రోజులు ఉన్నా, అవి ఈ జన్మవరకే పరిమితం. అందువల్లనే వేదాలు పదేపదే చెబుతున్నాయి, భగవంతునితో ఉన్న శాశ్వత అనుబంధాన్ని మర్చిపోవద్దు అని. వ్యావహారిక జీవనంలో అనేక బంధాలను పెంచి పోషించుకోవటంలో చాలా సమయం వెచ్చిస్తూ ఉంటాము. ఆ దిశలో ప్రయత్నం చేయండి ఫర్వాలేదు, కాని, ఆ ప్రయత్నంలో ప్రాథమిక అనుబంధాన్ని పోగొట్టుకోకూడదు.

అందువల్ల శాస్త్రం గట్టిగా హెచ్చరిస్తుంది – ఏ క్షణంలో అయితే భగవంతునితో ఉన్న ప్రాథమిక అనుబంధానికి దూరమవుతారో, ఆ క్షణమే మీ జీవితం దుర్భరమవుతుంది, చుక్కాని తెగిన నావలాగా ఉంటుంది. అనేక సమస్యలలో కూరుకుపోతారు.

జీవితంలో అసలైన ఐశ్వర్యం భగవంతుని కృప. లౌకికంగా ఎంత ఐశ్వర్యాన్ని పొందినా, భగవంతుని కృప లేకపోతే, జీవితం సాఫీగా సాగదు. అందువల్ల అనాదిగా వస్తున్న అనుబంధాన్ని మర్చిపోకూడదు.

**విపదో నైవ విపదః సంపదో నైవ సంపదః।**

**విపత్ విస్మరణం విష్ణోః సంపత్ సంస్మరణం హరేః॥**

విపత్తు అంటే ఏమిటో, సంపద ఏమిటో శాస్త్రం చాలా చక్కగా వివరిస్తున్నది. విష్ణునామాన్ని విస్మరించటమే విపత్తు; హరినామ సంస్మరణమే సంపద. అందువల్ల వైదిక జీవనవిధానం అంటే ఈ విషయాన్ని జీర్ణించుకుని, ఈ విధమైన సంపదను పెంపొందించుకోవటం. భగవంతునితో మనకున్న అనుబంధాన్ని అర్థం చేసుకుని, పెంచి, పోషించుకోవటమే ధర్మపరమైన, భగవంతునితో అనుసంధానమైన జీవనవిధానం. ఈ జీవనవిధానాన్ని పెంపొందించటానికి మన సంస్కృతి అనేక ధర్మపరమైన కార్యక్రమాలను నిర్దేశించింది.

ఏ అనుబంధమైనా పదికాలాలు నిలవాలంటే ఆ వ్యక్తితో ప్రత్యేకంగా కొంతకాలం గడపాలి. ఇది ప్రాథమిక సూత్రం. ఈ రోజుల్లో అనుబంధాలు వీగిపోతున్నాయి అంటే ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరించటంవల్లనే. టీవీ చూస్తూ, భార్యతో మాట్లాడితే, అది చాలదు. వేరే ఏ పనీ చేయకుండా, భార్యకు మాత్రమే కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. అప్పుడే ఆ అనుబంధం పటిష్ఠంగా ఉంటుంది. ఈ సూత్రం భగవంతునికి కూడా వర్తిస్తుంది. అందువల్ల భగవంతునితో సమయం గడిపేలాగా మనకు కొన్ని పూజలను నిర్దేశించింది. అవి చేయాలంటే ముందు వాటి ప్రాముఖ్యత అర్థం కావాలి. లేకపోతే అది యాంత్రికం అవుతుంది. ఎక్కువ కాలం నిలవదు.

జీవితంలో ఏ విద్య నేర్చుకోవాలన్నా రెండు దశలుంటాయి. ఆ విద్యకు సంబంధించిన థియరీ తెలుసుకోవాలి; దాన్ని సాధన చెయ్యాలి. ఉదాహరణకు సంగీతం నేర్చుకోవాలంటే ఆరోహణం అంటే ఏమిటో అవరోహణం అంటే ఏమిటో తెలియాలి. సపస అంటే ఏమిటో, జంటస్వరాలు అంటే ఏమిటో, ఆదితాళమంటే ఏమిటో,

రూపకతాళం అంటే ఏమిటో, కాంభోజిరాగం అంటే ఏమిటో తెలియాలి. అప్పుడే సాధన అర్థవంతంగా సాగుతుంది– సంగీతమే కాదు, టెన్నిస్ ఆడాలన్నా ఇదే సూత్రం వర్తిస్తుంది. టెన్నిస్ రాకెట్‌ను ఎలా పట్టుకోవాలి, కాలు ఎలా పెట్టాలి, బంతిని ఎలా ఎగరవేయాలి, ఎలా కొట్టాలి – వీటన్నిటినీ డబ్బు ఖర్చు పెట్టి కోచ్ దగ్గర నేర్చుకుంటే, అప్పుడు ఆటలో ఆరితేరతాము.

అలాగని థియరీ నేర్చుకుని, దాన్ని సాధన చేయకపోయినా లాభం లేదు. యోగాసనాలు ఎలా వెయ్యాలో తెలుసు. వాటి వివరాలు తెలుసు. అర్ధమత్స్యేంద్రాసనం, శీర్షాసనం, ధనురాసనం అంటూ రకరకాల ఆసనాల పేర్లు చెప్పేస్తారు కొంతమంది. ఎంతసేపు ఆసనాలు వేస్తావు నువ్వు అని వారిని అడిగితే, క్షణం కూడా వెయ్యరు. ఎంత తెలిసి ఏం లాభం, దాన్ని ఆచరణలో పెట్టలేకపోయాక! అందువల్ల లౌకిక విద్యలో కూడా థియరీ, ప్రాక్టీసు రెండూ రెండు కళ్ళు. రెండూ సమానస్థాయిలో సాగాలి. లేకపోతే అందులో రాణించలేరు.

ఇదే సూత్రం ఆధ్యాత్మిక విద్యకు కూడా వర్తిస్తుంది. దానికి కూడా థియరీ, ప్రాక్టీసు అనే రెండు దశలున్నాయి. థియరీ అంటే శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. అందువల్ల పూర్వం ఏ వర్ణానికి చెందినా, చిన్న వయస్సులోనే గురుకులానికి వెళ్ళి కొన్ని సంవత్సరాలపాటు గురుముఖతః శాస్త్రాన్ని అభ్యసించేవారు. ఆ జీవనవిధానాన్ని బ్రహ్మచర్య ఆశ్రమం అనేవారు. వారు తరువాత ఏ విద్య చేపట్టినా శాస్త్ర అధ్యయనం చేసితీరాలి. బ్రహ్మచర్యం ముగిశాక, పెళ్ళి చేసుకుని గృహస్థుగా మారినా కూడా, భగవంతునితో అతని అనుబంధం కొనసాగేలాగా అతని జీవనవిధానం ఉండేది. అందువల్ల ఆ జీవనవిధానాన్ని కూడా గృహస్థాశ్రమం అనేవారు. భగవంతునితో అనుసంధానం చెందితేనే అది ఆశ్రమం అవుతుంది. లేకపోతే శ్రమ అవుతుంది. శ్రమ అంటే ఒత్తిడి, ఆందోళన, గొడవలు, పోట్లాటలు. గృహస్థ జీవనం శ్రమలా ఉంటుందా, ఆశ్రమంలా ఉంటుందా అనేది అతని జీవితం దైవప్రధానంగా ఉంటుందా, లేదా అనే అంశంమీద ఆధారపడి ఉంటుంది. దైవప్రధానంగా ఉండాలంటే అతను బ్రహ్మచర్య ఆశ్రమం పాటించి, గురువు ద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేసి ఉండాలి.

తరువాత, మన శాస్త్రాలను కూలంకషంగా అధ్యయనం చేయాలంటే అది చాలా కష్టమని తెలుసుకున్నారు. ఎందుకంటే మన శాస్త్రం చాలా విస్తారమైనది. 14 రకాల విద్యలు ఉన్నాయి. నాలుగు వేదాలు, మీమాంస శాస్త్రం, ధర్మశాస్త్రం, తర్కశాస్త్రం, పురాణాలు – ఇలా ఎన్నో ఉన్నాయి. ఇవికాక గంధర్వవేదం వంటి నాలుగు ఉపవేదాలు కూడా ఉన్నాయి. మనకేమో అంత తీరిక లేదు. పొద్దున లేచినది మొదలు పరుగులు తీయటమే సరిపోతున్నది. ఇప్పటి సెల్‌ఫోన్ యుగంలో మరీను. గీతాబోధకు వెళ్ళినా, ఆ గంటసేపు కూడా ఫోన్‌ను స్విచ్చాఫ్ చేయలేము.

**అనంత శాస్త్రం బహు వేదితవ్యం అల్పశ్చ కాలో బహవశ్చ విఘ్నాః।**

**యత్సారభూతం తదుపాసితవ్యం హంసో యథా క్షీరమివాంబుమిశ్రః॥**

అనంతశాస్త్రం – శాస్త్రం అనంతంగా ఉంది; బహు వేదితవ్యం – నేర్చుకోవాల్సింది చాలా ఉంది; అల్పశ్చకాలో– సమయం చాలా తక్కువ ఉంది; బహవశ్చ విఘ్నాః – ఆటంకాలు ఎన్నో వస్తున్నాయి; యత్సారభూతం తదుపాసితవ్యం– అన్నీ అధ్యయనం చేసే తీరిక లేకపోతే, కనీసం శాస్త్రాల సారాన్ని అయినా అధ్యయనం

చేయాలి. ఎలా? హంసో యథా క్షీరమివాంబు మిశ్రః – హంస పాలు నీళ్ళ మిశ్రమాన్నుంచి పాలను విడదీసినట్లుగా. అటువంటి సారం ఎక్కడ దొరుకుతుంది? శాస్త్రాల సారాన్ని భగవద్గీతలో చూస్తాము. సాక్షాత్తూ కృష్ణపరమాత్మే చెబుతాడు ఆ విషయాన్ని

**స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।**
**భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥ – 4.3**

శంకరులవారు తన ఉపోద్ఘాత భాష్యంలో రాస్తారు – మనుష్యులు బాహ్యాముఖంగా పరుగులు తీస్తున్నారు, వారి కోరికలు అనంతంగా ఉన్నాయి, వారికి క్షణం తీరికలేదు. ఆశ్చర్యం చూశారా? ఈ విషయం 1200 సంవత్సరాల క్రితమే వర్ణించారు శంకరులవారు. అంటే 21వ శతాబ్దంలో మనుష్యులు ఎలా ప్రాపంచిక విషయాలలో పడి కొట్టుమిట్టాడుతుంటారో, ఆయన 8వ శతాబ్దంలోనే వర్ణించారు!

అందువల్ల కృష్ణపరమాత్మ ఉపనిషత్తుల సారాన్ని తీసుకుని, మనకు భగవద్గీత రూపంలో అందించాడు. ఈ ఒక్క గ్రంథాన్ని సరిగ్గా అధ్యయనం చేస్తేనే మన సంస్కృతి, మన వైదిక జీవన విధానం, మన శాస్త్రం, భగవంతునితో మన అనుబంధం, మన ధర్మపరమైన కర్మల వెనకనున్న అంతరార్థం – అన్నీ బాగా అర్థమవుతాయి. అందువల్ల మన ఆచార్యులందరూ ముక్తకంఠంతో చెప్పేదొక్కటే! – ప్రతి ఒక్క భారతీయుడు, ప్రతి ఒక్క హిందువు, కనీసం భగవద్గీతను అధ్యయనం చేసితీరాలి. అది కూడా ఒక క్రమపద్ధతిలో కూలంకషంగా అధ్యయనం చేయాలి. ఒక్కొక్క శ్లోకం అర్థం నేర్చుకుంటూ రావాలి. కనీసం ఒక్కసారైనా మొత్తం భగవద్గీతను నేర్చుకోవాలి. మీలో ఆధ్యాత్మిక చింతన ఉన్నా లేకపోయినా, భారతదేశాన్ని అర్థం చేసుకోవాలంటే, మన సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే, తప్పనిసరిగా భగవద్గీతను అధ్యయనం చెయ్యాలి. ఒకవేళ ఆధ్యాత్మిక చింతన ఉంటే ఉపనిషత్తులు కూడా నేర్చుకోవచ్చు, ఒకవేళ ఆధ్యాత్మిక చింతన లేకపోతే, భగవద్గీత అయినా నేర్చుకోవాలి. లేకపోతే మన క్రతువులు అర్థరహితంగా కనిపిస్తాయి. ఇప్పటికే యజ్ఞయాగాదులు పోయాయి. కనీసం గాయత్రీమంత్రం కూడా జపించేవారు అరుదు అయిపోయారు.

ఇప్పటి కాలమాన పరిస్థితుల్లో, ఈ పరుగు పందెంలో పాల్గొనే హడావుడిలో చాలామంది ఆధ్యాత్మిక చింతన వైపు మొగ్గు చూపటం లేదు. ఈ పరుగుపందెంలో భాగంగా విశాలమైన ఇల్లు, పడవంత కారు, చాలా మంది నౌకర్లు ఉండవచ్చేమో కాని, మనస్సు శూన్యంగా ఉండే ప్రమాదముంది. ఎందుకంటే ఐహికసుఖాలు మాయ; మాయ అంటే మిథ్య, శాశ్వతం కావు. మనకు పూర్ణత్వాన్ని ఇచ్చేది ఆధ్యాత్మిక చింతన మాత్రమే.

పూర్వం విద్యార్థులకు గురుకుల సాంప్రదాయం ఉండటంవల్ల, శాస్త్రాన్ని అధ్యయనం చేయటానికి అవకాశం ఉండేది. ఇప్పుడు శాస్త్ర అధ్యయనం మాట దేవుడెరుగు, గీతాబోధే అరుదైపోయింది. పుట్టగొడుగుల్లా అనేక సంస్థలు అనేక రంగాల్లో పుట్టుకొస్తున్నాయి కాని భగవద్గీత బోధ, అది కూడా ఒక క్రమపద్ధతిలో చేయటానికి ఎవరూ ఉత్సాహం చూపటం లేదు. ఇటువంటి నేపథ్యంలో ఎవరన్నా భగవద్గీత బోధిస్తున్నా, అటువంటి బోధకు ఎవరన్నా క్రమం తప్పకుండా వెళుతున్నారన్నా వారిని అభినందించక తప్పదు. కాని అదే సమయంలో వారికి ఒక హెచ్చరిక కూడా ఇవ్వక తప్పదు. భగవద్గీత నేర్చుకుంటే చాలదు, దాన్ని అంతరంగంలోకి జీర్ణించుకోవాలి.

గీత నేర్చుకోవటానికే పరిమితమవకూడదు; గీత మీ జీవనవిధానానికి మార్గదర్శి. అందువల్ల నేర్చుకున్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలి.

**ఆచార్యాత్ పాదమ్ ఆదత్తే పాదం శిష్యః స్వమేధయా**
**పాదం స బ్రహ్మచారిభ్యః పాదం కాలక్రమేణ చ**

మీరు నేర్చుకునే విద్యను నాలుగు భాగాలుగా విభజిస్తే –

| | |
|---|---|
| **ఆచార్యాత్ పాదమ్ ఆదత్తే** | – గురువు బోధవల్ల నేర్చుకునేది ఒకవంతు |
| **పాదం శిష్యః స్వమేధయా** | – తన స్వంతమేధస్సుతో అర్థం చేసుకునేది ఇంకొక వంతు |
| **పాదం సబ్రహ్మచారిభ్యః** | – తన తోటి విద్యార్థులనుంచి గ్రహించేది మూడవ వంతు |
| **పాదం కాలక్రమేణ** | – తన ప్రవర్తనవల్ల ఆచరణలో పెట్టేది నాలుగవ వంతు |

గీత నేర్చుకున్న విద్యార్థిగా మీ జీవితం ఎలా ఉండాలి? కృష్ణపరమాత్మ అనేక చోట్ల అనేక విలువలను బోధించాడు. అందువల్ల మీ జీవితం ఆ విలువలను ఆచరణలో పెట్టేదిగా ఉండాలి. విలువల గురించిన జ్ఞానాన్ని ఋతం అనీ, దాన్ని ఆచరణలో పెట్టటాన్ని సత్యం అనీ అంటారు. రెండూ ముఖ్యమే. జ్ఞానం, అనుష్టానం రెండూ ఉండాలి.

భగవద్గీతలో గీతా మహాత్మ్యమ్ గురించి కూడా ఉంది. అందులో సాక్షాత్తూ విష్ణుమూర్తే, పృథివీ దేవతకు గీతా మహాత్మ్యమ్ గురించి వివరిస్తాడు. గీతాసారం అర్థం అయినా కాకపోయినా, రోజూ 18 అధ్యాయాలు చదివితే మంచిది. 18 అధ్యాయాలు చదివే తీరిక లేకపోతే 9, లేదా 6, లేదా 3, లేదా 1 చదివినా మంచిది. అదీ చదవలేకుంటే ఒక అధ్యాయంలో నాలుగవవంతు లేదా ఒక్క శ్లోకం, లేదా కనీసం అరశ్లోకం చదివినా కూడా మంచిదే అని చెబుతాడు విష్ణుమూర్తి. గీత నేర్చుకుంటే అది జీవనవిధానాన్ని కూడా సూచిస్తుంది కాబట్టి లౌకికంగా, ఆధ్యాత్మికంగా ఎదుగుతారు. నేర్చుకునే తీరికలేదంటే, విష్ణుమూర్తి సూచించినట్టుగా మీ శక్తిమేరకు చదివినా మంచిదే.

కాని సమస్య ఏమిటంటే, దాన్ని పారాయణ చెయ్యకపోగా, కొంతమంది లేనిపోని అపోహలు పెంచుకుంటారు. భగవద్గీత మహాభారతంలో ఒక భాగం కాబట్టి, దాన్ని ఇంట్లో ఉంచుకుంటే గొడవలు వస్తాయి అనుకుంటారు, అక్కడికేదో ఇప్పుడు గొడవలు లేనట్టు. ఆ అపోహను గీతా మాహాత్మ్యమ్‌లో సాక్షాత్తూ విష్ణుమూర్తే తొలగిస్తాడు. ఎక్కడైతే గీతాపారాయణం జరుగుతుందో అక్కడ తనే స్వయంగా ఉంటానని, తక్కిన దేవతలు కూడా ఉంటారనీ, అన్ని పుణ్యనదుల్లో స్నానం చేసిన ఫలితం దక్కుతుందనీ, ఎటువంటి చెడు మీకూ, మీ కుటుంబసభ్యులకూ కలగదనీ తను చెబుతాడు. గీతను పారాయణం చేయలేకపోయినా, గీతా అని పదేపదే ఉచ్చరించినా మేలే జరుగుతుంది. అదీ చేయలేకపోతే భగవద్గీత పుస్తకం ఇంట్లో ఉన్నా మంచిదే. కాని దానితో సరిపెట్టుకోకుండా భగవద్గీతను నేర్చుకుని, పదిమందికి నేర్పిస్తారని ఆశిస్తాము.

సదాశివసమారమ్భామ్। శఙ్కరాచార్యమధ్యమామ్।
అస్మదాచార్యపర్యన్తామ్। వన్దే గురుపరమ్పరామ్॥
శ్రీ గురుభ్యోనమః హరిః ఓం

# ఉపోద్ఘాతం

ప్రతిమనిషికీ, అనేక జీవితలక్ష్యాలు ఉంటాయి. అందులో కొన్ని తక్షణ లక్ష్యాలు అయితే, కొన్ని దీర్ఘకాలిక లక్ష్యాలు అవుతాయి. వాటిని తీర్చుకుంటూనో, తీర్చుకోవటానికి ప్రణాళికలు వేసుకుంటూనో ఉంటాడు మనిషి. ఆ లక్ష్యాలు అందరికీ ఒక్కలా ఉండవు. ఒక వ్యక్తి ఇల్లు అమ్ముకోవటానికి తాపత్రయపడుతుంటే, ఇంకొక వ్యక్తి ఇల్లు కొనడానికి తాపత్రయపడతాడు. ఒక వ్యక్తి పెళ్ళి చేసుకోవటానికి నానా తిప్పలు పడుతుంటే, ఇంకొక వ్యక్తి చేసుకున్న పెళ్ళినుంచి బంధవిముక్తుడవటానికి నానా తిప్పలు పడుతుంటాడు. ఆ విధంగా భిన్నంగా ఉంటాయి కోరికలు.

ఈ లక్ష్యాలు కాలక్రమేణా మారుతూ ఉంటాయి కూడా. కొన్ని నెలల కిందట దేనికైతే తీవ్రంగా ప్రయత్నించామో, ఇప్పుడు దానిమీద మోజు పోయింది. ఎవరైనా ఫ్రీగా ఇస్తానన్నా కూడా మనకు అవసరం లేదు. ఈ లక్ష్యాలు తరతరానికీ కూడా మారుతూ ఉంటాయి. కొన్ని దశాబ్దాల కిందట, కంప్యూటర్ మాటే ఎరగరు. అప్పుడు పిల్లలు కంప్యూటర్ గేమ్స్‌కోసం అడిగే అవకాశమే లేదు. ఇప్పటి పిల్లలు కంప్యూటర్లలో పుట్టి పెరుగుతున్నారు. అందువల్ల వారి లక్ష్యాలు వేరు.

ఆ విధంగా లక్ష్యాలు మనిషి–మనిషికీ మారతాయి; కాలక్రమేణా మారతాయి; తరాలనుబట్టీ మారతాయి. ఇంత విస్తారంగా కోరికలూ, లక్ష్యాలూ ఉన్నా, తరచి చూస్తే, ఏ మనిషికైనా, ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా, ఏ తరంలోనైనా కొన్ని లక్ష్యాలు ఒకటే అని తెలుస్తుంది. వీటిని మానవాళియొక్క **సార్వజనీన ప్రాథమిక లక్ష్యాలు** అంటారు. ఇవి జంతువులకు కూడా ఉంటాయి కాని అవి వాటికి ప్రకృతి సహజంగా వచ్చినవి. మనిషి విషయంలో అవి బాగా రూపుదిద్దుకున్నాయి. వాటిని మనం మూడు లక్ష్యాలుగా నిర్వచించవచ్చు. అవి – శాంతి, ఆనందం, భద్రత (Peace, Happiness, Security - PHS). వీటిని వివరంగా చూద్దాము.

**భద్రత** – మనం జీవితం సాఫీగా సాగిపోవాలనుకుంటాము. అలా సాగాలంటే భద్రత కావాలి. తినటానికింత తిండి, ఉండటానికింత చోటు – ఇవి మనుష్యులకూ, పశువులకూ సమానంగా ఉంటాయి. మనిషి వాటికోసం చాలా శ్రమ పడతాడు. మనకు రకరకాల భీమా పథకాలు ఉన్నాయి. ఇల్లు కొంటే ఇంటి భీమా పథకం, కారు కొంటే కారు భీమా పథకం తీసుకుంటాము. ఎందుకు? అవి భద్రంగా ఉండాలని.

**శాంతి** – మనం కోరే ఇంకో కోరిక శాంతి. ఎంత ఉన్నా శాంతి లేదు అంటారు. అన్నీ ఉన్నా, మనస్సు ప్రశాంతంగా ఉండదు. ఏదో కొరత వెంటాడుతూనే ఉంటుంది. ఊటీ, కొడైకెనాల్ అందమైన ప్రాంతాల్లో తిరిగినా, ప్రశాంతతకు నెలవైన ఆశ్రమాల్లో ఉన్నా ప్రశాంతత దక్కదు. అందువల్ల మనస్సుకు శాంతి కోరతాము.

**ఆనందం** – మనం కోరే మరో కోరిక ఆనందం. ఏ లక్ష్యం కోరినా, అది ఆనందాన్ని ఇస్తుందనే ఉద్దేశ్యంతోనే కోరతాము.

ఆ విధంగా మానవజాతి లక్ష్యాలు ఈ మూడే – శాంతి, ఆనందం, భద్రత. కాకపోతే వాటిని పొందే మార్గంలోనే ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. కొంతమంది హోదాలో భద్రత వెతుక్కుంటే, మరికొంతమంది మందీమార్బలంలో భద్రత వెతుక్కుంటారు. కొంతమంది ధన కనక వస్తు వాహనాలలో భద్రత ఉందనుకుంటారు. అలాగే ఆనందం నిర్వచనం కూడా మనిషి మనిషికీ మారుతుంది. ఇద్దరు సైనికులు సైన్యంలో తాము ఎందుకు చేరారో చర్చించుకుంటున్నారు.

'నాకు పెళ్ళి కాలేదు, నాకు యుద్ధమంటే ఇష్టం. అందువల్ల నేను సైన్యంలో చేరాను,' అన్నాడు ఒకవ్యక్తి. 'నాకు పెళ్ళి అయింది, నాకు శాంతి అంటే ఇష్టం. అందువల్ల నేను సైన్యంలో చేరాను,' అన్నాడు ఇంకోవ్యక్తి. అంటే ఆనందం అంటే ఏమిటో మీరే ఆలోచించండి.

అసలైన శాంతి, భద్రత, ఆనందాలు ఎక్కడ దొరుకుతాయి? అవి **నీలోనే దొరుకుతాయి** అంటుంది శాస్త్రం. అంతేకాదు ఇంకో పిడుగులాంటి సత్యం చెబుతుంది. అవి నీలో **మాత్రమే** దొరుకుతాయి అంటుంది. అవి నీలోనే దొరుకుతాయి అంటే కొంతమేరకు అంగీకరించవచ్చు కాని నీలో మాత్రమే దొరుకుతాయి అంటే ఆశ్చర్యం వేస్తుంది. మాత్రమే పదానికి గొప్ప అర్థం ఉంది. ఏమిటది? నీలో మాత్రమే దొరుకుతుంది అంటే **బాహ్యప్రపంచంలో దొరకదు** అని అర్థం. అందువల్లనే శాంతి, భద్రత, ఆనందాలకోసం బాహ్యప్రపంచంలో ఎంతగా వెతికినా అవి మీకు దొరకవు. అవి మీనుంచి పారిపోతాయి. ఎందుకు? **వెతికినా దొరకని చోట మీరు వెతుకుతున్నారు** కాబట్టి.

శాస్త్రం ప్రకారం మన ప్రాథమిక సమస్య – మనం మనకు కావాల్సినది దొరకని చోట వెతుకుతున్నాము. అక్కడ ఎంత ప్రయత్నించినా అది దొరకదు. అక్కడ ఉంటేగా, దొరకటానికి! తెలివైన పని, అది దొరికేచోట వెతకాలి. అలా బాహ్యంగా అది దొరకనప్పుడు మనుష్యులు ఎందుకు పదేపదే తప్పు చేస్తున్నారు? ఎందుకు వారి జీవితాన్ని సమస్యల వలయంగా చేసుకుని కష్టాల్లో కూరుకుపోతున్నారు? ఎందుకంటే ఈ మూడు ప్రాథమిక లక్ష్యాలు మనలోనే ఉన్నాయి కాని అవి కప్పబడివున్నాయి. అందువల్ల మనకు తెలియటం లేదు.

ఒక స్వామీజీకి నీటియెద్దడి వచ్చింది. ఆశ్రమం నడపటానికి కావాల్సినంత నీరు లేదు. బయటనుంచి లారీల ద్వారా నీరు తెప్పించుకుంటున్నారు. కాని అలా ఎన్నాళ్ళు? ఈ సమస్యకు పరిష్కారం కనపడనట్టుగా ఉంది. ఒకరోజు తన ఆశ్రమ గుమ్మం దగ్గర నిల్చుని ఆ స్వామీజీ దిగులుపడుతుండగా, అటుగా ఒక ప్రభుత్వ అధికారి వెళు తున్నాడు. అతని చేతిలో నీరు ఎక్కడుందో తెలిపే పరికరం ఉంది. దానితో పరీక్షిద్దామని ఆ అధికారి అనగానే, అతనికి లోపలికి త్రోవ ఇవ్వటానికా అన్నట్టు స్వామీజీ పక్కకు తొలిగారు. ఆయన అంతకు ముందు నిల్చున్నచోట చూస్తే, సరిగ్గా అక్కడే, పెద్ద నీటి వనరులు ఉన్నట్టు తెలిసింది. స్వామీజీ ఆనందానికి అవధులు లేవు. ఆ నీటి సమస్యతో పది సంవత్సరాలు అవస్థ పడ్డారు. అది కూడా ఆశ్రమంలోనే నీటి వనరులను పెట్టుకుని! అదే నీటికోసం బాహ్యంగా పరుగులు తీశారు.

శాస్త్రం, మన పరిస్థితీ సరిగ్గా అలాగే ఉంది అంటున్నది. శాంతి, భద్రత, ఆనందాలు మనలోనే ఉన్నాయి. కాకపోతే వాటిపైన పొరలు, పొరలుగా అనేక మలినాలు కప్పుకుపోయాయి. అయితే ఏంచేయాలి? ఆ స్వామీజీ ఆ భూమిలో పైన ఉన్న మలినాలను తొలగించుకుంటూ నీటిధార పైకి పెల్లుబికి వచ్చేదాకా ఎలా త్రవ్వించారో, అలా మనం కూడా ఈ మూడు వనరులూ దొరికేదాకా, మలినాలను దాటుకుంటూ వెళ్ళి, తవ్వుతూ రావాలి. స్వామీజీ స్వంతంగా నీటిని సృష్టించారా? లేదే! ఉన్న నీటికీ, తనకూ మధ్య అడ్డుగా ఉన్న మూతను తొలగించారు.

మనలోని శాంతి, భద్రత, ఆనందాలను మనకు తెలియకుండా కప్పుతున్న మలినాలు ఏమిటి? అవి కూడా మూడు పొరలుగా ఉన్నాయి – అత్యంత స్థూలమైనది, సూక్ష్మమైనది, అత్యంత సూక్ష్మమైనది. వాటి పేర్లు **మలం, విక్షేపం, ఆవరణం**.

**మలం** – మలం అంటే మనస్సుకు సంబంధించిన అశుద్ధాలు. వాటిని షడ్వికారాలు అంటారు. అవి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. అంటే అవి వరుసగా కోరిక, కోపం, దురాశ, పాశం, గర్వం, ఈర్ష్య. ఇవి మన ఆంతర ఆనందాన్ని కప్పివేసే మొట్టమొదటి పొర.

**విక్షేపం** – మనస్సుయొక్క చంచలత్వం. మనస్సు స్థిరంగా లేకుండా, అనునిత్యం బాహ్యంగా పరుగులు తీస్తూ ఉంటుంది. అందువల్ల అంతర్ముఖులమయ్యే అవకాశమే దొరకదు. ఒక కొలనులో నీటి పైభాగం బురదగా ఉన్నా అడుగుభాగాన్ని చూడలేము. అలాగే నీటి పైభాగం ప్రశాంతంగా లేకుండా కదులుతున్నా కూడా అడుగు భాగాన్ని చూడలేము. మనలో ఉన్న రాగద్వేషాలనే మలం బురదతో సమానం. మనస్సుయొక్క చంచలత్వం, చంచలంగా కదులుతున్న నీటితో సమానం. రెండు సందర్భాలలోనూ నీటి అడుగుభాగాన్ని చూడలేనట్టే, రెండు సందర్భాలలోనూ మనమూ మన మనస్సు లోతులను కొలువలేము.

**ఆవరణం** – అజ్ఞానం మన మనస్సును కప్పివేసింది. ఏమిటా అజ్ఞానం? శాంతి, భద్రత, ఆనందాలు మనలోనే దొరుకుతాయనే జ్ఞానాన్ని తెలుసుకోనివ్వని అజ్ఞానం. మనమే ఆనందస్వరూపులం, మనం పూర్ణం అనే సత్యాలు మనకు తెలియనివ్వటం లేదు.

వీటిని ఎలా పోగొట్టుకోవాలి? వీటికి ఆధ్యాత్మిక సాధనలు చేయాలి. ఒక్కొక్క సాధనను యోగం అంటారు. యోగం అంటే సాధకుణ్ణి, తన లక్ష్యంతో కలిపేలా చేసే సాధన. సాధకుడు అయిన ఒక వ్యక్తిని, అతని లక్ష్యాలైన శాంతి, భద్రత, ఆనందాలతో కలిపేది యోగం. నిధి వెతకటానికి చేసే ప్రయత్నంలో ఆ సాధకుడు తనకు ఎదురైన ఆటంకాలను రకరకాల పరికరాలతో ఎదుర్కొంటాడు. వాటన్నిటినీ ఛేదించుకుంటూ వెళ్ళి, తన అంతిమ లక్ష్యాన్ని చేరుకుంటాడు. రామాయణంలో హనుమంతుడు, సీతారాములను కలిపాడు. రామాయణాన్ని ఆధ్యాత్మిక ప్రయాణంగా అభివర్ణించవచ్చు. ఇప్పుడు ఈ మూడు మలినాలను నివృత్తి చేసే మూడు యోగాలు ఏమిటి?

**కర్మయోగేన మల నివృత్తిః ఉపాసనా యోగేన విక్షేప నివృత్తిః, జ్ఞానయోగేన అజ్ఞాన నివృత్తిః**

కర్మయోగం ద్వారా మలాన్ని; ఉపాసనయోగం ద్వారా విక్షేపాన్ని; జ్ఞానయోగం ద్వారా అజ్ఞానాన్ని తొలగించవచ్చు. ఈ మూడు యోగాలు కొత్తగా ఏమీ తీసుకురాలేదు. మనలో ముందే నిక్షిప్తంగా ఉన్న నిధిని మనకు చూపిస్తాయి. కొంతమంది వీలునామా రాయకుండా చనిపోతారు. మళ్ళీ వారసులకు వారి ఆస్తిని చేజిక్కించు కోవటం బ్రహ్మప్రళయం అవుతుంది. వారే వారసులని నిరూపించుకోవటానికి బోలెడు తతంగం ఉంటుంది. అంతా అయ్యాక, వారికి కొత్తగా డబ్బు వచ్చిందా? వారికి సర్వహక్కులూ ఉన్న ఆస్తి వారికి దక్కింది. 'స్వరాజ్యం నా జన్మహక్కు, నేను పొందితీరతాను,' అన్నాడు లోకమాన్య తిలక్. అలా శాంతి, భద్రత, ఆనందాలు మన జన్మహక్కు. వాటిని పొందితీరాలి. వాటిని మనలోంచి పొందకుండా అడ్డుపడుతున్న మలం, విక్షేపం, అజ్ఞానాలనే మలినాలను వరుసగా కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగాలతో తొలగించాలి.

**కర్మయోగం** – కర్మయోగం అంటే సరియైన కర్మ + సరియైన దృక్పథం. సరియైన కర్మ అంటే సాత్త్విక కర్మ. కామక్రోధలోభమోహమదమాత్సర్యాలను పెంచి పోషించకుండా వాటిని తగ్గించే కర్మను సరియైన కర్మ అంటారు.

సరియైన దృక్పథం అంటే ఈశ్వరార్పణభావన, ఈశ్వరప్రసాదబుద్ధిభావన. అంటే మనం ఏదైనా కర్మ చేసినప్పుడు మనం కర్తలం అవుతాము. అలాగే ఆ కర్మఫలాలు వచ్చినప్పుడు వాటిని స్వీకరించే మనం భోక్తలం అవుతాము. కర్మయోగం అంటే కర్తగా మనం చేసే ప్రతి పనినీ ఈశ్వరార్పణభావనతో చేయటం, భోక్తగా మనకు వచ్చిన ప్రతి ఫలితాన్నీ ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించటం.

కర్మయోగంవల్ల మలనివృత్తి అవుతుంది. దాన్నే సానుకూలంగా చెపితే, చిత్తశుద్ధి ఏర్పడుతుంది. అశుద్ధం పోతే శుద్ధం అవుతుంది కదా!

**ఉపసనా యోగం** – ఉపాసనా యోగం అంటే అనేక ఉపాసనలను చేయటం. ఏ ఉపాసన చేసినా మనస్సు నిశ్చలంగా అవుతుంది. బాహ్యంగా పరుగులు తీసే, చంచలమైన, కుదురులేని, విశ్రాంతిలేని మనస్సుకు కొంత విశ్రాంతి అవసరం. ఉపాసనవల్ల విక్షేపనివృత్తి అవుతుంది. దాన్నే సానుకూలంగా చెపితే, చిత్తనిశ్చలత్వం కలుగుతుంది. చంచలంగా ఉండే మనస్సు నిశ్చలంగా అవుతుంది.

**జ్ఞానయోగం** – జ్ఞానయోగాన్ని ఆత్మవిచారణ అంటారు. నా స్వస్వరూపాన్ని గురించిన విచారణ. నాకు శాంతి బాహ్యంగా లభిస్తుందా, లేక నేనే శాంతి స్వరూపాన్నా? నాకు భద్రత బాహ్యంగా దొరుకుతుందా లేక నేనే ఆత్మనా? నాకు ఆనందం బాహ్యంగా దొరుకుతుందా, లేక నేనే ఆనందస్వరూపాన్నా? నేను సత్, చిత్ , ఆనంద స్వరూపాన్ని అని తెలుసుకునేలా చేస్తుంది జ్ఞానయోగం. జ్ఞానయోగం అజ్ఞానాన్ని తొలగిస్తుంది. దీన్నే సానుకూలంగా చెపితే, జ్ఞానం కలుగుతుంది.

కర్మయోగం, ఉపాసనా యోగం, జ్ఞానయోగం అనే ఈ మూడు యోగాలను పాటిస్తే, ఈ మూడు రకాల మలినాలూ తొలగుతాయి. ఏదో ఒకటే పాటించవచ్చా అంటే కుదరదు. ఎందుకంటే మనలో మూడు మలినాలూ ఉన్నాయి. అది కూడా చాలా దట్టంగా పేరుకుపోయి ఉన్నాయి. వీటిని పారద్రోలి, మనం వెంపర్లాడే శాంతి, భద్రత, ఆనందాలను మనలోనే వెతుక్కునేందుకు తోడ్పడుతుంది మన శాస్త్రం. ఈ శాస్త్రం పేరు వేదం. మనకు

నాలుగు వేదాలు ఉన్నాయి. అవి అపౌరుషేయాలు. అంటే పురుషబుద్ధినుంచి వచ్చినవి కావు, సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచే వచ్చాయి. ఎలాగైతే టీవీకి ట్రాన్స్‌మిషన్ స్టేషన్, రిసీవింగ్ స్టేషన్లు ఉన్నాయో, అలాగే పరమాత్మ ట్రాన్స్‌మిషన్ స్టేషన్, మన ఋషులు రిసీవింగ్ స్టేషన్. పరమాత్మ అందజేసిన వేదాలను ఋషులు అందుకున్నారు.

ఒక్కొక్క వేదంలోనూ నాలుగు భాగాలున్నాయి.

| | | | |
|---|---|---|---|
| మంత్ర భాగము | – దేవతాసూక్తులు | – అనుగ్రహసిద్ధి | – యోగప్రాప్తి |
| బ్రాహ్మణ భాగము | – కర్మకాండం | – కర్మయోగం | – మలనివృత్తి |
| ఆరణ్య భాగము | – ఉపాసనకాండం | – ఉపాసనయోగం | – విక్షేపనివృత్తి |
| ఉపనిషత్ భాగము | – జ్ఞానకాండం | – జ్ఞానయోగం | – అజ్ఞాననివృత్తి |

మంత్రభాగాన్ని సంహిత భాగం అని కూడా అంటారు. ఇందులో అనేక దేవతల ప్రార్థనలు వస్తాయి. ప్రార్థన చేస్తేనే, మన సమస్య ఏమిటో మనకు తెలుస్తుంది. సమస్య తెలిస్తే, పరిష్కారం తేలికగా దొరుకుతుంది. అప్పుడు తక్కిన యోగాలకు వస్తాము. భగవంతుని కృప లేకపోతే, ఎన్నడూ మనం అంతర్ముఖులము అవలేము. ఎప్పటికీ లౌకిక వ్యవహారాల్లో కూరుకుపోయి, బాహ్యంగా శాంతి, భద్రత, ఆనందాలను వెతుకుతూ ఉంటాము. సమస్య ఏమిటని చూశాము? **వెతికినా దొరకని చోట వెతకటం**. బట్టలషాపుకు వెళ్ళి చెప్పులు కావాలంటే దొరుకుతాయా? కాని అలాంటి పనే చేశాడు ఒక బ్రాహ్మణుడు ఒకసారి.

కుంభకోణంలో పన్నెండు సంవత్సరాలకు ఒకసారి మేళా జరుగుతుంది. అక్కడికి లక్షలాది ప్రజలు వస్తారు. మహామఖం కొలనులో స్నానాలు చేస్తారు అందరూ. ఒక బ్రాహ్మణుడు అక్కడ స్నానం చేస్తుండగా అతని చేతికున్న ఉంగరం జారిపడిపోయింది. వెతుకుదామంటే విపరీతమైన జనసందోహం. బయటకు వచ్చేశాడు. వచ్చాక చూస్తే, పక్కనే ఇంకొక కొలను నిర్మానుష్యంగా కనబడింది. 'ఓ, ఇక్కడ హాయిగా వెతుక్కోవచ్చు,' అని మురిసిపోయి, వెతకటం మొదలుపెట్టాడు. అతను వెతకటం చూసి ఎవరో వచ్చి, 'ఏం వెతుకుతున్నావు?' అన్నారు. కారణం చెప్పాడు. అతను కూడా సహాయం చేస్తానన్నాడు. అలా ఒక్కొక్కరూ వచ్చి, వారి వంతు సహాయం వారూ చేయసాగారు. అలా చాలామందే పోగుపడ్డారు. వెతుకుతూనే ఉన్నారు, ఫలితం మాత్రం శూన్యం. చివరకి ఎవరో వచ్చి 'అసలు ఎక్కడ పోగొట్టుకున్నావు నువ్వు?' అన్నాడు. 'ఆ రెండో కొలనులో,' అన్నాడు ఈ అమాయక చక్రవర్తి. 'పిచ్చివాడా, అక్కడ పోగొట్టుకుని ఇక్కడ వెతికితే దొరుకుతుందా?' అని తిట్టాడు అతను. 'ఇక్కడ వెతకటానికి వీలుగా ఉందని వెతుకుతున్నాను,' అన్నాడు మరింత అమాయకంగా. అందరూ ఘొల్లున నవ్వారు. అతన్ని చూచి నవ్వుతాము కాని, మనం చేస్తున్నది మాత్రం ఏమిటి? **వెతికినా దొరకని చోట వెతుకుతున్నాము**. అతను ఉంగరంకోసం వెతికితే మనం శాంతి, భద్రత, ఆనందాలకోసం వెతుకుతున్నాము.

మనం సరియైన చోట వెతకాలంటే, దానికి భగవంతుని అనుగ్రహం కావాలి. అందువల్ల మంత్రభాగం అటువంటి అనుగ్రహాన్ని కలుగజేస్తుంది. మన దృష్టిని భోగంనుంచి యోగం వైపుకు మళ్ళిస్తుంది. నాలుగు వేదాలు ఉన్నాయని చూశాము. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. మళ్ళీ యజుర్వేదంలో రెండు శాఖలున్నాయి – శుక్లయజుర్వేదం, కృష్ణయజుర్వేదం. అవి నేర్చుకోవాలంటే చాలా కష్టం. అందువల్ల సాక్షాత్తూ ఆ పరమాత్మే మనమీద కరుణా కటాక్షాలు కురిపించి, **వేదాల సారంగా భగవద్గీతను** మనకు అందించాడు.

వేదాల సారం అయిన భగవద్గీతలో 700 శ్లోకాలున్నాయి. ఇది మహాభారతంలో కృష్ణార్జునుల సంవాద రూపంలో వస్తుంది. భగవద్గీతను అధ్యయనం చేస్తే, మొత్తం వేదాలను అధ్యయనం చేసినంత ఫలం దక్కుతుంది. అందువల్ల మన గురువులందరూ, 'మీరు వేదాలనూ, వేదాంతాలనూ (ఉపనిషత్తులనూ) నేర్చుకోకపోయినా ఫర్వాలేదు, కనీసం భగవద్గీతను నేర్చుకోండి,' అంటారు.

**భగవద్గీతా కించిదధీతా గంగాజలలవకణికా పీతా**
**సకృదపి యేన మురారిసమర్చా క్రియతే తస్య యమేన న చర్చా** – భజగోవిందమ్

శంకరాచార్యులు తన భజగోవిందంలో చెబుతున్నారు, 'మొత్తం శాస్త్రాన్ని అధ్యయనం చేయకపోయినా, కనీసం భగవద్గీతను అధ్యయనం చేయండి.' భగవద్గీత మనకు దిశానిర్దేశం చేస్తుంది. భగవద్గీతమీద అనేక భాషల్లో అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయి. శంకరాచార్యులు అద్భుతమైన భాష్యాన్ని రచించారు భగవద్గీతమీద. అలాగే మధుసూదన సరస్వతి అనే గొప్ప ఆచార్యులు కూడా గొప్ప భాష్యం రాశారు. ఆయన తన భాష్యంలో 9 ధ్యానశ్లోకాలు రాశారు.

ఏ బృహత్కార్యం చేపట్టినా, దానికి ఆటంకాలు కలుగకుండా చూసుకోవాలి. అందువల్ల ప్రార్థన చేయాలి. ఈ తొమ్మిది శ్లోకాల్లోనూ ఆయన ఈ నలుగురికి వరుసక్రమంలో నమస్కారాలు చేశారు.

1. మహాభారతానికి – భగవద్గీత మహాభారతంలో ఒక భాగం కాబట్టి
2. భగవద్గీతకు – సాక్షాత్తూ సరస్వతీమాతగా భావించబట్టి
3. వ్యాసాచార్యులకు – మహాభారతాన్ని రచించిన కావ్యకర్త కాబట్టి
4. కృష్ణపరమాత్మకు – జగద్గురువుగా అర్జునుని ద్వారా మానవాళికి బోధ చేశాడు కాబట్టి.

వీరందరి కృపవల్ల, ఈ రోజు మనం కూడా భగవద్గీతను అధ్యయనం చేయగలుగుతున్నాము, చేయబోతున్నాము. అందువల్ల ఈ ధ్యానశ్లోకాలను ముందుగా చూద్దాము.

# ధ్యానశ్లోకాలు - వివరణ

శ్లో. 1 ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ ।
అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీమ్
అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥

శ్లో. 2 నమోఽస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిందాయతపత్రనేత్ర ।
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥

శ్లో. 3 ప్రపన్నపారిజాతాయ తోత్రవేత్రైకపాణయే ।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః ॥

శ్లో. 4 సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥

శ్లో. 5 వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

శ్లో. 6 భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా! ।
అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః ॥

శ్లో. 7 పారాశర్యవచః సరోజమమలం గీతార్థగంధోత్కటం
నానాఖ్యానకకేసరం హరికథా సంబోధనాబోధితమ్ ।
లోకే సజ్జనషట్పదైరహరహః పేపీయమానం ముదా
భూయాద్భారతపంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే ॥

శ్లో. 8 మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।
యత్కృపా తమహం వందే పరమానందమాధవమ్ ॥

శ్లో. 9 యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుతః స్తున్వంతి దివ్యైః స్తవైః
వేదైః సాంగపదక్రమోపనిషదైః గాయంతి యం సామగాః ।
ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాంతం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః ॥

భగవద్గీత అధ్యయనం చేసేముందు ధ్యానశ్లోకాలను కూడా అధ్యయనం చేయాలి. ధ్యానశ్లోకాల ద్వారా, మన గీతాధ్యయనం నిరాటంకంగా సాగటానికి భగవంతుని కృప వేడుకుంటాము. భగవద్గీత, మహాభారతంలో భాగం కానీ, ధ్యానశ్లోకాలు కావు. ముందే చూసినట్టుగా మధుసూదన సరస్వతి అనే గొప్ప ఆచార్యులు భగవద్గీతమీద గొప్ప భాష్యం రాశారు. దాని పేరు గూఢార్థదీపిక. అద్భుతమైన పేరు! భగవద్గీతలో ఉన్న గూడార్థాన్ని చూపించే దీపం అది. అందులో ఆయన తొమ్మిది ధ్యానశ్లోకాలు రచించారు. దానిలో మహాభారతానికి, భగవద్గీతకు, వ్యాసాచార్యులకు, కృష్ణపరమాత్మకు నమస్కారాలు చేశారని కూడా చూశాము. ముందుగా ఆ ధ్యానశ్లోకాలు అర్థం చూద్దాము. వాటిని పైన చెప్పిన వరుసక్రమంలో మనం మార్చుకుని వాటి అర్థాలు చూద్దాము. అంటే మొదటి నమస్కారం మహాభారతానికి చేయాలి. అది ఏడవ శ్లోకంలో వస్తుంది. ముందు అది చూద్దాము.

**1. మహాభారత నమస్కారం**

**శ్లో. 7 పారాశర్యవచః సరోజమమలం గీతార్థగంధోత్కటం**
**నానాఖ్యానకకేసరం హరికథా సంబోధనాబోధితమ్ ।**
**లోకే సజ్జనషట్ పదైరహరహః పేపీయమానం ముదా**
**భూయాద్భారతపంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే ॥**

**అమలం భారత పంకజమ్**– శుద్ధమైన పంకజంలాంటి మహాభారతం; **పారాశర్య వచః సరోజమ్** – పారాశర్యుని (వేదవ్యాసుని) వాగ్ధాటి అనే కొలనులో పుట్టిన కలువపువ్వు; **గీతార్థ గంధోత్కటమ్** – భగవద్గీత అనే సుగంధాలను వెదజల్లుతున్నది; **నానాఖ్యానక కేసరమ్** – అనేక కలువరేకులలాంటి అనేక కథలతో నిండి ఉన్నది; **హరికథా సంబోధనా బోధితమ్** – కృష్ణపరమాత్మ కథలతో పూర్తిగా వికసించి ఉంది; **లోకే సజ్జన షట్పదైః** – లోకం లోని సజ్జనులనే తేనెటీగలు; **అహరహః పేపీయమానం ముదా** – ఆనందంగా ప్రతిరోజూ దానిలోని మధువును గ్రోలుతున్నారు; **ప్రధ్వంసి** – అది కలియుగంలోని మలినాలను ధ్వంసం చేస్తుంది; **భూయాత్ నః శ్రేయసే** – అటువంటి మహాభారతం మాకు మంగళాన్ని చేకూర్చుగాక!

శుద్ధమైన పంకజంలాంటి మహాభారతం; పారాశర్యుని వాగ్ధాటి అనే కొలనులో పుట్టిన కలువపువ్వు; భగవద్గీత అనే సుగంధాలను వెదజల్లుతున్నది. అది అనేక కలువరేకులలాంటి అనేక కథలతో నిండి ఉన్నది; కృష్ణపరమాత్మ కథలతో పూర్తిగా వికసించి ఉంది; లోకంలోని సజ్జనులనే తేనెటీగలు ఆనందంగా ప్రతిరోజూ దానిలోని మధువును గ్రోలుతున్నారు. అది కలియుగంలోని మలినాలను ధ్వంసం చేస్తుంది. అటువంటి మహాభారతం మాకు మంగళాన్ని చేకూర్చుగాక!

దీన్ని వివరంగా చూద్దాము. ముందు నాలుగవ పాదం చూద్దాము.

**భారత పంకజం నః శ్రేయసే భూయాత్** – భరతవంశానికి చెందిన కావ్యం కాబట్టి దీన్ని భారతం అన్నారు. భరతవంశం అధికృత్య ప్రవృత్తం మహాభారతం. ఇది ఒక మహాకావ్యం.ఒక లక్ష శ్లోకాలు ఉన్నాయి ఇందులో.

**ఇతిహాసః** – మహాభారతాన్ని ఇతిహాసం అంటారు. హాసః అంటే జరిగింది; ఇతి అంటే ఇలా; అందువల్ల ఇతిహాసం అంటే ఇలా జరిగింది. ఇతిహాసంలో అలా చరిత్రలో జరిగిన కథను తీసుకుని, అది ఆకర్షణీయంగా ఉండటం కోసం ప్రయత్నిస్తారు.

నః శ్రేయసే భూయాత్ – మాకు శ్రేయస్సుని ఇచ్చుగాక! శ్రేయస్సు అంటే ఆనందం, ఆరోగ్యం, మంగళం. మహాభారతాన్ని మేము అధ్యయనం చేయటంవల్ల మేము శారీరకంగా, మానసికంగా, బుద్ధిపరంగా, ఆధ్యాత్మికంగా ఎదుగుదుముగాక! అంటే మా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలి.

**పంకజమ్ –** మహాభారతాన్ని పంకజంతో పోల్చారు. పంకజం కన్నులకింపుగా ఉంటుంది, మంచి సువాసనలను వెదజల్లుతుంది, తేనెటీగలకు మధువును అందిస్తుంది. అంత గొప్పది మహాభారతం. తక్కిన పదాలన్నీ మహాభారతాన్ని వర్ణించే విశేషణాలు. ఏమిటవి?

**పారాశర్యవచః సరోజమ్** – సరోజం అన్నా కూడా పంకజమే. కొలనులో పుట్టిన కలువపువ్వు. మహాభారతమనే కలువపువ్వు పారాశర్యుని వాగ్ధాటినుంచి పుట్టింది. పారాశర్యుడు అంటే వేదవ్యాసుడు. ఆయన పరాశరుని కుమారుడు కాబట్టి పారాశర్యుడు అయ్యాడు.

**అమలమ్** – ఆ కమలం ఎలా ఉంది? అమలంగా ఉంది. బురదలో పుట్టినా, దానికి బురద అంటదు. మలం లేకుండా శుద్ధంగా ఉంటుంది. మహాభారతమనే కమలం కూడా శుద్ధం, దోషరహితం. బోధలో కాని, భాషలో కాని ఎటువంటి దోషాలూ లేవు.

**గీతార్థ గంధోత్కటమ్** – అద్భుతమైన సువాసనలవల్ల ఆకర్షణీయంగా ఉంది. ఏమిటా సువాసన? గీతార్థ – భగవద్గీత బోధ. మహాభారతం పంకజం అయితే, భగవద్గీత ఆ పంకజం వెదజల్లే సుగంధం. నిజానికి భగవద్గీతవల్ల మహాభారతానికి ఆకర్షింపబడతారు.

**నానాఖ్యానక కేసరం** – కలువపువ్వుకు అనేక కలువరేకులు ఉన్నట్టుగా మహాభారతంలో అనేక ఆఖ్యానాలు అంటే కథలు ఉన్నాయి. మహాభారతం ఒకటే పెద్ద కావ్యం అయినా అందులో అనేక కథలున్నాయి. అందులో శకుంతల–దుష్యంతుల కథ ఒకటి. దాన్ని గొప్ప సంస్కృత పండితుడైన కాళిదాసు **అభిజ్ఞాన శాకుంతలమ్** పేరిట రచించాడు. సత్యహరిశ్చంద్రుని కథ ఇంకొకటి. అలా అనేక కథలున్నాయి మహాభారతంలో. ఇటువంటి కథలు మహాభారత గొప్పదనాన్ని మరింత ఇనుమడింప చేస్తాయి.

**హరికథా సంబోధనాబోధితమ్** – కలువపువ్వు మొగ్గగానూ ఉంటుంది, పూర్తిగా విచ్చుకునీ ఉంటుంది. మహా భారతం పూర్తిగా వికసించిన కలువపువ్వులా ఉంటుంది. దేనివల్ల విచ్చుకుంది? హరికథలవల్ల. అంటే కృష్ణపరమాత్మ కథలవల్ల. మహాభారతంలో ప్రాథమికంగా భరతవంశం గురించి ఉన్నా అందులో కృష్ణుని లీలలు, ఆటపాటలు, అల్లర్లు అన్నీ చూస్తాము.

**సజ్జనషట్ పదైః పేపీయమానమ్** – ఎక్కడ అందమైన పువ్వు ఉంటుందో, దాన్ని వెన్నంటి తావి ఉంటుంది. ఆ మధువును గ్రోలటానికి తేనెటీగలు అక్కడికి ఆకర్షింపబడతాయి. అలాగే మహాభారతంలో జ్ఞాననిధి ఉంది.

ప్రపంచంలో ఉన్న జ్ఞానమంతా దానిలో ప్రోగుచేసుకుంది. మతం, వేదాంతం, మనస్తత్వవిశ్లేషణ, రాజకీయాలు, సాంఘీక జీవనం, మానవ అనుబంధాలు – ఒకటేమిటి ఏది కావాలంటే అది దొరుకుతుంది. ప్రతి ఒక్కదాన్నీ వ్యాసాచార్యులు అద్భుతంగా విశ్లేషించారు. నిజానికి మహాభారతంలో లేనిది వేరే ఎక్కడా లేదు, వేరే ఎక్కడైనా ఉన్నది, మహాభారతంలో లేకుండా లేదు.

**ధర్మే చ అర్థే చ కామే చ మోక్షే చ భరతర్షభః యదిహాస్తి తత్ అన్యత్ర యన్నే హాస్తి న తత్ క్వచిత్**

మహాభారతంలో చర్చించని అంశం లేదు. అది ఒక విజ్ఞానఘని. ఏ రంగం గురించిన జ్ఞానం కావాలన్నా అందులో ఖచ్చితంగా దొరుకుతుంది. అందువల్ల దాని జ్ఞానామృతం గ్రోలటానికి వచ్చే విద్యార్థులు సజ్జనులు. ఎందుకంటే వారికి తెలుసు, మహాభారతం అంటే కేవలం కథల సముదాయం కాదు; ప్రతి కథ వెనుకా మనస్తత్వవిశ్లేషణ ఉంటుంది, మానవ అనుబంధాలు ఉంటాయి, సృష్టి సత్యాలు ఉంటాయి అని. షట్పదైః అంటే ఆరుకాళ్ళు ఉన్న తేనెటీగలు. సజ్జనులను తేనెటీగలతో పోల్చారు. పేపీయమానం అంటే తేనెను గ్రోలుతారు. ఎప్పుడు?

**అహరహః** – ఎప్పుడూ; పదేపదే. ఎక్కడ? **లోకే** – ఈ లోకంలో. చదివిన కొద్దీ ఇంకా గూఢార్థాలు అర్థమవుతాయి. ఒకసారి ఒకలా అర్థమైనది, మళ్ళీ చదివితే మరింత లోతుగా అర్థమవుతుంది. అందుకని కొంతమంది మనస్తత్వ శాస్త్రవేత్తలు ప్రత్యేకించి అందులోని పాత్రల మనస్తత్వ విశ్లేషణలు చేస్తారు. కుంతి, ద్రౌపది, కర్ణుడు, దుర్యోధనుడు, ధర్మరాజు – వంటి పాత్రలను అధ్యయనం చేస్తే విలువైన పాఠాలను నేర్చుకోవచ్చు. **ముదా** – ఆనందంగా మహాభారతంలోని తేనెను గ్రోలుతారు. **కలిమల ప్రధ్వంసి** – ఈ మహాభారతమనే కావ్యం ఈ కలికాలానికి చెందిన మలినాలను విధ్వంసం చేస్తుంది. కలి అంటే కలికాలం. కలికాలంలో ధనంకోసం వెంపర్లాట, పోటీతత్త్వం పెరిగిపోయాయి. అందువల్ల ఎక్కడ చూసినా గొడవలు, పోట్లాటలు, విలువలకు విలువ లేకుండా పోతున్నది. అటువంటి వాతావరణంలో మన మనస్సు కూడా కలుషితమైపోతుంది. అటువంటి మలినాలు మనకు అంటకూడదు అంటే మహాభారతమొక్కటే దానికి మందు.

మహాభారతం ఇంట్లో ఉంటే కుటుంబకలహాలు వస్తాయనే అపోహ ఉంది. నిజానికి అది కుటుంబ కలహాలకు చక్కటి మందు. కుటుంబాలలో అనుబంధాలు బీటవారిపోతుంటే, దానివల్ల వారి చిన్నారుల మనస్సులు చెదిరిపోతుంటే, వాటిని అరికట్టటానికి ఒక్కటే మార్గం. వాటిని ధ్వంసం చేసే మహాభారతాన్ని అధ్యయనం చెయ్యటం మన ధర్మం. మహాభారతం కలియుగానికి చెందిన మలినాన్ని ధ్వంసం చేసి, మాకు శక్తిని, శ్రేయస్సును, మంగళాన్ని కలుగజేయుగాక! ఇది మహాభారతానికి చేసే నమస్కారం.

## 2. భగవద్గీతకు నమస్కారం

**శ్లో. 1** **ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం**
**వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ ।**
**అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీమ్**
**అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥**

**అంబ** – ఓ తల్లీ; **భగవద్గీతే** – భగవద్గీతా; **త్వామనుసందధామి** – నీకు గౌరవపూర్వకంగా నమస్కారం చేస్తున్నాను;

**భగవతా నారాయణేన స్వయమ్** – సాక్షాత్తూ భగవంతుడైన నారాయణునిచేత; **పార్థాయ ప్రతిబోధితామ్**– అర్జునునికి బోధింపబడిన; **పురాణ మునినామ్** – పురాణాలు రచించిన ముని; **వ్యాసేన గ్రథితామ్** – వ్యాసమహర్షి రచించిన; **మధ్యే మహాభారతమ్**– మహాభారతం మధ్యలో ఉన్న; **అద్వైతామృతవర్షిణీమ్**– అద్వైతమనే మకరందాన్ని వర్షింపజేసే; **అష్టాదశాధ్యాయినీమ్** – అష్టాదశ అధ్యాయాలు ఉన్న; **భవద్వేషిణీమ్** – సంసారాన్ని నాశనం చేస్తుంది.

ఓ తల్లీ, భగవద్గీతా, నీకు గౌరవపూర్వకంగా నమస్కారం చేస్తున్నాను; సాక్షాత్తూ భగవంతుడైన నారాయణుని చేత అర్జునునికి బోధింపబడిన, పురాణాలు రచించిన, వ్యాసమహర్షి రచించిన మహాభారతం మధ్యలో ఉన్న, అద్వైతమనే మకరందాన్ని వర్షింపజేసే అష్టాదశ అధ్యాయాలు ఉన్న భగవద్గీత సంసారాన్ని నాశనం చేస్తుంది.

ఇందులో కవి భగవద్గీతను తల్లిగా సంబోధిస్తున్నాడు.

**హే అంబ** – నువ్వు సరస్వతీదేవివి. నువ్వు నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే తల్లివి. కన్నతల్లి శారీరక పోషణ చూస్తే, సరస్వతీతల్లి ఆంతర్గత ఎదుగుదల చూస్తుంది. తల్లికి తన బిడ్డకు ఏ వయస్సులో ఎటువంటి ఆహారం పెట్టాలో తెలుసు. ముందు ద్రవపదార్థాలు మాత్రమే పెట్టి, నెమ్మదిగా సగం ద్రవం, సగం ఘనం ఉండే పదార్థాలను పెట్టి, చివరకి ఘనపదార్థాలు పెడుతుంది. అలాగే భగవద్గీత అనే తల్లి, ముందు కర్మయోగం అనే జ్ఞానాన్ని ఇచ్చి, తరువాత ఉపాసనా యోగం అనే జ్ఞానాన్ని ఇచ్చి, మనం మానసికంగా ఎదిగామన్న నమ్మకం కలిగాక, ఘనపదార్థం అంటే జ్ఞానయోగాన్ని ఇస్తుంది.

**భగవద్గీతే** – ఓ తల్లీ, ఓ భగవద్గీతా;

**త్వామనుసందధామి** – నీకు గౌరవపూర్వకంగా నమస్కారం చేస్తున్నాను. భగవద్గీత గొప్పతనం ఏమిటి?

**పార్థాయ ప్రతిబోధితామ్** – పంచపాండవులలో ఒకరైన అర్జునునికి బోధింపబడింది. ఎవరిచే?

**భగవతా నారాయణేన స్వయమ్** – సాక్షాత్తూ భగవంతుడైన ఆ నారాయణునిచేత. సర్వశక్తిమంతుడైన భగవంతుడే బోధించటంవల్ల ఈ బోధ సర్వకాలాలకు, సర్వదేశాలకూ వర్తిస్తుంది. ఎవరు రచించారు దీనిని?

**వ్యాసేన గ్రథితామ్** – కృష్ణపరమాత్మ చేసిన బోధను వ్యాసాచార్యులు లిఖించారు. వ్యాసాచార్యులు ఎవరో కాదు, సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారం.

> **ఓం వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే**
> **నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమోనమః**

వ్యాసాచార్యులు విష్ణుమూర్తి అవతారం కాబట్టి, ఆయన లిఖించిన దానిలో పొరపాట్లు దొర్లవు. పైగా ఆయన ఎవరు?

**పురాణమునినా** – చాలా అనుభవం ఉన్న ముని. అష్టాదశ పురాణాలను రచించారు ఆయన. భాగవత పురాణం అందులో ఒకటి. భగవద్గీత ఎందులో ఉంది?

**మధ్యే మహాభారతమ్** – మహాభారతం మధ్యలో ఉంది. అర్జునుడు యుద్ధరంగంలో నిస్సహాయుడిగా నిలిచినప్పుడు అతనికి బోధగా వెలుగు చూసింది. దాని సారాంశం ఏమిటి?

**అద్వైతామృతవర్షిణీమ్** – అద్వైత వేదాంతాన్ని వర్షింపజేస్తుంది. అద్వైతం అంటే ఇంకొకటి లేనిది. సత్యం ఒకటే ఉంటుంది. అందువల్ల సత్యాన్ని అద్వైతం అంటారు; అమృతం అంటే తేనె లేదా జ్ఞానం; వర్షిణీం – కురిపిస్తుంది. అద్వైతమనే జ్ఞానవర్షాన్ని కురిపిస్తుంది. భగవద్గీత ఎంత పెద్దది?

**అష్టాదశాధ్యాయినీమ్** – అష్టాదశ అధ్యాయాలు ఉన్నాయి. అంటే 18 అధ్యాయాలు ఉన్నాయి. అందులో 700 శ్లోకాలు ఉన్నాయి.

**భవద్వేషిణీమ్** – సంసారాన్ని నాశనం చేస్తుంది. భవః అంటే సంసారం, సంసారం అంటే అసంతృప్తి. మనిషికి ఏదో ఒకదాని గురించి అసంతృప్తి వెంటాడుతూనే ఉంటుంది. అందంగా లేననో, జుట్టు వత్తుగా లేదనో, రంగు లేననో బెంగలు కొన్ని. ఇవి శారీరక బెంగలు. ఇవి కాక కొన్ని మానసిక సమస్యలు. పిల్లలు ప్రేమ చూపించటం లేదనో, కోడలు వచ్చి కొడుకును లొంగదీసుకుందనో బెంగ. అదీ కాదంటే మనం ఎక్కడనుంచి వచ్చాము, ఎక్కడికి వెళతాము, మన జీవితలక్ష్యం ఏమిటి అని అంతుపట్టని ప్రశ్నలతో అసంతృప్తి. అన్ని రకాల అసంతృప్తులూ వెరసి సంసారం అవుతుంది. మోక్షం అంటే ఈ అసంతృప్తులనుంచి విముక్తి పొందటం. పూర్ణత్వభావన. ఇటువంటి పూర్ణత్వాన్ని ఇచ్చే భగవద్గీతకు నా నమస్కారం. భగవద్గీత స్తుతి ఇంకా కొనసాగు తున్నది.

**శ్లో. 4 సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।**

**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥**

**సర్వోపనిషదో గావో** – ఉపనిషత్తులన్నీ ఆవులలాంటివి; **దోగ్ధా గోపాలనందనః** – గోపాలనందనుడైన కృష్ణపరమాత్మ వాటి పాలు పితికాడు; **పార్థో వత్సః** – అర్జునుడు దూడలాంటివాడు; **దుగ్ధం గీతామృతం మహత్** – ఆ పాలు మహత్తరమైన గీతామృతము.

ఉపనిషత్తులన్నీ ఆవులలాంటివి; గోపాలనందనుడైన కృష్ణపరమాత్మ అర్జునుడు అనే దూడను ముందు పెట్టుకుని, మహత్తరమైన గీతామృతము అనే పాలను పితికాడు.

భగవద్గీత అంటే ఏమిటి? అది కృష్ణపరమాత్మ స్వంతంగా చేసిన బోధ కాదు – వ్యాసాచార్యుని సిద్ధాంతం కూడా కాదు. అది వేదాలసారం. వేదాలు అనాదిగా ఉన్నాయి. అవి అపౌరుషేయాలు. వేద అంతభాగాన్ని ఉపనిషత్తులు అంటారు. ఉపనిషత్తులు ఆత్మజ్ఞానాన్ని బోధిస్తాయి. ఉపనిషత్తులను శ్రుతి గ్రంథాలంటారు, భగవద్గీతను స్మృతి అంటారు. భగవద్గీత ఉపనిషత్తుల సారం. ఈ విషయాన్ని తెలియపరచటానికి, ఇంకొక ఉదాహరణ చూస్తాము. వేదాలను, ముఖ్యంగా ఉపనిషత్తుల భాగాన్ని ఆవుతో పోలుస్తున్నాడు కవి.

**సర్వోపనిషదో గావో** – నాలుగు వేదాలైన ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదాలకు చెందిన వేదాంత

భాగమైన ఉపనిషత్తులన్నీ ఆవులు. కృష్ణపరమాత్మ గోపబాలుడు. ఆయనకు గోవులను ఎలా చూడాలో తెలుసు. ఆయనకు అసలు గోవులనే కాదు, ఉపనిషత్తులనే గోవులను చూడటం కూడా తెలుసు.

**దోగ్ధా గోపాలనందనః** – గోపాలనందనుడు, ఆవులనుంచి పాలు పితికినట్టుగా, ఉపనిషత్తులనే ఆవులనుంచి వేదాంతసారమనే పాలను పితికాడు.

ఆవు పాలివ్వాలంటే దాని ముందు దాని దూడను నిలబెడతారు. దూడను చూడగానే, ఆవులో ప్రేమ పెల్లుబికి పాలు పొంగుకొస్తాయి. అలా ఉపనిషత్తు అనే ఆవు పాలివ్వటానికి దూడ ఎవరు?

**పార్థో వత్సః** – అర్జునుడు దూడ. అర్జునుడనే దూడను ముందు నిలబెట్టి కృష్ణపరమాత్మ ఉపనిషత్తు అనే ఆవునుంచి వేదాంతజ్ఞానమనే పాలను పిండాడు. ఆ పాలు ఏమిటి?

**దుగ్ధం గీతామృతం మహత్** – భగవద్గీత అనే అమృతం. భగవద్గీత అనే పాలు ఎంతో మహత్తు ఉన్నవి. అటువంటి గీతకు నమస్కారం చేస్తున్నాను.

**3. వ్యాసాచార్యులకు నమస్కారం**

**శ్లో. 2** **నమోஉస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిందాయతపత్రనేత్ర ।**
**యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥**

**వ్యాస విశాలబుద్ధే** – విస్తారమైన, లోతైన జ్ఞానం ఉన్న ఓ వ్యాసాచార్యా; **ఫుల్లారవిందాయతపత్రనేత్ర** – పూర్తిగా వికసించిన కలువపువ్వులాంటి అందమైన కన్నులు కలవాడా; **భారతతైలపూర్ణః** – మహాభారతమనే తైలంతో; **త్వయా జ్ఞానమయః ప్రదీపః ప్రజ్వాలితః**– నీ జ్ఞానంతో జ్ఞానజ్యోతిని వెలిగించినవాడా; **నమోஉస్తుతే** – నీకు నమస్కారం చేస్తున్నాను.

విస్తారమైన, లోతైన జ్ఞానం ఉన్న ఓ వ్యాసాచార్యా, పూర్తిగా వికసించిన కలువపువ్వులాంటి అందమైన కన్నులు కలవాడా, మహాభారతమనే తైలంతో, నీ జ్ఞానంతో జ్ఞానజ్యోతిని వెలిగించినవాడా, నీకు నమస్కారం చేస్తున్నాను.

వ్యాసాచార్యుని సంబోధిస్తున్నాడు కవి. వ్యాసుడు అంటేనే వేదాలను నాలుగుగా విభజించి, వేదబోధను 18 పురాణాల ద్వారా విస్తరింపజేసిన వ్యక్తి అని అర్థం. అంటే వ్యాసుడు అంటే విభజించి, విస్తరింపజేసిన వ్యక్తి. ముందు వేదం ఒకటే ఉండేది – దాన్ని మనుష్యులు అర్థం చేసుకోలేకపోతే, వ్యాసాచార్యులు వాటిని క్రోఢీకరించి నాలుగు వేదాలుగా విభజించారు. తరువాత ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శిష్యుణ్ణి ఆచార్యునిగా నియమించి, ఆ వేదం ప్రచారం అయ్యేటట్టుగా కృషి చేశారు.

వ్యాసాచార్యుని అసలు పేరు కృష్ణ. కృష్ణపరమాత్మ పేరు కూడా కృష్ణ. ఈ పేరు వారి శరీరవర్ణంవల్ల వచ్చింది. ద్రౌపదిని కూడా కృష్ణ అంటారు, ఇదే కారణంవల్ల. కృష్ణకూ, వ్యాసాచార్యులకూ మధ్య వ్యత్యాసం తెలియటానికి

వ్యాసాచార్యులను కృష్ణద్వైపాయనుడు అంటారు. అంటే ద్వీపంలో పుట్టిన కృష్ణ. ఈ వ్యాసాచార్యులు ఎటువంటి వారు?

**విశాలబుద్ధే** – గొప్ప జ్ఞానం ఉన్న ఆచార్యుడివి నువ్వు. గొప్ప జ్ఞానం అంటే అటు విస్తారమైన జ్ఞానం, ఇటు లోతైన జ్ఞానం – రెండూ వస్తాయి. కొంతమందికి అనేక అంశాలు తెలుసు కాని, ఏదీ లోతుగా తెలియదు. మరికొంతమందికి ఒకటే సబ్జెక్టు తెలుసు కాని, దాని లోతులు బాగా కొలుస్తారు. వ్యాసాచార్యులకు అనేక అంశాలమీద, లోతైన జ్ఞానం ఉంది. విశాలబుద్ధే అంటే గొప్ప జ్ఞానం ఉంది.

**ఫుల్లారవిందాయతపత్రనేత్ర** – పూర్తిగా వికసించిన కలువపువ్వులాంటి అందమైన కన్నులు కలవాడు. వ్యాసాచార్యులు బాహ్యంగా అందంగా లేకపోవచ్చు కాని ఆయన జ్ఞాననేత్రమైన మూడవకన్ను అందాన్ని వర్ణిస్తున్నారు మధుసూదన సరస్వతి.

**త్వయా జ్ఞానమయః ప్రదీపః ప్రజ్వాలితః** – నువ్వు ఎంత గొప్పవాడివంటే, నీ జ్ఞానంతో నువ్వు జ్ఞానజ్యోతిని వెలిగించావు. దానికి వాడిన నూనె ఏమిటి?

**భారతతైల పూర్ణః** – మహాభారతమనే నూనెతో. మహాభారతకథతో, జ్ఞానజ్యోతిని వెలిగించావు. ఆ దీపకాంతితో నాలో ఉన్న అజ్ఞానమనే చీకటిని తొలగించుకుంటాను.

**నమోఽస్తుతే** – అటువంటి వ్యాసాచార్యునికి నమస్కారం చేస్తున్నాను.

### 4. జగద్గురువు శ్రీకృష్ణపరమాత్మకు నమస్కారం

**శ్లో. 3** **ప్రపన్నపారిజాతాయ తోత్రవేత్రైకపాణయే ।**
**జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః ॥**

**ప్రపన్నపారిజాతాయ** – పారిజాతవృక్షంలా తనను శరణు కోరినవారికి కోరికలను తీర్చేవాడు; **తోత్రవేత్రైక పాణయే** – ఒక చేత్తో అశ్వాలను అదిలించే పగ్గాలు పట్టుకున్నవాడు; **జ్ఞానముద్రాయ** – ఒకచేత్తో చిన్ముద్ర వేసేవాడు; **గీతామృతదుహే** – గీత అనే అమృతాన్ని పాలలా చిలికినవాడు; **కృష్ణాయ నమః** – అయిన కృష్ణపరమాత్మకు నమస్కారములు.

పారిజాత వృక్షంలా తనను శరణు కోరినవారికి కోరికలను తీర్చేవాడు; ఒక చేత్తో అశ్వాలను అదిలించే పగ్గాలు పట్టుకున్నవాడు; ఒక చేత్తో చిన్ముద్ర వేసేవాడు; గీత అనే అమృతాన్ని పాలలా చిలికినవాడు అయిన కృష్ణపరమాత్మకు నమస్కారములు.

**కృష్ణాయ నమః** – కృష్ణపరమాత్మకు నమస్కారం. ఎటువంటి కృష్ణపరమాత్మ?

**ప్రపన్న పారిజాతాయ** – పారిజాతవృక్షం కల్పతరువులాంటిది. ఆ చెట్టు కింద కూర్చుని ఏదైనా కోరిక కోరుకుంటే, కోరినంత మాత్రాన ఆ వృక్షం ఆ కోరిక తీరుస్తుంది. భక్తులకు కృష్ణపరమాత్మ అలాంటి పారిజాతవృక్షం. కోరినదే

తదువుగా భక్తుల కోరికలను తీరుస్తాడు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలలో ఏది కోరినా తీరుస్తాడు. దానికి నియమం ఏమిటి? ప్రపన్న – భగవంతుణ్ణి శరణు వేడాలి.

**తోత్రవేత్రైకపాణయే** – మహాభారతయుద్ధంలో కృష్ణపరమాత్మ అర్జునునికి రథసారథిగా వ్యవహరించాడు. ఒక చేత్తో అశ్వాలను అదిలించే పగ్గాలను పట్టుకున్నాడు. దీన్నిబట్టి, మనం ఒక విషయం నేర్చుకోవాలి. కృష్ణపరమాత్మ సాక్షాత్తూ జగత్తుకు పరమాత్మ అయినా, రథసారథిగా చేయటానికి వెనుకంజ వేయలేదు. అలా మనం చేపట్టిన ఏ వృత్తినైనా తక్కువగా భావించకూడదు. ఏ పని చేసినా అంకితభావం, ప్రేమ, ఉత్సాహం, గర్వంతో చేయాలి.

**జ్ఞానముద్రాయ** – కృష్ణపరమాత్మ అర్జునునికి రథసారథిమాత్రమే కాదు, ఆత్మజ్ఞానం బోధించిన గురువు కూడా. ఒక చేత్తో పగ్గాలు పట్టుకుంటే, ఇంకొక చేత్తో చిన్ముద్ర వేస్తున్నాడు. దీన్ని జ్ఞానముద్ర అని కూడా అంటారు. ఎందుకంటే ఈ జ్ఞానముద్ర గీతాసారాన్ని అంటే వేదాంతసారాన్ని సూచిస్తుంది. వేదాంతసారం – జీవాత్మ పరమాత్మల ఐక్యం.

మన చూపుడువేలు జీవాత్మను సూచిస్తుంది. ఈ చూపుడువేలును తర్జని అని అంటారు, ఇది బెదిరిస్తుంది, నీ పనిపడతాను అంటుంది. ఇటువంటి జీవుడివల్ల తనకు, తన ద్వారా సమాజానికి కూడా అవస్థే. ఈ జీవుడు శాశ్వతం కాదు. పరమాత్మ శాశ్వతం. మన బొటనవేలు పరమాత్మను సూచిస్తుంది. అశాశ్వతమైన జీవుడు, శాశ్వతమైన పరమాత్మతో కలవకుండా, తక్కిన మూడింటితో కలుస్తాడు. అంటే చూపుడువేలు ఎప్పుడూ తక్కిన మూడు వేళ్ళతో కలిసివుండి, బొటనవేలుకు దూరంగా ఉంటుంది. ఆ మూడువేళ్ళూ మూడు గుణాలను – సత్త్వ, రజ, తమో గుణాలను; మూడు శరీరాలను – స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను సూచిస్తాయి.

ఆధ్యాత్మిక సాధన అంటే ఈ మూడింటినుంచి జీవాత్మను విడదీసి, పరమాత్మతో కలపాలి. బొటనవేలును పరమాత్మ అని ఎందుకంటాము? బొటనవేలు సహాయ సహకారాలు లేనిదే మనం ఏ పనీ చేయలేము. ఆఖరికి వ్రాయటం కూడా చేయలేము. ఏ విధంగా బొటనవేలు తక్కిన అన్ని వేళ్ళకూ ఆధారమో, అలా పరమాత్మ సృష్టికంతటకూ ఆధారం.

జీవాత్మ సృష్టికంతటకూ ఆధారమైన పరమాత్మతో కలవాలి. మూడు గుణాలనుంచి, మూడు శరీరాలనుంచి విడివడాలి. అవి రెండూ కలిస్తే జీవాత్మ పరమాత్మ ఐక్యం జరుగుతుంది. అంటే చూపుడువేలును, బొటనవేలుతో కలిపి చిన్ముద్ర వెయ్యాలి. అలా చిన్ముద్ర వేస్తే ఒక వృత్తాకారం ఏర్పడుతుంది. వృత్తం దేనికి ప్రతీక? పూర్ణత్వానికి. వృత్తానికి తుది, మొదలు ఉండదు. అంటే వృత్తం ఆద్యంతరహితం. అందువల్ల ఎప్పుడైతే జీవాత్మ పరమాత్మతో ఐక్యం అవుతుందో అప్పుడే అశాశ్వతమైన జీవాత్మ, శాశ్వతమైన పరమాత్మ అవుతుంది; అపూర్ణ జీవాత్మ, పూర్ణం అవుతుంది.

ఆధ్యాత్మ సాధన అంటే బంధకత్వంనుంచి, బంధవిమోచనం పొందటం. మనం ఇప్పుడు చేస్తున్నదీ అదే. కాకపోతే దానికి భిన్నంగా చేస్తున్నాము. చిన్మయానంద స్వామిని రైలుప్రయాణం చేయబోయే ముందు, వేదాంతసారాన్ని రెండు ముక్కల్లో చెప్పమని ఎవరో అడిగారుట! ఆయన **అటాచ్‌మెంట్ అండ్ డిటాచ్‌మెంట్** అని

చెప్పారుట. సరిగ్గా ఇదే మాటలు – బంధకత్వం, బంధవిమోచనం. కాకపోతే మనం చేస్తున్నది వేరు, చెయ్యాలన్నది వేరు. మనం అశాశ్వతమైన వాటితో బంధకత్వం పెంచుకుని, శాశ్వతమైన పరమాత్మనుంచి బంధవిమోచనం చేస్తున్నాము. అసలు చెయ్యాల్సినది శాశ్వతమైన పరమాత్మతో బంధం పెంచుకుని, అశాశ్వతమైన జగత్తునుంచి బంధవిమోచనం పొందాలి. ఈ జ్ఞానాన్ని కృష్ణపరమాత్మ తన చిన్ముద్ర ద్వారా సూచిస్తున్నాడు. అటువంటి గొప్ప జ్ఞానికి, అటువంటి గొప్ప కర్మయోగికి, అటువంటి దయాసాగరునికి మా నమస్కారములు.

**సర్వాన్ భక్తాన్ కర్షతి ఆకర్షతి ఇతి కృష్ణః**

కృష్ణపరమాత్మ అందరినీ ఆకర్షిస్తాడు. మానవాళికి కృపాకటాక్షాలను కురిపించటం ద్వారా అందరినీ అలరిస్తాడు, ఆకర్షిస్తాడు.

**గీతామృతదుహే నమః** – అటువంటి కృష్ణపరమాత్మకు మా నమస్కారములు.

**శ్లో. 5 వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।**
**దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥**

**వసుదేవసుతం** – వసుదేవుని పుత్రుడు; **దేవకీ పరమానందం** – తల్లి దేవకికి పరమానందాన్ని చేకూర్చిన వాడు; **కంసచాణూర మర్దనమ్** – కంస, చాణూరులను వధించినవాడు; **జగద్గురుమ్** – జగత్తుకు గురువైనవాడు; **కృష్ణం వందే** – అయిన కృష్ణపరమాత్మకు నమస్కారములు.

వసుదేవుని పుత్రుడు, తల్లి దేవకికి పరమానందాన్ని చేకూర్చినవాడు; కంసుడు, చాణూరులను వధించినవాడు, జగత్తుకు గురువైనవాడు అయిన కృష్ణపరమాత్మకు నమస్కారములు.

ఈ శ్లోకంలో కూడా కృష్ణపరమాత్మకు నమస్కారములు అందజేస్తున్నాడు కవి. కృష్ణపరమాత్మను మూడు స్థాయిల్లో కొలుస్తున్నాడు – కుటుంబసభ్యునిగా, దేశరక్షకునిగా, జగద్గురువుగా.

**కృష్ణం వందే** – కృష్ణపరమాత్మకు నమస్కారములు.

**వసుదేవసుతం దేవం** – పరమాత్మ వసుదేవుని పుత్రుడు; అంతేకాదు

**దేవకీ పరమానందం** – తల్లి దేవకీదేవికి పరమానందాన్ని కలుగజేసేవాడు. ఈ విధంగా తల్లిదండ్రుల జన్మను ధన్యం చేసినవాడు.

మన ధర్మం అక్కడే మొదలవుతుంది. మన కుటుంబసభ్యులకు పరమానందాన్ని కలుగజేసి, తరువాత బయట సమాజానికి సేవ చేయాలి. చాలామంది ఏదో ఒకటే చేస్తారు. అంటే సమాజానికి ఎంతో సేవ చేస్తారు, కుటుంబసభ్యుల దగ్గరికి వచ్చేసరికి వారికి ఓపికా, తీరికా ఉండదు. మరికొంత మంది కుటుంబాన్ని అపురూపంగా చూసుకుంటారు, కాని సమాజాన్ని పట్టించుకోరు. ముందు తరాల గురించి అసలే ఆలోచించరు. కాని కృష్ణపరమాత్మ మూడు విధులను చక్కగా నిర్వర్తించాడు. తల్లిదండ్రులకు ఆనందం కలిగించాడు.

**కంసచాణూరమర్దనమ్** – కంసుడు, చాణూరులను రాక్షసులను వధించాడు. తద్వారా దేశానికి మేలు చేశాడు. అధర్మాన్ని పారద్రోలి, ధర్మస్థాపన చేయటానికి అవతారాలు ఎత్తుతాను అని కృష్ణపరమాత్మే చెప్పాడు.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**

**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ – 4.8**

ఆ విధంగా భక్తులను రక్షించాడు.

**జగద్గురుమ్** – అర్జునునికి భగవద్గీతను బోధించాడు. అర్జునుని ద్వారా ఈ జ్ఞానాన్ని అప్పటి కాలానికే కాక, నేడు ఈ ఇరవై ఒకటవ శతాబ్దానికి కూడా ఉపయోగపడే జ్ఞానబోధ చేశాడు. మహాభారతయుద్ధం ద్వాపర యుగంలో జరిగింది. ఇప్పుడు కలియుగం. అంటే 5000 సంవత్సరాల పైనే అయింది. కాని ఆరోజు చెప్పిన సత్యాలు ఇప్పటికీ పనికివస్తాయి. అందువల్ల కృష్ణపరమాత్మ జగద్గురువు అయ్యాడు.

**శ్లో. 6 భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా**

**శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా! ।**

**అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ**

**సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః ॥**

**రణనదీ** – ఆ మహాభారత యుద్ధనదికి; **భీష్మద్రోణతటా** – భీష్మద్రోణులు తీరాలు; **జయద్రథజలా** – జయద్రథుడు నీరు; **గాంధార నీలోత్పలా** – గాంధార రాజకుమారుడు నీలికలువపువ్వు; **శల్యగ్రాహవతీ** – శల్యుడు తిమింగలం; **కృపేణ వహనీ** – కృపాచార్యుడు అంతర్వాహిని; **కర్ణేన వేలాకులా** – కర్ణుడు మిన్నంటి ఎగసే అలలు; **అశ్వత్థామ వికర్ణ ఘోరమకరా** – అశ్వత్థామ వికర్ణులు ఘోరమైన మొసళ్ళు; **దుర్యోధనావర్తినీ** – దుర్యోధనుడు సుడిగుండం; **కైవర్తకః కేశవః** – నైపుణ్యంతో పడవ నడిపే కేశవుడివల్ల; **ఉత్తీర్ణా ఖలు పాండవైః** – పాండవులు ఆ రణనదిని దాటారు.

మహాభారత రణనదికి భీష్మద్రోణులు తీరాలు; జయద్రథుడు నీరు; గాంధార రాజకుమారుడు నీలికలువ పువ్వు; శల్యుడు తిమింగలం; కృపాచార్యుడు అంతర్వాహిని; కర్ణుడు మిన్నంటి ఎగసే అలలు; అశ్వత్థామ వికర్ణులు ఘోరమైన మొసళ్ళు; దుర్యోధనుడు సుడిగుండం. అయినా నైపుణ్యంతో పడవ నడిపే కేశవుడివల్ల పాండవులు ఆ రణనదిని దాటారు.

**కైవర్తకః కేశవః** – కైవర్తకుడు అంటే పడవ నడిపేవాడు. తుఫాను ఎదురైనా పడవను ఒడుపుగా ముందుకు నడుపుతాడు. కృష్ణపరమాత్మకు అటువంటి నైపుణ్యం ఉంది. మహాభారత యుద్ధాన్ని అలా భీకరమైన నదితో పోల్చాడు కవి. అందులో అనేక ప్రమాదాలు పొంచివున్నాయి. పాండవులు అటువంటి భీకరమైన నదిని క్షేమంగా దాటాలి. అది వారికి ఒక పెద్ద పరీక్షా సమయం.

పాండవులకు పరీక్షా సమయం మహాభారత యుద్ధం అయితే, మనకు వేరే రూపంలో పరీక్షా సమయాలు ఎదురవుతూ ఉంటాయి. అలా భయంకరమైన పరిస్థితిలో మునిగిపోయిన వ్యక్తిని ఆర్తపురుషుడు అంటారు.

ఆర్తపురుషుడు అంటే నిస్సహాయస్థితిలో ఉన్న వ్యక్తి. అటువంటి పరిస్థితిలో భగవంతుణ్ణి శరణువేడితే వచ్చి కాపాడుతాడు. అందువల్ల భగవంతుణ్ణి ఆర్తత్రాణపరాయణుడు అంటారు.

**భీష్మద్రోణతటా** – మహాభారత యుద్ధాన్ని నదితో పోలిస్తే, భీష్మద్రోణులు నదీ తీరాలు. నది ప్రవహించే దిక్కును నదీతీరాలు నిర్ణయించినట్టుగా, మహాభారత యుద్ధమనే నది ప్రవహించే దిక్కును నిర్ణయించే తీరాలు భీష్మద్రోణులు.

**జయద్రథజలా** – నదిలోని నీరు జయద్రథుడు అనే రాజు. ఆయన సింధుదేశపు రాజు. నది లోతెంతో తెలియనట్టుగా, ఆ రాజుయొక్క పరాక్రమాన్ని కొలవలేము.

**గాంధారనీలోత్పలా** – గాంధారుడు అంటే శకుని. అతను నీటిలోని నీలికలువ పువ్వులాంటివాడు. గాంధారదేశపు రాజు పేరు సుబలుడు. రాజకుమారుడు శకుని, రాజకుమార్తె గాంధారి. గాంధారి సోదరుడు శకునిని నీలికలువలతో పోల్చాడు కవి. కలువపువ్వులు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి కాని వాటి దగ్గరకు వెళితే బురదనీటిలో కూరుకుపోతాము. శకుని దగ్గరకు వెళ్ళినా అంతే ప్రమాదం.

**శల్యగ్రాహవతీ** – శల్యుడు నీటిలోని తిమింగలం లాంటివాడు. అతను మద్రదేశపు రాజు. పాండురాజు భార్య అయిన మాద్రికి బంధువు. కాని శత్రుసైన్యంలో చేరాడు. అతను కూడా చాలా శక్తివంతమైన రాజు.

**కృపేణ వహనీ** – కృపాచార్యుడు అంతర్వాహినివంటివాడు. నీటిలో అంతర్వాహిని శక్తి బాహ్యంగా కనపడదు. దగ్గరకు వెళితే మాత్రం ఈడ్చుకుపోతుంది. కృపాచార్యుడు కూడా అంత శక్తివంతుడు. ద్రోణాచార్యుని లాగా కృపాచార్యుడు కూడా పాండవులకు, కౌరవులకు, యాదవులకు విలువిద్యను నేర్పిన గొప్ప విలుకాడు. కాని ఆయన శత్రుసైన్యంలో చేరాడు.

**కర్ణేన వేలాకులా** – కర్ణుడు తుఫాను సమయంలో అంతెత్తున ఎగసిపడే భీకరమైన అలలవంటివాడు.

**అశ్వత్థామ వికర్ణ ఘోరమకరా** – మకరం అంటే మొసలి. అశ్వత్థామ, వికర్ణుడు ఘోరమైన మొసళ్ళవంటివారు. అశ్వత్థామ ద్రోణాచార్యుని పుత్రుడు, వికర్ణుడు దుర్యోధనుని సోదరుడు.

**దుర్యోధనావర్తినీ** – ఆవర్తినీ అంటే సుడిగుండం. సుడిగుండంలో పడితే ప్రాణాలు పోవటమే, వేరే మార్గం లేదు. పెద్ద ఓడలే అందులో పడితే మాయమయిపోతాయి. దుర్యోధనుడు రణనదిలో సుడిగుండంలాంటివాడు.

**సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ** – ఇటువంటి రణనదినుంచి పాండవులు ఆవలి తీరానికి చేరారు. అసాధ్య మనుకున్నదాన్ని సుసాధ్యం చేశారు. ఎలా? పడవ నడిపేవాని నైపుణ్యంతో. అందువల్ల కృష్ణపరమాత్మను కైవర్తకః కేశవః అన్నారు. దీన్నిబట్టి మనకు అర్థమవుతున్న దేమిటంటే రేపు మనం కూడా ఇటువంటి నిస్సహాయస్థితిలో ఇరుక్కుంటే, మనం కూడా పాండవులలాగా కృష్ణపరమాత్మను శరణువేడితే, తప్పక విజయం పొందుతాము. తలుపులన్నీ మూసుకుపోయాయి అంటే, అన్ని తలుపులూ మూసుకు పోలేదని గుర్తుంచుకోండి. ఆర్తత్రాణ పరాయణుడైన పరమాత్మ వైపు ఉన్న తలుపు మనకోసం తెరిచే వుంది.

**శ్లో. 8** **మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।**
**యత్కృపా తమహం వందే పరమానందమాధవమ్ ॥**

**పరమానందమాధవమ్** – పరమానందాన్ని చేకూర్చే మాధవునికి; **యత్కృపా** – ఆయన కృప; **మూకం వాచాలం కరోతి** – మూగవాణ్ణి ధారాళంగా మాట్లాడేలాగా చేస్తాడు; **పంగుం గిరిమ్ లంఘయతే** – కుంటివాడు ఎత్తైన కొండ ఎక్కేలాగా చేస్తాడు; **తమ్ మాధవమ్ అహం వందే** – అటువంటి మాధవునికి నేను నమస్కరిస్తున్నాను.

ఎవరి కృపయైతే మూగవాణ్ణి ధారాళంగా మాట్లాడేలాగా చేస్తుందో, కుంటివాణ్ణి ఎత్తైన కొండ ఎక్కేలా చేస్తుందో అలాంటి కృపానిధి అయిన పరమానంద మాధవునికి నేను నమస్కరిస్తున్నాను.

**పరమానందమాధవం వందే** – మాధవునికి నమస్కారములు. మాధవుడు అంటే లక్ష్మీపతి, శ్రీపతి. ఎటువంటి మాధవుడు? పరమానందాన్ని కలుగజేసేవాడు. సాక్షాత్తూ లక్ష్మీదేవే చెంతనున్నవాడు కాబట్టి ఆనందాన్ని కలుగ జేస్తాడు. ఇక్కడ ఐశ్వర్యం అంటే జ్ఞానం. కేవలం ఐశ్వర్యం పరమానందాన్ని ఇవ్వదు. ఒక్కోసారి సమస్యలను కొనితెస్తుంది కూడా. అందువల్ల భగవంతుడు సర్వజ్ఞుడు కాబట్టి, ఆయన పరమానందస్వరూపుడు. ఆయన ఏం చేస్తాడు?

**మూకం వాచాలం కరోతి** – మూగవాడు అద్భుతంగా మాట్లాడేలాగా చేస్తాడు. ఎప్పుడు? భగవంతుణ్ణి శరణు వేడితే. అంటే భగవంతుడు సర్వశక్తిమంతుడు. తలుచుకుంటే ఏమైనా చేయగలడు, మూగవాడు ధారాళంగా మాట్లాడేలాగా చేయగలడు అంటే అవసరమైతే ధారాళంగా మాట్లాడేవాణ్ణి మూగవానిగా కూడా చేయగలడు. అంతేకాదు –

**పంగుం గిరిం లంఘయతే** – భగవంతుడు కుంటివాణ్ణి సైతం ఎత్తైన కొండను ఎక్కేలాగా చేయగలడు. కుంటివారు ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కారంటే వారి ఆత్మస్థైర్యానికి తోడు దైవకృప ఉండటంవల్లనే.

**యత్కృపా** – ఇదంతా మాధవకృపవల్లనే సాధ్యం.

**తం మాధవం అహం (వందే)** – అటువంటి మాధవునికి నేను నమస్కారాలు చేస్తున్నాను.

మనకు కొండ ఏమిటి? గీతాధ్యయనం! గీతాబోధకు వెళ్ళి, వారానికొక రోజు చొప్పున వింటే ఎంత లేదన్నా కొన్ని సంవత్సరాలు పడుతుంది నేర్చుకోవటానికి. అన్ని సంవత్సరాలు అధ్యయనం చేయాలంటే, మధ్యలో ఎన్నో ఆటంకాలు రావచ్చు. అన్ని సంవత్సరాలు నేర్చుకోవటం మనవల్ల సాధ్యమవుతుందో, అవదో అనే శంక పెట్టుకోకండి. సాక్షాత్తూ ఆ కృష్ణపరమాత్మే చూసుకుంటాడు. మీరు బోధకు సోమవారం వెళ్ళాలంటే, ఆరోజు ఏమీ ఆటంకాలు కలుగకుండా చూసుకునే బాధ్యత ఆయనదే. అందువల్ల నిశ్చింతగా ముందుకు సాగండి! ఈ ప్రార్థన శ్లోకాలు నేర్చుకునే ఉద్దేశ్యం కూడా అదే!

శ్లో. 9 **యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుతః స్తున్వంతి దివ్యైః స్తవైః**
**వేదైః సాంగపదక్రమోపనిషదైః గాయంతి యం సామగాః ।**
**ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యంతి యం యోగినో**
**యస్యాంతం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః ॥**

**యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుతః స్తున్వంతి** – ఆ భగవంతుణ్ణి బ్రహ్మ, వరుణుడు, ఇంద్రుడు, మరుతుడు, స్తుతిస్తారు; **దివ్యై స్తవై** – దివ్యమైన స్తోత్రాలతో; **యం సామగాః గాయంతి** – భూలోకంలో సామవేదాన్ని గానం చేస్తారు; **వేదైః** – అన్ని వేదాల ద్వారా భగవంతుణ్ణి స్తుతిస్తారు; **అంగపదక్రమోపనిషదైః** – వేదాంగాలు, పదాలు, పదక్రమాలు, ఉపనిషత్తులు కూడా కీర్తిస్తాయి; **యోగినః యం పశ్యంతి** – గొప్ప యోగులు నిన్ను చూస్తారు; **మనసా తద్గతేన** – నీమీద దృష్టి నిలిపిన మనస్సుతో; **ధ్యానావస్థిత** – ధ్యానంలో; **యస్యాంతం న విదుః సురాసురగణాః**– నీ అసలు స్వరూపం సురాసురులకు తెలియదు; **తస్మై దేవాయ నమః** – అటువంటి దేవునికి నా నమస్కారాలు.

ఆ భగవంతుణ్ణి బ్రహ్మ, వరుణుడు, ఇంద్రుడు, మరుతుడు, దివ్యమైన స్తోత్రాలతో స్తుతిస్తారు. భూలోకంలో సామవేదాన్ని గానం చేస్తారు. అన్ని వేదాల ద్వారా, వేదాంగాల ద్వారా, పదక్రమాల ద్వారా, ఉపనిషత్తుల ద్వారా స్తుతిస్తారు. గొప్ప యోగులు నీమీద దృష్టి నిలిపిన మనస్సుతో ధ్యానంలో నిన్ను చూస్తారు. నీ అసలు స్వరూపం సురాసురులకు తెలియదు. అటువంటి దేవునికి నా నమస్కారములు.

**తస్మై దేవాయ నమః** – అటువంటి దేవునికి నా నమస్కారములు. ఎటువంటి దేవునికి?

**యం బ్రహ్మా వరుణేంద్రరుద్ర మరుతః స్తున్వంతి** – ఆ భగవంతుణ్ణి అనేక దేవతలు స్తుతిస్తారు. వారు బ్రహ్మదేవుడు, వరుణుడు, ఇంద్రుడు, రుద్రుడు, మరుతుడు. వీరందరిలోకి బ్రహ్మదేవుడు ప్రథముడు. సాక్షాత్తూ సృష్టికర్త. ఆయనే విష్ణుమూర్తిని కీర్తిస్తున్నాడు అంటే విష్ణుమూర్తి ఎంత గొప్పవాడు! ఎలా కీర్తిస్తున్నారు వీరంతా?

**దివ్యైః స్తవైః** – దివ్యమైన స్తోత్రాలతో! భాగవతంలో ధృవస్తుతి, కుంతీస్తుతి, రుద్రస్తుతిలాంటి స్తుతులు ఎన్నో ఉంటాయి. వీరంతా విష్ణుమూర్తిని ఉన్నతలోకాల్లో కీర్తిస్తారు. అలాగే భూలోకంలో కూడా భక్తులు కీర్తిస్తారు.

**యం సామగాః గాయంతి** – సామగానం చేసేవారు ఎవరినైతే స్తుతిస్తారో,

**వేదైః** – అన్ని వేదాల ద్వారా భగవంతుణ్ణి స్తుతిస్తారు.

**అంగపదక్రమోపనిషదైః** – వేదాలే కాదు, వేదాంగాలు కూడా కీర్తిస్తాయి. వేదాంగాలు అంటే స్మృతిగ్రంథాలు. ఆరు వేదాంగాలు ఉన్నాయి. వేదాలను వల్లెవేయటానికి వీలుగా పూర్వం అనేక పద్ధతులను తెలివిగా కనుగొన్నారు. అందులో ఒకటి –

పదం – అంటే ప్రతి ఒక్క పదాన్నీ విడివిడిగా పలుకుతారు.

**పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయమ్**

**పార్థాయ – ప్రతిబోధితాం – భగవతా – నారాయణేన – స్వయం**

క్రమం – రెండేసి పదాలను కలుపుతారు. ఉదా: 1-2, 2-3, 3-4

**పార్థాయ ప్రతిబోధితాం – ప్రతిబోధితాం భగవతా – భగవతా నారాయణేన**

వీటన్నిటి ద్వారా భగవంతుణ్ణి స్తుతిస్తారు. అంతేకాదు,

**యోగినః యం పశ్యంతి** – గొప్ప జ్ఞానులు, గొప్ప ఉపాసకులు నిన్ను చూస్తారు, ఎలా?

**మనసా తద్గతేన** – నీమీద దృష్టి నిలిపిన మనస్సుతో; ఎక్కడ?

**ధ్యానావస్థిత** – ధ్యానంలో. భక్తులు భగవంతుణ్ణి బాహ్యంగా చూస్తే, యోగులు వారి ఏకాగ్రచిత్తంతో భగవంతుణ్ణి అంతర్గతంగా చూస్తారు.

**యస్యాంతం న విదుః సురాసురగణా** – దేవతలు, సురులు, అసురులకు కూడా నీ అసలు స్వరూపం తెలియదు. యస్య అంతం. అంతం అంటే పరిమితి. ఎటువంటి పరిమితి? దేశకాల పరిమితులు. భగవంతుడికి పరిమితులు లేవని దేవాసురులకే తెలియదు.

భగవంతుణ్ణి ఒక వ్యక్తిగా శాస్త్రం వర్ణించినా, నిజానికి భగవంతుని అసలు స్వరూపం – రూపంలేని భగవంతుడు. భక్తులు కొలవటానికి సగుణరూపం దాల్చాడు కాని, నిజానికి ఆయన నిర్గుణుడు. అంటే భగవంతుణ్ణి రెండు స్థాయిల్లో కొలుస్తాము. ముందుగా సగుణరూపంలో కొలిచి, ఆ తర్వాత నిర్గుణరూపం అయిన అసలు స్వరూపం అని తెలుసుకునే ఉన్నతస్థాయికి ఎదగాలి. కృష్ణపరమాత్మే, భగవద్గీతలో ఈ రెండు రూపాల గురించి చెబుతాడు. నన్ను ఒక వ్యక్తిగా కృష్ణునిగా, గోకులవాసిగా కొలుస్తారు కొందరు. నిజానికి నేను ఒక వ్యక్తిని కాదు. నాది మాయామానుష వేషం. అసలు నేను సర్వవ్యాపకుణ్ణి, దేశకాల పరిస్థితులకు అతీతుణ్ణి అని చెబుతాడు.

**తస్మై నమః** – అటువంటి సర్వవ్యాపకుడైన కృష్ణపరమాత్మకు నేను నమస్కారం చేస్తున్నాను.

అటువంటి కృష్ణపరమాత్మ మనందరినీ దీవించి, ఈ గీతాధ్యయనం అనే జ్ఞానసాధన నిర్విరామంగా సాగేలా చేసి, మనను జ్ఞానులను చేయాలని ప్రార్థిస్తున్నాము.

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ ప్రథమోఽ ధ్యాయః - అర్జున విషాదయోగః

## (మొదటి అధ్యాయము - అర్జున విషాదయోగము)

మొదటి అధ్యాయాన్ని ఉపోద్ఘాత అధ్యాయం అనవచ్చు. ఎందుకంటే అసలు గీతాబోధ, రెండవ అధ్యాయం నుంచీ, అది కూడా పదకొండవ శ్లోకంనుంచే మొదలవుతుంది. అలాంటప్పుడు మొదటి అధ్యాయం ఎందుకు? అది రెండు అంశాలను ప్రవేశపెడుతుంది – సమస్యను వర్ణిస్తుంది, గురుశిష్యులను పరిచయం చేస్తుంది.

అర్జునుని సమస్య ఏమిటి? సంసారం! సంసారాన్ని మనిషియొక్క ప్రాథమిక సమస్య అనవచ్చు. ఎందుకంటే ఈ సమస్య సర్వజనీన సమస్య, సర్వకాలాలకూ చెందిన సమస్య. దీనికి దేశం, కాలం, వయస్సు, జాతి, కులం, మతం, వర్ణం, ఆశ్రమాలతో సంబంధం లేదు. 5000 సంవత్సరాల ముందు అర్జునుడు ఏ సమస్యనైతే ఎదుర్కొన్నాడో, సరిగ్గా ఇప్పుడు కూడా మానవజాతిని వేధిస్తున్న సమస్య అదే. మానవజాతి ఇంకో 5000 సంవత్సరాలు కొనసాగితే, అప్పుడు కూడా ఇదే సమస్య వెంటాడుతుంది. అందువల్లనే దీన్ని ప్రాథమిక సమస్య అన్నారు.

ఈ ప్రాథమిక సమస్యను శాస్త్రము **సంసారం** అంటుంది. ఈ సమస్యను ఒక రోగంగా చూస్తే, దీన్ని భవరోగం లేదా సంసారరోగం అంటారు. సంసార రోగవిశ్లేషణను మొదటి అధ్యాయంలో చూస్తాము. వ్యాసాచార్యులు దీనిని మొదటి అధ్యాయంలో ఎందుకు చర్చించారు? ఎందుకంటే ఈ సర్వజనీన సమస్యకు పరిష్కారంగా వచ్చినదే గీతాశాస్త్రము. ఈ భవరోగానికి పరిష్కారం గీతలో రెండవ అధ్యాయంలో మొదలయి చివరివరకు కొనసాగుతుంది. అందువల్ల భగవద్గీతను **మోక్షశాస్త్రము** అని కూడా అంటారు. మోక్షశాస్త్రము అంటే మానవజాతి సమస్య అయిన సంసారానికి పరిష్కారం చూపించే శాస్త్రము. అందువల్ల సమస్య ఏమిటో సరిగ్గా అర్థం అయితే కానీ, పరిష్కారంయొక్క ప్రాముఖ్యతను, అవసరాన్ని గుర్తించలేము.

అందువల్ల సంసారవర్ణన ప్రథమ అధ్యాయంయొక్క ప్రథమలక్ష్యం. అందువల్ల ఈ అధ్యాయాన్ని **అర్జున విషాదయోగము** అంటారు. విషాదము అంటే సంసారం. అంటే అర్జున సంసారయోగము. ఒక ప్రత్యేక సందర్భంలో అర్జునుడు ఎదుర్కొన్న సమస్య. అటువంటి సమస్యను ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో ఎదుర్కొంటూనే ఉంటారు. అందువల్ల ఈ సంసారం అంటే ఏమిటో వివరంగా చూద్దాము.

**సంసార వర్ణనము** – సంసారం అంటే ఏమిటి? మానవజాతి ఎదుర్కొనే ఈ సమస్యను రకరకాలుగా వర్ణించవచ్చు! ఉదాహరణకు ఒక వ్యాధిని రకరకాల వైద్యవిధానాలలో రకరకాలుగా నిర్వచిస్తారు. ఒక రోగి అల్లోపతి వైద్యానికి వెళితే, ఆ డాక్టరు అతని రోగాన్ని జాండిస్ అనో, క్యాన్సర్ అనో నిర్వచిస్తాడు. అదే రోగి ఆయుర్వేదానికి వెళితే,

అక్కడ రోగనిర్ధారణ వేరే విధంగా ఉంటుంది. ఆయుర్వేదంలో వాతం, పిత్తం, కఫం అనే మూడు అంశాలలో ఏదో ఒక అంశంవల్ల రోగం వస్తుంది అంటారు. సమస్య ఒకటే, రోగి ఒక్కడే, కాని దాన్ని చూసిన తీరు వేరు.

అలాగే సంసారమనే సమస్య ఒకటే, కాని దాన్ని భిన్నసందర్భాలలో భిన్నరీతుల్లో వర్ణిస్తారు. ఇక్కడ వ్యాసాచార్యులు ఒక ప్రత్యేక పద్ధతిలో వర్ణించారు. ఆయన సంసారాన్ని మూడు రోగాల కలయికగా అభివర్ణించారు. ఆ మూడు రోగాలు – రాగం, శోకం, మోహం. ఒక్కొక్క పదాన్నీ వివరంగా చూద్దాము.

**1. రాగం** – ఈ రాగం అనే పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇది చాలా ముఖ్యమైన పదం. కృష్ణపరమాత్మ గీతలో పదేపదే వాడతాడు దీనిని. సంగీతప్రియులు ఈ మాటను వింటే ఇది ఏ రాగం – కళ్యాణి రాగమా, కాంభోజి రాగమా అని అడగవచ్చు. ఇది వేదాంత రాగం. రాగం అంటే బంధకత్వం; భావపరంగా ఆధారపడటం.

రాగం గురించి మాట్లాడేటప్పుడు రాగానికీ, ప్రేమకూ మధ్యనున్న సూక్ష్మమైన భేదాలను గ్రహించాలి, ఎందుకంటే రెండూ చూడటానికి ఇంచుమించు ఒక్కలాగా ఉంటాయి. కాని భగవద్గీతలో రాగాన్ని తీవ్రంగా విమర్శిస్తే, ప్రేమను గొప్పగా కీర్తిస్తారు. రాగం సంసారి లక్షణం అయితే, ప్రేమ ముక్తిపొందిన జ్ఞాని లక్షణం. అందువల్ల ఈ రెండింటి మధ్య భేదాలను జాగ్రత్తగా గమనించాలి.

రాగం–ప్రేమల మధ్య వ్యత్యాసాలు –

ఎ) **స్వార్థం–నిస్వార్థం:** రాగం బంధకత్వంతో కూడినది. ఈ బంధకత్వం స్వార్థపూరితమైనది. ఒక వ్యక్తిమీద అభిమానం ఏర్పడితే, అతనితో అనుబంధంవల్ల నాకేమిటి లాభం అని చూస్తాను నేను. అతనికేమిటి లాభం అనేది పట్టించుకోకపోవచ్చు, లేదా దానికి అంతగా ప్రాముఖ్యత నివ్వకపోవచ్చు. అతనివల్ల నేను ఆనందం పొందుతున్నానా లేదా అనే స్వార్థంతో ఆలోచిస్తాను. ప్రేమ విషయంలో అలా కాదు. ఒక వ్యక్తిని నేను ప్రేమిస్తే అతనివల్ల నాకు ఆనందం కలుగుతుందా లేదా అని మాత్రమే చూడకుండా, అతను కూడా ఆనందంగా ఉన్నాడా లేదా అని చూస్తాను. అంటే ఇక్కడ నా ఆనందాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయాలని కాదు అర్థం, కాని ఎదుటి మనిషి ఆనందాన్ని హరించి నేను ఆనందం పొందాలనుకోను. ఒక్క ముక్కలో చెప్పాలంటే రాగం స్వార్థపూరితమైనది, ప్రేమ నిస్వార్థమైనది.

బి) **తీసుకోవటం–పుచ్చుకోవటం:** ఇది మొదటి లక్షణంవల్ల ఏర్పడుతుంది. రాగంలో నా ఆనందం చూసుకుంటాను అంటే ఏమిటి అర్థం? ఎంతసేపూ నేను ఏం పొందుతాను అనే ఆలోచిస్తాను. కాని ప్రేమ నిస్వార్థమైనది కాబట్టి ఇవ్వటానికీ, ఇంకా అవసరమైతే త్యాగం చేయటానికే ప్రయత్నిస్తాను. ఒక్క ముక్కలో చెప్పాలంటే రాగం తీసుకోవాలని చూస్తే, ప్రేమ ఇవ్వాలని చూస్తుంది.

సి) **షరతులతో కూడినది–బేషరతుగా ఉంటుంది:** ఎప్పుడైతే ఒక అనుబంధంలో నా స్వార్థం చూసుకుంటానో, అప్పుడే ఆ అనుబంధం షరతుతో కూడినది అవుతుంది. నాకు ఆనందం కలుగుతున్నంతసేపే నేనా అనుబంధాన్ని కొనసాగిస్తాను. నాకు ఏ క్షణంలో బాధ కలుగుతుందో ఆ క్షణమే చేతిలో ఉన్న వేడి బంగాళాదుంపను కింద పడేసినట్టుగా, ఆ అనుబంధాన్ని వదులుకుంటాను. ప్రేమకు ఆశించటం లేదు, షరతులు లేవు. ఎదుటి వ్యక్తి

నాకు తగ్గట్టుగా ఉన్నా లేకపోయినా ప్రేమిస్తాను. ఒక్క ముక్కలో చెప్పాలంటే రాగం షరతులతో కూడితే, ప్రేమ బేషరతుగా ఉంటుంది.

డి) **బలహీన మనస్సు-బలమైన మనస్సు:** రాగం బలహీనమైన మనస్సులో పుడుతుంది. మనస్సు శూన్యంగా అనిపిస్తే నాకు ఆనందంగా ఉండదు. అప్పుడు ఆనందంకోసం, బాహ్యంగా పరుగులు తీస్తాను. ఎవరిమీదో ఆ ఆనందంకోసం ఆధారపడతాను. కాని ప్రేమలో, నా మనస్సు నిండుగా ఉంటుంది. నాలోనే కొండంత ప్రేమ ఉంటే, చిటికెడు ప్రేమకోసం నేను ఎక్కడికీ పరుగులు తీయనవసరం లేదు. ప్రేమను కోరే బదులు, నేనే ప్రేమను పంచగలను. ఒక్క ముక్కలో చెప్పాలంటే బలహీన మనస్సునుంచి రాగం పుడితే, బలమైన మనస్సునుంచి ప్రేమ పుడుతుంది.

ఇ) **అధార్మికం-ధార్మికం:** రాగంలో బుద్ధి కప్పబడిపోతుంది. అప్పుడు రాగం అధర్మానికి పాల్పడేలా చేస్తుంది. కాని ప్రేమలో బుద్ధి బాగానే పనిచేస్తుంది. అప్పుడు నా ప్రవర్తన ధార్మికంగానే ఉంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే రాగం అధార్మికం, ప్రేమ ధార్మికం.

ఈ విధంగా రాగం సంసారంయొక్క ప్రాథమిక రోగం.

**2. శోకం** – ఈ రాగంనుంచి ఏర్పడినదే శోకం. శోకం అంటే దుఃఖం. రాగం శోకానికి దారితీయక తప్పదు. బాహ్యవస్తువుమీద నా ఆనందం ఆధారపడితే, ఆ వస్తువు ఎన్నాళ్ళు నిలుస్తుంది? అది మాయమైన మరుక్షణం నాకు శోకం కలుగుతుంది. చేతికర్రను సరదాగా పట్టుకుని నడిచేవారు, ఆ కర్ర లేకపోయినా బాధపడరు కాని, కర్రమీద ఆధారపడి నడిచేవారు, అది లేకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేరు. ఎవరిమీదో భావపరంగా ఆధారపడటం కూడా ఇటువంటి కర్రే! వారు కనుమరుగయితే నీరసం, నిస్పృహ, నిరాశలకు లోనవుతాము. ఇంకా మాట్లాడితే దిగ్భ్రాంతికి లోనవుతాము.

దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, నిజానికి ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు. ఆస్తులు, మనుష్యులు, హోదా, ఐశ్వర్యం, శరీరం – ఏదీ శాశ్వతం కాదు. వీటిలో దేనిమీద నేను ఆధారపడినా కూడా అది అశాశ్వతమే. భవిష్యత్తులో ఏదో ఒకరోజు వాటిని నేను వదులుకోక తప్పదు. కాని అది నన్ను వదిలివెళ్ళిపోయినప్పుడు, నేను కృంగిపోతాను. అందువల్ల ఈ నగ్నసత్యాన్ని ఎదుర్కోవటానికి నువ్వేం ప్రయత్నం చేస్తున్నావు అని ప్రశ్నిస్తున్నది శాస్త్రం!

ఈ సమస్య ప్రతి ఒక్కరం ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కోక తప్పదు. చూస్తూ చూస్తూండగానే వృద్ధాప్యం పైన బడుతుంది. ఒంట్లో శక్తి ఉడిగిపోతుంది. సంపాదించే వయస్సు తీరిపోతుంది – అటువంటి సమయంలో ఆదుకోవటానికి జీవితభీమాలు, ఆరోగ్య పథకాలు, ఎఫ్.డీ.లు ఏర్పాటు చేసుకుంటాము. ఇది ఆర్థిక సమస్యకు చెందినది. కాని భావపరమైన సమస్యకు ఏం ఏర్పాటు చేసుకున్నావంటున్నది శాస్త్రం. దానికి ఏర్పాట్లు చేసుకోకపోతే మానసికంగా కృంగిపోతాము. మనకు దేనిమీద బంధం ఉందో, అది మనకు దక్కకుండా పోయినప్పుడు, ఈ మానసికంగా కృంగిపోవటాన్ని **శోకం** అంటారు.

సమస్య వచ్చినప్పుడు ఏర్పాటు చేసుకోవటం కుదరదంటుంది గీత. వృద్ధాప్యంలో ఆర్థిక భద్రతకోసం ఎప్పుడు ఏర్పాట్లు చేసుకుంటాము? వృద్ధాప్యం పైబడక ముందే కదా! అలాగే మనం కోరుకున్న వస్తువు మనకు దూరమైనప్పుడు తట్టుకోలేము. అది మన దగ్గర ఉండగానే, మనం దాన్ని అనుభవిస్తున్నప్పుడే, ఆ ఎడబాటుకు సంసిద్ధులమై ఉండాలి. దీన్ని ముందుచూపు అంటారు.

**యావత్స్వస్థమిదం శరీరమరుజం యావచ్చ దూరే జరా**
**యావచ్చేన్ద్రియ శక్తిరప్రతిహతా యావత్క్షయోనాయుషః ।**
**ఆత్మశ్రేయసి తావదేవ విదుషా కార్యః ప్రయత్నమహాన్**
**సందీప్తే భవనే తు కూప ఖననం ప్రత్యుద్యమః కేదృశః ॥** – భర్తృహరి వైరాగ్యశతకమ్ – 75

**యావత్ స్వస్థమ్ ఇదం** – నేను శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడు, ఇంద్రియాలలో పటుత్వం తగ్గనంతవరకూ, కుటుంబసభ్యుల ఆదరాభిమానాలు తగ్గనంతవరకు, వ్యాపారం బాగా కొనసాగుతున్నప్పుడు, అంతా బాగున్నప్పుడు,

**ఆత్మశ్రేయసి తావదేవ కార్యః ప్రయత్నో మహాన్** – అటువంటి సమయంలో ముందుచూపు ఉండాలి. సమస్య ముంచెత్తినప్పుడు దాని పరిష్కరించాలనుకోవటం ఇంటికి నిప్పంటుకున్నప్పుడు బావి తవ్వటంలా ఉంటుంది.

అందువల్ల రెండవ భవరోగం – శోకం. రాగంవల్ల ఏర్పడిన శోకం.

**3. మోహం** – రాగం, శోకాలు ఉన్నప్పుడు బుద్ధి సరిగ్గా పనిచేయదు. బుద్ధిని రాగశోకాలనే మేఘాలు కప్పేస్తాయి. మబ్బు పట్టిన బుద్ధి సరియైన నిర్ణయాలు తీసుకోలేదు. తప్పుడు నిర్ణయాలు సబబుగానూ, సరియైన నిర్ణయాలు తప్పుగానూ అనిపిస్తాయి. ధర్మం అధర్మంగా, అధర్మం ధర్మంగా కనిపిస్తుంది. ఈ భ్రాంతిని మోహం అంటారు.

ఇది ఒక విషమవృత్తంలా అవుతుంది. రాగంవల్ల శోకంలో పడతాను. శోకంవల్ల బుద్ధి కప్పబడుతుంది. బుద్ధి కప్పబడటంవల్ల మోహంలో పడి, తప్పుడు నిర్ణయాలు తీసుకుంటాను. మోహంవల్ల మళ్ళీ రాగం, మళ్ళీ శోకం తప్పదు. నిజానికి బంధకత్వం పోదు. బంధంనుంచి విముక్తి పొందటానికి ప్రయత్నించే బదులు, ఒక బంధంనుంచి ఇంకో బంధంలో పడతాను. అది సిగరెట్టు మానటంకోసం, ముక్కుపొడుం అలవాటు చేసుకున్నట్టు ఉంటుంది – సమస్య ఏమీ పోలేదు. ఒక రోగంనుంచి ఇంకొక రోగానికి మారాను అంతే. ఇది మొదటి అధ్యాయంయొక్క మొదటి అంశం.

ఇలా రాగం–శోకం–మోహం అనే వృత్తంలో పడి తిరగటమే సంసారం. దీన్నుంచి బయటపడి, విముక్తి పొందటమే మోక్షం. అదే గీతాసారం. శారీరకంగా విముక్తి కాదు అది. శారీరక విముక్తి ఎవరూ పొందలేరు. మానసికంగా విముక్తి పొందాలి. దీన్నే మోక్షం అంటారు.

**గురుశిష్యులను పరిచయం చేయటం** – గురుశిష్యులను ఎందుకు పరిచయం చేయాలి? ఎందుకంటే మన ఉపనిషత్తులలో జరిగే ఆత్మజ్ఞాన బోధ అంతా గురుశిష్యుల సంవాదరూపంలో సాగుతుంది. దీని ముఖ్యోద్దేశం, ఆత్మజ్ఞానాన్ని గురువు ద్వారానే పొందాలి తప్ప, స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించకూడదు.

ఏదైనా అనారోగ్యం చేస్తే స్వంతంగా మనకు తోచిన వైద్యం చేసుకోవటం ఎంత ప్రమాదమో, స్వంతంగా ఆత్మజ్ఞానం పొందటానికి ప్రయత్నించటం కూడా అంతే ప్రమాదం. ఒక చిన్న తలనొప్పి రావటానికి కొన్ని వేల కారణాలు ఉండవచ్చు – సమస్య ఏమిటో తెలియకుండా మందు ఎలా వేసుకుంటాము? అలాగే ఆత్మజ్ఞానం స్వంతంగా పొందటానికి ప్రయత్నిస్తే అది సరిగ్గా అర్థం కాకపోవచ్చు. సరిగ్గా అర్థం కాకపోయినా ఫర్వాలేదు, తప్పుగా అర్థం చేసుకుంటే చాలా ప్రమాదం. అందువల్ల గురువుయొక్క ప్రాముఖ్యతను చెబుతుంది శాస్త్రం. ఆ సందర్భంలో గురువు అర్హతను, శిష్యుని అర్హతలను కూడా వర్ణిస్తుంది. ఏ సందర్భంలో గురుశిష్యులు ఒకచోట చేరారో కూడా చెబుతుంది.

సందర్భం ఏమిటి? మహాభారతయుద్ధం. ధార్మికులైన పాండవులకూ, అధార్మికులైన కౌరవులకూ మధ్య జరగబోయే సంగ్రామం. కౌరవులు అధర్మమార్గంలో వెళుతున్నారని తెలిసినా, వారెన్నో అక్రమాలు చేసినా పాండవులు వెంటనే యుద్ధానికి దిగలేదు. సామదానభేదదండోపాయాలు అంటారు. అంటే సామదానభేద మార్గాలు ఉపయోగించి చూసి, అవి పనిచేయకపోతే దండోపాయానికి రావాలి. పాండవులు అదే చేశారు. **అహింసా పరమో ధర్మః** అంటుంది మన శాస్త్రం. పాండవులు అహింసా మార్గంలోనే ప్రయత్నించారు కాని కుదరలేదు.

శాస్త్రం అహింసను బోధించినా, కొన్ని ప్రత్యేక సందర్భాలలో హింస తప్పదు అంటుంది. అందువల్లనే మన దేవుళ్ళు కృపాసాగరులు అయినా కూడా, వారు ప్రేమ స్వరూపులైనా కూడా, వారందరికీ ఆయుధాలు ఉన్నాయి. కోదండపాణి, పినాకపాణి, సుదర్శనచక్రం వగైరాలు. ఎందుకు? అహింసా మార్గం పని చెయ్యనప్పుడు ధర్మసంరక్షణకోసం, దుష్టులను శిక్షించక తప్పదు. ఒక డాక్టరు అవసరమైతే రోగికి ఒక కాలు కొంతమేరకు తీసేస్తాడు. ఎందుకు? అది మందులతో తగ్గదు, అంతేకాదు, లేకపోతే ఆ రోగికి రోగం ఆ కాలంతా పాకుతుంది. ఇక్కడ డాక్టరు ద్వేషం చూపించినట్టా, జాలి చూపించినట్టా? ఖచ్చితంగా జాలే!

అదే విధంగా దేశంలో అధర్మం పెరిగి పోతున్నప్పుడు, క్షత్రియుడు ముందు అహింసామార్గంలో దాన్ని అణగద్రొక్కటానికి ప్రయత్నించాలి. అయినా కుదరకపోతే ధర్మయుద్ధం చేయక తప్పదు. పాండవులు పదమూడు సుదీర్ఘ సంవత్సరాలు దీర్ఘంగా ఆలోచించి, ఎన్నో వ్యయప్రయాసల కోర్చాక, ధర్మయుద్ధం చేయాలనే నిర్ణయానికి వచ్చారు. దుర్యోధనుడనే రోగాన్ని అంతమొందించాలి. వేరే మార్గం లేదు.

అలా ధర్మయుద్ధంలోకి అడుగుపెట్టారు. ఏమయిందప్పుడు? ఇరుపక్షాల సైన్యాలు కురుక్షేత్రంలో చేరి, యుద్ధానికి సిద్ధమయ్యాక, అర్జునునికి శత్రుసైన్యంయొక్క బలాబలాలను పర్యవేక్షించాలనే కుతూహలం కలిగింది. తన రథసారథి అయిన కృష్ణపరమాత్మను శత్రుసైన్యం ముందు నిలబెట్టమన్నాడు. తీరా చూస్తే, తన ముందు ఉన్నది ఎవరు? దుర్యోధనుడు కాదు! దుర్యోధనుడు అయివుంటే అతను ఇంకా పగతో రగిలిపోయి ఉండేవాడు. కాని అతను చూసింది ఎవరిని? భీష్మ, ద్రోణులను. ఎవరిమీదైతే అతనికి బంధం ఉందో వారిని.

అది వారిమీద బంధమా, ప్రేమా? ఎలా తెలుస్తుంది? బంధానికి, ప్రేమకూ మధ్య చూసిన కొన్ని వ్యత్యాసాలలో ఒక వ్యత్యాసాన్ని గుర్తు తెచ్చుకోవాలి ఇక్కడ. బంధం ఉంటే అధార్మిక ప్రవర్తన, ప్రేమ ఉంటే ధార్మిక ప్రవర్తన చూపుతారు. బంధం ఉన్నచోట మోహం పుడుతుందనీ, మోహం బుద్ధిని కప్పేస్తుందనీ, బుద్ధిని కప్పేయటంవల్ల అతను అధార్మిక నిర్ణయం తీసుకుంటాడనీ చూశాము. అతని బుద్ధి మోహంతో కప్పబడిందని ఎలా తెలుసు? చాలా తేలిక! పదమూడు సంవత్సరాలు దీర్ఘంగా ఆలోచించి మహాభారత యుద్ధం ధర్మయుద్ధం అనే నిర్ణయానికి వచ్చారు. అది రాత్రికి రాత్రి తీసుకున్న నిర్ణయం కాదు. కాని ఇప్పుడు, క్షణిక నిర్ణయానికి వచ్చేశాడు. ఏ యుద్ధాన్నైతే ధర్మయుద్ధంగా భావించి కయ్యానికి కాలు దువ్వాడో, ఇప్పుడా యుద్ధాన్ని అధర్మయుద్ధం అనేస్తున్నాడు అర్జునుడు. అతని దృష్టిలో మార్పు వచ్చింది. ధర్మం అధర్మంగా కనపడుతోంది. అతను మోహంలో పడ్డాడు అని చెప్పటానికి ఇదొక నిదర్శనం.

అంతేకాదు, ఒక క్షత్రియుడు యుద్ధరంగానికి వెన్ను చూపకూడదు. అతను యుద్ధంనుంచి విరమించు కోవటమే కాక, సన్న్యాసం స్వీకరిస్తానన్నాడు. ఇది కూడా అధర్మమే. సమస్యనుంచి పారిపోయి సన్న్యాసం స్వీకరించటం ధర్మం కాదు. అర్జునునికి ఈ విషయం బాగా తెలుసు, అయినా సన్న్యాసం తీసుకుంటానన్నాడు. అంటే అధార్మిక సన్న్యాసాన్ని ధర్మంగా చూస్తున్నాడు; ధర్మయుద్ధాన్ని అధర్మంగా చూస్తున్నాడు. వీటినిబట్టి అతని మనస్సు భ్రాంతిలో పడిందని మనకు స్పష్టంగా తెలుస్తోంది. మనకే కాదు, తరువాత అర్జునునికే, తన మనస్సు భ్రాంతిలో పడిందని స్పష్టంగా తెలుస్తుంది.

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**

**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ – 2.7**

హే కృష్ణా, నేను పిరికితనానికి లోనై, ధర్మాధర్మవిచక్షణను కోల్పోయాను అన్నాడు. ఎక్కడ అయోమయంలో పడతారో, అక్కడ బంధం ఉన్నట్టే అర్థం. ఉదాహరణకు మీరు ఒక పెద్ద సంస్థ యజమాని. ఎవరో తప్పు చేశారని విన్నారు. వెంటనే వారిని శిక్షించటానికి నిర్ణయించుకున్నారు. కాని కాసేపటికల్లా, ఆ తప్పు చేసింది ఎవరో కాదు, మీ బావమరిదే అని తెలుస్తుంది. అప్పుడు మీరు ఆలోచనలో పడతారు. మీవారు కానంతసేపు ధర్మంగానే ప్రవర్తిస్తారు. స్వంతవారి దగ్గరికి వచ్చేసరికి ధర్మం పక్కకి తొలగిపోతుంది.

మోహం సరిగ్గా ఆలోచించనివ్వదు. ఆపరేషన్లు చేయటంలో ఆరితేరిన వైద్యుడు కూడా, అదే ఆపరేషన్‌ను స్వయంగా తన పుత్రునికి చేయాల్సి వస్తే బెదిరిపోతాడు. ఏకాగ్రత చూపలేడు. అదే విధంగా అర్జునుడు సాక్షాత్తూ తన పితామహుడు అయిన భీష్ముణ్ణి, తన గురుదేవులైన ద్రోణాచార్యుణ్ణి సంహరించటానికి వచ్చానని గ్రహించగానే బెంబేలెత్తిపోయాడు. వారిమీద అతనికున్న రాగం శోకంలోకి, ఆ తరువాత మోహం లోకి దిగింది. మోహంవల్ల నిస్సహాయుడయ్యాడు.

ఎప్పుడైతే తన నిస్సహాయస్థితిని తను గుర్తించాడో వెంటనే కృష్ణపరమాత్మను శరణు వేడాడు. దీన్నిబట్టి శిష్యుని అర్హత ఏమిటో తెలుస్తున్నది. శిష్యునికి తన సమస్య ఏమిటో తెలియాలి. సమస్య అర్థం కాకపోతే, పరిష్కారాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేడు.

గురువు అర్హత ఏమిటి? గురువుకు ఆ సమస్య ఉండకూడదు. అంతేకాదు, ఆ సమస్యకు పరిష్కారం కూడా తెలిసివుండాలి. ఆ విధంగా అర్జునునికి తను మోహంలో పడ్డాడని తెలుసు; కృష్ణపరమాత్మకు ఆ మోహం లేకపోగా, దాని పరిష్కారమైన మోక్షమార్గం కూడా తెలుసు. ఆ విధంగా అర్హతలున్న గురుశిష్యులు ఒకచోట చేరితే, ఆధ్యాత్మిక బోధ జరగటానికి పరిస్థితులు అనువుగా ఉన్నాయి. అసలు బోధ రెండవ అధ్యాయం 11వ శ్లోకంనుంచి మొదలవుతుందని చూశాము.

**1. సందర్భం శ్లోకాలు 1-19** మొదటి అధ్యాయం అర్జునుని సమస్యను వర్ణిస్తుంది, గురుశిష్యులను పరిచయం చేస్తుంది అని చూశాము. ఈ నేపథ్యంతో శ్లోకాలను చూద్దాము.

**ధృతరాష్ట్ర ఉవాచ**

శ్లో. 1 **ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥**
ధర్మక్షేత్రే, కురుక్షేత్రే, సమవేతాః, యుయుత్సవః,
మామకాః, పాండవాః, చ, ఏవ, కిమ్, అకుర్వత, సంజయ ॥

| | | | |
|---|---|---|---|
| సంజయ | = ఓ సంజయా | మామకాః | = నా వారు |
| ధర్మక్షేత్రే | = ధర్మక్షేత్రమైన | చ | = ఇంకా |
| కురుక్షేత్రే | = కురుక్షేత్రమందు | పాండవాః | = పాండుకుమారులు |
| సమవేతాః | = చేరినవారు | ఏవ | = కలిసి |
| యుయుత్సవః | = యుద్ధకాంక్షగలవారును (యుద్ధ సన్నద్ధులై ఉన్నవారును) అయిన | కిమ్ | = ఏమి |
| | | అకుర్వత | = చేశారు? |

**ధృతరాష్ట్ర ఉవాచ।**
**హే సంజయ! ధర్మక్షేత్రే, కురుక్షేత్రే, యుయుత్సవః**
**సమవేతాః మామకాః పాండవాః చ ఏవ కిమ్ అకుర్వత।।**

తా: ధృతరాష్ట్రుడు ఇట్లు ప్రశ్నించెను - ఓ సంజయా। ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునందు యుద్ధమును చేయగోరి ఒకచోట చేరిన నా పుత్రులు, పాండుపుత్రులు ఇంకా ఇతరులు ఏమి చేశారు?

ఈ శ్లోకంలో వ్యాసాచార్యులు యుద్ధసందర్భాన్ని వివరిస్తున్నారు. రెండు సైన్యాలు యుద్ధరంగంలో నిలిచాయి. దుర్యోధనుని సైన్యం ఎక్కువ సంఖ్యలో ఉండటమే కాక శక్తివంతమైనది కూడా. అందులో అనేక అతిరథ, మహారథులు ఉన్నారు. పాండవుల సైన్యం బలంలోనూ, సంఖ్యలోనూ తక్కువే. కాని వారి బలం **కైవర్తకః కేశవః**. వారిని రణనదినుంచి ఖచ్చితంగా దాటించగల గొప్ప నైపుణ్యం ఉన్న కేశవుడు వారివైపు ఉన్నాడు.

**ధృతరాష్ట్ర ఉవాచ** - ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. ఎవరిని? సంజయుడిని. ధృతరాష్ట్రుడు కౌరవుల తండ్రి అని, అతను గుడ్డివాడనీ మనకు తెలుసు. అతని గుడ్డితనం అతని అవివేకానికి చిహ్నం. కౌరవులు అధర్మంగా

ప్రవర్తిస్తున్నారని తెలిసి కూడా, వారిమీద ఉన్న రాగం కొద్దీ, వారి అరాచకాలను అరికట్టే ప్రయత్నం చెయ్యలేదు. అతనికి ధర్మాధర్మాలు స్వయంగా తెలియకపోయినా, వాటిని విడమరచి చెప్పే విదురుడు మంత్రిగా ఉన్నాడు. అందువల్ల అన్నీ తెలిసి మరీ ధర్మాన్ని అతిక్రమించాడు. అతని ఆంతర అంధత్వం బాహ్యంగా సూచించబడింది.

అతను గుడ్డివాడైనా, వ్యాసాచార్యుని కృపవల్ల యుద్ధరంగంలో జరుగుతున్న విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోగలుగుతాడు. సంజయునికి శ్రీకృష్ణపరమాత్మ ప్రత్యేక చూపును ఇచ్చాడు. దాన్ని దివ్యదర్శనం అంటారు. సంజయునికి యుద్ధభూమిలో జరిగే విషయాలు ఈ దివ్యదర్శనమువల్ల కనబడతాయి. అందువల్ల ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు.

**సంజయ కిమ్ అకుర్వత** – హే సంజయా, వీరిరువురు ఏం చేస్తున్నారు? ఏ ఇరువురు?

**మామకాః పాండవాశ్చైవ** – నా కుమారులు, పాండుపుత్రులు. కౌరవులు, పాండవులు మాత్రమే కాదు, అనేక దేశాలకు చెందిన అనేక రాజులు కూడా ఇరుపక్షాలలోనూ చేరారు. వారంతా ఎక్కడ ఉన్నారు?

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే** – కురుక్షేత్రంలో యుద్ధసన్నద్ధులై ఉన్నారు. కురుక్షేత్రం ధర్మక్షేత్రం. ధర్మానికి నెలవు.

**సమవేతా** – ఆ ధర్మక్షేత్రంలో వారంతా ఉన్నారు. ఎందుకు?

**యుయుత్సవః** – యుద్ధం చేయటానికి చేరారు. ఆ సమయంలో ఏం జరిగింది? సంజయుడు ఇరుపక్షాల సైన్యాలను వివరిస్తున్నాడు.

**ఇరుపక్షాల సైన్యాల వర్ణన** –

**సంజయ ఉవాచ**

శ్లో. 2 **దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।**
**ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥**
దృష్ట్వా, తు, పాండవానీకమ్, వ్యూఢమ్, దుర్యోధనః, తదా,
ఆచార్యమ్, ఉపసంగమ్య, రాజా, వచనమ్, అబ్రవీత్ ॥

| | | | |
|---|---|---|---|
| తదా | = అప్పుడు | తు | = మరల |
| రాజా | = రాజైన | ఆచార్యమ్ | = ద్రోణాచార్యుని సమీపమునకు |
| దుర్యోధనః | = దుర్యోధనుడు | ఉపసంగమ్య | = చేరి |
| వ్యూఢమ్ | = వ్యూహరచనతో ఉన్న | వచనమ్ | = ఈ మాటను |
| పాండవానీకమ్ | = పాండవసేనను | అబ్రవీత్ | = పలికెను |
| దృష్ట్వా | = చూచి | | |

**సంజయ ఉవాచ।**
**తదా తు పాండవానీకం వ్యూఢం దృష్ట్వా, రాజా దుర్యోధనః**
**ఆచార్యమ్ ఉపసంగమ్య (ఇదం) వచనమ్ అబ్రవీత్॥**

తా: సంజయుడిట్లు పలికెను – అప్పుడు మహారాజైన దుర్యోధనుడు వ్యూహరచనతో కూడియున్న పాండవుల సేననుచూచి ద్రోణాచార్యుని వద్దకు వెళ్లి ఈ మాటను పలికెను.

**సంజయ ఉవాచ** – సంజయుడు చెప్పాడు.

**రాజా దుర్యోధనః పాండవానీకం దృష్ట్వా** – రాజైన దుర్యోధనుడు పాండవ సైన్యాన్ని చూశాడు, అది ఎలా ఉంది?

**వ్యూఢమ్** – యుద్ధశాస్త్రానికి అనువుగా వ్యూహరచనతో యుద్ధానికి సిద్ధంగా ఉంది. యుద్ధశాస్త్రంలో సైనికులను ఒక ప్రత్యేక పద్ధతిలో నిలబెడతారు. వాటిని పద్మవ్యూహం, చక్రవ్యూహం, గరుడవ్యూహం అనే పేర్లతో వ్యవహరిస్తారు. అలాంటి వ్యూహరచనలను పరిశీలించాక,

**ఆచార్యముపసంగమ్య** – దుర్యోధనుడు తన ఆచార్యుణ్ణి సమీపించాడు. అతని ఆచార్యుడు యుద్ధశాస్త్రంలో గురువు. అతను ద్రోణాచార్యుడు.

**వచనమ్ అబ్రవీత్** – ఈ విధంగా మాట్లాడాడు.

శ్లో. 3 **పశ్యైతాం పాండుపుత్రాణామ్ ఆచార్య మహతీం చమూమ్ ।**
**వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥**
పశ్య, ఏతామ్, పాండుపుత్రాణామ్, ఆచార్య, మహతీమ్, చమూమ్,
వ్యూఢామ్, ద్రుపదపుత్రేణ, తవ, శిష్యేణ, ధీమతా ॥

| | | | |
|---|---|---|---|
| ఆచార్య | = ఓ గురువర్యా! | పాండుపుత్రాణామ్ | = పాండవులయొక్క |
| తవ | = మీయొక్క | ఏతామ్ | = ఈ |
| ధీమతా | = తెలివైన వాడు | మహతీమ్ | = గొప్పదియైన |
| శిష్యేణ | = శిష్యుడును అగు | చమూమ్ | = సైన్యమును |
| ద్రుపదపుత్రేణ | = ద్రుపదపుత్రుని (ధృష్టద్యుమ్నుని)చేత | పశ్య | = చూడండి |
| వ్యూఢామ్ | = వ్యూహాకృతిలో నిలుపబడిన | | |

**హే ఆచార్య! తవ ధీమతా శిష్యేణ, ద్రుపద–పుత్రేణ వ్యూఢాం**
**పాండుపుత్రాణామ్ ఏతాం మహతీం చమూం పశ్య॥**

తా: ఓ ఆచార్యా! పాండవుల ఈ గొప్పదియైన సైన్యమును చూడండి. ద్రుపదుని పుత్రుడగు ధృష్టద్యుమ్నుడు దీని వ్యూహమును రచించినాడు. అతడు తెలివైన మీ శిష్యుడే.

ఈ శ్లోకం ముందు దుర్యోధన ఉవాచ కలుపుకోవాలి. అది ప్రత్యేకించి చెప్పలేదు కాని, మనకు అర్థమవుతుంది. పాండవుల సైన్యాన్ని పర్యవేక్షించాక, మూడు శ్లోకాల్లో పాండవుల వైపు ఉన్న ముఖ్యమైన యోధుల పేర్లు చెబుతున్నాడు ద్రోణాచార్యునితో.

**పాండుపుత్రాణామ్ ఆచార్య మహతీం చమూమ్ పశ్యైతాం** – ఓ ఆచార్యా! పాండవుల ఈ మహాసైన్యాన్ని చూడండి. వారి నాయకుడు ఎవరు?

**ద్రుపదపుత్రేణ వ్యూఢాం** – ద్రుపదరాజు కొడుకు ధృష్టద్యుమ్నుడు చేసిన వ్యూహరచన అది. అంతేకాదు, అతను ఎవరు?

**తవ శిష్యేణ** – అతను ఎవరో కాదు మీ శిష్యుడు కూడా! అంతేకాదు,

**ధీమతా** – తెలివైనవాడు. ఆచార్యుడని కూడా చూడకుండా దుర్యోధనుడు ద్రోణాచార్యుణ్ణి విమర్శిస్తున్నాడు. అతని మాటల గూఢార్థం "చూడండి మీరు తెలివితక్కువగా విలువిద్య ఎవరికి నేర్పారో. ద్రుపదరాజు పుత్రునికి, పాండురాజు పుత్రులకు నేర్పారు. ఇవాళ వారంతా మిమ్మల్ని చంపటానికి మీ ఎదురుగా నిలుచున్నారు.'

ద్రుపదరాజుకు, ద్రోణాచార్యునికి ఒకసారి గొడవ అయింది. ద్రుపదునికి ద్రోణాచార్యుణ్ణి చంపే శక్తిలేదు. అందువల్ల ద్రుపదరాజు ద్రోణాచార్యుణ్ణి చంపగలిగే శక్తివంతమైన పుత్రుడు పుట్టాలని ఒక యజ్ఞం చేశాడు. ఇటువంటి యజ్ఞాలను తామసపూజగా కృష్ణపరమాత్మ ముందు ముందు అభివర్ణిస్తాడు. తామసపూజ ఎదుటి వారిని నాశనం చేసేందుకు చేసే పూజ. రాజసపూజ పూర్తిగా స్వార్థపూరితమైన పూజ. సాత్త్విక పూజ ప్రపంచ శ్రేయస్సుకోసం చేసే పూజ. ద్రుపదుడు అలా తామసపూజను చేస్తే, అగ్నికుండంనుంచి ధృష్టద్యుమ్నుడు ఉద్భవించాడు. ఎందుకు? ద్రోణాచార్యుణ్ణి చంపటానికి.

కాని తమాషా ఏమిటంటే, విలువిద్య నేర్చుకోవటానికి ధృష్టద్యుమ్నుడు ఆ ద్రోణాచార్యుని దగ్గరికే వెళ్ళాడు. అతను తన దగ్గర విద్య నేర్చుకునేది, ఆ శక్తితో తనను చంపటానికే అని తెలిసి కూడా, ద్రోణాచార్యుడు అతనికి విలువిద్య నేర్పాడు. ఎందుకంటే ధర్మశాస్త్రం అలా ఉంది. అర్హత ఉన్న శిష్యుడు వచ్చి విద్య నేర్పమని గురువును కోరితే, గురువుకు ఆ విద్య తెలిస్తే నేను నేర్పను అనకూడదు. పిల్లలు తమను వృద్ధాప్యంలో చూస్తారో లేదో అనే శంక లేకుండా తల్లిదండ్రులు ఎలా పిల్లలను పెంచి పెద్ద చేస్తారో, అలా శిష్యులు తమను ప్రేమగా చూస్తారో లేదో అని చూడకుండా గురువు విద్య నేర్పాలి. కాని ఈ ధర్మసూక్ష్మం తెలియని దుర్యోధనుడు గురువని కూడా చూడకుండా ఆయనను హేళన చేస్తున్నాడు. మీ శిష్యుడు, కాని తెలివిగా శత్రుసైన్యంలో చేరాడు అంటున్నాడు.

శ్లో. 4 **అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।**
**యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥**
అత్ర, శూరాః, మహేష్వాసాః, భీమార్జునసమాః, యుధి,
యుయుధానః, విరాటః, చ, ద్రుపదః, చ, మహారథః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అత్ర | = | ఈ సేనయందు | శూరాః | = | శూరులును అగు |
| మహేష్వాసాః | = | గొప్ప ధనుస్సులుగలవారును | యుయుధానః, చ | = | సాత్యకియును |
| చ | = | ఇంకా | విరాటః, చ | = | విరాటుడును |
| యుధి | = | యుద్ధమందు | మహారథః | = | మహారథుడగు |
| భీమార్జునసమాః | = | భీమార్జునులతో సమానమైన | ద్రుపదః | = | ద్రుపదుడును |

**అత్ర భీమార్జునసమాః యుధి శూరా మహేష్వాసాః, మహారథః**
**యుయుధానః, విరాటః చ ద్రుపదః చ (సన్తి)॥**

తా: ఈ సేనయందు గొప్ప ధనుస్సులుగలవారును ఇంకా యుద్ధమందు భీమార్జునులతో సమానమైన శూరులును అగు సాత్యకియును, విరాటుడును, మహారథుడగు ద్రుపదుడును,

దుర్యోధనుడు పాండవులవైపున్న గొప్ప యోధుల పేర్లు చెబుతున్నాడు.

**అత్ర శూరా మహేష్వాసా మహారథః** – అక్కడ శూరులు ఉన్నారు. అంటే మన సైన్యం అంటే భయపడని వీరాధివీరులు ఉన్నారు. మహేష్వాస – ఈష్వాస అంటే ధనుస్సు, మహేష్వాసా అంటే గొప్ప ధనుస్సు కలవారు. ఆ ధనుస్సులను దేవతలనుంచి కూడా పొందారు. వారు మహారథులు.

యుద్ధభూమిలో వారి శక్తి సామర్థ్యాలనుబట్టి వారికి బిరుదులు వస్తాయి. అర్ధరథః, రథః, మహారథః, అతిరథః అంటారు.

**ఏకోదశ సహస్రానా నాం యోద్ధయే యస్తు ధన్వినామ్**
**శస్త్ర శాస్త్ర ప్రవిణాశ్చ మహారథః ఇతి స్మృటః**

మహారథి అని ఎవరిని అనగలము? ఎవరైతే 10,000 సైనికులతో ఒంటరిగా, ఏకకాలంలో యుద్ధం చేయగలడో, అతనిని మహారథి అంటారు. ఏకకాలంలో ఒంటరిగా 10,000 సైనికులతో యుద్ధం చేయగలడంటే అతను ఎంత పరాక్రమవంతుడో ఊహించుకోండి.

**అమితం యోధయే యస్తు సంప్రోక్తే అతిరథిః సః**

10,000 సైనికులకన్నా ఎక్కువ మంది సైనికులతో ఏకకాలంలో, ఒంటరిగా యుద్ధం చేయగలిగిన పరాక్రమవంతుణ్ణి అతిరథి అంటారు. పాండవుల సైన్యంలో ఎందరో మహారథులు ఉన్నారని చెబుతున్నాడు దుర్యోధనుడు. అంతేకాదు,

**భీమార్జునసమాః యుధి** – దాదాపు అందరూ వారి శౌర్యంలో భీమార్జునులకు సమానులు. కొంతమంది పేర్లను పేర్కొంటున్నాడు.

**యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ** – యుయుధానుడు సాత్యకికి ఇంకో పేరు; విరాటుడు అంటే విరాటరాజు, ద్రుపదుడు అంటే ద్రౌపదికి తండ్రి, వీరంతా మహారథులు.

శ్లో. 5 **ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్ ।**
**పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥**
ధృష్టకేతుః, చేకితానః, కాశిరాజః, చ, వీర్యవాన్,
పురుజిత్, కుంతిభోజః, చ, శైబ్యః, చ, నరపుంగవః ॥

| | | | |
|---|---|---|---|
| ధృష్టకేతుః, చ | = ధృష్టకేతుడును | పురుజిత్ | = పురుజిత్తు |
| చేకితానః, చ | = చేకితానుడును | కుంతిభోజః, చ | = కుంతిభోజుడును |
| వీర్యవాన్ | = పరాక్రమవంతుడైన | నరపుంగవః | = నరులలో శ్రేష్ఠుడైన |
| కాశిరాజః | = కాశీరాజు | శైబ్యః | = శైబ్యుడును (ఉన్నారు) |

**ధృష్టకేతుః చ, చేకితానః చ, వీర్యవాన్ కాశిరాజః చ,**
**పురుజిత్ చ, కుంతిభోజః చ, నరపుంగవః శైబ్యః చ (సన్తి) ॥**

తా: ధృష్టకేతుడును, చేకితానుడును, పరాక్రమవంతుడైన కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడును, నరులలో శ్రేష్ఠుడైన శైబ్యుడును (ఉన్నారు).

ఇంకా కొందరు యోధులను పేర్కొంటున్నాడు. వారు –

**ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్** – ధృష్టకేతువు, చేకితానుడు, వీరుడైన కాశీరాజు. వీర్యవాన్ కాశీరాజుకి వాడిన విశేషణము.

**పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః** – పురుజిత్తు, కుంతిభోజుడు, నరులలో శ్రేష్ఠుడైన శైబ్యుడు. నరపుంగవః శైబ్యునికి వాడిన విశేషణము. కుంతిభోజుడు అంటే కుంతీదేవి తండ్రి.

పేర్లు చెబుతున్న కొద్దీ దుర్యోధనుడిలో భయం పెరుగుతున్నది.

శ్లో. 6 **యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।**
**సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥**
యుధామన్యుః, చ, విక్రాంతః, ఉత్తమౌజాః, చ, వీర్యవాన్,
సౌభద్రః, ద్రౌపదేయాః, చ, సర్వే, ఏవ, మహారథాః ॥

| | | | |
|---|---|---|---|
| విక్రాంతః | = పరాక్రమవంతుడైన | సౌభద్రః, చ | = సుభద్ర కుమారుడైన అభిమన్యుడును |
| యుధామన్యుః, చ | = యుధామన్యుడును | ద్రౌపదేయాః | = ద్రౌపది కుమారులు ఐదుగురును |
| వీర్యవాన్ | = వీరుడైన | సర్వే, ఏవ | = అందరును |
| ఉత్తమౌజాః | = ఉత్తమౌజుడును | మహారథాః | = మహారథులు (కలరు) |

**విక్రాంతః యుధామన్యుః చ, వీర్యవాన్ ఉత్తమౌజః చ,**
**సౌభద్రః ద్రౌపదేయః చ, సర్వ మహారథాః ఏవ (సన్తి) ॥**

తా: పరాక్రమవంతుడైన యుధామన్యుడు, బలశాలియగు ఉత్తమౌజుడు, సుభద్రాపుత్రుడగు అభిమన్యుడు, ద్రౌపదియొక్క పుత్రులగు ఉప పాండవులు కూడా ఉన్నారు. వీరందరూ గొప్ప ధనుర్ధారులు, మహారథులు. వీరు యుద్ధములో భీమునితో, అర్జుననితో సమానమైనవారు.

**యుధామన్యుశ్చ విక్రాంత** – పరాక్రమవంతుడైన యుధామన్యుడు;

**ఉత్తమౌజాశ్చ వీర్యవాన్** – వీరుడైన ఉత్తమౌజుడు;

**సౌభద్రో ద్రౌపదేయాశ్చ** – సౌభద్రుడు అంటే సుభద్ర పుత్రుడైన అభిమన్యుడు, ద్రౌపదేయాశ్చ అంటే ద్రౌపది యొక్క ఐదుగురు పుత్రులూ ఉన్నారు. వారిని ఉపపాండవులు అంటారు. వీరంతా ఎలాంటివారు?

**సర్వ ఏవ మహారథాః** – వీరంతా మహారథులు.

శ్లో. 7 **అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।**
**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥**
అస్మాకమ్, తు, విశిష్టాః, యే, తాన్, నిబోధ, ద్విజోత్తమ,
నాయకాః, మమ, సైన్యస్య, సంజ్ఞార్థమ్, తాన్, బ్రవీమి, తే ॥

| | | | |
|---|---|---|---|
| ద్విజోత్తమ | = ఓ బ్రాహ్మణోత్తమా | సంజ్ఞార్థమ్ | = తెలియుటకోసం |
| అస్మాకమ్, తు | = మనపక్షము వారైతే | (యే) | = ఎవరయితే |
| యే | = ఎవరు | మమ | = నా (యొక్క) |
| విశిష్టాః (సంతి) | = ప్రముఖులై ఉన్నారో | సైన్యస్య | = సేనకు |
| తాన్ | = వారిని | నాయకాః | = నాయకులైయున్నారో |
| నిబోధ | = తెలిసికొనుము | తాన్ | = వారిని గూర్చి |
| తే | = మీకు | బ్రవీమి | = తెలిపెదను |

**హే ద్విజోత్తమ! అస్మాకం తు యే విశిష్టాః, మమ సైన్యస్య**
**నాయకాః తాన్ నిబోధ, తాన్ సంజ్ఞార్థం తే బ్రవీమి॥**

తా: ఓ బ్రాహ్మణోత్తమా! మనకు చెందిన ప్రముఖులు ఎవరైతే గలరో వారిని గురించి తమరికి తెలియుటకోసం చెప్పెదను. నా సైన్యముయొక్క నాయకులను గురించి తమరు తెలుసుకొనుడు.

పాండవుల సైన్యాన్ని వర్ణించాక, ఇప్పుడు తనవైపు ఉన్న యోధులను వర్ణించబోతున్నాడు. అంటే ఇరుపక్షాల బలాబలాలను బేరీజు వేస్తున్నాడు. క్రికెట్‌లాంటి ఆటలో కూడా ఆట ఆడే ముందు వారితో ఆడే జట్టు బలాబలాలను ఇరువైపుల వారు బేరీజు వేసుకుంటారు. ఎవరు బ్యాటింగ్ బాగా చేస్తారో, ఎవరు బౌలింగ్ బాగా చేస్తారో తెలుసుకుంటారు.

**ద్విజోత్తమ** – ద్రోణాచార్యుడు బ్రాహ్మణుడు. నిజానికి వర్ణాశ్రమధర్మం ప్రకారం చూస్తే బ్రాహ్మణుడు క్షత్రియ ధర్మాన్ని పాటించకూడదు, వైశ్యధర్మాన్ని కూడా పాటించకూడదు. అంటే అతను యుద్ధమూ చేయకూడదు, వ్యాపారమూ చేయకూడదు. ఈ ధర్మం అప్పటి కాలమాన పరిస్థితులకు చెందినది. అప్పటి రోజుల్లో బ్రాహ్మణుడికి ఆరు ధర్మాలు ఉన్నాయి.

**యజనం యాజనం పఠనం పాఠనం దానం ప్రతిగ్రహః సత్కర్మాణి బ్రాహ్మణ కర్మాణి**

**యజనం యాజనమ్** – యజనమ్ అంటే యజ్ఞయాగాదులు చేయటం; యాజనమ్ అంటే క్షత్రియులు, వైశ్యులచేత యజ్ఞయాగాదులు చేయించటం.

**పఠనం పాఠనమ్** – పఠనమ్ అంటే తను శాస్త్రాన్ని నేర్చుకోవటం; పాఠనమ్ అంటే తక్కినవారికి పాఠాన్ని నేర్పించటం. తక్కినవారికి అంటే తక్కిన వర్ణాల వారికి.

**దానం ప్రతిగ్రహః** – దానం అంటే తను ఇంకొకరికి దానం చెయ్యవచ్చు; ప్రతిగ్రహః అంటే తను ఇంకొకరినుంచి దానం స్వీకరించవచ్చు.

కాని క్షత్రియుని విషయానికి వచ్చేసరికి అతనికి మూడే ధర్మాలుంటాయి. యజనం, పఠనం, దానం. అంటే అతను యజ్ఞాలు చేయగలడు కాని ఇంకొకరిచేత చేయించకూడదు; తను శాస్త్రాన్ని అధ్యయనం చేయవచ్చు కాని ఇంకొకరికి బోధించకూడదు; తను దానం ఇవ్వవచ్చు కాని ఇంకొకరినుంచి స్వీకరించకూడదు.

ద్రోణాచార్యుడు ఈ వర్ణాశ్రమధర్మాన్ని ఉల్లంఘించాడు. అందువల్ల మహాభారత యుద్ధంలోనే సందర్భం వచ్చినప్పుడు భీముడు ద్రోణాచార్యుణ్ణి తీవ్రంగా ఆక్షేపిస్తాడు. బ్రాహ్మణుడికి విలువిద్య నేర్చుకునే హక్కు, నేర్పించే హక్కు ఉంది కాని, క్షత్రియుడిలా యుద్ధం చేసే హక్కు లేదు. అలాంటప్పుడు అతను యుద్ధరంగంలోకి ఎలా దిగాడని నిలదీస్తాడు. దానికి ద్రోణాచార్యుని వద్ద జవాబు లేదు. ఆ ద్రోణాచార్యునితో చెబుతున్నాడు దుర్యోధనుడు.

**తాన్ నిబోధ** – మన పక్షాన ఉన్న యోధులను కూడా చూడండి!

**అస్మాకం తు విశిష్టాః** – మన యోధులలో శ్రేష్ఠులను గురించి;

**నాయకా మమసైన్యస్య** – మన సేనానాయకుల గురించి చెబుతున్నాను. ఎందుకు?

**తాన్ సంజ్ఞార్థం తే బ్రవీమి** – మీ ఎరుకకోసం ఈ సమాచారం చెబుతున్నాను. మీకు తెలియదని కాదు; కాని బలాబలాలను బేరీజు వెయ్యటానికి చెబుతున్నాను అని అర్థం. ఆ తర్వాత వచ్చే శ్లోకాల్లో వారి పేర్లను చెబుతున్నాడు.

శ్లో. 8 **భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।**
**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ ॥**

భవాన్, భీష్మః, చ, కర్ణః, చ, కృపః చ, సమితింజయః,
అశ్వత్థామా, వికర్ణః, చ, సౌమదత్తిః, తథా, ఏవ, చ

| | | | | | |
|---|---|---|---|---|---|
| భవాన్, చ | = | పూజ్యులైన మీరును | తథా, ఏవ | = | అట్లే |
| భీష్మః, చ | = | భీష్మ పితామహుడును | అశ్వత్థామా | = | అశ్వత్థామయు |
| కర్ణః, చ | = | కర్ణుడును | వికర్ణ, చ | = | వికర్ణుడును |
| సమితింజయః | = | యుద్ధమందు విజయుడగు | సౌమదత్తిః | = | సోమదత్తుని కుమారుడగు భూరిశ్రవుడును |
| కృపః చ | = | కృపాచార్యుడును | | | |

**భవాన్, భీష్మః చ, కర్ణః చ, సమితింజయః, కృపః చ,**
**అశ్వత్థామా, వికర్ణః చ, తథా ఏవ సౌమదత్తిః ॥**

తా: తమరు, భీష్ముడు, కర్ణుడు, యుద్ధమందు విజయుడగు కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, ఇంకా సోమదత్తుని కుమారుడగు భూరిశ్రవసుడు (మన సేనలో ఉన్నారు).

**భవాన్** – మీరు. అందరికన్నా పైన గురువు పేరు చెబుతున్నాడు. తనకే కాదు ఆయన అందరికీ గురువే.

**భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః** – భీష్మాచార్యులు, కర్ణుడు, కృపాచార్యుడు. సమితింజయుడు ఇంకొక పేరు కాదు; ఇది కృపాచార్యుడికి విశేషణము. సమితింజయుడు అంటే సంగ్రామ విజయుడు. అంటే యుద్ధభూమిలో ఎన్నడూ ఓటమి ఎరుగనివాడు. సమితిః అంటే యుద్ధం. జయః అంటే విజయం. యుద్ధభూమిలో ఎప్పుడూ విజయాన్ని చవిచూసినవాడు.

**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ** – అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కుమారుడైన భూరిశ్రవుడు ఇటువైపు ముఖ్యులు. అంతేకాదు, ఇంకా ఉన్నారు అంటున్నాడు.

శ్లో. 9 **అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః ।**
**నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥**
అన్యే, చ, బహవః, శూరాః, మదర్థే, త్యక్తజీవితాః,
నానాశస్త్రప్రహరణాః, సర్వే, యుద్ధవిశారదాః

| | | | | | |
|---|---|---|---|---|---|
| అన్యే, చ | = | ఇతరులు | నానాశస్త్ర ప్రహరణాః | = | వివిధములగు శస్త్రాస్త్రములను గలిగియున్నవారును |
| మదర్థే | = | నాకోసం | సర్వే | = | అందరును |
| త్యక్తజీవితాః | = | ప్రాణములను విడుచుటకు సిద్ధముగా ఉన్నవారు | యుద్ధవిశారదాః | = | యుద్ధమందు నిపుణులై |
| బహవః | = | పెక్కుమంది | (సన్తి) | = | ఉన్నారు |
| శూరాః | = | శూరులు | | | |

**అన్యే చ బహవః శూరాః, సర్వే మదర్థే త్యక్త జీవితాః,**
**నానాశస్త్రప్రహరణాః యుద్ధవిశారదాః (సన్తి)॥**

తా: వీరే గాక ఇతర శూరులు చాలామంది నా ప్రయోజనము నిమిత్తముగా ప్రాణములను విడిచిపెట్టుటకు సిద్ధముగా ఉన్నవారు ఉన్నారు. అనేకములైన శస్త్రములు, అస్త్రములుగల వారందరు యుద్ధములో నిపుణులే.

ముందు చెప్పిన వారు మాత్రమే కాదు ఇంకా ఉన్నారు మనవైపు.

**అన్యే చ బహవః శూరాః** – ఇంకా ఎందరో శూరులు ఉన్నారు. ఎవరు వారు?

**మదర్థే త్యక్తజీవితాః** – నాకోసం వారి ప్రాణాలనొడ్డియైనా యుద్ధం చేయటానికి సిద్ధంగా ఉన్నారు.

వారికి కౌరవ పాండవుల గొడవతో సంబంధం లేదు. అయినా దుర్యోధనునిమీద గౌరవం, అభిమానం కొద్దీ, ప్రాణాలకు సైతం తెగించి వచ్చారు. ప్రపంచయుద్ధాలు జరిగింది రెండు దేశాల మధ్యే అయినా, ప్రపంచంలోని దేశాలన్నీ ఏదో ఒక పక్షం వహించటంవల్ల అవి ప్రపంచయుద్ధాలు అయ్యాయి. ఇందులో కూడా అలా అనేక రాజ్యాల రాజులు పాల్గొన్నారు. వారు మామూలు మనుష్యులు కారు.

**నానాశస్త్రప్రహరణాః** – వారి దగ్గర అనేక రకాల శస్త్రాలు, అస్త్రాలు ఉన్నాయి. ప్రహరణాలు అంటే అస్త్రాలు. శస్త్రాలకూ, అస్త్రాలకూ చిన్న బేధం ఉంది. శస్త్రం అంటే చేతిలో పట్టుకొని యుద్ధం చేసేది. ఉదాహరణకు కత్తి. అస్త్రం అంటే బాణంగా విడుదల చేస్తారు. అనేక దేవతల పేర్లను జపించి విడుదల చేస్తారు. వీటిని క్షిపణులతో పోల్చవచ్చు. క్షిపణులను వైజ్ఞానిక శాస్త్రపరంగా వదిలితే, ఈ అస్త్రాలు మంత్రశాస్త్రపరంగా వదులుతారు. మనకు అగ్నిక్షిపణి ఉంది.

పూర్వం యోధులు అగ్ని అస్త్రం ఉపయోగించేవారు. దానికి వైజ్ఞానిక శాస్త్రంతో సంబంధం లేదు, అగ్నిదేవతకు ప్రార్థన చేసి, అగ్నిదేవతను ఆవాహన చేసేవారు ఆ అస్త్రంమీద. అలా ఒకరు ఆగ్నేయాస్త్రం వదిలితే, ఇంకొకరు వరుణాస్త్రం వదిలేవారు. అలా ఒకరు నాగాస్త్రం వదిలితే, ఇంకొకరు గరుడాస్త్రం వదిలేవారు. అలా వారి దగ్గర, వారి బలాబలాలను చూపుకునే అస్త్రాలు ఉండేవి. రామాయణంలో శ్రీరాముడు ఒక గడ్డిపోచను తీసుకుని, దాని మీదకు బ్రహ్మదేవుణ్ణి ఆవాహన చేసి, దాన్ని వదిలాడు. అది బ్రహ్మాస్త్రం అయింది.

**సర్వే యుద్ధవిశారదాః** – వీరి దగ్గర అస్త్రశస్త్రాలు ఉండటమే కాదు, వీరంతా యుద్ధవిశారదులు.

శ్లో. 10 **అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**
**పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥**
అపర్యాప్తమ్, తత్, అస్మాకమ్, బలమ్, భీష్మాభిరక్షితమ్,
పర్యాప్తమ్, తు, ఇదమ్, ఏతేషామ్, బలమ్, భీమాభిరక్షితమ్ ॥

| | | | |
|---|---|---|---|
| భీష్మాభిరక్షితామ్ | = భీష్మపితామహునిచే రక్షితమైన | ఏతేషామ్ | = వీరియొక్క |
| అస్మాకమ్ | = మనయొక్క | ఇదమ్, బలమ్ | = ఈ సైన్యము |
| తత్, బలమ్ | = ఆ సేన | పర్యాప్తమ్ | = జయము సాధించుటకు సరిపోయేలా ఉంది |
| న+పర్యాప్తమ్ | = వారికి సరిపోదు (సరి తూగదు) | | |
| తు, భీమాభిరక్షితమ్ | = అయితే భీమునిచే రక్షింపబడిన | | |

**అస్మాకం భీష్మాభిరక్షితం తద్ బలమ్ అపర్యాప్తం,**
**ఏతేషాం తు భీమాభిరక్షితమ్ ఇదం బలం పర్యాప్తం (అస్తి) ॥**

తా: అందువల్ల భీష్మునిచే పరిరక్షించబడే మన సేన వారికి సరిపోదు (సరి తూగదు). కానైతే, భీమునిచే రక్షించబడే వీరి ఈ సైన్యము జయము సాధించుటకు సరిపోయేలా ఉంది.

ఇరుపక్షాల యోధుల గురించీ చెప్పాక, దుర్యోధనుడు వారి బలాబలాలను బేరీజు వేస్తున్నాడు. దుర్యోధనుని ఉద్దేశ్యంలో కౌరవసైన్యంకన్నా పాండవసైన్యం గొప్పది. దీన్నిబట్టి అతను చాలా భయపడుతున్నట్టు అర్థమవుతున్నది. ద్రోణాచార్యునితో ఇలా అంటున్నాడు –

**అస్మాకం బలం అపర్యాప్తం** – ఈ సందర్భంలో అపర్యాప్తం అంటే బలహీనం. మన సైన్యం బలహీనంగా ఉంది. శత్రువుని ఎదుర్కొనే బలం లేదు.

**భీష్మాభిరక్షితమ్** – భీష్మ పితామహుడే మన సైన్యాన్ని రక్షిస్తున్నా కూడా మన శక్తి చాలదు. భీష్ముడు గొప్ప యోధుడు, అయినా అతనికి భయం పట్టుకుంది.

**ఏతేషాం బలం పర్యాప్తం** – ఏతేషాం అంటే పాండవుల బలం. బలం అంటే ఇక్కడ సైన్యం. పాండవుల సైన్యం పర్యాప్తంగా ఉంది అంటున్నాడు. ఈ సందర్భంలో పర్యాప్తం అంటే శక్తివంతమైనది. సరైనది.

**భీమాభిరక్షితమ్** – అది కేవలం భీమునిచేత రక్షింపబడుతున్నా కూడా, భీష్ముని ముందు భీముడు తక్కువే. అయినా వారి బలమే ఎక్కువగా అనిపిస్తోంది.

దీన్నిబట్టి మానసిక స్థైర్యం గురించి ఒక ముఖ్యమైన విషయాన్ని గ్రహించవచ్చు. ఇరుపక్షాలలో ఎటువైపూ మొగ్గు చూపకుండా, బాహ్యంగా నిలుచుని చూస్తే, కౌరవుల సైన్యమే అత్యంత శక్తివంతమైనదని తేలిగ్గా చెప్పవచ్చు. కౌరవుల సైన్యం 11 అక్షౌహిణులు ఉంటే, పాండవుల సైన్యం 7 అక్షౌహిణులు మాత్రమే ఉంది. ఒక సైన్యంలో ఉన్న రథగజతురగపదాదులనుబట్టి ఒక అక్షౌహిణిగా వ్యవహరిస్తారు. అంటే వరుసగా రథాలు, ఏనుగులు, గుర్రాలు, సైనికులు. వీరి సంఖ్యల వివరాలు మహాభారతంలో వస్తాయి.

సైన్యం పరంగా చూస్తే కౌరవుల సైన్యం ఎక్కువ. అంతేకాదు, బలపరీక్షలో కూడా కౌరవులదే అగ్రస్థానం ఉంటుంది. అటువైపు ఒక్క భీష్మాచార్యుడే చాలు; ఒక్క ద్రోణాచార్యుడే చాలు. ద్రోణాచార్యుడు పాండవులకు గురువు. గురువుకు శిష్యుల బలహీనతలు తెలుసు. శిష్యుల బలహీనత చూసి కొట్టడం తేలిక గురువుకు.

అంతేకాక ఇంకా అనేక యోధులున్నారు – కర్ణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ. అయినా ఎందుకు దుర్యోధనుడు భయపడుతున్నాడు?

తనవైపు ధర్మం లేదు కాబట్టి; తనకు భక్తి లేదు కాబట్టి. ఈ రెండూ లేనిచోట ఆత్మస్థైర్యం కొరవడుతుంది. దుర్యోధనుడు నిరంతరం ధర్మాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాడు. ధర్మాన్ని ఉల్లంఘిస్తే ప్రాపంచిక సుఖాలు పొందవచ్చేమో కాని, ఆత్మస్థైర్యం కొరవడుతుంది. అదికాక అతనికి ఈశ్వర అనుగ్రహం విలువ తెలియదు.

మనకు తెలిసిన విషయమే – కృష్ణపరమాత్మ సహాయం కోరటానికి దుర్యోధనుడు, అర్జునుడు – ఇద్దరూ వెళ్ళారు. కృష్ణపరమాత్మ తనను కాని, తన సైన్యాన్ని కాని ఎన్నుకోమన్నాడు. పైగా తను యుద్ధం చెయ్యనన్నాడు. అది కూడా అర్జునునికే ముందు అవకాశం ఇచ్చాడు. అర్జునుడు కృష్ణపరమాత్మను ఎన్నుకున్నాడు. దుర్యోధనుడు అతని కోరికకు నవ్వుకున్నాడు. యుద్ధం చేయని కృష్ణుణ్ణి ఎన్నుకుని ఏం చేస్తాడు అనుకున్నాడు కాని అందులోని రహస్యం గ్రహించలేకపోయాడు.

కృష్ణపరమాత్మ ఈశ్వర అనుగ్రహానికి ప్రతీక. ఇంకో విధంగా చూస్తే నీకు ఐశ్వర్యం కావాలా, ఈశ్వర అనుగ్రహం కావాలా అని అడిగినట్టు అర్థం. అర్జునుడు ఈశ్వర అనుగ్రహం ఎంత గొప్పదో గ్రహించాడు కాబట్టి, ఈశ్వర అనుగ్రహం కోరాడు. రాజ్యం పట్టుకు ప్రాకులాడే దుర్యోధనుడు ఐశ్వర్యం కోరాడు. ఫలితం? దుర్యోధనుడు డీలాపడ్డాడు, పాండవులు ధైర్యంగా ఉన్నారు.

దీన్నిబట్టి మనం నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటి? జీవితంలో భద్రత కావాలంటే, అంతకంతకూ ఆస్తులు పెంచుకుంటూ పోవటం కాదు, ఒక్కటే మార్గం ఉంది. కృష్ణపరమాత్మే ఆ విషయం చెబుతాడు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

ఓ అర్జునా! పరమేశ్వరుడనైన నన్నే నిరంతరం అనన్యభక్తితో చింతన చేస్తే, వారి యోగక్షేమాలను నేనే చూస్తాను. సెక్యూరిటీ గార్డులు కాదు కావాల్సింది, ఈశ్వరానుగ్రహం కావాలి.

**అరక్షితం తిష్ఠతి దైవరక్షితం; సురక్షితం దైవహతం వినశ్యతి**

ఈశ్వర అనుగ్రహం లేకపోతే, భక్తి లేకపోతే, నీ ఐశ్వర్యం నీకు రక్షణ నివ్వలేదు. అదే భక్తి ఉంటే, రక్షణ ఉంటుంది. ప్రస్తుతం దైవచింతన లేని దుర్యోధనుడు అభద్రతా భావానికి లోనవుతున్నాడు. మన సైన్యం బలహీనమైనది అన్నమాట అతని బలహీనతకు ప్రతీక.

శ్లో. 11 **అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।**
**భీష్మమేవాభిరక్షంతు భవంతః సర్వ ఏవ హి ॥**
అయనేషు, చ, సర్వేషు, యథాభాగమ్, అవస్థితాః,
భీష్మమ్, ఏవ, అభిరక్షంతు, భవంతః, సర్వే, ఏవ, హి ॥

| | | | |
|---|---|---|---|
| చ | = కావున | సర్వే, ఏవ | = అందరు |
| సర్వేషు అయనేషు | = అన్ని వ్యూహాత్మక ద్వారములందు | హి | = నిశ్చయముగా |
| యథాభాగమ్ | = మీమీ స్థానములందు | భీష్మమ్, ఏవ | = భీష్మపితామహుని |
| అవస్థితాః | = నిలిచియున్నవారై | అభిరక్షంతు | = అన్నివైపులనుంచి రక్షింతురు గాక |
| భవంతః | = మీరు | | |

**భవంతః సర్వే ఏవ హి సర్వేషు అయనేషు చ యథాభాగమ్ అవస్థితాః**
**భీష్మమ్ ఏవ అభిరక్షంతు ॥**

తా: అందువల్ల మీరందరు అన్ని వ్యూహాత్మక ద్వారములందు మీమీ స్థానములందు నిలిచి ఉన్నవారై, భీష్మపితామహుని నిశ్చయముగా రక్షింతురు గాక!

దుర్యోధనుడు అభద్రతా భావానికి లోనైనా కూడా, కనీసం ఒక యోధుడైనా తమ వైపు ఉన్నాడని ధైర్యంగా ఉన్నాడు. ఆయన భీష్మ పితామహుడు. మామూలుగా కూడా చూడండి, ఇంట్లో పెద్దవాళ్ళెవరైనా ఉంటే, కొండంత అండగా అనిపిస్తుంది. వారు ఏమీ చెయ్యలేని పరిస్థితిలో ఉండవచ్చు, మంచంమీద దీర్ఘరోగంతో అవస్థపడుతూ ఉండవచ్చు, కాని వారు ఉన్నారన్న భావనే మనకు మానసిక ధైర్యం ఇస్తుంది. ఇప్పుడు అటువంటి ధైర్యం వచ్చింది దుర్యోధనుడికి.

**భీష్మం ఏవ అభిరక్షంతు** – మీరందరూ భీష్మపితామహుణ్ణి రక్షించాలి అని తన చుట్టూ ఉన్న వారందరిని, ద్రోణాచార్యుడితో సహా ఆజ్ఞాపిస్తున్నాడు.

**భవంతః సర్వ ఏవ హి** – మీరందరూ భీష్మపితామహుని రక్షించాలి. ఎలా?

**అయనేషు** – అయనం అంటే ఒక ప్రత్యేకమైన స్థానం. యుద్ధంలో అది ఒక సాంకేతిక పదం. ముఖ్యంగా వ్యూహరచన చేసినప్పుడు, ఒక్కొక్క యోధుణ్ణి ఒక్కొక్క ప్రత్యేకస్థానంలో నిలబెడతారు. యుద్ధం మధ్యలో ఎంత ప్రమాదం ముంచుకువచ్చినా అక్కడనుంచి కదలకూడదు.

**యథాభాగమ్ అవస్థితాః** – అంతకుముందు వారిని ఎక్కడ నియమిస్తే అక్కడ స్థిరంగా ఉండి, భీష్ముని రక్షించాలి.

శ్లో. 12 **తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః ।**
**సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥**
తస్య, సంజనయన్, హర్షమ్, కురువృద్ధః, పితామహః,
సింహనాదమ్, వినద్య, ఉచ్చైః, శంఖమ్, దధ్మౌ, ప్రతాపవాన్ ॥

| | | | |
|---|---|---|---|
| కురువృద్ధః | = కురువంశమువారిలో వృద్ధుడు | సంజనయన్ | = కలిగించుచు |
| ప్రతాపవాన్ | = పరాక్రమవంతుడైన | ఉచ్చైః | = బిగ్గరగా |
| పితామహః | = భీష్మపితామహుడు | సింహనాదమ్, వినద్య | = సింహగర్జనమొనర్చి |
| తస్య | = దుర్యోధనునియొక్క హృదయమందు | శంఖమ్ | = శంఖమును |
| హర్షమ్ | = సంతోషమును | దధ్మౌ | = పూరించెను |

**తస్య హర్షం సంజనయన్ ప్రతాపవాన్ కురువృద్ధః పితామహః,**
**ఉచ్చైః సింహనాదం వినద్య శంఖం దధ్మౌ॥**

తా: కౌరవులలో వృద్ధుడు, పితామహుడు, ప్రతాపశాలి అగు భీష్మపితామహుడు ఆ దుర్యోధనునకు అధికమగు సంతోషమును కలిగించుచు సింహనాదమును చేసి బిగ్గరగా శంఖమును పూరించెను.

ముందు శ్లోకంతో దుర్యోధన ఉవాచ ముగిసింది. 3–11 వరకు దుర్యోధనుడు మాట్లాడాడు. ఇక్కడనుంచి సంజయుడు మాట్లాడినట్టు అర్థం చేసుకోవాలి. మళ్ళీ సంజయ ఉవాచ.

భీష్ముడు దుర్యోధనుడు ఉన్న నిస్సహాయస్థితిని చూసి, అతనిలో ఉత్సాహాన్ని ప్రేరేపించాలని నిర్ణయించుకున్నాడు. ఇటువంటి నీరసమే పిల్లలకు పరీక్షల ముందు వస్తుంది. అప్పుడు పెద్దలు వారికి ధైర్యం చెప్పాలి.

**కురువృద్ధః పితామహః** – కురువృద్ధుడు, పితామహుడు అయిన భీష్మాచార్యుడు. ఏం చేశాడు?

**తస్య సంజనయన్ హర్షం** – దుర్యోధనునిలో ఉత్సాహాన్ని, ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపాడు. ఎలా చేశాడు?

**ఉచ్చైః సింహనాదం వినద్య** – సింహంలా గట్టిగా గర్జించాడు. ఇంక యుద్ధం ఆలస్యమైనకొద్దీ ఇతను ఇంకా బెంబేలెత్తిపోయేలా ఉన్నాడని గ్రహించి, యుద్ధం ప్రారంభించటానికి సూచనగా,

**ప్రతాపవాన్ శంఖం దధ్మౌ** – అత్యంత శక్తివంతమైన తన శంఖాన్ని పూరించాడు.

శ్లో. 13 **తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః।**
**సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽభవత్॥**
తతః, శంఖాః, చ, భేర్యః, చ, పణవానకగోముఖాః,
సహసా, ఏవ, అభ్యహన్యంత, సః, శబ్దః, తుములః, అభవత్॥

| | | | |
|---|---|---|---|
| తతః | = తరువాత | సహసా, ఏవ | = ఒక్కుమ్మడిగా |
| శంఖాః, చ | = శంఖములును | అభ్యహన్యంత | = మ్రోగినవి |
| భేర్యః, చ | = నగారాలును | సః, శబ్దః | = ఆ శబ్దము |
| పణవానక గోముఖాః | = డోళ్ళు, మృదంగములు, కొమ్ము బూరాలు మొదలగునవి | తుములః | = మిక్కిలి భయంకరమైనదిగా |
| | | అభవత్ | = అయినది |

**తతః శంఖాః చ భేర్యః చ పణవ–ఆనక–గోముఖాః ।**
**సహసా ఏవ అభ్యహన్యంత సః శబ్దః తుములః అభవత్ ॥**

తా: తరువాత శంఖములు, భేరీలు, తప్పెటలు, మద్దెలలు, కొమ్ము బూరాలు ఒక్కసారిగా మ్రోగించబడినవి. ఆ శబ్దము సంకులము (దొమ్మి ధ్వని)గా (భయంకరముగా)నుండెను.

భీష్మాచార్యుడు ఎప్పుడైతే తన శంఖాన్ని పూరించాడో, అప్పుడే కౌరవుల పక్షం ఉన్న యోధులందరూ వారి శంఖాలను, వాయిద్యాలను, మృదంగాలను మ్రోగించారు.

**తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః** – మరుక్షణమే శంఖాలు, నగారాలు, డోళ్ళు, మృదంగాలు, గోముఖ వాద్యాలు మొదలైనవి,

**సహసైవాభ్యహన్యంత** – ఒక్కసారిగా మ్రోగాయి.

**స శబ్దస్తుములోஉభవత్** – దిక్కులను పిక్కటిల్లచేసే ఆ శబ్దనాదాలతో ఆకాశమంతా ప్రతిధ్వనిస్తున్నది.

ఈ విధంగా కౌరవులు వారి యుద్ధసంసిద్ధతను తెలియజేశారు. ఇప్పుడు పాండవుల వంతు. వారెలా తెలపాలి? వారు వారి శంఖాలను, మృదంగాలను మ్రోగించాలి.

శ్లో. 14 **తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।**
**మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥**
తతః, శ్వేతైః, హయైః, యుక్తే, మహతి, స్యందనే, స్థితౌ,
మాధవః, పాండవః, చ, ఏవ, దివ్యౌ, శంఖౌ, ప్రదధ్మతుః ॥

| | | | |
|---|---|---|---|
| తతః | = తరువాత | స్థితౌ | = కూర్చొనియున్న |
| శ్వేతైః | = తెల్లని | మాధవః, చ | = శ్రీకృష్ణపరమాత్ముడును |
| హయైః | = గుర్రములతో | పాండవః, ఏవ | = పాండుకుమారుడైన అర్జునుడును |
| యుక్తే | = కూడియున్న | దివ్యౌ | = దివ్యములైన |
| మహతి | = ఉత్తమమైన | శంఖౌ | = శంఖములను |
| స్యందనే | = రథమందు | ప్రదధ్మతుః | = పూరించిరి |

**తతః శ్వేతైః హయైః యుక్తే మహతి స్యందనే స్థితౌ,**
**మాధవః పాండవః చ ఏవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥**

తా: తరువాత తెల్లని గుర్రములు పూన్చిన గొప్ప రథమందు ఉన్న శ్రీకృష్ణార్జునులిద్దరూ కూడా దివ్యములైన శంఖములను పూరించిరి.

ఇంతవరకూ దుర్యోధనుని మాటలు విన్నాము. భీష్మాచార్యుణ్ణి చూశాము. వ్యాసాచార్యులు తన వర్ణన ఇప్పుడు పాండవులవైపు తిప్పుతున్నాడు. పాండవులవైపు ధర్మరాజు అగ్రజుడైనా, కృష్ణుణ్ణి చెలికాడు గానే కాక,

అవతారంగా కూడా పాండవులు గుర్తించారు కాబట్టి, కృష్ణపరమాత్మ మొట్టమొదటగా శంఖాన్ని పూరించటంకోసం వేచివున్నారు పాండవులు. అందువల్ల ఇప్పుడు వ్యాసాచార్యులు అర్జునుని రథాన్ని చూపిస్తున్నారు.

**తతః శ్వేతైర్హయైర్యుక్తే** – ముందుగా గుర్రాలను వర్ణిస్తున్నాడు. ఏ గుర్రాలు? అర్జునుని రథానికి ఉన్న గుర్రాలు. ఎటువంటి గుర్రాలు? తెల్లగుర్రాలు.

కఠోపనిషత్తులో రథకల్పనను చూస్తాము. అందులో మన స్థూలశరీరాన్ని రథంతోనూ, ఇంద్రియాలను గుర్రాలతోనూ, మనస్సును పగ్గాలతోనూ, రథసారథిని బుద్ధితోనూ పోల్చింది ఉపనిషత్తు. గుర్రాలను ఎలా పగ్గాలతో అదుపులో పెడతామో, అలా ఇంద్రియాలను మనస్సుతో అదుపులో పెడతాము. ఇంద్రియాలు జ్ఞానానికి సంకేతం, మన సాంప్రదాయంలో జ్ఞానాన్ని తెల్లరంగుతో సూచిస్తారు. అందువల్ల సరస్వతీదేవిని, జ్ఞానదేవతను, శ్వేతవస్త్రధారిణిగా అభివర్ణిస్తారు.

**యా కుందేందు తుషారహార ధవలా యా శుభ్రవస్త్రావృతా**

అంతేకాదు, సత్త్వగుణం ద్వారా జ్ఞానాన్ని సూచిస్తారనీ, సత్త్వగుణానికి తెల్లరంగు సంకేతమనీ తర్వాత చూస్తాము. ఇంద్రియాలు జ్ఞానాన్ని సూచిస్తాయనీ, ఇంద్రియాలను గుర్రాలతో పోలుస్తామనీ, ఇక్కడ గుర్రాలు తెల్లరంగులో ఉన్నాయనీ చూశాము. అదీ దాని అంతరార్థం. అర్జునునుని రథం ఎలా ఉంది?

**మహతి స్యందనే స్థితౌ** – అది మామూలు రథం కాదు. అర్జునునికి స్వర్గలోకంలో కానుకగా ఇవ్వబడిన రథం అది. అందువల్ల గొప్ప రథం అది. దానిమీద ఇద్దరు కూర్చుని ఉన్నారు. ఎవరు వారు?

**మాధవః పాండవశ్చైవ** – మాధవుడు, పాండవుడు. మాధవుడు అంటే కృష్ణుడు. మాధవః అంటే లక్ష్మీపతి. ధ్యానశ్లోకాల్లో చూశాము, లక్ష్మీపతి అంటే కేవలం ఐశ్వర్యమే ఉన్నవాడు కాదు, సర్వజ్ఞుడు అని కూడా వస్తుందని. కృష్ణుణ్ణి మొదటిసారిగా ప్రవేశపెడుతూనే మాధవ పదం వేశాడు. మాధవుడు ముందు ముందు అర్జునునికి జ్ఞానాన్ని బోధించబోతాడు. పాండవ అంటే ఇక్కడ అర్జునుడు. అర్జునుడు రథంలో యజమానిలా కూర్చున్నాడు, కృష్ణుడు రథసారథిగా వచ్చాడు. త్వరలో వారి పాత్రలు మారబోతున్నాయి. వారిరువురూ ఏం చేశారు?

**దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః** – వారి వారి దివ్యశంఖాలను పూరించారు. పాండవులు కూడా యుద్ధానికి సంసిద్ధమే అని సూచిస్తూ కృష్ణుడు తన శంఖాన్ని పూరించాడు. ఎటువంటి శంఖం? ఇద్దరివీ దివ్యమైన శంఖాలు. వారి వివరాలు తరువాత వచ్చే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 15 **పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।**
**పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥**
పాంచజన్యమ్, హృషీకేశః, దేవదత్తమ్, ధనంజయః,
పౌండ్రమ్, దధ్మౌ, మహాశంఖమ్, భీమకర్మా, వృకోదరః ॥

| | | | |
|---|---|---|---|
| హృషీకేశః | = శ్రీకృష్ణుడు | వృకోదరః | = భీమసేనుడు |
| పాంచజన్యమ్ | = పాంచజన్యమను పేరుగల శంఖమును | పౌండ్రమ్ | = పౌండ్రమను పేరుగల |
| ధనంజయః | = అర్జునుడు | మహా శంఖమ్ | = మహాశంఖమును |
| దేవదత్తమ్ | = దేవదత్తమను పేరుగల శంఖమును | దధ్మౌ | = పూరించిరి |
| భీమకర్మా | = భయంకర కృత్యములను చేయునట్టి | | |

**హృషీకేశః పాంచజన్యమ్, ధనంజయః దేవదత్తమ్,**
**భీమకర్మా వృకోదరః పౌండ్రం మహాశంఖం దధ్మౌ॥**

తా: ఇంద్రియాధిపతియగు పరమాత్మ శ్రీకృష్ణుడు పాంచజన్యమనే శంఖమును, ధనంజయుడు దేవదత్తమనే శంఖమును, తోడేలు పొట్టవంటి పొట్టగల భీమసేనుడు పౌండ్రమనే పెద్ద శంఖమును పూరించిరి.

కౌరవులు శంఖాలు పూరించినప్పుడు, **సహసైవ అభ్యహన్యంత** అన్నాడు. అంటే వారి వాద్యాలు దిక్కులను మార్మోగించాయి అన్నాడు. ఇక్కడ పాండవుల వైపు, వరుసగా వారి శంఖాల పేర్లు చెప్పుకువస్తున్నారు వ్యాసాచార్యులు. ముందుగా కృష్ణార్జునులకు ఇంకో పేర్లు ఇస్తున్నారు.

**హృషీకేశః** – ఇంద్రియాలకు రాజు. హృషీకం అంటే ఇంద్రియాలు. వాటితో మనస్సును కూడా కలుపుకోవాలి. ఈశః అంటే రాజు. హృషీకేశః అంటే ఇంద్రియాలను, మనస్సును సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యం లేదా ఆత్మ.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః** – కేన

హృషీకేశుడని ఎందుకన్నారంటే త్వరలోనే కృష్ణపరమాత్మ అర్జునుని మనస్సు చదివి, అతనికి మనో నిగ్రహాన్ని జ్ఞానం ద్వారా కలిగించ బోతున్నాడు.

**పాంచజన్యం(దధ్మౌ)** – దధ్మౌ క్రియాపదం లేదు. ప్రతి శంఖానాదానికి ఈ పదాన్ని కలుపుకోవాలి. దధ్మౌ అంటే శంఖాన్ని పూరించాడు. కృష్ణపరమాత్మ శంఖాన్ని పాంచజన్యం అంటారు. పురాణగాథల ప్రకారం రాక్షసులే పాంచజన్యంగా మారారని వస్తుంది. కృష్ణపరమాత్మ పాంచజన్యం శంఖాన్ని పూరించాడు.

**దేవదత్తం ధనంజయః** – అర్జునుడు దేవదత్తమనే శంఖాన్ని పూరించాడు. ఇక్కడ అర్జునుణ్ణి ధనంజయుడు అంటున్నారు. ధనంజయుడు అంటే చాలా ధనాన్ని జయించినవాడు. ఈ విశేషణాలు కూడా ముఖ్యమైనవే. అర్జునునికి లేనిదంటూ లేదు. చాలా అందగాడు, వీరుడు, కీర్తిమంతుడు, ఐశ్వర్యవంతుడు, ధర్మరక్షకుడు, విజేయుడు, స్వర్గారోహకుడు. అతని పరాక్రమం ఎంత గొప్పదంటే, స్వర్గలోకానికి వెళ్ళి దేవతల రాజైన ఇంద్రునికే యుద్ధంలో సహాయం చేశాడు. అంటే ఇహలోకంలో ఏ ఐశ్వర్యాలనైతే ఏ మానవుడైనా కోరుకుంటాడో, అవన్నీ అర్జునునికి పుష్కలంగా ఉన్నాయి. అంత పుష్కలంగా అన్నీ ఉన్నా, ఒక క్లిష్టపరిస్థితి వచ్చేసరికి తనంతటతాను తన సమస్యను పరిష్కరించుకోలేకపోయాడు.

దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. మనిషి దుఃఖాన్ని ఐశ్వర్యం పోగొట్టలేదు. అలా ఐశ్వర్యమే పరిష్కారమయితే, అర్జునునికి అసలు దుఃఖమే కలుగకూడదు. కాని అతను శోకంలో మునిగిపోయాడు. దానికి ఆత్మజ్ఞానమొక్కటే మార్గం! అందువల్ల భగవద్గీత చెప్పకనే చెబుతున్నది – మీరు ఎంతైనా ధనం సంపాదించండి; ఎంతైనా భార్యాపిల్లలకోసం కష్టపడండి; ఎంతైనా పైకి రావాలని శ్రమించండి; కాని ఒక విషయం మాత్రం మర్చిపోకండి. అవేమీ మీ అంతర్గత సమస్యలైన బంధకత్వాన్నీ, భయాన్నీ, దుఃఖాన్నీ పారద్రోలవు.

ధనంజయుడు దేవదత్తం పేరున్న తన శంఖాన్ని పూరించాడు.

**వృకోదరః పౌండ్రం దధ్మౌ మహాశంఖం** – వృకోదరుడు అంటే భీముడు. వృకం అంటే తోడేలు.

**వృకస్య ఉదరం ఇవ యస్య సః వృకోదరః**

తోడేలుకున్న ఉదరంలాంటి ఉదరం ఉన్న వ్యక్తిని వృకోదరుడు అంటారు. తోడేలు ప్రత్యేకత ఏమిటి? అది ఎంత తిన్నా, దానికి తృప్తి తీరదు. భీముడు కూడా ఎంతైనా తినగలడు. కొంతమంది అతిగా తింటే ఏమీ పని చేయలేరు. కాని భీముడు అలాకాదు, ఎంత తిన్నా అతను పని కూడా బాగా చేయగలడు.

**భీమకర్మా** – అద్భుతమైన బిరుదు.

**భీమాని భయంకరాణి కర్మాణి యస్య సః భీమకర్మా**

భీమ అంటే భయంకరమైన, కర్మ అంటే పనులు. భీమకర్మా అంటే భయంకరమైన పనులు చేసేవాడు. అతను ఎందరో రాక్షసులను సంహరించాడు. తన దగ్గర ఎన్నో అద్భుతమైన ఆయుధాలున్నా కూడా, ఎన్నో సందర్భాలలో వాటిని ప్రయోగించనే లేదు. అతని పక్కన చెట్టో, స్తంభమో, కొండో ఉంటే చాలు దాన్ని అమాంతం ఎత్తేస్తాడు. అటువంటి బలశాలి శంఖం ఎంత గొప్పగా ఉండాలి? దాన్ని మహాశంఖం పౌండ్రం అన్నారు.

మరికొంతమంది శంఖాలను వర్ణిస్తారు వ్యాసాచార్యులు రాబోయే శ్లోకాల్లో.

శ్లో. 16 **అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।**
**నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ॥**
అనంతవిజయమ్, రాజా, కుంతీపుత్రః, యుధిష్ఠిరః,
నకులః, సహదేవః, చ, సుఘోషమణిపుష్పకౌ ॥

| | | | |
|---|---|---|---|
| కుంతీపుత్రః | = కుంతీదేవియొక్క కుమారుడును | నకులః | = నకులుడు |
| రాజా | = రాజైన | సహదేవః, చ | = సహదేవుడును |
| యుధిష్ఠిరః | = యుధిష్ఠిరుడు | సుఘోష | = సుఘోషము, మణిపుష్పకము |
| అనంత విజయమ్ | = అనంతవిజయమను పేరుగల శంఖమును | మణిపుష్పకౌ | అను పేర్లుగల శంఖములను (పూరించిరి) |

**కుంతీపుత్రః రాజా యుధిష్ఠిరః అనంతవిజయమ్।**
**నకులః సహదేవః చ సుఘోషమణిపుష్పకౌ॥**

తా: కుంతీ పుత్రుడగు ధర్మరాజు అనంతవిజయమనే శంఖమును పూరించెను. ఆయన యుద్ధమందు స్థిరముగా నిలుచును. నకుల సహదేవులు క్రమంగా సుఘోషమణిపుష్పకములనే శంఖములను పూరించిరి.

**యుధిష్ఠిరః అనంత విజయం (దధ్మౌ)** – ధర్మరాజు పేరు యుధిష్ఠిరుడు. యుధి అంటే యుద్ధభూమి. యుధిష్ఠిరుడు అంటే యుద్ధంలో స్థిరంగా నిలుచువాడు.

**రాజా కుంతీపుత్రః** – ఈ యుధిష్ఠిరుడు రాజు, కుంతీపుత్రుడు. అతని శంఖం పేరు అనంత విజయం. ఎప్పుడూ విజయాన్నే తెస్తుంది.

**నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ** – నకుల సహదేవులు కూడా వారివారి శంఖాలను పూరించారు. వాటి పేర్లు వరుసగా సుఘోషం, మణిపుష్పకం.

శ్లో. 17 **కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః ।**
**ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥**
కాశ్యః, చ, పరమేష్వాసః, శిఖండీ, చ, మహారథః,
ధృష్టద్యుమ్నః, విరాటః, చ, సాత్యకిః, చ, అపరాజితః ॥

శ్లో. 18 **ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।**
**సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్॥**
ద్రుపదః, ద్రౌపదేయాః, చ, సర్వశః, పృథివీపతే,
సౌభద్రః, చ, మహాబాహుః, శంఖాన్, దధ్ముః, పృథక్, పృథక్ ॥

| | |
|---|---|
| పృథివీపతే | = ఓ రాజా! |
| పరమేష్వాసః | = శ్రేష్ఠమైన ధనస్సుగల |
| కాశ్యః, చ | = కాశీరాజు |
| మహారథః | = మహారథుడైన |
| శిఖండీ, చ | = శిఖండి |
| ధృష్టద్యుమ్నః, చ | = ధృష్టద్యుమ్నుడు |
| విరాటః, చ | = విరాటరాజు |
| అపరాజితః | = అజేయుడైన |
| సాత్యకిః | = సాత్యకి |
| ద్రుపదః, చ | = ద్రుపద మహారాజు |
| ద్రౌపదేయాః, చ | = ద్రౌపదియొక్క కుమారులు ఐదుగురు |
| మహాబాహుః | = గొప్ప బాహువులుగలవాడైన |
| సౌభద్రః | = అభిమన్యుడు |
| సర్వశః | = అన్నివైపులనుంచి |
| పృథక్–పృథక్ | = వేర్వేరుగా |
| శంఖాన్ | = శంఖములను |
| దధ్ముః | = పూరించిరి |

**పరమేష్వాసః కాశ్యః చ మహారథః శిఖండీ చ ।**
**ధృష్టద్యుమ్నః విరాటః చ అపరాజితః సాత్యకిః చ॥**
**ద్రుపదః ద్రౌపదేయాః చ, మహాబాహుః సౌభద్రః చ, హే పృథివీపతే!**
**పృథక్ పృథక్ సర్వశః శంఖాన్ దధ్ముః॥**

తా: ఓ ధృతరాష్ట్ర మహారాజా! గొప్ప ధనుర్ధారియైన కాశీరాజు, మహారథుడగు శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, పరాజయములేని సాత్యకి, ద్రుపదుడు, ద్రౌపది పుత్రులు(ఉపపాండవులు), గొప్ప భుజబలముగల సుభద్రాపుత్రుడగు అభిమన్యుడు అందరు (అన్ని వైపులనుంచి) వేర్వేరుగా శంఖములను పూరించిరి.

**కాశ్యశ్చ పరమేష్వాసః** – మహాధనుర్ధారి అయిన కాశీరాజు తన శంఖాన్ని పూరించాడు.

**శిఖండీ చ మహారథః** – భీష్ముని సంహరిస్తానని ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేశాడు శిఖండి. అతను మామూలు యోధుడు కాదు, మహారథుడు. అతను కూడా శంఖాన్ని పూరించాడు.

**ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చ అపరాజితః** – ధృష్టద్యుమ్నుడు, విరాటరాజు, అపరాజితుడైన సాత్యకి;

**ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః** – ద్రౌపది తండ్రి, ద్రౌపది ఐదుగురు పుత్రులు;

**సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ పృథక్ పృథక్ దధ్ముః** – సుభద్రాపుత్రుడు, భుజబలం ఉన్న అభిమన్యుడు – అందరూ వారివారి శంఖాలను వేర్వేరుగా పూరించారు.

**పృథివీపతే** – ఓ రాజా! సంజయుడు ధృతరాష్ట్రునికి చెబుతున్నాడు ఈ విధంగా. అప్పుడేమయింది?

శ్లో. 19 **స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।**
**నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥**
సః, ఘోషః, ధార్తరాష్ట్రాణామ్, హృదయాని, వ్యదారయత్,
నభః, చ, పృథివీమ్, చ, ఏవ, తుములః, వ్యనునాదయన్ ॥

| | | | |
|---|---|---|---|
| చ | = ఇంకా | పృథివీమ్, ఏవ | = భూమిని గూడ |
| సః | = ఆ | వ్యనునాదయన్ | = ప్రతిధ్వనింపజేయగా |
| తుములః | = భయంకరమైన | ధార్తరాష్ట్రాణామ్ | = ధృతరాష్ట్రుని పుత్రుల |
| ఘోషః | = నాదము | హృదయాని | = హృదయములు |
| నభః, చ | = ఆకాశమును | వ్యదారయత్ | = కకావికలములుగా అయినవి. |

**సః తుములః ఘోషః నభః చ పృథివీం చ ఏవ వ్యనునాదయన్,**
**ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్॥**

తా: సంకులమైన (సర్వము కలిసిపోయిన) ఆ భయంకరమైన ధ్వని ఆకాశమును, భూమిని కూడా ప్రతిధ్వనించునట్లు చేయగా ధృతరాష్ట్రుని పుత్రుల హృదయములు కకావికలములుగా అయినవి.

**స ఘోషో ధార్తరాష్ట్రాణాం** – ధార్తరాష్ట్రుల గుండెలను అదరగొట్టాయి. ధార్తరాష్ట్రులు అంటే ధృతరాష్ట్రుని పుత్రులు.

**నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్** – వ్యనునాదయన్ అంటే ప్రతిధ్వనించటం. పాండవులంతా శంఖనాదాలు చేస్తే, భూమ్యాకాశాలు దద్దరిల్లాయి.

**హృదయాని వ్యదారయత్** – అక్షరాలా చూస్తే గుండెను అనేక ముక్కలు చేసింది అని అర్థం. అసలే దుర్యోధనుడు తన సైన్యబలం పాండవుల సైన్యబలం ముందు నిలబడలేదని భయపడుతున్న తరుణంలో, ఈ శంఖనాదాలు ఇంకా కృంగిపోయేలా చేశాయి దుర్యోధనుణ్ణి. అతనికి భయం ఎందువల్ల కలిగింది? అతను అధర్మానికి పాల్పడటంవల్ల. అందువల్ల శంఖనాదాన్ని వివరిస్తున్నారు వ్యాసాచార్యులు.

శ్లో. 20 **అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।**
**ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥**
అథ, వ్యవస్థితాన్, దృష్ట్వా, ధార్తరాష్ట్రాన్, కపిధ్వజః,
ప్రవృత్తే, శస్త్రసంపాతే, ధనుః, ఉద్యమ్య, పాండవః ॥

శ్లో. 21 **హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే ।**
హృషీకేశమ్, తదా, వాక్యమ్, ఇదమ్, ఆహ, మహీపతే,

| | | | |
|---|---|---|---|
| మహీపతే | = ఓ రాజా! | తదా | = అప్పుడు |
| అథ | = తరువాత | శస్త్రసంపాతే | = శస్త్రములను ప్రయోగించుటకు |
| కపిధ్వజః | = కపిధ్వజుడైన | ప్రవృత్తే | = సన్నద్ధుడైన సమయమున |
| పాండవః | = అర్జునుడు | ధనుః | = ధనుస్సును |
| వ్యవస్థితాన్ | = యుద్ధసన్నద్ధులై నిలిచియున్న | ఉద్యమ్య | = పైకెత్తి |
| ధార్తరాష్ట్రాన్ | = ధృతరాష్ట్రునకు సంబంధించిన వారిని | హృషీకేశమ్ | = శ్రీకృష్ణుని (తో) |
| | | ఇదమ్, వాక్యమ్ | = ఈ వాక్యమును |
| దృష్ట్వా | = చూచి | ఆహ | = పలికెను |

**అథ కపిధ్వజః పాండవః ధార్తరాష్ట్రాన్ వ్యవస్థితాన్ దృష్ట్వా,**
**శస్త్ర సంపాతే ప్రవృత్తే (సతి) ధనుః ఉద్యమ్య ॥**
**హే మహీపతే! తదా హృషీకేశమ్ ఇదం వాక్యమ్ ఆహ।**

తా: ఓ మహారాజా! తరువాత హనుమంతుని తన ధ్వజమునందుగల పాండుపుత్రుడగు అర్జునుడు యుద్ధమునకు సంసిద్ధులైన ధృతరాష్ట్రపుత్రులను చూచెను. బాణముల ప్రయోగము ఆరంభము కాబోవుచున్నది. అప్పుడాయన ధనుస్సు పైకెత్తి సర్వాంతర్యామియగు శ్రీకృష్ణుని ఉద్దేశించి ఈ మాటను పలికెను.

**2. ఒక మలుపు శ్లోకాలు 20-25** శ్లోకం 19 వరకూ మొదటి దశ. 20వ శ్లోకంనుంచి కథ మలుపు తిరగబోతున్నది. సంస్కృతంలో దీన్ని అథ శబ్దంతో సూచిస్తారు. అథ అంటే చెబుతున్న అంశంలో కాని, ఉన్న సందర్భంలో కాని

మార్పును సూచిస్తుంది.ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అటు కౌరవులు, ఇటు పాండవులు వారివారి శంఖాలను పూరించారు. అంటే ఇరుపక్షాల వారూ యుద్ధానికి సంసిద్ధులుగా ఉన్నారు. ఆ సూచన ముగియగానే, అసలు యుద్ధం ప్రారంభమవ్వాలి. అంటే బాణాల తూటాలు దూసుకురావాలి.

**శస్త్రసంపాతే ప్రవృత్తే** – సమయం అనువుగా ఉన్నది. బాణాలు దూసుకు రావాలి. కాని చివరి నిముషంలో అర్జునుని మనస్సులో మెరుపులా ఒక ఆలోచన మెరిసింది. ఈ మెరుపులాంటి ఆలోచనే గొప్ప గ్రంథానికి దారి తీసింది. అది గనుక అర్జునుని మనస్సులో రాకపోయి వుంటే, ఇరుపక్షాల వారూ యుద్ధం చేసి ఉండేవారు. అప్పుడు గీతోపదేశం జరిగివుండేది కాదు; వ్యాసాచార్యులు దీన్ని రచించి ఉండేవారు కాదు, మనం దీనిని నేర్చుకునేందుకు అవకాశం ఉండేది కాదు.

**అథ –** కాని ఇదంతా ఒక అథ పదంవల్ల జరిగింది. అర్జునునిలో మెరుపులా మెరిసిన ఆలోచన ఏమిటి? శత్రుసైన్యంలో బారులు తీరి ముందు నిలుచున్న వారిని చూడాలనిపించింది. యుద్ధంలో తను సంహరించబోయేవారెవరో చూడాలనుకున్నాడు. ఇది కుటుంబ కలహం, అందువల్ల బంధువులు ఉంటారని తెలుసు. వారిని చివరిసారిగా వీడ్కోలు చెప్పటానికా అన్నట్టుగా చూడాలనుకున్నాడు. ఆ విషయమే కృష్ణపరమాత్మకు చెబుతాడు.

**ధార్తరాష్ట్రాన్ వ్యవస్థితాన్ దృష్ట్వా** – యుద్ధానికి నడుము బిగించి, సిద్ధంగా ఉన్న ధార్తరాష్ట్రులను చూశాడు అర్జునుడు. దుర్యోధనాదులకు ధార్తరాష్ట్రులు అనే పదం సరిగ్గా సరిపోతుంది. కౌరవులు అంటే మనం కేవలం దుర్యోధనాదులనే తీసుకుంటాము కాని కౌరవులు అంటే కురువంశానికి చెందినవారు. అందువల్ల పాండవులు కూడా కౌరవులలోకే వస్తారు. కాని మనం దుర్యోధనాదులను కౌరవులనీ, ధర్మరాజుని, అతని సోదరులని పాండవులనీ అంటాము. ఇక్కడ వ్యాసాచార్యులు సరియైన పదం వేశారు. దుర్యోధనాదులను ధార్తరాష్ట్రులు అన్నారు. అంటే ధృతరాష్ట్రుని పుత్రులు వారు.

**కపిధ్వజః –** అర్జునుణ్ణి ఏమన్నారు? కపిధ్వజుడు అన్నారు. తన జండాపై కపిరాజు ఉన్నాడు. కపిరాజు అంటే హనుమంతుడు. హనుమంతుడు వాయుపుత్రుడు, భీముడు కూడా వాయుపుత్రుడు కాబట్టి వీరిరువురూ సోదరులు. హనుమంతుడు చిరంజీవి. అందువల్ల ఆయన రాముని కాలం అయిన త్రేతాయుగంలోనూ, కృష్ణుని కాలం అయిన ద్వాపరయుగంలోనూ కూడా ఉన్నాడు. భీముడు తమ యుద్ధానికి కూడా వచ్చి తమకు విజయం వచ్చేలాగా దీవించమని ఆంజనేయస్వామిని కోరితే అలాగే వచ్చి జండాపైన ఉంటానని మాట ఇచ్చాడు. అందువల్ల హనుమంతుడు కూడా కృష్ణపరమాత్మ చెప్పిన భగవద్గీతను విన్నాడు. అంతకుముందు రాముడు చెప్పిన గీతను విన్నాడు. హనుమంతుడు గీతాభాష్యం చెప్పాడు. దాన్ని హనుమత్ పైశాచ భాష్యం అంటారు. పైశాచ అంటే ఆకారం లేనిది అని అర్థం. అద్భుతమైన భాష్యం అది.

**దృష్ట్వా** – ఇంతకీ కపిధ్వజుడైన అర్జునుడు వీరందరినీ చూశాడు. చూసి ఏం చేశాడు?

**ధనుః ఉద్యమ్య పాండవః** – అర్జునుడు ధనుస్సును పైకెత్తి,

**హృషీకేశమ్ ఇదం వాక్యమ్ ఆహ** – శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

**మహీపతే** – సంజయుడు ఇదంతా ధృతరాష్ట్రునికి చెబుతున్నాడు. ఓ మహారాజా అని ఆయనను సంబోధించి చెబుతున్నాడు. సంజయుడు యుద్ధభూమిలో లేడు. కాని ఆయనకున్న దివ్యదృష్టివల్ల అక్కడ జరుగుతున్న విషయాలను, అర్జునుని మనస్సులో ఉన్న విషయాలను కూడా చెప్పగలుగుతున్నాడు.

**అర్జున ఉవాచ**

శ్లో. 21 **సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥**

సేనయోః, ఉభయోః, మధ్యే, రథమ్, స్థాపయ, మే, అచ్యుత ॥

శ్లో. 22 **యావదేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్ ।**
**కైర్మయా సహ యోద్ధవ్యమ్ అస్మిన్ రణసముద్యమే ॥**

యావత్, ఏతాన్, నిరీక్షే, అహమ్, యోద్ధుకామాన్, అవస్థితాన్,
కైః మయా, సహ, యోద్ధవ్యమ్, అస్మిన్, రణసముద్యమే ॥

| | | | |
|---|---|---|---|
| అచ్యుత | = ఓ కృష్ణా! | యోద్ధుకామాన్ | = యుద్ధాభిలాషులైన |
| మే, రథమ్ | = నా రథమును | ఏతాన్ | = ఈ ప్రతియోధులను |
| ఉభయోః | = ఉభయ పక్షముల | నిరీక్షే | = చక్కగా చూడగలనో |
| సేనయోః, మధ్యే | = సేనల మధ్య | అస్మిన్ | = ఈ |
| స్థాపయ | = నిలిపియుంచుము | రణసముద్యమే | = మహారణభూమియందు |
| యావత్ | = ఎంతవరకైతే | మయా | = నాతో (నాకు) |
| అహమ్ | = నేను | కైః, సహ | = ఎవరితో |
| అవస్థితాన్ | = రణరంగమున ఉన్న | యోద్ధవ్యమ్ | = యుద్ధము చేయవలసియున్నదో |

**అర్జున ఉవాచ।**
**హే అచ్యుత! ఉభయోః సేనయోః మధ్యే మే రథం స్థాపయ**
**యావత్ అహం యోద్ధుకామాన్ అవస్థితాన్ ఏతాన్ నిరీక్ష్యే।**
**అస్మిన్ రణసముద్యమే మయా కైః సహ యోద్ధవ్యమ్॥**

తా: అర్జునుడిట్లు పలికెను – ఇంతలో నేను యుద్ధము చేసే కోరికతో సంసిద్ధులైన వీరిని చూచెదను. ఓ అచ్యుతా! నా రథమును రెండు సేనల మధ్యలో నిలుపుము. ఈ యుద్ధముయొక్క పెద్ద ఉద్యమమునందు నేను ఎవరితో యుద్ధము చేయవలెనో చూచెదను.

శ్లో. 23 **యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః ।**
**ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః యుద్ధే ప్రియచికీర్షవః ॥**

యోత్స్యమానాన్, అవేక్షే, అహమ్, యే, ఏతే, అత్ర, సమాగతాః,
ధార్తరాష్ట్రస్య, దుర్బుద్ధేః, యుద్ధే, ప్రియచికీర్షవః ॥

| | | | |
|---|---|---|---|
| దుర్బుద్ధేః | = దుర్బుద్ధిగలవాడైన | అత్ర | = ఇచ్చట (ఈ సమరభూమియందు) |
| ధార్తరాష్ట్రస్య | = దుర్యోధనునకు | సమాగతాః | = చేరియున్నారో |
| యుద్ధే | = యుద్ధమందు | యోత్స్యమానాన్ | = యుద్ధసన్నద్ధులైయున్నట్టి వారిని |
| ప్రియచికీర్షవః | = ప్రియము చేయుటకు | అహమ్ | = నేను |
| యే | = ఎవరెవరు | అవేక్షే | = చూచెదను గాక |
| ఏతే | = (రాజులుగలరో) వీరు | | |

**దుర్బుద్ధేః ధార్తరాష్ట్రస్య యుద్ధే ప్రియచికీర్షవః,**
**యే ఏతే అత్ర సమాగతాః యోత్స్యమానాన్ అహమ్ అవేక్షే॥**

తా: దుర్బుద్ధిగలవాడైన దుర్యోధనునకు యుద్ధమందు ప్రియము చేయుటకు ఎవరెవరు రాజులు గలరో ఈ సమరభూమియందు చేరియున్నారో యుద్ధసన్నద్ధులైయున్నట్టి వారిని నేను చూచెదను గాక.

**అర్జున ఉవాచ** – ఇప్పుడు అర్జునుడు కృష్ణపరమాత్మతో మాట్లాడతాడు.

**అచ్యుత** – ఓ అచ్యుత అని పిలుస్తున్నాడు. అచ్యుత పదానికి మతపరంగా, ఆధ్యాత్మిక పరంగా, నైతికపరంగా గొప్ప అర్థం ఉంది. అచ్యుతుడు అంటే తను ఎన్నడు ఓడిపోడు, తను ఎన్నడూ ఓడించడు. భగవంతుడు సత్యసంకల్పుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు. అందువల్ల ఆయనకు ఓటమి లేదు. అంతేకాదు, ఆయనను నమ్ముకున్నవారికి కూడా ఓటమి లేదు. పాండవులు కృష్ణపరమాత్మమీద పూర్తి భారం వేశారు. వారి నమ్మకాన్ని వమ్ము చెయ్యలేదు కృష్ణపరమాత్మ. **కైవర్తకః కేశవః** అని ధ్యానశ్లోకాల్లో చూశాము. వారిని మహాభారత యుద్ధమనే నదిని దాటించాడు. అలాగే మనము కూడా, మనుష్యులను నమ్ముకోకుండా, భగవంతుణ్ణి నమ్ముకుంటే ఓటమి ఎరగము.

ద్రౌపది ఉదంతమే మనకు తార్కాణం. నిండు సభలో అవమానం జరుగుతుంటే, మహాయోధులైన భర్తలు ఏమీ చెయ్యలేకపోయారు, భీష్మద్రోణులు ఏమీ చెయ్యలేకపోయారు, కృష్ణపరమాత్మను నిండు మనస్సుతో ఎలుగెత్తి పిలిచింది, ఆమెను రక్షించాడు. అలా భగవంతుడు ఎప్పుడూ అండగా ఉంటాడు.

అచ్యుతుడు అంటే ఇంకొక అర్థం నిత్యముక్తుడు. భగవంతుడు సంసారంలో ఎన్నడూ పడడు. ఆయన ఈ ప్రపంచంలోకి వస్తే, దాన్ని పుట్టుక అనము, అవతారము అంటాము. జన్మకూ, అవతారానికీ మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి? జన్మ అంటే కింద పడటం, సంసారబంధంలో పడటం. అవతారం అంటే కిందకి దిగటం. ఆయన సంసారంలో పడడు, సంసారంలోంచి లేపుతాడు.

**స్థాపయ మే రథం** – ఓ అచ్యుతా, నా రథాన్ని నిలబెట్టు. ఎక్కడ?

**సేనయోరుభయోర్మధ్యే** – రెండు సైన్యాల మధ్య. ఎందుకు?

**యావత్ ఏతాన్ నిరీక్షే అహమ్** – నేను పరీక్షగా చూడాలి. ఎవరిని?

**యోద్ధుకామాన్ అవస్థితాన్** – యుద్ధాభిలాషులై నిలిచివున్న ప్రతిపక్ష యోధులందరినీ చూడాలి,

**కైః మయా సహ యోద్ధవ్యమ్** – వారిలో నేను ఎవరితో యుద్ధం చేయాలో చూడాలి.

**రణసముద్యమే** – ఈ మహాభారత యుద్ధంలో.

**యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః** – దుర్యోధనాదులనే కాదు, దుర్యోధనునికి ప్రియం చేకూర్చటానికి వచ్చిన రాజులందరినీ కూడా నేను ఒకసారి స్పష్టంగా చూస్తాను.

ఇది కేవలం కురు, పాండవుల మధ్య జరిగే కుటుంబ కలహం కాదు. అనేక దేశాల రాజులు ఇటు కౌరవుల వైపో, అటు పాండవుల వైపో చేరారు. అందువల్ల కౌరవులను బలపరుస్తున్న రాజులెవరో తెలుసు కోవాలనుకున్నాడు అర్జునుడు.

**యుద్ధే ప్రియచికీర్షవః** – వారికి ప్రియం చేకూర్చటానికి, వారివైపు యుద్ధం చేయటానికి వచ్చిందెవరో చూడాలి అన్నాడు. కౌరవులవైపు అని చెప్పేటప్పుడు –

**ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః** – ధార్తరాష్ట్రులు అని కౌరవులను పేర్కొనటంలోనే అర్జునుని రక్తం ఎలా మండుతోందో తెలుస్తోంది. లక్కగృహ దహనంనుంచీ కౌరవులు పాండవులను ఎన్నో రకాలుగా హింసించారు. వారిని సంహరించటానికి అనేక మార్గాలను ఉపయోగించారు. అందువల్ల **దుర్బుద్ధి** పదాన్ని వాడాడు.

ఈ దుర్బుద్ధి పదాన్ని గుర్తుంచుకోవాలి. ఇది చాలా ముఖ్యమైన పదం. దుర్బుద్ధి అంటే దుష్టబుద్ధి లేదా అధార్మిక బుద్ధి. దీన్నిబట్టి అర్జునుడు ఈ యుద్ధాన్ని అన్నదమ్ముల మధ్య పోరాటంగా చూడటం లేదని అర్థమవుతుంది. ఇది ధర్మానికి, అధర్మానికి మధ్య పోరాటం. భీష్ముడు గొప్పవ్యక్తి కావచ్చు, ద్రోణుడు గొప్ప వ్యక్తి కావచ్చు, వారు అర్జునునికి పితామహుడు, ఆచార్యులే కావచ్చు కాని వారు అధర్మం వైపు నిలిచారు. అందుకని వారితో యుద్ధం చేయటానికి నిశ్చయించుకునే వచ్చాడు. ఆ క్షణంలో అతనిలో ఏ విధమైన ఆందోళన లేదు. మనస్సును బుద్ధి అదుపులో పెడుతున్నది.

ఎవరి మనస్సైతే బుద్ధియొక్క చెప్పుచేతల్లో ఉంటుందో, అతని నిర్ణయం ధర్మబద్ధంగానే ఉంటుంది. ఎప్పుడైతే భావోద్రేకాలు అదుపు తప్పుతాయో, అప్పుడే బుద్ధిమీద మనస్సు అధికారం చెలాయించటానికి చూస్తుంది.

ఇప్పటిదాకా అర్జునుని పరిస్థితి ఎలా ఉంది? అతని మనస్సు, అతని బుద్ధి అధీనంలో ఉంది. శత్రువులు అధర్మం వైపు ఉన్నారు, తాము ధర్మంకోసం పోరాడుతున్నారు అని స్పష్టంగా తెలుసు. లోకంలో ధర్మానికి పెద్దపీట వెయ్యాలి. అనుబంధాలు అశాశ్వతం, ధర్మం శాశ్వతం. అందువల్ల అనుబంధమా, ధర్మమా అనే సంకట పరిస్థితి ఎదురైనప్పుడు ధర్మానికే ఓటు వెయ్యాలి. మనుధర్మశాస్త్రం అదే చెబుతుంది.

వేదాంతం తరువాత నేర్పిస్తుంది – ఆప్యాయతలు, అనుబంధాలు ఉండటం మంచిదే కాని అవి మన బుద్ధిని కప్పేయకూడదు అని. వేదాంతం నేర్చుకుంటే జ్ఞానికి ఆప్యాయతలు ఉండవనీ, ఎవరైనా అవస్థ పడుతున్నా బెల్లం కొట్టిన రాయిలా ఉంటాడనీ అపోహ పడతారు. కాని నిజానికి జ్ఞాని దయాస్వరూపుడు అని కృష్ణపరమాత్మే చెబుతాడు తరువాత.

అర్జునుడు ముందు చూసినట్టుగా ధర్మయుద్ధం చేయటానికి వచ్చాడు. **యుద్ధం అంటే హింస తప్పదు,** బంధుబలగాన్నీ, స్నేహితులనూ చంపక తప్పదు. అది అర్జునునికి కూడా తెలుసు. అహింసను గొప్ప విలువగా మన ధర్మశాస్త్రం అభివర్ణించినా, దాన్ని అక్షరాలా తీసుకోకూడదు. సందర్భాన్నిబట్టి విలువ మారుతుంది. భగవంతుడు దయాస్వరూపుడైనా కూడా అనవసరమైన జాలి చూపించకూడదు అంటాడు. ధర్మసంస్థాపనార్థం దుష్టులను శిక్షించాలని భగవంతుడే చెప్పాడు.

ఈ నియమం క్షత్రియునికి కూడా వర్తిస్తుంది. మహాభారత యుద్ధంలో వేలాది సైనికులు ప్రాణాలు కోల్పోవచ్చు. కాని అర్జునుడు తన లక్ష్యం విషయంలో స్పష్టంగా ఉన్నాడు.

**క్షతాత్ అధర్మాత్ త్రాయతే ఇతి క్షత్రియః**

క్షత్రియుడంటే అధార్మిక వ్యక్తులనుంచి సమాజాన్ని రక్షించేవాడు అని అర్థం. అతను **సామదానభేద మార్గాలు ప్రయత్నించి,** అప్పుడూ కుదరకపోతే దండోపాయానికి రావాలి. అర్జునుడు ఇప్పుడు వేడిగా, వాడిగా ఉన్నాడు. కౌరవులు అధార్మికంగా ఉన్నారని చూపటానికి దుర్బుద్ధే అనే పదం వేశాడని చూశాము. అందువల్ల కోపంగా, యుద్ధం చేయటానికి, మొదటిబాణం వదలటానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ వేడిలో రథాన్ని ఇరుసేనల మధ్య నిలపమన్నాడు. కృష్ణపరమాత్మ అలాగే నిలిపాడు.

**సంజయ ఉవాచ**

శ్లో. 24 **ఏవముక్తో హృషికేశో గుడాకేశేన భారత ।**
**సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥**
ఏవమ్, ఉక్తః, హృషీకేశః, గుడాకేశేన, భారత,
సేనయోః, ఉభయోః, మధ్యే, స్థాపయిత్వా, రథోత్తమమ్ ॥

శ్లో. 25 **భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ॥**
**ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ॥**
భీష్మద్రోణప్రముఖతః, సర్వేషామ్, చ, మహీక్షితామ్,
ఉవాచ, పార్థ, పశ్య, ఏతాన్, సమవేతాన్, కురూన్, ఇతి ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ ధృతరాష్ట్రా! | మధ్యే | = మధ్య |
| గుడాకేశేన | = అర్జునుని చేత | భీష్మద్రోణ ప్రముఖతః | = భీష్మద్రోణాదుల సమక్షమున |
| ఏవమ్ | = ఈ విధముగా | చ | = ఇంకా |
| ఉక్తః | = చెప్పబడిన | సర్వేషామ్ | = సమస్త |
| హృషీకేశః | = శ్రీకృష్ణుడు | మహీక్షితామ్ | = రాజుల యెదుట |
| ఉభయోః | = ఉభయ పక్షములవారి | రథోత్తమమ్ | = ఉత్తమమైన రథమును |
| సేనయోః | = సేనలయొక్క | స్థాపయిత్వా | = నిలిపి |

| | | | |
|---|---|---|---|
| ఇతి, ఉవాచ | = ఈ విధముగా పలికెను | ఏతాన్ | = ఈ |
| పార్థ! | = ఓ అర్జునా! | కురూన్ | = కౌరవులను |
| సమవేతాన్ | = (యుద్ధమునకై) చేరియున్న | పశ్య | = చూడుము |

**సంజయ ఉవాచ।**
**హే భారత! ఏవమ్ గుడాకేశేన ఉక్తః హృషికేశః,**
**ఉభయోః సేనయోః మధ్యే భీష్మ-ద్రోణ- ప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్**
**రథోత్తమమ్ స్థాపయిత్వా, హే 'పార్థ! ఏతాన్ సమవేతాన్ కురూన్ పశ్య', ఇతి ఉవాచ॥**

తా: సంజయుడిట్లు పలికెను - భరతవంశీయుడగు ఓ ధృతరాష్ట్ర మహారాజా! నిద్రను జయించిన అర్జునుడు ఇట్లు పలుకగా సర్వాంతర్యామియగు శ్రీకృష్ణుడు ఉత్తమమైన ఆ రథమును రెండు సేనల మధ్యలో, భీష్ముడు-ద్రోణుల యెదుట, మహారాజులందరి యెదుట నిలబెట్టి, శ్రీకృష్ణుడిట్లు పలికెను - ఓ కుంతీ పుత్రా! ఇచ్చట సమావేశమైన ఈ కౌరవులను చూడుము.

అర్జునుడు కోరినట్టుగా, కృష్ణపరమాత్మ రథాన్ని ఇరుసేనల మధ్య నిలిపాడు. తరువాత, ఇద్దరూ మాట్లాడలేదు. ఇప్పుడు, మళ్ళీ సంజయుడు అందుకుని జరిగిన విషయాన్ని వివరిస్తున్నాడు.

**సంజయ ఉవాచ** - సంజయుడు చెప్పాడు.

**ఉక్తః ఏవం హృషీకేశః** - ఆ విధంగా ఆజ్ఞాపించబడిన కృష్ణపరమాత్మ. ఎవరిచే?

**గుడాకేశేన** - అర్జునుని చేత. ఇక్కడ అర్జునుని గుడాకేశునిగా అభివర్ణిస్తున్నాడు. గుడాకేశ అంటే తమోగుణాన్ని జయించినవాడు. తమోగుణం ఉన్న వ్యక్తి గీతాబోధకు అర్హుడు కాదు. అందువల్ల అర్జునునికి గీతను అందుకునే అర్హత ఉంది కాబట్టి బోధించడం జరిగింది అని వ్యాసాచార్యులు పరోక్షంగా సూచిస్తున్నారు.

**భారత** - సంజయుడు, ధృతరాష్ట్రునిని సంబోధిస్తున్నాడు. కృష్ణపరమాత్మ ఏం చేశాడు?

**సేనయోరుభయోర్మధ్యే ఉత్తమం రథం స్థాపయిత్వా** - కృష్ణపరమాత్మ ఆ దివ్యరథాన్ని ఇరుపక్షాల యోధుల మధ్య నిలిపాడు. అక్కడ అర్జునుడు ఎవరిని చూశాడు?

**సర్వేషాం మహీక్షితామ్ (ప్రముఖతః రథం స్థాపయిత్వా)** - రథాన్ని ప్రముఖ రాజులందరి ముందు నిలబెట్టాడు. ఇక్కడ కృష్ణపరమాత్మ తన లీలను ప్రదర్శించాడు. ఏం చేశాడు?

**భీష్మద్రోణప్రముఖతః** - భీష్మద్రోణుల ముందు నిలబెట్టాడు. కేవలం అర్జునుణ్ణి పరీక్షించటానికే అలా చేశాడు. ఆ రథాన్ని తీసుకెళ్ళి కర్ణుడు లేదా దుర్యోధనుల ముందు నిలబెట్టి ఉంటే, వెంటనే మహాభారతయుద్ధం జరిగి ఉండేది, గీతాబోధకు అవకాశం ఉండేది కాదు. అర్జునునికి భీష్మద్రోణులమీద అభిమానం ఉందని కృష్ణపరమాత్మకు తెలుసు. అతనికి జ్ఞానబోధ చేయటానికి సిద్ధంగా ఉన్నాడు. అందువల్ల రథాన్ని ఒక చోట నిలిపాక,

**ఇతి ఉవాచ** - ఇలా అన్నాడు.

**పార్థ ఏతాన్ సమవేతాన్ కురూన్ పశ్య** – ఓ పార్థా! ఇక్కడ సమావేశమైన ఈ కౌరవవీరులందరినీ చూడు. ఇప్పుడు అర్జునుడు వారిని పరీక్షగా చూడాలి.

శ్లో. 26 **తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్ ।**
**ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా ॥**

శ్లో. 27 **శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి ।**
తత్ర, అపశ్యత్, స్థితాన్, పార్థః, పితౄన్, అథ, పితామహాన్,
ఆచార్యాన్, మాతులాన్, భ్రాతౄన్, పుత్రాన్, పౌత్రాన్, సఖీన్, తథా ॥
శ్వశురాన్, సుహృదః, చ, ఏవ, సేనయోః, ఉభయోః, అపి ।

**తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్ ॥**
శ్లో. 28 **కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ ।**
తాన్, సమీక్ష్య, సః, కౌంతేయః, సర్వాన్, బంధూన్, అవస్థితాన్ ॥
కృపయా, పరయా, ఆవిష్టః, విషీదన్, ఇదమ్, అబ్రవీత్ ।

| | | | | | |
|---|---|---|---|---|---|
| అథ | = | తరువాత | సఖీన్ | = | మిత్రులను |
| పార్థః | = | అర్జునుడు | శ్వశురాన్, చ | = | పిల్లనిచ్చిన మామలను |
| తత్ర | = | అక్కడ | సుహృదః, చ | = | మొదలగు ఆత్మీయులను |
| ఉభయోః | = | ఉభయపక్షముల | ఏవ | = | అందరిని |
| సేనయోః, అపి | = | సేనలందును | అపశ్యత్ | = | చూచెను |
| స్థితాన్ | = | నిలిచియున్న | అవస్థితాన్, తాన్ | = | చేరియున్నవారైన |
| పితౄన్ | = | పినతండ్రులను, పెదతండ్రులను | సర్వాన్, బంధూన్ | = | బంధువులందరిని |
| పితామహాన్ | = | తాతముత్తాతలను | సమీక్ష్య | = | పరికించి |
| ఆచార్యాన్ | = | గురువులను | సః, కౌంతేయ | = | కుంతీపుత్రుడైన అర్జునుడు |
| మాతులాన్ | = | మేనమామలను | పరయా, కృపయా | = | (ఇక్కడ) మిక్కిలి రాగముతో |
| భ్రాతౄన్ | = | సోదరులను | ఆవిష్టః | = | కూడినవాడై |
| పుత్రాన్ | = | పుత్రులను | విషీదన్ | = | శోకించుచు |
| పౌత్రాన్ | = | మనుమలను | ఇదమ్ | = | ఈ వచనమును |
| తథా | = | అలాగే | అబ్రవీత్ | = | పలికెను |

**అథ పార్థః ఉభయోః సేనయోః అపి, తత్ర స్థితాన్ పితౄన్, పితామహాన్, ఆచార్యాన్, మాతులాన్, భ్రాతౄన్, పుత్రాన్, పౌత్రాన్ తథా సఖీన్, శ్వశురాన్, సుహృదః చ ఏవ అపశ్యత్ సః కౌంతేయ, తాన్ సర్వాన్ బన్ధూన్ అవస్థితాన్ సమీక్ష్య పరయా కృపయా ఆవిష్టః, విషీదన్ ఇదమ్ అబ్రవీత్॥**

తా: రెండుసేనలందు కూడా తండ్రులు, తాతలు, ఆచార్యులు, మేనమామలు, సోదరులు, కొడుకులు, మనుమలు, మిత్రులు, మామలు, ప్రాణస్నేహితులు కూడా నిలచియున్నారు. అప్పుడు కుంతీపుత్రుడగు అర్జునుడు అక్కడ వారిని చూచెను.ఆ కుంతీపుత్రుడు యుద్ధసన్నద్ధులై ఉన్న ఆ బంధువులందరినీ బాగా చూచి, మిక్కిలి రాగముతో కూడినవాడై శోకించుచు ఈ వచనమును పలికెను.

**3. అర్జునుని రాగం సమస్య శ్లోకాలు 26-28( మొదటి పాదం) అథ తత్ర పార్థః అపశ్యత్** – అర్జునుడు, కౌరవుల వైపు చూశాడు. ఎవరిని? తన బంధువులను, స్నేహితులను. సంజయుడు ఒక పెద్ద పట్టికను ఇస్తున్నాడు –

**పితౄన్ పితామహాన్ ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీన్** – పితౄన్ – తండ్రులను. తండ్రులను అని బహువచనం ఎందుకు వాడాడు సంజయుడు? ధర్మశాస్త్రం ప్రకారం ప్రతి ఒక్కరికీ ఐదుగురు తండ్రులు ఉంటారు.

**జనితా చ ఉపనేతా చ యశ్చ విద్యాం ప్రయచ్ఛతి**
**అన్నదాతా భయత్రాతా పంచైతే పితరస్మృతాః**

**1. జనితా** – జన్మనిచ్చిన తండ్రి; **2. ఉపనేతా** – ఉపనయనం చేసిన వ్యక్తి; **3 యశ్చ విద్యాం ప్రయచ్ఛతి** – గురువు. గురుకుల వాసాన్ని కూడా గర్భావాసంగా పరిగణించేవారు పూర్వం. గర్భావాసం అంటే తల్లిగర్భంలో ఉండటం. మనమంతా పుట్టినప్పుడు ప్రాకృత పురుషులుగా పుడతాము. అంటే మనుష్యశరీరం ఉన్న పశువులుగా ఉంటాము. అంటే బుద్ధి వికసించదు. గురువు విద్యాభ్యాసం చేయించాక, ధర్మాధర్మ విచక్షణ నేర్పించాక మనం సంస్కృత పురుషులం అవుతాము. జంతు ప్రవృత్తినుంచి మనిషి ప్రవృత్తి నేర్చుకుంటాము. గురుకులవాసంలో గాయత్రీదేవిని తల్లిగా, ఆచార్యుణ్ణి తండ్రిగా పరిగణిస్తారు. అందువల్ల అతనిని ద్విజుడు అంటారు. ద్విజుడు అంటే రెండవసారి పుట్టినవ్యక్తి అని అర్థం.

**4. అన్నదాత** – ఆకలిగా ఉన్నప్పుడు, అన్నం పెట్టి ఆకలి తీర్చిన వ్యక్తి నాలుగవ తండ్రి.

**5. భయత్రాత** – భయం కలిగినప్పుడు భయాన్ని పోగొట్టిన వ్యక్తి ఐదవ తండ్రి.

పితామహాః – తాతలను; ఆచార్యాన్ – ఆచార్యులను; మాతులాన్ – మేనమామలను; భ్రాతౄన్ – సోదరులను; పుత్రాన్ – పుత్రులను; పౌత్రాన్ – మనవళ్ళను; సఖీన్ – సఖులను చూశాడు. సోదరులు అంటే కౌరవులు కూడా సోదర సమానులు, వారి పిల్లలు, వారి మనవళ్ళు తనకు కూడా పిల్లలతో, మనవళ్ళతో సమానం. తరువాత శ్లోకంలో –

**శ్వశురాన్ సుహృదశ్చైవ** – పిల్లనిచ్చిన మామగార్లు మొదలైన ఆత్మీయులను చూశాడు. ఎక్కడ?

**సేనయోరుభయోరపి** – ఉభయసేనలలోనూ చేరియున్నారు వారు.

**తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్** – యుద్ధానికి వచ్చివున్న బంధువులందరినీ చూశాడు అర్జునుడు. బంధువు అంటే మనకు బంధం ఉన్న వ్యక్తి. బంధాన్ని పాశం అంటారు. పాశం అంటే తాడు.

ఈ పాశమనే తాడును మనమే మన మెడ చుట్టూ బిగించుకుంటాము. మన ఆనందం వారితో మనకున్న బంధంమీద ఆధారపడివుంటుంది. సమీక్ష్య అంటే దగ్గరగా పరిశీలించాడు. వారి మోహాలను అంత దగ్గరగా చూసేసరికి, ఏమయింది? అతని వ్యక్తిత్వంలో పూర్తి మార్పు వచ్చింది. ఏమిటా మార్పు?

**కృపయా పరయా ఆవిష్టః** – అర్జునుడు బంధంలో కూరుకుపోయాడు. ఇక్కడ కృప అంటే జాలి, కరుణ కాదు. ఇక్కడ కృప అంటే రాగం. జాలి అనేది జ్ఞానికుండే మంచి లక్షణం; అది మనిషిని బంధించదు; కాని రాగం అనేది అజ్ఞానియొక్క బలహీనత. అది అతనిని బంధిస్తుంది. జాలి మంచిగుణం అయితే, రాగం బలహీనత. జాలి జ్ఞాని లక్షణమైతే, రాగం అజ్ఞాని లక్షణం.

ఇక్కడ అర్జునుడు అజ్ఞాని. అందువల్ల కృపను రాగంగా అర్థం చేసుకోవాలి. అందువల్ల రాగేన ఆవిష్టః అని తీసుకోవాలి. ఈ రాగం అతను కోరుకుంటే రాలేదు. ఈ రాగానికి అతను బానిస అయ్యాడు. జ్ఞాని తన భావోద్రేకాలను తన అదుపులో పెట్టుకోగలడు, అజ్ఞాని భావోద్రేకాలకు బానిస అవుతాడు. జ్ఞాని ప్రయత్నపూర్వకంగా, తెలిసి తెలిసి ఒక భావాన్ని అనుభవిస్తాడు. అజ్ఞాని తన ప్రమేయం లేకుండానే భావోద్రేకానికి లోనవుతాడు.

వ్యాసాచార్యులు ఈ విషయాన్ని చూపించటానికి ఆవిష్ట అనే పదం వేశారు. ఆవిష్ట అంటే బానిస అయ్యాడు. చాలామందికి ఒక సందేహం వస్తూ ఉంటుంది. కోపం చూపించకూడదు అంటారు కాని కోపం చూపించక పోతే ఎవరు మాట వింటారు? పనివారు వినరు; పిల్లలు వినరు; ఉద్యోగులు వినరు – ప్రేమగా, నెమ్మదిగా చెపితే పనులు అవవు అంటారు వారు.

దానికి జవాబు ఒక్కటే! కోపాన్ని ప్రదర్శించవచ్చు కాని, కోపానికి బానిస కాకూడదు. అంటే కోపాన్ని మనకు అవసరమైనప్పుడు మనమే పిలిచి, అరవాల్సిన వారిని అరిచాక, మనమే కోపం తగ్గించుకోవాలి. అంటే కోపాన్ని ప్రదర్శించాలి కాని, నిజంగా కోపం తెచ్చుకోకూడదు. అదే జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్య ఉండే వ్యత్యాసం. జ్ఞాని కోపాన్ని తన అదుపులో పెట్టుకుంటే, అజ్ఞాని కోపం కోరల్లో చిక్కుకుపోతాడు.

ఇక్కడ అర్జునుడు రాగం అనే కోరల్లో చిక్కుకుపోయాడు. రాగం సంసారంయొక్క ప్రాథమిక సమస్య అని చూశాము. ఎప్పుడైతే, మనిషి రాగం అధీనంలోకి వెళ్ళిపోతాడో, అప్పుడే అతని కవల సోదరుడు కూడా అతనిని ఆక్రమిస్తాడు. ఎవరది?

**విషీదన్నిదమబ్రవీత్** – విషీదం అంటే శోకం. ఎక్కడ రాగం ఉంటే అక్కడ శోకం ఉంటుంది. అందువల్ల రాగం ఎంత ఎక్కువ ఉంటే, శోకం కూడా అంత ఎక్కువ ఉంటుంది. అర్జునుని విషయంలో పరయా కృపయా అంటే చాలా ఎక్కువ రాగం ఉంది, అందువల్ల అతని శోకం కూడా ఎక్కువే ఉంటుంది.

అందువల్ల ఇక్కడ అర్జునునిలో పూర్తి మార్పు చూస్తాము. కోపంతో ఎగసిపడే అర్జునుడు, శోకంతో కృంగి పోతున్నాడు. బుద్ధి ప్రధానంగా ఉన్న అర్జునుడు మనస్సు చేసే గారడీకి లొంగిపోతున్నాడు. యోధుడైన అర్జునుడు సంసారి అయిపోతున్నాడు. ఇది మొదటి దశ – గీతాబోధకు వచ్చేముందు, ప్రతి ఒక్కరూ మూడు దశలు

దాటాలి. సైనికుడు సంసారి అవాలి; సంసారి శిష్యుడు అవాలి. ఇప్పటిదాకా సైనికుడు సంసారి అయ్యాడు. ఇంకా సంసారి అర్జునుడు శిష్యుడుగా మారాలి.

ఈ సందర్భం గనుక ఒకవేళ దృశ్యకావ్యం అయివుంటే, ఒకసారి అర్జునుని మొహం, ఇంకొకసారి భీష్మద్రోణుల మొహాలు చూపించి ఉండేవారు. పైగా సన్నివేశానికి తగ్గ నేపథ్య సంగీతం కూడా ఉండేది. అర్జునుడు వారిని చూసి తన బాల్యం గుర్తు తెచ్చుకున్నట్టుగా భీష్మునితో తన ఆటపాటలు, గురువుతో తన శిష్యరికం అన్నీ మనకు చూపించి ఉండేవారు.

కాని ఇది శబ్దకావ్యం. పదాలతోనే సన్నివేశాన్ని చిత్రించాలి. వ్యాసాచార్యులు **కృపయా పరయా ఆవిష్టః** అన్న పదం వేశారు. అక్కడ మనం ఒక్క క్షణం ఆగి, అర్జునునితో మనం కూడా మమేకం చెంది, అతనికి భీష్మద్రోణులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. తాను చిన్నప్పుడు వారి ప్రేమ చూరగొంటే, ఇప్పుడేమో నిర్దాక్షిణ్యంగా వారిమీద బాణాలు ప్రయోగించబోతున్నాడు. యుద్ధంలో తను వారిని సంహరించటం తథ్యం. ఎందుకంటే సాక్షాత్తూ ఆ పరమాత్మే తమవైపు ఉన్నాడు. అలాంటప్పుడు వారిని యుద్ధంలో సంహరించి, ఇంటికి వెళితే వారిరువురూ లేని జీవితాన్ని ఊహించుకోలేక పోతున్నాడు. నిజంగా వారిని అర్జునుడు చంపలేదు. కాని వారు చనిపోతారన్న ఊహే భరించలేక పోతున్నాడు. ఆ ఊహే, అర్జునుని మనస్సులో పెద్ద మార్పు తీసుకువచ్చింది. సంసారంలో పడవేసింది.

సంసారం అంటే ఏమిటి? రాగం, శోకం, మోహం అని అంతకుముందు చూశాము. ఈ మూడింటిలో ఇప్పుడు రెండు చూస్తున్నాము – రాగం, శోకం. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి మనం. అర్జునునికి రాగం కొత్తగా యుద్ధభూమిలో పుట్టుకురాలేదు. అంతకుముందు కూడా భీష్మద్రోణులతో బంధం ఉంది, కాని అప్పుడు ప్రకటితమవలేదు. యుద్ధభూమిలో, తనకు బంధం ఉన్న వారిని కోల్పోతానేమోననే ఆలోచనే, అతనిలో అంతవరకూ లోపల ఎక్కడో అణగివున్న బంధాన్ని పైకి తీసుకువచ్చింది. అప్పటికే భవరోగం ఉంది, కాని తెలియలేదు. యుద్ధరంగంలో బయటపడింది.

అందువల్లనే రాగాన్ని తగ్గించుకోవటం చాలా కష్టం. మనకసలు ఒకరిమీద అంత రాగం ఉందని కాని, వారితో బంధం అంతగా పెనవేసుకుని ఉందని కాని తెలియనే తెలియదు. సమస్య ఉందని తెలిస్తేనే కదా, దాని పరిష్కారం గురించి ఆలోచించేది. అది అలా దాక్కుని ఉండి బయట పడేసరికి, దాని తీవ్రత ఎంత ఎక్కువగా ఉంటుందంటే, ఆ పరిస్థితిలో దాన్ని మనం ఎదుర్కోలేము. ముందేమో సమస్య ఉందని తెలియక, ఏమీ చేయము; సమస్య బాహ్యరూపం దాల్చేసరికి, తీవ్రరూపం దాల్చటంతో ఏమీ చేయలేము.

క్యాన్సర్ మహమ్మారి రోగం. అది వచ్చిన వెంటనే తెలియదు. ఆ రోగం ఆరంభదశలో ఉండగా తెలిస్తే నయం చేయవచ్చు అంటారు. కాని తరచు లేతస్థితిలో తెలియదు. ఆ రోగం తెలివిగా లోపల చేయాల్సినంత నష్టాన్నంతా చేసేసి, అప్పుడు బయటపడుతుంది. దాన్ని సెకండరీ స్టేజి అంటారు. అప్పుడు మనమేమీ చేయలేము. అంటే ప్రైమరీ స్టేజిలో తెలియదు కాబట్టి ఏమీ చేయము; సెకండరీ స్టేజిలో తెలిసినా, మన చేయి దాటిపోవటంతో అప్పుడూ ఏమీ చేయలేము.

ఇదే సూత్రం రాగానికి కూడా వర్తిస్తుంది. రాగం మనను సంసారంలో పడవేస్తున్నదని తెలియని దశలో ఏమీ చేయము; అది సంసారంలో పడవేసినట్లు తెలిసేసరికి, ఏమీ చేయలేము. అంటే రెండు సమస్యలు – **ఏమీ చేయము, ఏమీ చేయలేము**. అర్జునుని పరిస్థితి కూడా అలాగే ఉంది. ఏమీ చేయలేడు. ఎంత శోకంలో మునిగిపోయాడు? వ్యాసాచార్యులు పదాలతోనే అతని శోకతీవ్రతను వర్ణిస్తున్నారు.

**అర్జున ఉవాచ**

శ్లో. 28 **దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥**

శ్లో. 29 **సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥**

దృష్ట్వా, ఇమమ్, స్వజనమ్, కృష్ణ, యుయుత్సుమ్, సముపస్థితమ్ ॥
సీదంతి, మమ, గాత్రాణి, ముఖమ్, చ, పరిశుష్యతి,
వేపథుః, చ, శరీరే, మే, రోమహర్షః, చ, జాయతే ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ! | = ఓ కృష్ణా! | ముఖమ్ | = నోరు |
| సముపస్థితమ్ | = (యుద్ధభూమికి) చేరియున్న | పరిశుష్యతి | = ఎండిపోవుచున్నది |
| యుయుత్సుమ్ | = యుద్ధాభిలాషతోనున్న | చ | = ఇంకా |
| ఇమమ్ స్వజనమ్ | = ఈ స్వజనసముదాయమును | మే | = నాయొక్క |
| దృష్ట్వా | = చూచి | శరీరే | = శరీరమునందు |
| మమ | = నాయొక్క | వేపథుః | = కంపము |
| గాత్రాణి | = అంగములు | రోమహర్షః, చ | = గగుర్పాటు గూడ |
| సీదంతి | = పట్టుతప్పుచున్నవి | జాయతే | = కలుగుచున్నవి |
| చ | = ఇంకా | | |

**హే కృష్ణ! ఇమం స్వజనం యుయుత్సుం సముపస్థితం దృష్ట్వా**
**మమ గాత్రాణి సీదంతి, ముఖం చ పరిశుష్యతి ।**
**మే శరీరే వేపథుః చ, రోమహర్షః చ జాయతే ॥**

తా: తన వారిని చూచి అతనికి అతిశయించిన దయ ఆవేశించెను. అతడు ఖేదమును పొందుచున్నవాడై ఇట్లు పలికెను – ఓ శ్రీకృష్ణా! యుద్ధమును చేయగోరి సంసిద్ధులైయున్న ఈ నా బంధుజనులను చూచి నా అవయవములు క్రుంగిపోవుచున్నవి. నా నోరు కూడా ఎండిపోవుచున్నది. నా శరీరములో వణుకు, గగుర్పాటు కూడా కలుగుచున్నవి.

శ్లో. 30 **గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।**
**న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥**
గాండీవమ్, స్రంసతే, హస్తాత్, త్వక్, చ, ఏవ, పరిదహ్యతే,
న, చ, శక్నోమి, అవస్థాతుమ్, భ్రమతి, ఇవ, చ, మే, మనః ॥

| | | | |
|---|---|---|---|
| హస్తాత్ | = చేతినుంచి | మనః | = మనస్సు |
| గాండీవమ్ | = గాండీవమనే ధనుస్సు | భ్రమతి, ఇవ | = భ్రమించుచున్నట్లున్నది |
| స్రంసతే | = జారిపోవుచున్నది | అవస్థాతుమ్, చ | = నిశ్చలముగా నిలిచి యుండుటకును |
| చ, త్వక్ ఏవ | = ఇంకనూ చర్మము | న, శక్నోమి | = సమర్థుడను కాకున్నాను |
| పరిదహ్యతే | = కాలిపోవుచున్నది | | |
| చ, మే | = అలాగే నాయొక్క | | |

**హస్తాత్ గాండీవం స్రంసతే, త్వక్ చ ఏవ పరిదహ్యతే ।**
**అవస్థాతుం నచ శక్నోమి, మే మనః చ భ్రమతి ఇవ (భవతి) ॥**

తా: చేతినుంచి గాండీవము అనే పేరుగల ధనుస్సు జారిపోవుచున్నది. చర్మము కూడా కాలిపోవుచున్నది. అలాగే నేను నిలబడలేక పోవుచున్నాను. నా మనస్సు భ్రమించుచున్నట్లున్నది.

శ్లో. 31 **నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।**
**న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే ॥**
నిమిత్తాని, చ, పశ్యామి, విపరీతాని, కేశవ,
న, చ, శ్రేయః, అనుపశ్యామి, హత్వా, స్వజనమ్, ఆహవే ॥

| | | | |
|---|---|---|---|
| కేశవ! | = ఓ కృష్ణా! | స్వజనమ్ | = బంధువులను |
| విపరీతాని | = అశుభసూచకములైన | హత్వా | = చంపుటవల్ల |
| నిమిత్తాని, చ | = శకునములను గూడ | శ్రేయః, చ | = (ఏ విధమైన) శ్రేయస్సును గూడ |
| పశ్యామి | = చూచుచున్నాను | న, అనుపశ్యామి | = చూడజాలకున్నాను |
| ఆహవే | = యుద్ధమందు | | |

**హే కేశవ! నిమిత్తాని విపరీతాని చ పశ్యామి।**
**ఆహవే చ స్వజనం హత్వా శ్రేయః న అనుపశ్యామి॥**

తా: ఓ కేశవా! (బ్రహ్మవిష్ణురుద్రరూపుడు) విపరీతములైన శకునములు నాకు కనబడుచున్నవి. నా బంధువులను యుద్ధములో చంపుటవల్ల శ్రేయస్సు కలుగునని నాకు అనిపించుట లేదు.

**4. అర్జునుని శోకం సమస్య శ్లోకాలు 28 (రెండవ పాదం)–35** ఇంతకుముందు శ్లోకాల్లో అంటే 26 నుంచి 28 (28 మొదటి పాదం) వరకూ వ్యాసాచార్యులు సంసారంయొక్క మొదటి లక్షణమైన **రాగాన్ని** చూపించారు. ఇప్పుడు 28 (రెండవ పాదం) నుంచి 35 వరకూ, రెండవ లక్షణమైన **శోకాన్ని** చూపించబోతున్నారు. దాని తరువాత మూడవ లక్షణమైన **మోహాన్ని** చూస్తాము.

ఈ సమస్య ఒక్క అర్జునునికే చెందినది కాదు; సర్వజనీన సమస్య. కాకపోతే ఏ వస్తువుమీద లేదా వ్యక్తిమీద బంధం ఏర్పడుతుందనేది మారుతుంది కాని బంధంవల్ల ఏర్పడే సమస్య మారదు. రాగం ఎంత తీవ్రంగా ఉంటే, శోకం కూడా అంత తీవ్రంగా ఉంటుందని చూశాము. మనస్సు బాగా కలత చెందితే, ఆ బాధ శరీరానికి కూడా పాకుతుంది. మనస్సును బాధిస్తున్న సమస్య చిన్నదైతే, దాన్ని మనస్సులోనే దాచుకుని, పైన పెదవులమీద చిరునవ్వు పులుముకుని, అంతా సవ్యంగా ఉన్నట్టు చెలామణి అయిపోవచ్చు. ఎందుకంటే మనస్సు వేరు, శరీరం వేరు. కాని మనస్సులోని అలజడి తీవ్రరూపం దాలిస్తే మాత్రం, అది స్థూలశరీరానికి కూడా పాకుతుంది.

ఇప్పుడు అర్జునుని రాగం తీవ్రరూపం దాల్చింది కాబట్టి, అది స్థూలశరీరానికి కూడా పాకుతున్నది.

**కృష్ణ ఇమం స్వజనం దృష్ట్వా** – ఓ కృష్ణా, నేను అంతా నా వారిని చూస్తున్నాను. స్వజనులు అంటే వారు నావారు, నేను వారి వాడిని. దీన్నే ఇంకో విధంగా చెప్పాలంటే, అహంకార, మమకారాలు అంటారు. బంధకత్వం. నేను ఫలానావారికి చెందుతాను; వారు నాకు చెందుతారు. ఈ బంధకత్వాన్నే రాగం అంటారు. ఈ బంధకత్వాన్ని **స్వజనం** పదంతో వర్ణిస్తున్నాడు అర్జునుడు.

ఈ స్వజనం పదం మొదటి అధ్యాయంలో పదేపదే వస్తుంది. ఇది చాలా ముఖ్యమైన పదం. కొంతమందిని స్వజనం అనటంలో తప్పేంలేదు. నిజానికి మనం ఈ ప్రపంచంలో జీవనం కొనసాగిస్తునప్పుడు, కొందరితో బంధం పెంచుకోవటం చాలా సహజమైన ప్రవృత్తి. అంతవరకూ తప్పులేదు. కాని ఆ బంధం రాగంగా తీవ్రరూపం దాల్చి, అది మోహంలోకి దింపితేనే ప్రమాదం. మోహం బుద్ధి విచక్షణను కప్పివేసి, ధర్మాధర్మ విచక్షణ చేయనివ్వదు.

ఇంతకుముందు కౌరవులను ఏమన్నాడు? ధార్తరాష్ట్రులనీ, దుర్బుద్ధి కలవారనీ అన్నాడు. ఆ పదాన్ని గుర్తుంచుకోవాలని చూశాము కూడా. శత్రురాజులందరూ దుర్బుద్ధి ఉన్నవారు; వారు అధార్మిక పురుషుడైన దుర్యోధనునితో చేతులు కలిపారు అన్నాడు. అప్పుడు కోపంగా అని ఉంటాడు. అప్పుడు అతని బుద్ధి పనిచేస్తున్నది. ఎందుకంటే ధర్మాధర్మ వివేకం చూపించాడు.

కాని ఇప్పుడు బుద్ధిస్థాయినుంచి మనస్సు స్థాయికి దిగాడు అర్జునుడు. తార్కికంగా ఆలోచించటం మానివేసి భావోద్రేకంతో మాట్లాడుతున్నాడు. అందువల్ల **అధార్మికులు** అన్న నోటితోనే **స్వజనులు** అంటున్నాడు. అంటే స్వజనులు అనుకునేసరికి వారు చేసిన అధర్మం గుర్తురావటం లేదు.

శంకరాచార్యులు తన భాష్యంలో అర్జునుని సమస్యను ఒక్కముక్కలో విశ్లేషించారు.

**అహం యేషాం, మమ ఏతే –** నేను వీరి మనిషిని, వీరు నావారు. దీన్నే వేరే మాటలో చెప్పాలంటే రాగం అనవచ్చు. ఈ రాగాన్ని స్వజనం పదంతో సూచించారు వ్యాసాచార్యులు. స్వజనాన్ని చూశాడు అర్జునుడు. వారు అక్కడికి ఎందుకు వచ్చారు?

**యుయుత్సుం సముపస్థితమ్** – బంధుత్వాన్ని గుర్తు తెచ్చుకోవటానికి కాదు, పాండవులతో యుద్ధం చెయ్యటానికి. కాని వారిని చూసిన అర్జునుని పరిస్థితి ఎలా ఉంది? చాలా డీలా పడిపోయాడు. శారీరకంగా బాగా కృంగిపోయాడు.

ఈ పరిస్థితి ఒక్కసారిగా రాదు. ఒక్క ఆలోచనవల్ల నష్టం జరగదు. పదేపదే ఆ విషయం గురించి ఆలోచించటంవల్ల నష్టం జరుగుతుంది. కోపం గాని, ఈర్ష్య గాని, నిస్పృహ గాని, ఏదైనా సరే ఒక్క ఆలోచనవల్ల పెరగదు. ఉదాహరణకు ఎవరైనా మనను ఒకమాట అంటే, దాన్ని పదేపదే తలుచుకుంటాము.

ఈ విషయాన్ని దృశ్యకావ్యంలో బాగా చూపిస్తారు. ఒక వ్యక్తిని ఎవరో ఏదో అంటే, అతను ఇటూ–అటూ పచార్లు చేస్తున్నట్టూ, ఆమాట అతని చెవిలో గింగుర్లెత్తుతున్నట్టూ చాలాసార్లు చూపిస్తారు. అది తలచుకొంటున్నకొద్దీ, ఇతని మొహంలో రంగులు మారుతుంటాయి.

అందువల్ల ఒక్క ఆలోచన ఎప్పుడూ హానికరం కాదు. దానికి మన సహకారం కావాలి. దాన్ని పెంచి మనమే పోషిస్తాము. మొదటి ఆలోచన మన చేతిలో లేదు, అది సహజంగా జరుగుతుంది. కాని రెండవ ఆలోచన మన చేతిలో ఉంది. అంటే ఎవరైనా ఏదైనా అంటే వెంటనే మనం బాధపడతాము. అది మొదటి ఆలోచన. అదే బాధను పదేపదే తలుచుకుని కృంగిపోవాలా, దాన్ని పారద్రోలాలా అన్నది మన చేతిలో ఉంది. మనం దాన్ని పట్టించుకోకపోతే నీటి బుడగలా అది పేలిపోతుంది. కాని దానికి మనం సహకారం అందించి, పెంచి పోషిస్తే మాత్రం, అది పెద్ద అలలాగా మారి మనను ముంచెత్తే ప్రమాదముంది. అర్జునుడు ఒక్క ఆలోచనను పెంచి పోషించాడు. దాన్ని అలలాగా చేశాడు. అది అతన్ని ముంచెత్తే పరిస్థితి వచ్చింది. అందువల్ల ఏ చేత్తో అయితే వేలాది రాక్షసులను సంహరించాడో, ఇప్పుడా చేత్తో తన గాండీవాన్ని కూడా పట్టుకోలేకుండా ఉన్నాడు.

**సీదంతి మమ గాత్రాణి** – నా చేతులు, కాళ్ళు వణుకుతున్నాయి;

**ముఖం చ పరిశుష్యతి** – నోరు ఎండి పోతోంది. సమస్య మనస్సులో ఉంది, కాని నోరు ఎండిపోతోంది. మీకు అనుమానంగా ఉంటే, ఏదైనా సభలో మాట్లాడటానికి ప్రయత్నించి చూడండి. ప్రసంగమే అవసరం లేదు, ఒక్క నిముషం పట్టే వెల్‌కమ్ స్పీచో, వోట్ ఆఫ్ థ్యాంక్సో అయినా సరే! అంతకుముందు ఎన్నిసార్లు సాధన చేసినా కూడా, మొదటిసారిగా స్టేజీ ఎక్కగానే, మైకు ముందు నిల్చోగానే, జరిగే మొట్టమొదట పని నోరు ఎండి పోతుంది. ఎవరో అద్భుతంగా వర్ణించారు, 'గుండె అంటే పుట్టిన క్షణంనుంచి పనిచేసే అంగం, కాని సభలో ప్రసంగం ఇవ్వటానికి నిల్చుంటే మాత్రం ఆగిపోతుంది.'

**వేపథుశ్చ శరీరే మే** – శరీరం వణికిపోతోంది;

**రోమహర్షశ్చ జాయతే** – రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి;

| | |
|---|---|
| **గాండీవం స్రంసతే హస్తాత్** | – గాండీవము చేతినుంచి జారిపోతున్నది; |
| **త్వక్ చ ఏవ పరిదహ్యతే** | – చర్మం తపించిపోతున్నది; |
| **న చ శక్నోమి అవస్థాతుమ్** | – నేను నిల్చోలేకపోతున్నాను; |
| **భ్రమతి ఇవ చ మే మనః** | – తల తిరుగుతున్నట్టుగా అనిపిస్తోంది; |
| **నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ** | – ఓ కేశవా, అనేక అపశకునాలు కనిపిస్తున్నాయి. |

దీన్నిబట్టి అపశకునాలు మన మనస్సు చూపించినవే అని తెలుస్తోంది. మనస్సు దృఢంగా ఉంటే మంచి శకునాలు చూస్తాము; అదే మనస్సు బలహీనంగా ఉంటే, పిల్లి అడ్డంగా పరుగు తీసింది, ఒంటి బ్రాహ్మణుడు ఎదురయ్యాడు అంటూ లేనిపోని అపశకునాలు చూస్తాము. అలాగే అర్జునుడు కూడా అనేక అపశకునాలు చూస్తున్నాడు.

శోకంయొక్క పర్యవసానం ఏమిటి? నిరాశానిస్పృహలు. సముద్రంలో అల్పపీడనం (డిప్రెషన్) ఏర్పడితే వాన కురుస్తుంది. మనస్సులో అల్పపీడనం ఏర్పడితే ఇక్కడా వాన కురుస్తుంది అంటే కన్నీరు వస్తుంది. ఇది శోకంయొక్క తరువాత స్థితి. అర్జునుడు శోకం అంచులో ఉన్నాడు. అందువల్ల –

**న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే** – యుద్ధంలో నా స్వజనులను చంపటంవల్ల శ్రేయస్సు కలుగుతుందని నాకేమీ అనిపించటం లేదు అంటున్నాడు అర్జునుడు.

నిరాశానిస్పృహల మొట్టమొదటి సూచన ఇది. జీవితానికి అర్థం లేదనిపిస్తుంది. ఇది సంసారంయొక్క సమస్య. ఎవరైనా పోతే, ఇంకెవరికోసం నేను జీవించాలి? ఎవరికోసం తినాలి? ఎవరికోసం నగలు ధరించాలి? ఎవరికోసం ముస్తాబు చేసుకోవాలి? జీవితం శూన్యంగా అనిపిస్తుంది. జీవితానికి అర్థం లేదనిపిస్తుంది. కాని వేదాంతం – సృష్టిలో దేనికైనా అర్థం ఉందంటే, అది నీ ఉనికికే అంటుంది; నీ జీవితానికి అర్థం బాహ్యవస్తువుల్లో కాని మనుష్యుల్లో కాని లేదు అంటుంది. కాని అజ్ఞానంవల్ల మనం ప్రపంచంలో మనుష్యులతోనో, వస్తువులతోనో ఎంతగా బంధం పెంచుకుంటామంటే, వారిమీదే మన ప్రాణాలన్నీ నిలుపుకుంటాము. అందువల్ల వారు ఉంటేనే మన జీవితానికి అర్థముంది అనుకుంటాము.

నిజానికి మనమే తక్కినవారికి అర్థాన్ని కలుగజేస్తున్నాము, కాని మన అజ్ఞానంవల్ల, మన బంధకత్వంవల్ల, వారే మన జీవితాన్ని అర్థవంతంగా చేస్తున్నారు అనుకుంటాము. ఒక సంగీతవిద్వాంసుడు తను సంగీతం పాడలేకపోతే, తన జీవితానికి అర్థం లేదనుకుంటాడు; ఒక క్రీడాకారుడు తను ఆడలేకపోతే, తన జీవితానికి అర్థం లేదనుకుంటాడు. అలా మనం దేనితో బంధం పెంచుకుంటామో అది లేకపోతే మన జీవితం శూన్యం అనుకుంటాము.

వేదాంతం దీన్ని ఒప్పుకోదు. ఎవరూ, ఏదీ మీ జీవితానికి అర్థం ఇవ్వలేదు. మీ జీవితమే అర్థవంతమైనది. మీరే మీ జీవితాన్ని అర్థవంతంగా చేసుకోగలరు కాని, బాహ్యంగా ఏదీ మీ జీవితాన్ని అర్థవంతంగా చెయ్యలేదు.

బాహ్యప్రపంచం ఉన్నా మీ జీవితం అర్థవంతమైనదే; బాహ్యప్రపంచం మొత్తం మాయమయినా కూడా మీ జీవితం అర్థవంతమైనదే. అందువల్ల మీ జీవితాన్ని దేనితోనూ ముడిపెట్టుకోకండి!

ఈ భావనతో మన మనస్సుకు శిక్షణను ఇచ్చుకోవాలి. ఏమిటది? నా జీవితం బాహ్యవస్తువులవల్ల కాదు, నావల్లే అర్థవంతమైనది. అందువల్లనే ఆధ్యాత్మికమైన సాధన చిన్నవయస్సులోనే అవసరం. లేకపోతే మనం దేనిమీద ఆధారపడతామో, అది పడిపోగానే, ఇలాంటి బలహీనత మొదలవుతుంది. అర్జునుడు దానికి సరియైన ఉదాహరణ.

న చ శ్రేయోఽ నుపశ్యామి – నాకు శ్రేయస్సు కలుగుతుందని అనిపించటం లేదు అన్నాడు. ఎప్పుడు?

హత్వా స్వజనమాహవే – ఆత్మీయులైన నా బంధువులను యుద్ధమందు చంపుకోవటంవల్ల.

తను యుద్ధభూమికి ఎందుకు వచ్చాడో మర్చిపోయాడు అర్జునుడు. ధర్మసంస్థాపనార్థం వచ్చాడు. ఆ విషయం పక్కకు వెళ్ళిపోయింది; స్వజనులు పైకి వచ్చారు. ఇంతకుముందే చూసినట్టుగా మనుష్యులు శాశ్వతం కాదు; వచ్చిపోతారు, కాని ధర్మం శాశ్వతం. అందువల్ల మనకు దేనితోనైనా బంధం ఉండాలంటే, అది ధర్మంతో ఉండాలి. శాశ్వతధర్మంతో బంధం ఉండాలి కాని, అశాశ్వతమైన జనులతో కాదు.

**సస్యమివ మర్త్యః పచ్యతే సస్యమివాజాయతే పునః – కఠ**

అశాశ్వతమైన మనుష్యులు అశాశ్వతమైన మనుష్యులను పట్టుకు ప్రాకులాడుతున్నారు. అజ్ఞాని ధర్మంకన్నా మనుష్యులు ముఖ్యం అనుకుంటే, జ్ఞాని అశాశ్వతమైన మనుష్యులకన్నా ధర్మం ముఖ్యం అని తెలుసుకుంటాడు.

శ్లో. 32 **న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।**
**కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా॥**
న, కాంక్షే, విజయమ్, కృష్ణ, న, చ, రాజ్యమ్, సుఖాని, చ,
కిమ్, నః, రాజ్యేన, గోవింద, కిమ్, భోగైః, జీవితేన, వా ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ! | = ఓ కృష్ణా! | గోవింద! | = ఓ కృష్ణా! |
| విజయమ్ | = విజయమును | రాజ్యేన | = రాజ్యముతో |
| న, కాంక్షే | = (నేను) కోరుటలేదు | కిమ్ | = ఏమి పని? |
| చ, రాజ్యమ్, న | = ఇంకా రాజ్యమును సైతము కోరను | వా | = లేక |
| | | భోగైః | = భోగములతో గాని |
| సుఖాని, చ(న) | = సుఖములను కూడ కోరను | జీవితేన | = జీవితముతో గాని |
| నః | = మాకు | కిమ్ | = ఏమి పని? |

**హే కృష్ణ ! విజయం న, రాజ్యం చ సుఖాని చ న కాంక్షే!**
**హే గోవింద! నః రాజ్యేన కిం భోగైః జీవితేన వా కిమ్॥**

తా: ఓ శ్రీకృష్ణా! నేను విజయమును, రాజ్యమును, సుఖములను కూడా కోరుట లేదు. ఓ గోవిందా! మాకు రాజ్యముతో గాని, భోగములతో గాని, జీవితముతో గాని పని యేమున్నది? .

ఇక్కడ అర్జునుడు అజ్ఞానంలో ఉన్నాడు. అందువల్ల అయోమయంలో పడ్డాడు.

**న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ** – ఓ కృష్ణా, నాకు రాజ్యం కాని, విజయం కాని, సుఖాలు కాని అవసరం లేదు.

**కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా** – ఓ గోవిందా, రాజ్యం పొంది లాభమేమిటి? ఈ భోగాలవల్ల ప్రయోజనం ఏమిటి? ఈ జీవితంవల్ల ప్రయోజనం ఏమిటి అంటున్నాడు. ఎక్కణ్ణుంచి ఎక్కడికి వెళుతున్నాడో చూడండి. స్వజనులు లేకపోయాక జీవించివుండి మాత్రం లాభమేమిటి అంటున్నాడు. కాని ధర్మశాస్త్రం నీ జీవితలక్ష్యం నీ చుట్టూ ఉన్న నలుగురికోసం జీవించటం కాదు, ఆధ్యాత్మికంగా ఎదగటం అంటుంది. అది మర్చిపోతే కష్టాలు తప్పవు.

శ్లో. 33 **యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।**
**త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ ॥**
యేషామ్, అర్థే, కాంక్షితమ్, నః, రాజ్యమ్, భోగాః, సుఖాని, చ,
తే, ఇమే, అవస్థితాః, యుద్ధే, ప్రాణాన్, త్యక్త్వా, ధనాని, చ ॥

| | | | |
|---|---|---|---|
| యేషామ్, అర్థే | = ఎవరికోసం | ఇమే | = వీరును – అందరును |
| రాజ్యమ్ | = రాజ్యము | ధనాని | = సంపదల పైనను |
| భోగాః | = భోగములు | చ | = ఇంకా |
| సుఖాని, చ | = సుఖములును | ప్రాణాన్ | = ప్రాణముల పైనను |
| నః | = మాకు | త్యక్త్వా | = ఆశలను వదులుకొని |
| కాంక్షితమ్ | = అభీష్టమో, | యుద్ధే | = యుద్ధమందు |
| తే | = వారును | అవస్థితాః | = (సంసిద్ధులై) నిలిచియున్నారు |

**యేషామ్ అర్థే నః రాజ్యం కాంక్షితం, భోగాః సుఖాని చ।**
**తే ఇమే యుద్ధే ప్రాణాన్ ధనాన్ త్యక్త్వా అవస్థితాః॥**

తా: ఎవరికోసం రాజ్యము, భోగములు, సుఖములును మాకు అభీష్టమో, వారును, వీరును – అందరును, సంపదల పైనను ఇంకా ప్రాణముల పైనను ఆశలను వదులుకొని యుద్ధము చేయుటకు (సంసిద్ధులై) నిలిచియున్నారు

ఇక్కడ కూడా అర్జునుడు మహాభారతయుద్ధం ఎందుకు చేస్తున్నాడో మర్చిపోయాడు.

**యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ** – ఈ యుద్ధం ద్వారా మనం రాజ్యాన్ని, సుఖాలను తిరిగి పొందుదామనుకున్నాము. కాని ఇవన్నీ ఎందుకు? యేషామర్థే – భీష్మద్రోణులకోసం. ఎలా బంధంలో పడిపోయాడో

చూడండి. నేను ఈ రాజ్యం తిరిగిపొంది భీష్మద్రోణులకి అంకితం చేద్దామనుకున్నాను అంటున్నాడు. దీన్నిబట్టే అతని బుద్ధిని రాగం కప్పేసిందని అర్థమవుతున్నది.

మహాభారతయుద్ధం చేయటానికి వచ్చినది, రాజ్యం తిరిగిపొంది భీష్మద్రోణులకు అప్పజెప్పటానికి కాదు. మహాభారతయుద్ధం చేసేది అధర్మంతో. ఆ అధర్మం వైపు ఎవరు ఉన్నా కూడా వారిని నాశనం చేయక తప్పదు. భీష్మద్రోణులు దురదృష్టవశాత్తూ అటు చేరినందుకు, వారిని కూడా నిర్దాక్షిణ్యంగా సంహరించాలని నిర్ణయించుకునే వచ్చాడు. యుద్ధరంగంలోకి అడుగుపెట్టినప్పుడు అతని బుద్ధి స్థిరంగానే ఉంది – నిర్ణయం సరిగ్గానే తీసుకున్నాడు.

ఇప్పుడు భీష్మద్రోణులకోసం నేనీ యుద్ధం చేస్తున్నాను అంటున్నాడు. **యేషాం భీష్మద్రోణాదినాం ప్రయోజనాయ ఏవ రాజ్యం భోగాః సుఖాని చ కాంక్షితమ్** అంటున్నాడు. కాని వీరేం చేస్తున్నారు?

**ఇమే (అస్మిన్) యుద్ధే అవస్థితాః** – కాని వీరు యుద్ధానికి వచ్చివున్నారు. ఎలా?

**ప్రాణాన్ త్యక్త్వా ధనాని చ** – వారే ప్రాణంమీద, ధనంమీద ఆశ వదులుకుని యుద్ధానికి వచ్చి నిలబడ్డారు.

అర్జునుని వాదన ఏమిటంటే, నేను వారిని చంపి యుద్ధంలో గెలిస్తే, నా విజయాన్ని ఎవరికి చూపించుకోను? ఒక వ్యక్తి దగ్గర డబ్బులు ఉన్నాయి కాని, వాటిని పెట్టుకునేందుకు పర్సు లేదు. అందుకని ఆ డబ్బులు పెట్టి పర్సు కొన్నాడు. ఇప్పుడు సమస్య ఏమిటి? డబ్బులు పెట్టి కొన్న పర్సులో పెట్టుకునేందుకు డబ్బులు లేవు. ఇప్పుడు అర్జునుని పరిస్థితి కూడా అలాగే ఉంది. అతని దగ్గర రాజ్యం లేదు. రాజ్యం పొంది భీష్మద్రోణుల పాదాల చెంత మ్రోకరిల్లాలి. కాని ఆ రాజ్యం పొందాలంటే వారందరినీ చంపాలి. వారిని చంపితే, ఎవరికి చూపించాలి రాజ్యాన్ని? అందువల్ల యుద్ధం చేయటంలో అర్థం లేదు అంటున్నాడు.

శ్లో. 34 **ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః ।**
**మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధినస్తథా ॥**
ఆచార్యాః, పితరః, పుత్రాః, తథా, ఏవ, చ, పితామహాః,
మాతులాః, శ్వశురాః, పౌత్రాః, శ్యాలాః, సంబంధినః, తథా ॥

| | | | |
|---|---|---|---|
| ఆచార్యాః | = గురువులు | మాతులాః | = మేనమామలు |
| పితరః | = పినతండ్రులు, పెదతండ్రులు | శ్వశురాః | = పిల్లనిచ్చిన మామలు |
| పుత్రాః, చ | = కుమారులును | పౌత్రాః | = మనుమలు |
| తథా, ఏవ | = అలాగే | శ్యాలాః | = బావమరుదులు |
| పితామహాః | = తాతలు | తథా, సంబంధినః | = ఇతర బంధువులు (చేరియున్నారు) |

**ఆచార్యాః, పితరః, పుత్రాః, తథా ఏవ పితామహాః,**
**మాతులాః, శ్వశురాః, పౌత్రాః, శ్యాలాః, తథా సంబంధినః**
**(ప్రాణాన్ ధనాని చ త్యక్త్వా యుద్ధే అవస్థితాః)॥**

తా: ఆచార్యులు, తండ్రులు, కొడుకులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమలు, బావమరుదులు, ఇంకా ఇతర బంధువులు ఇక్కడే ఉన్నారు.

శ్లో. 35 **ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।**
**అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥**
ఏతాన్, న, హంతుమ్, ఇచ్ఛామి, ఘ్నతః, అపి, మధుసూదన,
అపి, త్రైలోక్యరాజ్యస్య, హేతోః, కిమ్, ను, మహీకృతే ॥

| | | | |
|---|---|---|---|
| మధుసూదన! | = ఓ మధుసూదనా! | ఏతాన్ | = వీరిని (ఈ స్వజనులను) |
| ఘ్నతః, అపి | = (నేను) చంపబడినను | హంతుమ్ | = చంపుటకు |
| త్రైలోక్యరాజ్యస్య | = (లేక) మూడులోకముల రాజ్యాధిపత్యము | న, ఇచ్ఛామి | = ఇష్టపడను |
| | | మహీకృతే | = భూమండలము కోసమైతే |
| హేతోః, అపి | = నిమిత్తమైనను | కిమ్, ను | = చెప్పవలసినదేముంది? |

**హే మధుసూదన! మాం (ఘ్నతః అపి) ఏతాన్,**

**త్రైలోక్య రాజ్యస్య హేతోః అపి న హంతుమ్ ఇచ్ఛామి।కిం ను మహీకృతే ?**

తా: మధుకైటభులనే రాక్షసులను సంహరించిన ఓ మధుసూదనా! వీరు నన్ను చంపుచున్నా నేను వీరిని చంపుటకు ఇష్టపడను. ముల్లోకముల రాజ్యము వచ్చినా నేను వీరిని సంహరించను. ఇక భూలోకరాజ్యము గురించి సంహరించనని వేరుగా చెప్పవలసినదేముంది?

అర్జునుని ముందు ఎవరు నిల్చుని ఉన్నారు? ఎవరెవరిని అర్జునుడు చూశాడో అంతకుముందు (26వ) శ్లోకంలో చూశాము. ఇప్పుడు మళ్ళీ అదే పట్టిక వస్తోంది. దీన్నిబట్టి అర్జునుడు శోకంలో మునిగిపోయాడని తెలుస్తున్నది. ఏదైనా క్లిష్టపరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తే, దానికి ముందునుంచే సిద్ధపడి ఉండాలి. లేకపోతే, హఠాత్తుగా ఆ పరిస్థితి ఎదురైతే, తట్టుకోలేరు. ఆ బలం పొందటానికి దైవభక్తి పెంపొందించుకోమంటారు. అర్జునుడు సిద్ధంగా లేడు. అందువల్ల నీరుకారి పోతున్నాడు. అటువంటి పరిస్థితుల్లో ఒక్కొక్కరు ఒక్కొక్కలాగా ప్రవర్తిస్తారు. కొంతమంది గట్టిగా నవ్వుతారు; కొంతమంది ఏడుస్తారు; కొంతమంది అరుస్తారు.

అర్జునుని మాటల ప్రవాహాన్ని నిశ్శబ్దంగా గమనిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అతని మనస్సులో దుఃఖం అంతా ఉప్పెనలా బయటకు వచ్చేయాలి. అలా రావాలంటే, మధ్యలో కృష్ణపరమాత్మ మాట్లాడకూడదు. మనం కృష్ణపరమాత్మ నుంచి ఈ లక్షణం నేర్చుకోవాలి. ఎవరైనా ఇలా మాటల ప్రవాహంలో పడిపోతే, దానికి ఆనకట్ట వెయ్యకుండా వినాలి. తత్త్వబోధ నేర్పించేయకూడదు. అర్జునుడు ఇంకా ఎదుటవున్న తన బంధుకోటిని వివరిస్తున్నాడు.

**ఆచార్యాః** – గురువులు; **పితరః** – తండ్రులు; **పుత్రాః** – కొడుకులు; **పితామహాః** – తాతలు; **మాతులాః** – మేనమామలు; **శ్వశురాః** – పిల్లనిచ్చిన మామలు; **పౌత్రాః** – మనవలు; **శ్యాలాః** – బావమరదులు; **తథా సంబంధినః**– ఒక్క మాటలో చెప్పాలంటే ఇతర బంధువులు.

**ఏతాన్న హంతుమిచ్ఛామి** – ఏమైనా జరగనీ, నేను వారిని వధించటానికి ఇష్టపడను. ఈ మాట వింటే వారిమీద జాలితో అన్నట్టు అనిపిస్తుంది కాని నిజానికి అది రాగంతో అన్నమాట! ఈ సూక్ష్మభేదం ముందే చూశాము. రాగం ఉన్నచోట ధర్మాధర్మవిచక్షణ ఉండదు. జాలియొక్క గొప్పదనం ఏమిటంటే, ఎంత జాలివున్నా, ధర్మాన్ని మాత్రం వీడదు. న్యాయమూర్తికి నేరస్థునిమీద ఎంతైనా జాలి వుండవచ్చు కాని అతను ధర్మాన్ని నిలబెట్టాలి. అందువల్ల అతనిమీద జాలి చూపకుండా, అవసరమైతే ఉరిశిక్ష కూడా విధిస్తాడు. అతనికి ఉరిశిక్ష విధించినంత మాత్రాన న్యాయమూర్తికి జాలిలేదని విమర్శించలేరు.

అదేవిధంగా, ఇక్కడ అర్జునుడు జాలి చూపిస్తుంటే, అది చూపించకూడని చోట చూపిస్తున్నాడు. అది స్పష్టంగా రాగం మాత్రమే. దీని గురించి ఇంకా ముందుముందు చూస్తాము.

**ఘ్నతోఽపి మధుసూదన** – వారిలో ఎవరైనా నన్ను చంపటానికి ప్రయత్నించినా కూడా, నేను మాత్రము వారిని చంపను మధుసూదనా అంటున్నాడు. మధుసూదన పదం సరియైన సందర్భంలో వేశాడు. నువ్వు చంపావంటే ఎవరిని చంపావు? మధుకైటభులనే అసురులను. అందులో ఏమీ కష్టం లేదు. నేను నా స్వజనులను చంపుకోవాలి. ఆ మాటకొస్తే కృష్ణుడు కూడా ధర్మరక్షణకోసం తన కంసమామను చంపాడు. అది చూడటం లేదు అర్జునుడు.

**అపి త్రైలోక్యరాజ్యస్య** – నాకు మూడులోకాల ఆధిపత్యం వచ్చినా కూడా చంపను. భూలోక, భువర్లోక, సువర్లోకాలను త్రిలోకాలు అంటారు. ఈ మూడు లోకాలను జయించే అవకాశం వచ్చినా నా భీష్మద్రోణుల ముందు అవి తృణప్రాయం.

**కిం ను మహీకృతే** – అలాంటప్పుడు ఈ భూమండల విషయం గురించి చెప్పేదేముంది? త్రిలోకాల విజయమే వీరి ముందు దిగదుడుపు అంటే ఈ చిన్న రాజ్యవిషయం గురించి ప్రత్యేకించి చెప్పేదేముంది? అందువల్ల నేను భీష్మద్రోణులను ఎన్నుకుంటాను, యుద్ధాన్ని కాదు.

శ్లో. 36 **నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన ।**
**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః ॥**
నిహత్య, ధార్తరాష్ట్రాన్, నః, కా, ప్రీతిః, స్యాత్, జనార్దన,
పాపమ్, ఏవ, ఆశ్రయేత్, అస్మాన్, హత్వా, ఏతాన్, ఆతతాయినః ॥

| | | | |
|---|---|---|---|
| జనార్దన! | = ఓ జనార్దనా! | ఆతతాయినః | = ఆతతాయులను (మహాపాపిష్ఠులను) |
| ధార్తరాష్ట్రాన్ | = ధృతరాష్ట్ర కుమారులను | హత్వా | = చంపుటవల్ల |
| నిహత్య | = చంపినచో | అస్మాన్ | = మనలను |
| నః | = మనకు | పాపమ్, | = పాపమే |
| కా, ప్రీతిః స్యాత్ | = ఏమి సంతోషము కలుగును? | ఏవ ఆశ్రయేత్ | = చుట్టుముట్టును |
| ఏతాన్ | = ఈ | | |

**హే జనార్దన! ఏతాన్ ధార్తరాష్ట్రాన్ నిహత్య నః కా ప్రీతిః స్యాత్।**
**ఆతతాయినః హత్వా, అస్మాన్ పాపమ్ ఏవ ఆశ్రయేత్॥**

తా: ఓ జనార్దనా! (దుష్టజనులను శిక్షించువాడా!) ధృతరాష్ట్రుని పుత్రులను సంహరించిన మాకు ఏమి ప్రీతి కలుగును? (కలుగదు). మహాపాపిష్ఠులైన ఈ దుర్మార్గులను సంహరించినచో మాకు పాపమే చుట్టుకొనును.

**5. అర్జునుని మోహం సమస్య శ్లోకాలు 36-47 నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన** - ఓ జనార్దనా, ఈ ధార్తరాష్ట్రులను చంపుటవల్ల నేను ఏం ఆనందం పొందగలను? అంతకు ముందేమన్నాడు?

**ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః యుద్ధే ప్రియచికీర్షవః ॥** - 1.23

దుర్యోధనునికి ప్రీతి కలిగించటంకోసం దుర్బుద్ధితో వచ్చారు వీరంతా అన్నాడు. ఇప్పుడు ఆ దుర్బుద్ధి మాట మర్చిపోయాడు. వారిని చంపితే నాకేమొస్తుంది అంటున్నాడు. మళ్ళీ జనార్దనా అని సంబోధిస్తున్నాడు కృష్ణపరమాత్మని. జనార్ధనుడంటే దుష్టజనాన్ని సంహరించేవాడు. నీకేం సమస్య లేదు, నువ్వు దుష్టజనులను సంహరిస్తావు, నేను నా స్వజనులను సంహరించాలి. అందువల్ల నేను యుద్ధం చేయను.

ఇప్పటిదాకా అర్జునుని సమస్య శోకం మాత్రమే. ఇప్పుడు ఈ శ్లోకంనుంచి మూడవ దశకు చేరుకుంటున్నాడు, అది మోహం. మోహం అంటే ధర్మ-అధర్మ అవివేకం. ఇది సంసారంయొక్క మూడవ లక్షణం అని చూశాము. దీనివల్ల తప్పుడు నిర్ణయం తీసుకుంటాడు. శ్లోకం 28 నుంచి 35 వరకు శోకం సమస్య అయితే, 36 నుంచి 47 వరకూ అంటే ఈ అధ్యాయం చివరివరకూ మోహం సమస్యను ఎదుర్కొంటున్నాడు అర్జునుడు.

**ఎ) అధర్మయుద్ధం** - మోహం అంటే ధర్మాధర్మ అవివేకం అని చూశాము. ధర్మం అంటే ఏమిటి? క్షత్రియుని ధర్మం, అధర్మం చేసేవాణ్ణి శిక్షించటం. ఎలాగైతే న్యాయమూర్తి నేరస్తుణ్ణి శిక్షించాలో, అలాగే క్షత్రియుడు అధర్మంగా ప్రవర్తించేవాణ్ణి శిక్షించాలి; దానికోసం అవసరమైతే హింసించాలి. అలా దండించటం పాపం కాదు. నిజానికి పుణ్యం పొందుతాడు. అందువల్ల మహాభారతయుద్ధం అర్జునునికి పుణ్యాన్ని ఇస్తుంది. కృష్ణపరమాత్మే ఆ విషయాన్ని రెండవ అధ్యాయంలో చెబుతాడు. అక్కడ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।**
**సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ॥** - 2.32

ఓ అర్జునా, ఈ యుద్ధం అదృష్టవంతులైన క్షత్రియులకే లభిస్తుంది. ఈ యుద్ధం స్వర్గధామంలాంటిది. అంటే ఇది పుణ్యకర్మ.

**అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।**
**సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే ॥** - 2.34

అంతేకాదు, నువ్వు ఈ యుద్ధరంగంనుంచి పారిపోతే అది నీకు పాపాన్ని కలుగజేస్తుంది. యుద్ధం పుణ్యం, యుద్ధంనుంచి పలాయనం చిత్తగించటం పాపం అని కృష్ణపరమాత్మ చెప్పబోతున్నాడు. కాని ఇప్పుడు అర్జునుడు

ఆ విచక్షణాబుద్ధిని కోల్పోయాడు. అందువల్ల ధర్మం అధర్మంగా కనిపిస్తోంది. అంటే యుద్ధాన్ని పాపంగానూ, యుద్ధంనుంచి పలాయనం చిత్తగించటాన్ని పుణ్యంగానూ భావిస్తున్నాడు.

**పుణ్యే పాపదృష్టిః పాపే పుణ్యదృష్టిః అతస్మిన్ తత్ బుద్ధిః ఏవ మోహః**

ఈ పుణ్యపాపవిచక్షణను కోల్పోయే మోహబుద్ధిని వ్యాసాచార్యులు అద్భుతంగా వర్ణిస్తున్నారు.

**బి) ప్రత్యవాయ పాపం – పాపమ్ ఏవ ఆశ్రయేత్ అస్మాన్** – ఓ కృష్ణా, వీరిని చంపటంవల్ల మనం పాపం మూటగట్టుకుంటున్నాము. ఎవరిని చంపటంవల్ల?

**హత్వా ఏతాన్ ఆతతాయినః** – ఈ ఆతతాయిలను చంపటంవల్ల. ఇంకొక ఆసక్తికరమైన విషయం. అర్జునుడు ఈ కౌరవులను ఆతతాయిలంటున్నాడు. ఈ పదం ధర్మశాస్త్రంలో వచ్చే సాంకేతిక పదం. పాపాలపట్టిక, వాటి తీవ్రస్థాయిలో వస్తుంది. మద్యం సేవించటం, ధూమపానం, చెడుసావాసం, హత్య చేయటం, హత్య చేయించటం లాంటి అనేక పాపాలను పేర్కొంటుంది ధర్మశాస్త్రం. ఇవేకాక పాతకాలను అంటే తీవ్రమైన పాపాలను పేర్కొంటుంది.

**అగ్నిదో గరదశ్చైవ శస్త్ర పాణిర్ధనాపహః।**

**క్షేత్రదారహరశ్చైవ షడైతే ఆతతాయినః॥**

ఆరు రకాల నేరాలు. **అగ్నిదా** – ఇంకొకరి ఇంటిని కాల్చివేయటం; **గరతః** – ఒక వ్యక్తికి విషాన్ని ఇవ్వటం; **అశస్త్రపాణిర్** – చేతిలో ఆత్మరక్షణకు శస్త్రం లేని వ్యక్తిని చంపటం; **ధనాపహః** – ఇంకొకరి సొమ్మును దొంగలించటం; **క్షేత్రదారహరశ్చైవ** – ఇంకొక వ్యక్తి స్థలాన్ని కాని భార్యను కాని అపహరించటం; **షడైతే ఆతతాయినః**– ఈ ఆరూ పాతకాలు. వీటిని చేసేవారిని ఆతతాయిలు అంటారు. అంటే ఇంకొకరి ఇంటిని కాల్చివేయటం; ఒక వ్యక్తికి విషాన్ని ఇవ్వటం; తన చేతిలో ఆత్మరక్షణకు శస్త్రం లేని వ్యక్తిని చంపటం; ఇంకొకరి సొమ్మును దొంగలించటం; ఇంకొక వ్యక్తి స్థలాన్ని కాని భార్యను కాని అపహరించటం పాతకాలు. అటువంటి పాతకాలను చేసినవారిని ఆతతాయిలు అంటారు.

ఆ రోజుల్లో ఇటువంటి ఆతతాయిలకు శిక్ష ఏమిటి? వారికి ఉరిశిక్షే దండన. దుర్యోధనాదులు చేసిన పాతకాలు ఏమిటి? వారు పాండవుల లక్క ఇంటిని తగలబెట్టారు; భీమునికి విషం ఇచ్చారు; ద్రౌపదిని అపహరించారు. అంటే చాలా నేరాలే చేశారు. వారికి దండన వెంటనే ఉరి తీయించాలి. క్షత్రియుడు అటువంటి వారిని ఉరి తీయకపోతే, పాపం పొందుతాడు. కాని అర్జునుడు ఏమంటున్నాడు? ఈ ఆతతాయిలను నేను చంపితే, నేను ప్రత్యవాయ పాపం పొందుతాను అంటున్నాడు. వారు ఆతతాయిలని తెలుసు, వారిని చంపాలని తెలుసు, అయినా ఈ మాట అంటున్నాడూ అంటే అతని బుద్ధిని మోహం ఎలా కప్పేసిందో చూడండి. ఇది మోహం మొదలయిందని చెప్పటానికి సూచన. రాగం అయింది, శోకం అయింది, ఇప్పుడు మోహం ప్రవేశించింది.

శ్లో. 37 **తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్ ।**
**స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥**
తస్మాత్, న, అర్హాః, వయమ్, హంతుమ్, ధార్తరాష్ట్రాన్, స్వబాంధవాన్,
స్వజనమ్, హి, కథమ్, హత్వా, సుఖినః, స్యామ, మాధవ ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువల్ల | న, అర్హాః | = (వారిని చంపపుటకు)అర్హులము కాము |
| మాధవ! | = ఓ మాధవా! | హి | = ఎందుకంటే |
| స్వబాంధవాన్ | = మన బంధువులైన | స్వజనమ్ | = బంధువులను |
| ధార్తరాష్ట్రాన్ | = ధార్తరాష్ట్రులను | హత్వా | = చంపి |
| హంతుమ్ | = హతమార్చుటకు | కథం, సుఖినః | = ఎలా సుఖము |
| వయమ్ | = మనము | స్యామ | = కలుగుతుంది? |

**హే మాధవ! తస్మాత్ స్వబాంధవాన్ ధార్తరాష్ట్రాన్, హంతుం వయం న అర్హాః ।**
**హి స్వజనం హత్వా కథం సుఖినః స్యామ?॥**

తా: ఓ మాధవా! (లక్ష్మీపతీ!) కావున మాకు బంధువులైన ధృతరాష్ట్రపుత్రులను వధించుట మాకు తగదు. మా వారిని సంహరించుటవల్ల మాకు సుఖము ఎలా కలుగుతుంది? (కలుగదు).

**తస్మాత్** – అందువల్ల. అప్పటికే చాలా వివరంగా వాదనలు ఇచ్చేసినట్టుగా, అర్జునుడు చెబుతున్నాడు.

**వయం ధార్తరాష్ట్రాన్ హంతుం న అర్హాః** – మనం ధార్తరాష్ట్రులను చంపకూడదు. ఎవరు వీరు?

**స్వబాంధవాన్** – మన ఆత్మీయులు, బంధువులు. అంటే బంధువులు అనుకునేసరికి ధర్మశాస్త్రం మారిపోయింది. ఇంతవరకూ ఒక శాస్త్రం; ఇప్పుడు బంధువులు అనుకుంటే ఇంకొక నియమం. జీవితంలో అందరూ చేసేది అదే. కాని మనునీతిశాస్త్రంలో అలా ఉండదు.

**స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ** – ఓ మాధవా! స్వజనులను చంపితే, మనకు సుఖం ఎలా కలుగుతుంది? ముందే చూసినట్టుగా, స్వజనులను అనే పదాన్ని పదేపదే వాడుతున్నాడు. ఈ శ్లోకంలోనే రెండుసార్లు వాడాడు. స్వబాంధవాన్ అన్నాడు, స్వజనం అన్నాడు.

స్వజనులను చంపుకుని ఆనందంగా ఎలా ఉండగలము అంటే దాని అర్థం ఏమిటి? ధర్మం ముఖ్యం కాదు; మన ఆనందంకోసం ధర్మాన్ని కూడా త్యాగం చేయవచ్చు అని అర్జునుడు భావించినట్టు అర్థం. కాని గీతాబోధ ఏమిటి?

**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః**

స్వధర్మాన్ని పాటించాలి; పరధర్మాన్ని వదిలివేయాలి. కాని ప్రస్తుతం అర్జునుడు దీనికి భిన్నమైన ఆలోచనలో ఉన్నాడు. ఆనందమయ జీవితంకోసం స్వధర్మాన్ని త్యాగం చేయాలి అనుకుంటున్నాడు.

శ్లో. 38 **యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః ।**
**కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥**
యద్యపి, ఏతే, న, పశ్యంతి, లోభోపహతచేతసః,
కులక్షయకృతమ్, దోషమ్, మిత్రద్రోహే, చ, పాతకమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యద్యపి | = ఒకవేళ | దోషమ్, చ | = దోషమును |
| లోభోపహతచేతసః | = లోభముచే భ్రష్టచిత్తులై | మిత్రద్రోహే | = మిత్రద్రోహకారణముగా |
| ఏతే | = వీరు | పాతకమ్, చ | = (కలుగు) పాపమును |
| కులక్షయ | = కులనాశము | న, పశ్యంతి | = చూడకున్నవారైనను |
| కృతమ్ | = వల్ల కలుగు | | |

**యది అపి ఏతే లోభః ఉపహత చేతసః**
**కులక్షయకృతం దోషం, మిత్రద్రోహే చ పాతకం న పశ్యంతి।**

తా: ఒకవేళ లోభముచే భ్రష్టచిత్తులై వీరు కులనాశమువల్ల కలుగు దోషమును, మిత్రద్రోహకారణముగా (కలుగు) పాపమును, చూడకున్నవారైనను,

అర్జునుడు పూర్తిగా అయోమయంలో పడిపోయాడు. ఆ విషయం మనకు స్పష్టంగానే తెలుస్తున్నది కాని వచ్చిన చిక్కేమిటంటే, అర్జునుడు తనకు ఇప్పుడు స్పష్టమైన అవగాహన ఉంది అనుకుంటున్నాడు. మనమేమన్నాం? అతనికి యుద్ధభూమికి రాకముందు స్పష్టమైన అవగాహన ఉంది, కాని స్వజనులను చూసి రాగ–శోక–మోహాల్లో పడ్డాడు, అందువల్ల అతని బుద్ధి పదునుగా పనిచేయటం లేదు అన్నాము. కాని అర్జునుడు దానికి పూర్తి భిన్నంగా ఆలోచిస్తున్నాడు. తను యుద్ధభూమికి రాకముందు తన బుద్ధి సందిగ్ధంలో పడింది కాని, యుద్ధభూమికి వచ్చి, స్వజనులను చూశాక, స్పష్టమైన అవగాహన కలిగింది అనుకుంటున్నాడు. ఇలా పొరపాటు పడటం ఒక్క అర్జునుని సమస్య మాత్రమే కాదు, అందరికీ సమానంగా కలిగే సమస్యే.

మనం భావోద్రేకానికి లోనై తప్పుడు నిర్ణయం తీసుకుంటున్నప్పుడు, ప్రపంచమంతా అయోమయంలో పడింది, మనం మాత్రమే సరిగ్గా, స్పష్టంగా ఆలోచించగలుగుతున్నాము అనుకుంటాము. ఇది మనస్సు చేసే గారడీ. మనస్సు మోహంలో పడ్డప్పుడు, అది ఎంత శక్తిని పుంజుకుంటుందంటే, అది బుద్ధిని కూడా కప్పి వేస్తుంది. అలాంటి పరిస్థితిలో బుద్ధి మనస్సుతో పోరాడి గెలవకలేక, బుద్ధిగా మనస్సుకు లొంగిపోతుంది.

'అణగద్రొక్కి చూడు, లేదా అణగిపో,' అని అంటారు. ఒక వ్యక్తితో యుద్ధం చేయటానికి ప్రయత్నించి, అతనితో గెలవలేకపోతే, అతనితో చేతులు కలిపేయాలి. అలాగే మనస్సు చేసే గారడీలను, బుద్ధి సమర్థించే పరిస్థితి ఏర్పడుతుంది. ధూమపానం వ్యసనం అని బుద్ధికి తెలుసు. కాని మనస్సు వదలకుండా దాని వెంట పడుతుంటే, బుద్ధి నెమ్మదిగా ఆ వ్యసనాన్ని సమర్థించటానికి ప్రయత్నిస్తుంది. నేను సిగరెట్టు కాల్చకపోతే,

కంపెనీ ఏమవుతుంది, అందులో పనిచేసే ఉద్యోగులు ఏమవుతారు అని కుంటిసాకులు చెబుతుంది పైపెచ్చు. అలాగే మద్యపానం. అలా మనస్సు చేసే అక్రమాలన్నిటినీ సమర్థించుకుంటూ వస్తుంది పాపం బుద్ధి.

అంతేకాదు, ఆ బుద్ధికి శాస్త్రం తెలిస్తే అందులోంచి కూడా ఉదాహరణలను ఇస్తుంది. ఇదే దయ్యాలు వేదాలు వల్లించటం అంటే. మన శాస్త్రంలో ప్రతివాదనకూ తగ్గ వాక్యాలు ఉంటాయి.

**యోగరతో వా భోగరతో వా సంగరతో వా సంగవిహీనః**

**యస్య బ్రహ్మణి రమతే చిత్తం నందతి నందతి నందత్యేవ – భజగోవిందమ్**

నువ్వు యోగివైనా, భోగివైనా మనస్సు బ్రహ్మలో రమించాలి. మద్యపానం, ధూమపానం చేసేవారు ఈ మాటలు ఉటంకిస్తారు. అలాగే గుడికి వెళ్ళటానికి బద్ధకించేవారు దేవుడు సర్వవ్యాపకుడు, నా మనస్సులోనే ఉన్నాడు అంటారు. దానికి శివానందలహరినుంచి ఉటంకిస్తారు –

**గుహాయాం గేహే వా బహిరపి వనే వాఽద్రిశిఖరే**

**జలే వా వాహ్నౌ వా వసతు వసతేః కిం వద ఫలమ్**

**సదా యస్యైవాంతఃకరణమపి శంభో తవ పదే**

**స్థితం చేద్యోగోఽసౌ స చ పరమయోగి స చ సుఖీ –** శివానందలహరి 12

ఎక్కడ ఉన్నా మనస్సు భగవంతునిమీద నిలిస్తే చాలు అంటారు అందులో. నా మనస్సు భగవంతునిమీదే ఉంది అంటే దాన్ని ఎవరూ అవుననలేరు, కాదనలేరు.

**సి) కులక్షయం –** ఆ విధంగా అర్జునుని బుద్ధి, అతని మనస్సు చెప్పుచేతల్లోకి వెళ్ళిపోయింది. అందువల్ల యుద్ధంవల్ల జరిగే హాని గురించి మాట్లాడుతున్నాడు అతను. అతను చెప్పే హాని సత్యమే కాని అది అనువైన సమయం కాదు, అనువైన ప్రదేశం కాదు, అది బుద్ధి ఉపయోగించి చెబుతున్న మాటలు అంతకన్నా కావు. కాని 38వ శ్లోకంనుంచీ అర్జునుడు యుద్ధంవల్ల జరిగే కులక్షయం గురించి మాట్లాడుతున్నాడు.

పాపం దుర్యోధనాదులు అయోమయంలో పడి యుద్ధరంగానికి వచ్చారు. కాని మనకు ధర్మాధర్మాలు స్పష్టంగా తెలుసు, స్వజనులతో యుద్ధం చేయటం మంచిదికాదు! మనం యుద్ధరంగంనుంచి తప్పుకుంటే అప్పుడు యుద్ధం జరగదు కదా!

అందువల్ల అర్జునుడు ఏమంటున్నాడు?

**ఏతే న పశ్యంతి** – ఏతే అంటే దుర్యోధనాదులు. వారు స్పష్టంగా చూడలేకపోతున్నారుట. ఎందువల్ల?

**లోభోపహతచేతసః** – లోభంవల్ల వారి బుద్ధి సరిగ్గా పనిచేయటంలేదు. అందువల్ల యుద్ధంవల్ల జరిగే నష్టాలు వారికి తెలియటం లేదు. ఏమిటవి? ఇంకా వివరంగా తరువాత చెబుతాడు. ఇక్కడ వాటిని పేర్కొంటున్నాడు.

**కులక్షయకృతం దోషమ్** – ఒక కుటుంబంలోని మగవారిని సంహరిస్తే, ఆ కులం అంతరించి పోతుంది. పూర్వం పురుషులే కుటుంబాన్ని పోషించేవారు కాబట్టి, ఆ కుటుంబపెద్ద మరణిస్తే, ఆ కుటుంబం అంతరించి పోతుంది.

అలా యుద్ధంవల్ల ఎన్నో కుటుంబాలు అంతరించి పోతాయి. ఈ నష్టాన్ని దుర్యోధనాదులు గుర్తించలేక పోతున్నారు. అంతేకాదు, ఇంకొక పాపం కూడా జరగబోతున్నది – ఏమిటది?

**మిత్రద్రోహే చ పాతకమ్** – మిత్రద్రోహమనే మహాపాతకం కూడా చేయబోతున్నాము. ఎందుకంటే, యుద్ధంలో పాల్గొనటానికి బంధువులే కాదు, మిత్రులు కూడా వచ్చారు. మిత్రుడంటే ఎవరు? ఆపదలో ఆదుకునేవాడు. కాని నేను వారిని చంపబోతున్నాను. అసలు ఎవరినైనా చంపటమే పాపం. మిత్రుణ్ణి చంపటం మహాపాపం. ఈ విషయం దుర్యోధనుడు గుర్తించలేదు, కాని అదృష్టవశాత్తూ మనం గుర్తించాము. అందువల్ల యుద్ధాన్ని విరమిద్దాము. రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పట్లు! ఇరుసైన్యాల వారూ పోరాడితేనే కదా యుద్ధం!

అర్జునుడు తను యుద్ధం చేయనంటున్నాడు. ఈ వాదనను 46 వరకూ కొనసాగిస్తున్నాడు. వాదన చూడటానికి సరదాగా ఉంటుంది. యుద్ధంవల్ల కలిగే తీవ్రపరిణామాలను చర్చిస్తున్నాడు.

శ్లో. 39 **కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।**
**కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥**
కథమ్, న, జ్ఞేయమ్, అస్మాభిః, పాపాత్, అస్మాత్, నివర్తితుమ్,
కులక్షయకృతమ్, దోషమ్, ప్రపశ్యద్భిః, జనార్దన ॥

| | | | |
|---|---|---|---|
| జనార్దన! | = ఓ జనార్దనా! | అస్మాత్ | = ఈ విధమైన |
| కులక్షయకృతమ్ | = కులక్షయమువల్ల కలుగు | పాపాత్ | = పాపమునుంచి |
| దోషమ్ | = దోషమును | నివర్తితుమ్ | = నివర్తించుటకు |
| ప్రపశ్యద్భిః | = చక్కగా తెలుసుకున్న వారమైన | కథమ్ | = ఎందుకు |
| అస్మాభిః | = మనచేత | న, జ్ఞేయమ్ | = ఆలోచింపరాదు? |

**హే జనార్దన! కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిః**
**అస్మాభిః అస్మాత్ పాపాత్ నివర్తితుం కథం న జ్ఞేయమ్॥**

తా: ఓ జనార్దనా! కులక్షయమువల్ల కలుగు దోషమును చక్కగా తెలుసుకున్న వారమైన మనచే ఈ విధమైన పాపమునుంచి నివర్తించుటకు ఎందుకు ఆలోచింపరాదు?

**జనార్దన దోషం ప్రపశ్యద్భిః** – ఓ జనార్దనా, మనం యుద్ధంవల్ల జరిగే అరిష్టాలను స్పష్టంగా చూడగలుగుతున్నాము. దుర్యోధనాదుల బుద్ధి సరిగ్గా పనిచేయటం లేదు కాబట్టి, వారు చూడలేకపోతున్నారు. ఏమిటా దోషం?

**కులక్షయకృతం (దోషమ్)** – ముందు శ్లోకంలో చెప్పిందే మళ్ళీ చెబుతున్నాడు. కులక్షయం జరిగిపోతుంది.

**అస్మాభిః** – మనచేత;

**అస్మాత్ పాపాత్ నివర్తితుం కథం న జ్ఞేయమ్** – కులనాశనంవల్ల కలిగే నష్టాలను తెలిసిన మనం ఎందుకు ఈ పాపాన్ని చేయకుండా ఉండకూడదని కృష్ణపరమాత్మను అడుగుతున్నాడు. కృష్ణపరమాత్మ రథం దారి మళ్ళించాలి

కదా! కృష్ణపరమాత్మ, అర్జునుని మోహావేశానికి, మనస్సులో నవ్వుకుంటూ ఉండవచ్చు, కాని అతను ఏమీ చలనం లేకుండా కూర్చున్నాడు. అర్జునుని కోరిక మేరకు రథాన్ని వెనక్కి తిప్పనూ లేదు, అలాగని అతనితో వాదనకూ దిగలేదు. అలా వాదించాలంటే, అర్జునుడు వినే పరిస్థితిలో ఉండాలి.

వినే స్థితిలో లేనివానికి ఎంత చెప్పినా అది అరణ్యరోదనం అవుతుంది. అంటే అడవిలో ఏడవటం. నిజానికి మన కుటుంబాలలో జరిగేది అదే. వినే పరిస్థితిలో లేనప్పుడు సలహాలు ఇస్తూ ఉంటాము. కృష్ణపరమాత్మకు ఎప్పుడు మాట్లాడాలో తెలుసు. అందువల్ల మౌనంగా వింటున్నాడు. అర్జునుడు వినే స్థితిలో లేకపోగా, ఇంకా ఇంకా మాట్లాడే స్థితిలో ఉన్నాడు.

శ్లో. 40 **కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।**
**ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మోఽభిభవత్యుత ॥**
కులక్షయే, ప్రణశ్యంతి, కులధర్మాః, సనాతనాః,
ధర్మే, నష్టే, కులమ్, కృత్స్నమ్, అధర్మః, అభిభవతి, ఉత ॥

| | | | |
|---|---|---|---|
| కులక్షయే | = కులక్షయ కారణముగ | కృత్స్నమ్ | = సమస్తమైన |
| సనాతనాః | = సనాతనములైన | కులమ్ | = వంశమందు |
| కులధర్మాః | = కులధర్మములు | అధర్మః, ఉత | = అధర్మమే |
| ప్రణశ్యంతి | = నశించిపోవును | అభిభవతి | = వ్యాపించును |
| ధర్మే, నష్టే | = ధర్మము నశిస్తే | | |

**కులక్షయే సనాతనాః కులధర్మాః ప్రణశ్యంతి।**
**ఉత ధర్మే నష్టే అధర్మః కృత్స్నం కులమ్ అభిభవతి ॥**

తా: కులము నశించగా సనాతనములైన కులధర్మములు నశించును. ధర్మము నశిస్తే అధర్మము కులమంతనూ నిశ్చయముగా వ్యాపించును.

కుటుంబం నాశనమయితే జరిగే పరిణామాలను వివరిస్తున్నాడు అర్జునుడు. సమాజంలో ఆరోగ్యకరమైన కుటుంబాలు లేకపోతే, అంటే కుటుంబంలో పటిష్టమైన అనుబంధాలు లేకపోతే కులధర్మం నశిస్తుంది. ధర్మం లేనిచోట మతం ఉండదు; సంస్కృతి ఉండదు; ఆధ్యాత్మికతకు చోటు ఉండదు. అందువల్ల ధర్మం కానీ, సంస్కృతి కానీ, మతం కానీ, ఆధ్యాత్మికత కానీ పెరగాలంటే కుటుంబం పటిష్టంగా ఉండాలి.

భారతదేశంలో కుటుంబంలో బంధాలు బలంగా పెనవేసుకుని ఉంటాయి. మన శాస్త్రం మనకు ఆరోగ్యకరమైన కుటుంబ జీవనం గురించి నేర్పించింది. ఒక దేశం బాగుండాలంటే, దాన్ని పాలించే ప్రభుత్వం స్థిరంగా ఉండాలి; ఒక జాతి సంస్కృతి నిలబడాలంటే కుటుంబం పటిష్టంగా ఉండాలి.

**కులక్షయే ప్రణశ్యంతి** – ఎప్పుడైతే కుటుంబాలు నాశనమవుతాయో, అప్పుడే

**కులధర్మాః సనాతనాః** – సనాతనములైన కులధర్మాలన్నీ నశిస్తాయి.

**ధర్మే నష్టే కులం కృత్స్నమ్** – ధర్మం నశించినప్పుడు, కులంలో అధర్మం పెరిగిపోతుంది.
**అధర్మోఽ భిభవత్యుత** – అధర్మం అంటే అర్థకామాలు మాత్రమే కోరుకుంటారు. డబ్బుకూ, సుఖాలకూ మాత్రమే విలువనిస్తారు. వాటికోసం విలువలను వదులుకోవటానికి కూడా వెనుకాడరు. అటువంటి లౌకిక జీవనవిధానాన్ని అధార్మిక జీవనం అంటారు. అది విలువలను పారద్రోలుతుంది.

శ్లో. 41 **అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః ।**
**స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥**
అధర్మాభిభవాత్, కృష్ణ, ప్రదుష్యంతి, కులస్త్రియః,
స్త్రీషు, దుష్టాసు, వార్ష్ణేయ , జాయతే, వర్ణసంకరః ॥

| | | | |
|---|---|---|---|
| కృష్ణ! | = ఓ కృష్ణా! | వార్ష్ణేయ | = కృష్ణా! |
| అధర్మాభిభవాత్ | = అధర్మము (పాపము) అధికమగుటవల్ల | స్త్రీషు | = స్త్రీలు |
| | | దుష్టాసు | = దూషితులైనపుడు |
| కులస్త్రియః | = కులస్త్రీలు | వర్ణసంకరః | = వర్ణసంకరము |
| ప్రదుష్యంతి | = మిక్కిలి దూషితలగుదురు | జాయతే | = ఉత్పన్నమగును |

**హే కృష్ణ! అధర్మ అభిభవాత్ కులస్త్రియః ప్రదుష్యంతి।**
**హే వార్ష్ణేయ! స్త్రీషు దుష్టాసు వర్ణసంకరః జాయతే ॥**

తా: వృష్ణివంశోద్భవుడవగు ఓ శ్రీకృష్ణా! అధర్మము ధర్మమును జయించుటవల్ల కులస్త్రీలు పూర్తిగా చెడిపోయెదరు. కులస్త్రీలు చెడిపోయినచో, వర్ణములందు సాంకర్యమేర్పడును.

పిల్లలలో సంస్కారం పెరగటానికి, విలువలు పెరగటానికి, పటిష్టమైన కుటుంబ జీవనం చాలా అవసరం. ఎందుకంటే వారి మానసిక స్థితి చిన్నవయస్సులో, అంటే ఊహ తెలియని వయస్సులోనే ఏర్పడుతుంది. ఎలాగైతే చిన్న వయస్సులో సరిగ్గా ఆహారం తీసుకోకపోతే, పెద్దయ్యాక ఆరోగ్యం బాగుండదో, అలాగే చిన్నప్పుడు పిల్లలు సరియైన వాతావరణంలో పెరగకపోతే, వారి మనస్సు సరిగ్గా పరిపక్వత చెందదు. దీనిమీద చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇంట్లో వాతావరణ ప్రభావం పిల్లల ఎదుగుదలమీద చాలా ఉంటుందని నిరూపించబడింది వాటిలో.

చిన్న వయస్సులో పిల్లలకు మంచేదో, చెడేదో తెలియదు – ఆ వయస్సులో వారికి తల్లిదండ్రులు దేవునితో సమానం. వారి దృష్టిలో తల్లిదండ్రులు సర్వజ్ఞులు, సర్వశక్తిమంతులు. అందువల్ల వారికి తెలియకుండానే తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తారు. వారు ఎటువంటి విలువలను గమనిస్తే, అటువంటి విలువలనే పెంపొందించుకుంటారు. అంతేకాదు, తల్లిదండ్రులు వారినెలా చూస్తే, వారిమీద అభిప్రాయాన్ని అలాగే

పెంచుకుంటారు. వారిని ప్రోత్సహిస్తే, ఉత్సాహంగా పనులు చేస్తారు. వారిని ప్రత్యేకంగా రాజాలాగ చూస్తే, వారికి కూడా వారిమీద గౌరవం ఏర్పడుతుంది. వారిమీద వారికి ఆత్మస్థైర్యం ఏర్పడుతుంది. అలా కాకుండా వారిని ఎప్పుడూ విమర్శిస్తూంటే, వారు ఏదీ సాధించలేకపోగా, ఆత్మన్యూనతాభావనతో బాధ పడతారు. నేను ఏదీ సాధించలేను అని నిశ్చయించేసుకుంటారు. ఎవరిచ్చారు వారికి ఆ భావనను? సాక్షాత్తూ తల్లిదండ్రులే!

ఆరోగ్యకరమైన మనస్సు అంటే తనను తాను గౌరవించుకునే మనస్సు –

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥** – 6.5

నిన్ను నువ్వు కించపరుచుకుంటే, ఎవరూ నిన్ను ఉద్ధరించలేరు. సాక్షాత్తూ ఆ భగవంతుడే దిగివచ్చి నువ్వు మోక్షాన్ని పొందగలవు అని చెప్పినా, మనం భగవంతునితో, నా గురించి నీకు తెలియదు అని వాదిస్తాము. వంద మంది గురువులు వచ్చి చెప్పినా, వారిని జాలిగా చూస్తాము. శాస్త్రం చెప్పినా నమ్మము. ఎందుకు? మనకు ఆత్మస్థైర్యం లేకపోవటంవల్ల. మనం జీవితంలో ఏదైనా సాధించాలంటే ఈశ్వరకృప, శాస్త్రకృప, గురుకృప, ఆత్మకృప ఉండాలి. మొదటి మూడూ సమృద్ధిగానే ఉన్నాయి, కాని ఆత్మకృపే ఉండదు. ఆత్మకృప లేకపోతే ఏదీ సాధించలేము. ఆత్మకృప అంటే మనం సాధించగలమనే నమ్మకం, ఆత్మస్థైర్యం. అది ఉండాలంటే బాల్యంలో ఆ బీజం పడాలి. బాల్యంలో ఆ బీజం పడాలంటే, కుటుంబ వాతావరణం బాగుండాలి.

నేరాలు జరుగుతున్న కారణాలను పరిశీలిస్తే, దాని వెనక నేరస్థునికున్న ఆత్మన్యూనతాభావనే కనిపిస్తుంది. అందువల్ల, మనమీద మనకు గౌరవం ఉండాలి, దాన్ని అహంకారంగా, గర్వంగా చిత్రిస్తారు కొందరు. కాని అహంకారం ఉండాలి, అహంకారం ద్వారా మనస్సును పరిపక్వం చెందించి, ఆ తరువాత అహంకారాన్ని వదులుకోవాలి. అందువల్ల ఆత్మగౌరవం ఉండాలి, అది కుటుంబంవల్లనే సాధ్యం.

మంచి కుటుంబంవల్ల విలువలను పెంపొందించుకుంటారు పిల్లలు. పిల్లలకు ధర్మం బోధించాలి అంటే, వారు ఎలా నేర్చుకుంటారు? తల్లిదండ్రుల జీవనవిధానాన్ని అనుకరించటం ద్వారా. తల్లిదండ్రులు చెడు మాటలు మాట్లాడితే, పిల్లలు కూడా చెడు మాటలే మాట్లాడతారు. తల్లిదండ్రులు మంచి అలవాట్లు నేర్పితే, పిల్లలు అవి నేర్చుకుంటారు.

తల్లిగర్భంలో ఉండగానే, ఆ గర్భస్థ శిశువుకు తనను తల్లీ, తక్కిన కుటుంబ సభ్యులూ ఆనందంగా స్వాగతం పలుకుతారో లేదో తెలుస్తుందిట. అందువల్లనే సీమంతంలాంటి వేడుకలు చేస్తారు. మొట్టమొదటి గురువు తల్లి; తరువాత గురువు తండ్రి, ఆ తరువాత వచ్చే గురువు ఆచార్యుడు. అందువల్లనే మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ అంటారు. తల్లిదండ్రులు పిల్లలకు అద్భుతమైన గురువులు. పెద్దవారేం చేస్తే, పిల్లలు అది చేయటానికి ప్రయత్నిస్తారు. అందువల్ల తల్లిదండ్రులు సరిగ్గా లేకపోతే వారు వేరే ఎవరినో అనుకరిస్తారు.

పిల్లలకు మంచి విలువలు నేర్పించకపోతే ఎలా ఉంటుందో చూపించటానికి ఇదొక ఉదాహరణ. తల్లి ఒక ఆంగ్ల సంగీతకచేరికి తన పిల్లవాణ్ణి తీసుకువెళ్ళింది. ఆ పిల్లవాడు ఒక వాద్యకారుని చూపించి, 'అతను ఎందుకు

అందరినీ కర్ర చూపించి బెదిరిస్తున్నాడు?' అని అడిగాడుట. 'అది బెదిరించటం కాదు నాన్నా, అతను పాటను వాయిస్తున్నాడు,' అందిట. 'అతను బెదిరించకపోతే, ఆవిడెందుకు అరుస్తోంది?' అన్నాడుట. 'అది అరుపు కాదు నాన్నా, పాట,' అని చెప్పాల్సివచ్చింది. సంగీతం గురించి తెలియకపోతే ఇలాగే ఉంటుంది. ఇది చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? తల్లిదండ్రులది. అలా వారు మంచి విలువలు నేర్పాలంటే, ఆ కుటుంబం పదికాలాల పాటు స్థిరంగా ఉండాలి. తల్లిదండ్రుల మధ్య ఆప్యాయతానురాగాలు ఉండాలి. ఇల్లు అంటే సున్నం, ఇటుకలతో కట్టింది కాదు, ఇల్లు అంటే కుటుంబం. మమతానురాగాలు వెల్లివిరిసే అందమైన హరివిల్లు. అటువంటి ప్రేమానురాగాల మధ్య పిల్లలు పెరిగితే, వారి జీవితం ఉన్నతంగా ఉంటుంది.

ఒకసారి స్వామీజీ ఒక ఇంటికి భిక్షకి వెళ్ళినప్పుడు, ఆ కుటుంబం వారి ఏడాదిన్నర బాబును, 'స్వామీజీకి నమస్కారం చెయ్యి,' అన్నారు. స్వామీజీ ఒక కాలు కింద, ఒక కాలు పైన పెట్టుకుని కూర్చున్నారు. ఆ బాబు ఏం చేశాడో తెలుసా? టక్కున పైన ఉన్న స్వామీజీ కాలును లాగి, రెండు కాళ్ళు ఒకచోట పెట్టి, రెండు కాళ్ళమీద తల ఉంచి నమస్కారం చేశాడు. స్వామీజీ ఆశ్చర్యానికి అవధులు లేవు. అంత పాలుగారే పసిబాలుడు, అంత చక్కటి ప్రవర్తన ఎలా చూపగలిగాడు? బామ్మ, తాతగార్ల పెంపకంవల్ల. ఎవరికైనా నమస్కారం చేసేటప్పుడు, వారి పాదాలమీద తల ఉంచి నమస్కారం చేయాలని చూపించేవారు, స్వామీజీ రెండోకాలు అందుబాటులో లేకపోయేసరికి, ఆ పసికందు తనే ఆ కాలును కిందకు దింపాడు. ఇది మాటలతో చెపితే అర్థం చేసుకునే వయస్సు కాదు అతనిది. ఇది ఆచరణలో పెట్టి చూపించాలి.

ఇటువంటి చక్కటి వాతావరణం నెలకొనాలంటే, తల్లిదండ్రుల మాట ఒక్క త్రాటిమీద నడవాలి. వారి మధ్య సఖ్యత లేకపోతే పిల్లవాడికి తల్లి ఒకటి చెబుతుంది, తండ్రి ఒకటి చెబుతాడు. మధ్యలో పిల్లవాడు నలిగి పోతాడు. ఎవరి మాట వినాలి? అతనికి ఇద్దరూ దైవస్వరూపులే! అందువల్ల పిల్లల ముందు యుద్ధం చేసుకోకూడదు, ఒకరినొకరు విమర్శించుకోకూడదు. తల్లి ఏదైనా సలహా ఇస్తే, తండ్రికి నచ్చకపోతే, తల్లిని విడిగా పిల్చి దాని లోటుపాట్లను విడమరిచి చెప్పాలి. అప్పుడు తల్లే తను ఇచ్చిన సలహాను మార్చుకుంటుంది. తల్లి చెప్పిన సలహాను తల్లే మార్చినట్లైతే, పిల్లవాడికి ఏమీ ఇబ్బంది ఉండదు. దాని బదులు తండ్రి మారిస్తేనే అయోమయంలో పడతాడు. తండ్రి కేవలం సలహా మార్చటమే కాదు, కొన్ని కుటుంబాల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుంది. 'మీ అమ్మ ఒక వెర్రిబాగులది, దానికేమీ తెలియదు, దాని మాట వినకు,' అని తండ్రి, 'మీ నాన్న మిమ్మల్నేమీ పట్టించుకోడు, ఆయనకు ఇంటి వ్యవహారాలేం పట్టవు! అన్నీ నేనే చూస్తున్నాను, ఆయనకేం చెప్పనవసరం లేదు,' అని తల్లి అంటారు. అటువంటి ఇంట్లో పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో చూడండి.

మళ్ళీ తల్లిదండ్రుల్లో కూడా తల్లి పాత్ర ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే తల్లి జన్మనిస్తుంది బిడ్డకు. అందువల్ల తల్లితో శారీరకంగా, గర్భంలో ఉన్నప్పటినుంచే అనుబంధం ఉంటుంది పాపాయికి. తరువాత తల్లి పాలు తాగి, తల్లి ఒడిలో ఆటపాటలు నేర్చుకుంటాడు.

అందువల్ల అర్జునుడు అంటున్నాడు, ఒకవేళ కులక్షయం అయితే, స్త్రీలు విలువలకు విలువను ఇవ్వక పోవచ్చు. స్త్రీ విలువలకు ప్రాముఖ్యత నివ్వకపోతే, ఆమె తల్లి అయ్యాక అటువంటి స్త్రీ పెంపకంలో పెరిగిన పిల్లల జీవనవిధానం ఇంకెలా ఉంటుంది? అంటే ఒక స్త్రీవల్ల ముందు తరం కూడా నాశనమవుతుంది.

**అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః** – ఓ కృష్ణా! అధర్మం పెచ్చుపెరిగి పోయినప్పుడు, కులస్త్రీలు పాడయిపోతారు. అప్పుడేమవుతుంది?

**స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ** – స్త్రీలు పాడయిపోతే, మొత్తం సమాజం భ్రష్టుపట్టి పోతుంది. ఇక్కడ కూడా కృష్ణపరమాత్మను అద్భుతంగా సంబోధిస్తున్నాడు. వార్ష్ణేయ అంటే వృష్ణి కులంలో పుట్టాడు కృష్ణుడు. అంటే మంచి కుటుంబంలో పుట్టాడు కాబట్టి, అతనికి కుటుంబ విలువలు తెలుసు.

**జాయతే వర్ణసంకరః** – వర్ణాశ్రమధర్మాలు పోయి, వర్ణసంకరం ఏర్పడుతుంది. ఈ సందర్భంలో వర్ణధర్మం గురించి కొంచెం తెలుసుకోవాలి మనం. మనకు నాలుగు వర్ణాలున్నాయి. అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు.

బ్రాహ్మణుడు శాస్త్రపఠనం, పాఠనం, ఆచరణం చేయాలి. అంటే బ్రాహ్మణుడు శాస్త్రం తను నేర్చుకోవాలి, నలుగురికి నేర్పాలి, తను నేర్చుకున్నది ఆచరణలో పెట్టాలి. సత్యం వద నేర్చుకుని, దాన్ని ఆచరణలో పెట్టకపోతే సత్యం వధ అయిపోతుంది. బ్రాహ్మణులు ఆధ్యాత్మిక ఎదుగుదలకు, సంస్కృతిని పెంపొందించటానికి తోడ్పడాలి.

క్షత్రియుడు అంటే రాజు. రాజు దేశాన్ని పరిపాలించి, ప్రజలను రక్షించాలి. వైశ్యుడు వ్యాపారం చేసి ఆర్థికవ్యవస్థకు తోడ్పడాలి. శూద్రుడు పై ముగ్గురికీ తోడ్పడాలి. ఆ విధంగా ఒక్కొక్కరికీ ఒక్కొక్క ధర్మాన్ని ఆపాదించింది శాస్త్రం. దేశంయొక్క నాగరికత దేశంయొక్క స్థూలశరీరంలాంటిది అయితే, దాని సంస్కృతి సూక్ష్మశరీరంలాంటిది. అందువల్ల సంస్కృతి చాలా ముఖ్యం.

ఆ దేశప్రజలందరూ వారి జాతినిబట్టి గానీ, గుణాన్నిబట్టి గానీ ఈ నాలుగింటిలో దేన్నైనా వృత్తిగా ఎన్నుకోవాలి. శాస్త్ర అధ్యయనమో, పరిపాలనో, వ్యాపారమో ఏదో ఒకటి చేయాలి. కాని ఇప్పటి సమాజం ధనానికి విలువనిచ్చేదయితే, అందరూ ధనం ఎక్కువ వచ్చే ఉద్యోగానికో, వ్యాపారానికో ప్రాముఖ్యతనిస్తారు కాని, సాంస్కృతిక ఎదుగుదలకు ప్రాముఖ్యతనివ్వరు – అందరికీ తక్కువ శ్రమతో ఎక్కువ డబ్బు కావాలని ఉంటుంది. అందువల్ల శాస్త్రాలు నేర్చుకోవటానికి ఎవరూ ముందుకు రారు. అంటే బ్రాహ్మణ విధులు నిర్వహించటానికి ఎవరూ ఆసక్తి చూపరు.

వర్ణసంకరం అంటే ప్రతివారు తక్కిన ఉద్యోగాలను ఎన్నుకుంటారు కాని, శాస్త్ర అధ్యయానికి ఎవరూ మొగ్గు చూపరు. పూర్వం బ్రాహ్మణులు యజ్ఞయాగాదులు చేసేవారు. ఇప్పుడు బ్రాహ్మణులు కూడా తక్కిన వర్ణాలకు చెందిన విధులను ఎన్నుకుంటున్నారు కాని శాస్త్రం జోలికి పోవటం లేదు. వారికి సంధ్యావందనం అంటే ఏమిటో తెలియదు, గాయత్రీమంత్రం అంటే ఏమిటో తెలియదు. వర్ణసంకరం అంటే సంస్కృతి మటుమాయమయిపోతుంది.

సంస్కృతికి విలువ నివ్వకపోతే దైవచింతన, ఆధ్యాత్మిక చింతన పోతుంది. చార్వాక సిద్ధాంతం దేశమంతటా ప్రబలిపోతుంది. చార్వాకసిద్ధాంతం – తిను, తాగు, ఆనందించు. వారు పుణ్యపాపాలను, ఆత్మను నమ్మరు.మరణం తరువాత శరీరం కాలిపోతే, దానికి స్వర్గనరకాలేమిటి అంటారు. అలా పతనమై పోతుంది సమాజం.

దీన్నిబట్టి ధర్మం, కుటుంబం ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయని అర్థమవుతోంది. కుటుంబం నాశనమయితే ధర్మం నాశనమవుతుంది; ధర్మం నాశనమయితే, ముందు తరంలో వచ్చే కుటుంబం నాశనమవుతుంది. ఈ వృత్తాకార సంబంధం అర్థం చేసుకోవాలంటే, శాస్త్రం చెప్పిన ధర్మసూక్ష్మాలు తెలుసుకోవాలి. అవి మూడు – విలువలు, దృక్పథం, యజ్ఞయాగాదులు.

1. **విలువలు** – సత్యం, అహింస, దయ, ప్రేమ వంటి విలువలను పాటించాలి.
2. **దృక్పథం** – తల్లిదండ్రులను, గురువులను, సమాజంలో పెద్దవారిని గౌరవించాలి. దేవునితో సమానంగా పూజించాలి. వీరినే కాదు పంచభూతాలను కూడా దేవునిగా కొలవాలి.
3. **యజ్ఞయాగాదులు** – ఇప్పుడు వీటి విలువ తగ్గిపోతున్నది కాని యజ్ఞయాగాదులకు పూర్వం బాగా విలువను ఇచ్చేవారు. వీటివల్ల రెండు ప్రయోజనాలున్నాయి. అవి – విలువలను ఆచరణలో చూపుతాయి, సామూహిక పూజలను ప్రోత్సహిస్తాయి.

ఎ) **విలువలను ఆచరణలో చూపుతాయి** – విలువలను పాటించాలి, పెద్దల యెడ భక్తిభావనతో మెలగాలి అని పై రెండు ధర్మాలను చెప్పాము. అవి నేర్చుకోవాలంటే, పిల్లలకు చిన్నవయస్సులో వివరించి చెప్పలేము. ఆచరణలో చూపితే అర్థం చేసుకుంటారు. యజ్ఞయాగాదులు వాటిని ఆచరణలో చూపిస్తాయి.

బి) **సామూహిక పూజలను ప్రోత్సహిస్తాయి** – ఒక కుటుంబం పటిష్టంగా ఉండాలన్నా, సమాజం కలిసికట్టుగా ఉండాలన్నా నలుగురూ కలిసి చేసే యజ్ఞయాగాదులు తోడ్పడతాయి.

రీడర్స్ డైజెస్ట్‌లో కుటుంబం పటిష్ఠంగా ఎలా ఉండాలి అనే అంశంమీద ఒక వ్యాసం వచ్చింది. అందులో ఒక అంశం, కొన్ని క్రతువులను కనిపెట్టండి అని. మన సంస్కృతిలో కొత్తగా క్రతువులను కనిపెట్టనవసరం లేదు, పాటించాలే కాని బోలెడు ఉన్నాయి. అందులో రచయిత చెప్పిన ఒక క్రతువు – అందరూ కలిసి భోజనం చేయండి, తినేముందు అందరూ కలిసి బల్ల చుట్టూ ప్రదక్షిణం చేయండి. కలిసివుండాలి అని ఆచరణ ద్వారా చూపటం ఇది.

నిజానికి యజ్ఞయాగాదులు చేయటంవల్ల అదృష్టఫలం అయిన పుణ్యం కలుగుతుంది. ఇక్కడ దాని గురించి ప్రస్తావించటం లేదు. ప్రస్తుతం సామాజిక, మానసిక లాభాల గురించే మాట్లాడుకుంటున్నాము. అందువల్ల ధర్మం గురించిన ప్రస్తావన వచ్చినప్పుడల్లా మూడింటికే ప్రాముఖ్యత నిస్తాము. అవి – **విలువలు, దృక్పథం, యజ్ఞయాగాదులు**.

యజ్ఞయాగాదులు అంటే కర్మల కింద తీసుకోవచ్చు. కర్మలు ప్రతి ఒక్క మతానికీ మారతాయి. ఎప్పుడైతే కర్మలను పట్టించుకోమో అప్పుడే వర్ణసంకరం జరిగే ప్రమాదముంది. మతాల మధ్య వ్యత్యాసాలు ఈ కర్మలలోనే ఉన్నాయి. విలువలు, దృక్పథం అంశాలు అన్ని మతాల్లోనూ ఒకటే. సత్యం పలకమని అన్ని మతాలూ చెబుతాయి;

పెద్దలను గౌరవించమని అన్ని మతాలు చెబుతాయి. కర్మలు చేయటంలోనే వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు మనం పుట్టినరోజున దీపం వెలిగించి హారతి ఇస్తాము పుట్టినరోజు పాపాయికి; అన్యమతస్తులు కేకు కోసేముందు దీపాలు ఆర్పుతారు. కర్మలకు ప్రాముఖ్యత నివ్వనప్పుడు, మతాల మధ్య భేదాలు కూడా అంతరించిపోతాయి. అంటే వర్ణసంకరం జరుగుతుంది.

కుటుంబవ్యవస్థ కర్మలు చేయటానికి కావాలి. వైదికకర్మలను గృహస్థు మాత్రమే చేయగలడు. యజ్ఞయాగాదులు చేశాక దక్షిణ ఇవ్వాలి; అన్నదానంచేయాలి. అవి గృహస్థు మాత్రమే చేయగలడు. ఎందుకంటే తక్కిన మూడు ఆశ్రమాలకు చెందిన బ్రహ్మచారి, వానప్రస్థుడు, సన్న్యాసి – తామే భిక్షాటనం చేసి జీవిస్తారు. వారి దగ్గర ధనం కూడా ఉండదు. అందువల్ల వారు యజ్ఞయాగాదులు చేయలేరు. అందువల్ల యజ్ఞయాగాదులు చేయాలంటే కుటుంబం ఉండితీరాలి.

విలువలు పాటించటానికి, మంచి దృక్పథం పెంచుకోవటానికి కుటుంబం లేకపోయినా ఫర్వాలేదు. కాని అర్థకామ పురుషార్థాలు తీర్చుకోవటానికి కుటుంబవ్యవస్థ కావాలి. అర్థకామాలు భద్రతను, సుఖాలను ఇస్తాయి. కాని ఇప్పుడు కుటుంబానికి విలువ లేకుండా పోతోంది. కుటుంబంవల్ల మూడు ప్రయోజనాలను చూశాము. అవి యజ్ఞయాగాదులు, అర్థ, కామాలు. కాని ఇప్పటి కాలమాన పరిస్థితుల్లో యజ్ఞయాగాదులు మాయమయి పోయాయి. అర్థకామాలు కుటుంబం లేకుండానే దొరుకుతున్నాయి. అందువల్ల పెళ్ళి చేసుకోకుండానే, కలిసి జీవించటమనే సంస్కృతి బయలుదేరింది. కుటుంబ వ్యవస్థయొక్క అవసరాన్నే కాలదన్నుతోంది.

కుటుంబం కొన్ని ప్రాథమిక కర్మలు చేయటానికి కావాలి, అవి మతానికీ మతానికీ మారతాయని చూశాము. మనం ఒక తప్పటడుగు వేస్తే, పిల్లలు రెండు తప్పటడుగులు వేస్తున్నారు. మనం చేయాల్సిన యజ్ఞయాగాదులను మనం మర్చిపోయాము. గాయత్రీజపం, సంధ్యావందనమే మానేశాము. మన పిల్లలు వేరే కులంవారినో, మతస్థులనో పెళ్ళి చేసుకుంటే తప్పేమిటి అంటున్నారు. మనకే మన గోత్రమేమిటో, మనం ఏ వేదానికి చెందుతామో తెలియదు. పితృదేవతలకు శ్రాద్ధకర్మలు చేయటం లేదు. అంటే మనం కర్మలు మానేశాము, మనం కర్మలను మానితే భావితరం వారు విలువలను, దృక్పథాలను కూడా వదిలేస్తున్నారు. ఇప్పటి తరంలో కొందరు కారునో, స్కూటర్‌నో, దుస్తులనో మార్చినట్టుగా భార్యను/భర్తను మారుస్తున్నారు.

వర్ణసంకరం జరుగుతుందని చెబుతున్నాడు అర్జునుడు. అందువల్లనే బ్రాహ్మణ ధర్మాన్ని పాటించి, శాస్త్ర అధ్యయనం చేసేవారు అరుదైపోయారు. అందరూ చార్వాక సిద్ధాంతాన్ని పాటిస్తారు. ఇది ఎక్కడికి దారి తీస్తుంది?

శ్లో. 42 **సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।**
**పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః ॥**
సంకరః, నరకాయ, ఏవ, కులఘ్నానామ్, కులస్య, చ,
పతంతి, పితరః, హి, ఏషామ్, లుప్తపిండోదకక్రియాః॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంకరః | = | వర్ణసాంకర్యము | లుప్తపిండోదకక్రియాః | = | పిండోదక క్రియలు లుప్తమైనవారు(ను) |
| కులఘ్నానామ్, చ | = | కులఘాతకులను | ఏషామ్ | = | వీరియొక్క |
| కులస్య | = | కులమును | పితరః, హి | = | పితరులు కూడ |
| నరకాయ, ఏవ | = | నరకములో పడవేయును. | పతంతి | = | అధోగతి పాలవుతారు |

**సంకరః కులఘ్నానాం కులస్య చ నరకాయ ఏవ (భవతి)।**
**హి ఏషాం పితరః లుప్తపిండోదక క్రియాః (సంతః)పతంతి ॥**

తా: వర్ణసాంకర్యము కులఘాతకులను, కులమును కూడా నరకములో పడవేయును.వీరి పితరులు కూడా పిండము–తర్పణముల క్రియలు లోపించుటచే నరకములో పడెదరు.

కుటుంబం నాశనమైతే, వర్ణసంకరంతో పాటు మతసంకరం కూడా జరుగుతుంది అంటున్నాడు అర్జునుడు. కర్మలు చేయకపోతే, మతానికి విలువ ఉండదని చూశాము. అప్పుడు హిందూ మతస్తులు, అన్యమతానికి చెందినవారిని పెళ్ళి చేసుకునే అవకాశం ఉంది. అలా జరిగితే మధ్యలో పిల్లవాడు నలిగిపోతాడు. పుట్టిన రోజుకి దీపం వెలిగించాలా, దీపాన్ని ఆర్పాలా? కేకు కోయాలా, ఆయుష్షు హోమం చేయాలా? చర్చికి వెళ్ళాలా, గుడికి వెళ్ళాలా? మొత్తం అయోమయంలో పడిపోతాడు.

కర్మలు ఎందుకు? మన భావాలను ప్రదర్శించేటందుకు కర్మలు చేయాలి. ఈ కర్మలు మతపరంగానే కాదు, దేశపరంగా చూసినా కనిపిస్తాయి. ఉదాహరణకు మన దేశానికి విదేశాలనుంచి వారి నాయకుడు వస్తే, సాదరంగా అతన్ని ఆహ్వానిస్తారు, కరచాలనం చేస్తారు. ఇవేమిటి? కర్మలే! మీకు నమ్మకం కుదరకపోతే ఒలింపిక్ గేమ్స్ చూడండి. వాటిలో అనేక క్రతువులను చూస్తాము. జండా ఎగురవేస్తారు; ప్రత్యేక పద్ధతిలో నడుస్తారు; ఒలింపిక్ కాగడాను ఒక పద్ధతిలో వెలిగిస్తారు; ప్రతిజ్ఞ చేస్తారు. అంతా అయ్యాక, ఆ జండాను దింపి, తరువాత ఏ దేశంలో ఆ క్రీడలు జరుగుతాయో ఆ దేశపు మేయర్‌కు భద్రంగా జండాను అప్పచెప్పుతారు. ఇవన్నీ క్రతువులే. కొందరు క్రతువులను విమర్శిస్తారు కాని క్రతువులు లేకుండా ఎవరూ జీవించలేరు. క్రతువులు పోతే, ఏమవుతుంది?

**సంకరో నరకాయైవ** – వర్ణసంకరంవల్ల, నరకంలో పడతారు. ఎవరు?

**కులఘ్నానాం కులస్య చ** – యుద్ధంలో గెలిచినవారు, ఓడిపోయినవారు కూడా. వారు యజ్ఞయాగాదులు చేయనందువల్ల, వారునరకానికి పోతారు.

**పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః** – పితృదేవతలకు శ్రాద్ధకర్మలు చేయనందువల్ల వారు కూడా అధోగతి పాలవుతారు.

వేదం మనకు పంచమహాయజ్ఞాలను చేయమని ఆదేశించింది. వాటిలో ఒకటి పితృయజ్ఞం. పితృదేవతల ఆశీస్సులు మన ఎదుగుదలకు ఎంతో అవసరం. అందువల్ల కుటుంబంలో ఏ శుభకార్యం చేపట్టినా కూడా,

ముందు నాందీశ్రాద్ధం అని చేస్తారు. నాందీశ్రాద్ధం అంటే పితృదేవతల ఆశీస్సులను కోరుతూ చేసే క్రతువు. కాని ధర్మం పోయినప్పుడు, కర్మలు పాటించరు. పిండక్రియ, శ్రాద్ధక్రియ, ఉదకక్రియ అంటే తర్పణం వదలటం. లుప్త అంటే చేయకపోవటం. పితృదేవతలకు ఈ కర్మలు చేయరు.

కొంతమంది శ్రాద్ధకర్మలు చేసే బదులు బీదలకు అన్నదానం చేయవచ్చా, వృద్ధాశ్రమాలకు డబ్బులు ఇవ్వవచ్చా అని అడుగుతుంటారు. శాస్త్రం దాన్ని ఒప్పుకోదు. పితృతర్పణాలను చేయకుండా వేరే సేవతో సరిపెట్టకూడదు. కావాలంటే అది కూడా చేయవచ్చు. ఇంతకుముందు చూసినట్టుగా శాస్త్రం పంచమహాయజ్ఞాలు చేయాలి అంటుంది. అవి – బ్రహ్మయజ్ఞం, దైవయజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. ఒకదాని బదులు ఒకటి చేయకూడదు. ఐదూ చేయాలి. శ్రాద్ధకర్మలు చేయటం పితృయజ్ఞం కిందికి వస్తే, అన్నదానాలు మనుష్యయజ్ఞం కింద వస్తాయి. కాని పితృయజ్ఞాలు తగ్గిపోతాయి కాబట్టి పితృదేవతలు అధోగతి పాలవుతారు అని అర్జునుడు వాపోతున్నాడు.

అర్జునుడు మాట్లాడుతున్న కాలంలో యజ్ఞయాగాదులకు, శ్రాద్ధకర్మలకు ప్రాముఖ్యతనిచ్చేవారు. అలాంటి రోజుల్లో అవి చేయకపోతే జరగబోయే నష్టం ఊహించి చెబుతున్నాడు అర్జునుడు. వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించినా పాటించకపోయినా విలువలను పాటించవచ్చు, మంచి దృక్పథాలను పెంపొందించుకోవచ్చు, కాని వర్ణాశ్రమ ధర్మాలు పాటించకపోతే యజ్ఞయాగాదులను చేయలేము.

శ్లో. 43 **దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ।**
**ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥**
దోషైః, ఏతైః, కులఘ్నానామ్, వర్ణసంకరకారకైః,
ఉత్సాద్యంతే, జాతిధర్మాః, కులధర్మాః, చ, శాశ్వతాః ॥

| | | | |
|---|---|---|---|
| ఏతైః | = ఈ విధంగా | శాశ్వతాః | = సనాతనములైన |
| వర్ణసంకరకారకైః | = వర్ణసాంకర్యములకు హేతువులైన | కులధర్మాః, చ | = కులధర్మములును |
| దోషైః | = దోషములచే | జాతిధర్మాః | = జాతిధర్మములును |
| కులఘ్నానామ్ | = కులఘాతకులయొక్క | ఉత్సాద్యంతే | = నశించును |

**కులఘ్నానామ్ ఏతైః వర్ణసంకరకారకైః దోషైః శాశ్వతాః।**
**జాతిధర్మాః కులధర్మాః చ ఉత్సాద్యంతే॥**

తా: కులమును చెడగొట్టువారి ఈ దోషములు వర్ణముల సాంకర్యమును కలిగించుటయే గాక, సనాతనములైన జాతిధర్మములను, కులధర్మములను కూడా పూర్తిగా నశింప చేయును.

**వర్ణసంకరకారకైః కులఘ్నానామ్ ఏతై దోషైః** – వర్ణసంకరంలాంటి దోషాలవల్ల, యజ్ఞయాగాదులు పాటించకపోవటంవల్ల జరిగే నష్టం ఏమిటి?

**జాతిధర్మాః కులధర్మాశ్చ ఉత్సాద్యంతే** – కేవలం వర్ణంమీద ఆధారపడి చేసే కర్మలు జరగవు. కులధర్మాలు పాటించటం కుదరదు.

వేదం ప్రకారం, కొన్ని యజ్ఞాలను కొన్ని వర్ణాలవారే చేయగలరు. ఉదాహరణకు రాజసూయయాగం రాజులు మాత్రమే చేయగలరు. బ్రాహ్మణుడు ఈ యజ్ఞాన్ని తను చేయించగలడు కాని, తను చేయకూడదు. అందువల్ల అతను కొన్ని యజ్ఞాలు చేయలేడు. అలాగే ఒక వర్ణంలోనే భిన్నగోత్రాలకు చెందినవారు ఉంటారు. వారి మధ్య కూడా కొన్ని భేదాలుంటాయి. వర్ణసంకరం జరిగితే, కులధర్మాన్ని కూడా పాటించలేడు పిల్లవాడు. అందువల్ల కులధర్మాన్ని గాని, జాతిధర్మాన్ని గాని పాటించలేడు. కర్మలు చేయలేడు.

**శాశ్వతాః** – ఈ జాతిధర్మాలు, కులధర్మాలు అనాదికాలంనుంచి వస్తున్నాయి. దేన్నైనా నిలబెట్టటం కష్టం కానీ, దాన్ని కూలదోయటం తేలిక. అంత సనాతన ధర్మం కూడా నాశనమైపోతుంది.

శ్లో. 44 **ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన।**
**నరకేఽ నియతం వాసో భవతీత్యనుశుశ్రుమ ॥**
ఉత్సన్నకులధర్మాణామ్, మనుష్యాణామ్, జనార్దన,
నరకే, అనియతమ్, వాసః, భవతి, ఇతి, అనుశుశ్రుమ ॥

| | | | |
|---|---|---|---|
| జనార్దన! | = ఓ జనార్దనా! | వాసః | = నివాసము |
| ఉత్సన్నకుల ధర్మాణామ్ | = కులధర్మములు నశించినవారైన | భవతి | = అగును |
| మనుష్యాణామ్ | = మనుష్యులకు | ఇతి | = అని |
| అనియతమ్ | = నిరవధికముగా | అనుశుశ్రుమ | = విన్నాము |
| నరకే | = నరకమందు | | |

**హే జనార్దన! ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణామ్ ।**
**నరకే అనియతం వాసః భవతి, ఇతి అనుశుశ్రుమ ॥**

తా: ఓ జనార్దనా! నశించిన కులధర్మములు గల మనుష్యులు నిశ్చయముగా నరకములో పడెదరని పెద్దలు చెప్పగా విన్నాము.

దాని తర్వాత వచ్చే ఫలం ఏమిటి? ధర్మసూత్రాలు మూడు అనీ, అవి – విలువలు, దృక్పథం, యజ్ఞయాగాదులు అనీ చూశాము. కర్మలు చేయటానికి, అర్థకామాలను తీర్చుకోవటానికీ కుటుంబజీవనం కావాలనీ చూశాము. తరాలు మారుతున్నకొద్దీ దేనికీ కుటుంబజీవనం అవసరం లేదు అనే పరిస్థితి వస్తోంది. పైసా మే పరమాత్మా హై అంటారు.

కుటుంబం కోరుకునేది ఎందుకు? నా వారు అని చెప్పుకునేందుకు, ఒక తోడుకోసం. మనస్సు విప్పిచెప్పుకునేందుకు ఒక ఆలంబన, ఒక ఆధారం, భుజంమీద తలవాల్చి కష్టం, సుఖం చెప్పుకుంటే వినే అమృతహృదయం కావాలి అని ఉంటుంది అందరికీ. కాని కుటుంబంలో బంధాలు బీటలు వారిపోతున్నాయి;

ఎవరిమీద ఎవరికీ నమ్మకం లేదు, ఆప్యాయత అసలే లేదు. భార్యలను ఎలా ప్రేమించాలి అంటూ అనేక వ్యాసాలు వస్తున్నాయి. ఇష్టం ఉన్నా, లేకపోయినా రోజుకొకసారి భార్యకు 'ఐ లవ్ యూ,' చెప్పాలి. భర్తలను ఆకర్షించటానికి భార్యలు చక్కగా ముస్తాబు చేసుకుని ఉండాలి. అంటే ఆఫీసులో ఉద్యోగి ఉద్యోగంనుంచి వెళ్ళిపోకుండా అతన్ని ఎలా రక్షించుకోవాలో అలా భర్త భార్యను; భార్య భర్తను జాగ్రత్తగా చేజారిపోకుండా రక్షించుకోవాలి. ఇప్పటి ఫ్యాషన్ పిల్లలకు తల్లిదండ్రులు నచ్చకపోతే, నేను మీకు విడాకులు ఇస్తున్నాను అని పిల్లలు బెదిరించటం. ఇది మానసిక దౌర్బల్యం.

ఇప్పుడు మనస్సు విప్పి చెప్పుకునేవారు లేక మనస్తత్వశాస్త్రవేత్తలు అంతగా వెలిగిపోతున్నారు. వారు వందలూ, వేలూ తీసుకుని మనుష్యుల కష్టనష్టాలు వింటారు. అంతకు ముందు భర్తకు బాధ కలిగితే భార్యకూ, భార్యకు బాధ వేస్తే భర్తకూ చెప్పుకునేవారు. ఇప్పుడు ఆ దగ్గరితనం లేదు. పిల్లలు కూడా తండ్రిమీద కోపం వస్తే తల్లి ఒడిలోనో, తల్లిమీద అలిగితే తండ్రి భుజం ఎక్కో, ఇద్దరిమీదా అలక వస్తే, బామ్మా తాతయ్యల లాలనలోనో ఓదార్పు పొందేవారు. ఇప్పుడు ఒంటరి కాపురాలు. బామ్మా తాతయ్యలు అందుబాటులో ఉండరు; అమ్మ, నాన్నలకు తీరికలేదు. ఇటువంటి సమస్యలు వ్యక్తిగతంగా ఉంటే, అది సామాజిక సమస్యగా మారి, సమాజంలో నేరాలు, ఘోరాలు పెరిగిపోయే అవకాశాలు ఎక్కువ ఉంటాయి.

**మనుష్యాణాం నరకే వాసః** – మనుష్యులు నరకంలో పడిపోతున్నారు. మరణించాక కాదు, బ్రతికి ఉండగానే. వారిని అదుపులో పెట్టే కుటుంబ జీవనం లేక, ప్రేమ లేక, ఆప్యాయత పంచేవారు లేక నరకంలో పడుతున్నారు. అంతేకాదు, మరణించాక కూడా.

**(నరకే) అనియతం (వాసః) భవతి** – ఒక్కటి మాత్రం ఖచ్చితం. నరకంలో పడతారు. ఎందుకు? స్వధర్మం చేయకపోతే, అంటే పితృతర్పణాలు వదలకపోతే. అది శాస్త్రం ప్రకారం ప్రత్యవాయ పాపం కిందకి వస్తుంది. ప్రత్యవాయ పాపంవల్ల నరకానికి పోతారు. ఎవరు చెప్పారు?

**ఇతి అనుశుశ్రుమ** – ఇది వేదాల్లో పదేపదే చెప్పబడింది. ఎవరు చెప్పారు, నీకెలా తెలుసు అని ఎవరూ ప్రశ్నించకుండా, అర్జునుడు ముందే చెబుతున్నాడు.

ఇదంతా అర్జునుడు ఎందుకు చెప్పుకువస్తున్నాడు? బంధకత్వం, దానివల్ల దుఃఖం, దానివల్ల బుద్ధి నాశనం ఎవరినైనా సంసారంలో పడవేస్తుంది.

**రాగం + శోకం + మోహం = సంసారం**

శ్లో. 45 **అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।**
**యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః ॥**
అహో, బత, మహత్, పాపమ్, కర్తుమ్, వ్యవసితాః, వయమ్,
యత్, రాజ్యసుఖలోభేన, హంతుమ్, స్వజనమ్, ఉద్యతాః ॥

| | | | |
|---|---|---|---|
| అహో | = అయ్యో! | యత్ | = ఏ మహాపాపమునకైతే |
| బత | = ఎంత దారుణము! | రాజ్యసుఖలోభేన | = రాజ్యసుఖలోభములచే |
| వయమ్ | = మనము | స్వజనమ్ | = స్వజనులను |
| మహత్ పాపమ్ | = మహాపాపమును | హంతుమ్ | = చంపుటకు |
| కర్తుమ్ | = చేయుటకు | ఉద్యతాః | = ఉద్యుక్తులమైతిమో |
| వ్యవసితాః | = సిద్ధమైతిమి | | |

**అహో బత, మహత్పాపం కర్తుం వయమ్ వ్యవసితాః**
**యత్ రాజ్యసుఖలోభేన స్వజనం హంతుం ఉద్యతాః ॥**

తా: అయ్యో! ఎంత పొరపాటు! మనము పెద్ద పాపమును చేయుటకు నిశ్చయించితిమి. అదేమంటే, రాజ్యమునందు, సుఖములందు లోభముచే మన వారిని సంహరించుటకు సంసిద్ధులమైతిమి.

ఇవన్నీ అర్జునుని ఏకపాత్రాభినయం. అతను మహాభారతయుద్ధం చేస్తే కలగబోయే పరిణామాలను ఊహించు కుంటున్నాడు. అటువంటి యుద్ధం వ్యక్తిగత నష్టమే కాదు, సమకాలీన సమాజానికే కాదు, భావితరాలకు కూడా నష్టాన్ని కలుగజేస్తుంది.

**అహో బత** – అయ్యో! ఇది దారుణం!

**మహత్పాపం కర్తుం వయమ్ వ్యవసితాః** – ఘోరమైన పాపం చేయటానికి వచ్చాము. ఏమిటా పాపం? ఈ మనుష్యులందరినీ చంపటం. వీరిని చంపటంవల్ల వర్ణసంకరం, జాతిసంకరం, ధర్మసంకరం, పితృదేవతలు అధోగతి పాలవటం – ఇలా వరుసగా ఒకదానితో ఒకటి ముడిపడి అనేక నష్టాలు కలుగుతాయి. ఇంత నష్టం ఎందువల్ల జరుగబోతున్నది?

**యద్రాజ్యసుఖలోభేన** – మనం బుద్ధిమంతులమై ఉండి కూడా రాజ్యసుఖాలు పొందాలనే దురాశతో వచ్చాము.

**స్వజనం హంతుమ్ ఉద్యతాః** – ఆ లోభం ఎంతదాకా పోయిందంటే స్వజనులను చంపుకోవటానికి సిద్ధపడ్డాము. మళ్ళీ అర్జునుడు స్వజనులనే పదాన్ని వేశాడు. ఎప్పుడైతే అతను స్వజనులు అంటున్నాడో అప్పుడే అతను ధర్మాధర్మవివేకాన్ని కోల్పోతున్నాడు. పైగా అదృష్టం బాగుండి, ఘోరం జరగకముందే మేలుకున్నామని మురిసి పోతున్నాడు. ఎందుకంటే ఇంకా సమయం మించిపోలేదు. ఇప్పటికన్నా యుద్ధంనుంచి తను విరమించుకోవచ్చు– అందువల్ల ఇలా అంటున్నాడు.

శ్లో. 46 **యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః ।**
**ధార్తరాష్ట్రా రణే హన్యుః తన్మే క్షేమతరం భవేత్॥**
యది, మామ్, అప్రతీకారమ్, అశస్త్రమ్, శస్త్రపాణయః,
ధార్తరాష్ట్రాః, రణే, హన్యుః, తత్, మే, క్షేమతరమ్, భవేత్ ॥

| | | | |
|---|---|---|---|
| యది | = ఒకవేళ | రణే | = సమరమందు |
| అశస్త్రమ్ | = శస్త్రములను త్యజించినట్టి | హన్యుః | = చంపినవారైనను (చంపినను) |
| అప్రతీకారమ్ | = ప్రతీకారమును చేయనట్టి | తత్, మే | = అది నాకు |
| మామ్ | = నన్ను | క్షేమతరమ్ | = శ్రేయస్కరమే |
| శస్త్రపాణయః | = శస్త్రములను చేతియందు ధరించిన | భవేత్ | = అగును |
| ధార్తరాష్ట్రాః | = ధార్తరాష్ట్రులు | | |

**యది శస్త్రపాణయః ధార్తరాష్ట్రాః అశస్త్రమ్ అప్రతీకారం**
**మాం రణే హన్యుః తత్ మే క్షేమతరం భవేత్॥**

తా: నేను ఆయుధములను ప్రక్కన పెట్టెదను. నన్ను కొట్టినా తిరిగి కొట్టను. అటువంటి నన్ను ధృతరాష్ట్ర పుత్రులు ఆయుధములను ధరించి యుద్ధమందు సంహరించినచో, అదియే నాకు మరింత క్షేమమును కలిగించును.

అందువల్ల ఈ దుఃఖాన్ని నేను కలుగజేయదలుచుకోలేదు అంటే నేను యుద్ధం చేయబోవటం లేదు అంటాడు అర్జునుడు. కాని అప్పటికే యుద్ధం ప్రారంభించవచ్చున్నట్టుగా ఇరుపక్షాలవారూ శంఖనినాదాలు చేశారు. అందువల్ల దుర్యోధనాదులు తనమీద బాణాలు వదలవచ్చు. అయినా తను వారిని ఎదుర్కోడు. అలా ఎదుర్కోకుండా నిలుచుంటే, అర్జునుడు మరణించవచ్చు కూడా. అయినా ఫర్వాలేదు అంటాడు అర్జునుడు. నేను విల్లంబులు చేతబట్టను, దానివల్ల వారు నన్ను చంపితే సంతోషంగా మరణిస్తాను కాని ఈ మహాపాపానికి ఒడిగట్టను అంటున్నాడు అర్జునుడు.

**ధార్తరాష్ట్రా రణే హన్యుః** – కౌరవులు మమ్మల్ని సంహరింపటానికి నిశ్చయించుకున్నా కూడా,

**మామప్రతీకారమ్** – నేను తిరిగి యుద్ధం చేయను. అప్రతీకారం అంటే తిరిగి యుద్ధం చేయను.

**అశస్త్రం శస్త్రపాణయ** – శస్త్రాలు లేకుండా నిలబడతాను. వారు శస్త్రాలతో నన్ను చంపవచ్చు. అటువంటి దుర్ఘటన జరిగినా కూడా,

**తత్ మే క్షేమతరం భవేత్** – అది నాకు క్షేమతరమే అవుతుంది. నా జీవితాన్ని ధర్మంకోసం త్యాగం చేసినట్టుగా భావిస్తాను. సమాజంకోసం ప్రాణత్యాగం చేసేవారిలా మాట్లాడుతున్నాడు అర్జునుడు.

ఇంతా చెప్పాక, అర్జునుడు చాలా అలసిపోయాడు. ఇంతసేపూ గొప్ప వాగ్ధాటి చూపించి నీరసించిపోయాడు. సంసార లక్షణాలు మూడూ వాటి ద్వారా వచ్చాయి. అవి – రాగం, శోకం, మోహం. అర్జునుడు చెప్పటం ముగించాడు కాని కృష్ణుడు ఇంకా పరమాత్మ రూపం దాల్చలేదు. కృష్ణునికి ఎప్పుడు, ఎలా మాట్లాడాలో తెలుసు. ఇంకా అర్జునుని ఆలోచనా తీరు ముగియలేదని తెలుసు. అందువల్ల కృష్ణుడు కూడా ఏమీ మాట్లాడడు. సంజయుడు అందుకుని ఈ అధ్యాయాన్ని ముగిస్తాడు.

**సంజయ ఉవాచ**

శ్లో. 47 **ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।**
**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥**
ఏవమ్, ఉక్త్వా, అర్జునః, సంఖ్యే, రథోపస్థే, ఉపావిశత్,
విసృజ్య, సశరమ్, చాపమ్, శోకసంవిగ్నమానసః ॥

| | | | |
|---|---|---|---|
| సంఖ్యే | = రణభూమియందు | సశరమ్ | = బాణములతో కూడిన |
| శోకసంవిగ్నమానసః | = శోకముచే కలత చెందిన మనస్సుగల | చాపమ్ | = ధనుస్సును |
| | | విసృజ్య | = వదిలివేసి |
| అర్జునః | = అర్జునుడు | రథోపస్థే | = రథములో |
| ఏవమ్ | = ఈ విధంగా | ఉపావిశత్ | = చతికిలబడెను |
| ఉక్త్వా | = పలికి | | |

**సంజయః ఉవాచ।**
**సంఖ్యే ఏవమ్ ఉక్త్వా శోకసంవిగ్నమానసః అర్జునః**
**సశరం చాపం విసృజ్య రథోపస్థే ఉపావిశత్॥**

తా: సంజయుడిట్లు పలికెను – శోకముచే బాగా కలత చెందిన మనస్సుగల అర్జునుడు యుద్ధరంగమందు ఈ విధముగా పలికి, ధనుస్సును బాణములతో సహా ప్రక్కన పడవేసి, రథములో చతికిలబడెను.

**సంజయ ఉవాచ** – మహాసంసారికి మారుపేరుగా ఉన్న అర్జునుణ్ణి పూర్తిగా వర్ణిస్తున్నాడు సంజయుడు ఇక్కడ. ఎలా ఉన్నాడు?

**శోకసంవిగ్నమానసః** – అర్జునుని మనస్సు పూర్తిగా శోకంలో మునిగివుంది; అంటే రాగం, రాగంవల్ల శోకంతో ఉన్నాడు. అంతేకాదు,

**సశరం చాపం విసృజ్య** – ధనుర్బాణాలను త్యజించాడు. ఇది చూడటానికి, కాయికచర్య. కాని దానివెనుకనున్న గూఢార్థాన్ని గ్రహించాలి. ఒక క్షత్రియుడు ధనుర్బాణాలను చేతబట్టాడంటే ధర్మయుద్ధాన్ని చేయటానికి సిద్ధపడ్డాడని అర్థం. ధర్మసంస్థాపన చేయటం క్షత్రియధర్మం. అటువంటిది ధనుర్బాణాలను త్యజించాడంటే అతను స్వధర్మాన్ని త్యాగం చేయటానికి నిర్ణయించుకున్నాడని అర్థం. అంటే అతను మోహంలో పడ్డాడని తెలుస్తున్నది.

**శోకసంవిగ్నమానసః** – రాగ, శోకాలకు సంకేతం
**విసృజ్య సశరం చాపం** – మోహానికి సంకేతం

మోహంయొక్క ఫలితమేమిటి? ధర్మాధర్మవివేకం కోల్పోయి, తప్పుడు నిర్ణయం తీసుకోవటం. ఏమిటా తప్పుడు నిర్ణయం? స్వధర్మాన్ని పరిత్యాగం చేయటం. యుద్ధభూమినుంచి పారిపోయి, సన్న్యాసిగా తపస్సు చేయాలనుకోవటం. ఒక గృహస్థు తన ధర్మాన్ని నిర్వహించాలి. గృహస్థు తన సంసారధర్మాలను నిర్వర్తించాకే

జపాలు చేయాలి. గృహస్థు తన ధర్మాన్ని నిలబెట్టటాన్ని స్వధర్మం అంటారు. దాన్ని చేయకపోతే స్వధర్మ పరిత్యాగం అంటారు. గృహస్థుగా ఉండాల్సిన వ్యక్తి సన్న్యాసం తీసుకుంటానంటే దాన్ని పరధర్మగ్రహణం అంటారు. రెండూ తప్పే. పరధర్మగ్రహణం, స్వధర్మపరిత్యాగం – ఈ రెండింటినీ కలిపి మోహం అంటారు.

**ఏవం అర్జునః ఉక్త్వా** – ఈ విధంగా అర్జునుడు కృష్ణునితో పలికాక,

**రథోపస్థ ఉపావిశత్** – రథంలో వెనుక భాగాన చతికిలబడ్డాడు.

తరువాత అర్జునుని పరిస్థితి ఏమిటి? అతని సమస్యకు పరిష్కారం దొరుకుతుందా అనేది రాబోయే అధ్యాయాల్లో చూస్తాము.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**

**శ్రీకృష్ణార్జునసంవాదే అర్జునవిషాదయోగోనామ ప్రథమో஽ధ్యాయః**

**హరి ఓం తత్సత్**

కృష్ణార్జునుల సంవాదరూపంలో ఉన్న, ఉపనిషత్తుల సారం అయిన, యోగశాస్త్రం, బ్రహ్మవిద్యలతో కూడిన శ్రీ మద్భగవద్గీతోపనిషత్తులోని, అర్జునవిషాదయోగము అనే మొదటి అధ్యాయము శాశ్వతమైన రక్షకుడు, ఇంద్రియ అగోచరుడు అయిన భగవంతుని కృపవల్ల విజయవంతం అయినది.

ఈ భాగం ప్రతి అధ్యాయం చివర వస్తుంది. అందువల్ల దాని అర్థం కూడా చూద్దాము.

**ఓం తత్ సత్** – ఇవి మూడు పదాలు. మూడూ భగవంతునికి చెందినవి. భగవద్గీతలోని మొదటి అధ్యాయాన్ని విజయవంతంగా ముగించగలిగినందుకు కృతజ్ఞతా పూర్వకంగా పలికే మాటలు ఇవి. వీటి అర్థాలు చూద్దాము.

**ఓం** – ఓం పదానికి అనేక అర్థాలున్నాయి కాని ఇక్కడ తీసుకునే అర్థం రక్షకుడు. **అవతి ఇతి ఓం** – అవతి అంటే రక్షకుడు. భగవంతుడు. ఈ అధ్యాయం పఠించటానికి ఆటంకాలు కలుగకుండా కాపాడినందుకు రక్షకుడు అయ్యాడు.

**తత్** – ఇంద్రియ అగోచరుడు, ఇంద్రియాతీతుడు. అంటే ఇంద్రియాలకు అందనివాడు.

**సత్** – శాశ్వతం. త్రికాలేపి తిష్ఠతి ఇతి సత్. మూడు కాలాల్లోనూ ఉండేది.

ఇప్పుడు ఓం తత్ సత్ పదాలను కలిపితే, శాశ్వతమైన రక్షకుడు, ఇంద్రియ అగోచరుడు.

**ప్రథమోధ్యాయః** – మొదటి అధ్యాయం ముగిసింది. దాని పేరు ఏమిటి?

**అర్జున విషాదయోగః** – అర్జునవిషాదం. విషాదం అంటే శోకం. దీనితో తక్కిన రెండు పదాలనూ కలుపుకోవాలి. అవి రాగం, మోహం. ఇంకో విధంగా చెప్పాలంటే అర్జున సంసారయోగం. ఈ అంశం ఎలా చెప్పబడింది?

**శ్రీకృష్ణార్జున సంవాదే** – కృష్ణునికి, అర్జునునికి మధ్య సంభాషణ రూపంలో చెప్పబడింది. ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ ఏమీ మాట్లాడకపోయినా, భగవద్గీత మొత్తాన్ని దృష్టిలో పెట్టుకుని అలా చెప్పబడింది.

సంవాదం అంటే గురుశిష్యుల మధ్య జరిగే సంభాషణ. ఇది వాదన రూపంలో ఉండదు, పోట్లాటకు దారి తీయదు. ఆరోగ్యకరమైన సంభాషణ జరుగుతుంది. గురువుకు శిష్యునిమీద ప్రేమ, దయ ఉంటే శిష్యునికి గురువుమీద గౌరవం, శ్రద్ధ ఉంటాయి. ఈ సంవాదానికి పేరు ఇచ్చారు. ఏమని?

**శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు** – భగవద్గీత పూర్తిపేరు **శ్రీమద్భగవద్గీతోపనిషత్**. ఉపనిషత్తు అంటే మోక్షాన్ని కలుగజేసే జ్ఞానశాస్త్రం. అందువల్ల ఉపనిషత్తును మోక్షశాస్త్రం అని కూడా అంటారు. ఎటువంటి జ్ఞానం? శ్రీమద్భగవద్గీతాసు – సాక్షాత్తూ భగవంతునిచే బోధింపబడిన శాస్త్రం. భగవంతుడు అంటే ఆరు సద్గుణాలు ఉన్నవాడు.

ఉపనిషత్తులు కృష్ణపరమాత్మ పుట్టకముందే ఉన్నాయి. ఆయన బోధించినది ఉపనిషత్తుల సారం అని ధ్యానశ్లోకాల్లో చూశాము.

**సర్వోపనిషదో గావో దోగ్ధాగోపాలనందనః**
**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్**

ఉపనిషత్సు అంటే ఉపనిషత్తుల సారం అని అర్థం. గీత తాత్పర్యం ఏమిటి? రెండు ముఖ్యాంశాలు చర్చించ బడ్డాయి. వేదపూర్వభాగంనుంచీ, వేద అంతభాగంనుంచీ. వేదపూర్వభాగాన్ని కర్మకాండ అనీ, వేద అంత భాగాన్ని జ్ఞానకాండ అనీ అంటారు. కర్మకాండను ధర్మమనీ, జ్ఞానకాండను బ్రహ్మ అనీ అంటారు. అందువల్ల గీతలో రెండు అంశాలు చర్చించబడ్డాయి. ధర్మము, బ్రహ్మ.

కర్మకాండ ధార్మికజీవనవిధానాన్ని సూచిస్తుంది. అటువంటి ధార్మికజీవనవిధానాన్ని పాటిస్తే జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. జ్ఞానకాండ జ్ఞానాన్ని కలుగజేస్తుంది. మన జీవితంలో మొదటిభాగం మనను జ్ఞానానికి సంసిద్ధులను చేస్తే, రెండవభాగం జ్ఞానాన్ని కలుగజేస్తుంది. జ్ఞానం కలిగాక ఏం చేయాలి అని అడుగకూడదు. తరువాత ఏం చేయాలి అని అడిగితే, ఇప్పుడు ఉన్నదానితో తృప్తి లేదని అర్థం. జ్ఞానం పొందితే కలిగే ఫలం పూర్ణత్వం, సమత్వం.

**యోగశాస్త్రం** – జ్ఞానయోగ్యతా ప్రాప్తిని కలుగజేసే కర్మకాండను యోగశాస్త్రం అనీ;

**బ్రహ్మవిద్య** – జ్ఞానయోగాన్ని కలుగజేసే జ్ఞానకాండను బ్రహ్మవిద్య అనీ అంటారు.

**యోగశాస్త్రం + బ్రహ్మవిద్య = భగవద్గీత**

అంటే ధర్మము, జ్ఞానము (వేదపూర్వభాగం, వేద అంతభాగం) కలిపి గీత. అటువంటి యోగశాస్త్రం, బ్రహ్మవిద్యల మేలుకలయిక గీతాశాస్త్రం.

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు అర్జునవిషాదయోగము అనే మొదటి అధ్యాయము.

# అధ్యాయము 1 - అర్జున విషాదయోగము సారాంశము

మనం ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించాలంటే, రెండు అంశాల విషయాల్లో జాగ్రత్త వహించాలి. ఒకటి బాహ్యమైన శుభ్రత, రెండు మనలో రోగనిరోధక శక్తి.

మనం ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉండాలి. కాని అవి ఎంత శుభ్రంగా ఉన్నా కూడా ఆ ప్రాంతాల్లో రోగాలు ఉంటూనే ఉన్నాయి. అంటే ఎటువంటి వాతావరణంలో అయినా రోగక్రిములు ఉంటూనే ఉంటాయి. అందువల్లనే శుచిగా ఉండే దేశాల్లో కూడా ఆపరేషన్ చేసేటప్పుడు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. బాహ్యంగా తీసుకునే జాగ్రత్తలు చాలవు, మన రోగనిరోధక శక్తి కూడా బాగుండాలి. ఇప్పుడు మనం ఈ మాత్రం ఆరోగ్యంగా ఉన్నామంటే దానికి కారణం మనలో ఉన్న రోగనిరోధక శక్తే.

ఒక డాక్టరు ఇలా అన్నాడు, 'ఒక వ్యక్తికి క్షయవ్యాధి ముదిరిపోయినా, అది అంటువ్యాధి అయినా, అతను 20 మంది ఆరోగ్యకరమైన మనుష్యుల నోట్లోకి ప్రత్యక్షంగా గాలి ఊదినా, మహా అయితే నలుగురో, ఐదుగురో ఆ రోగాన్ని పొందుతారు కాని తక్కినవారు ఆరోగ్యకరంగానే ఉంటారు.' ఎందుకంటే అది మనకు భగవంతుడు ఇచ్చిన గొప్ప వరం. ఎటువంటి రోగం ఎదురైనా దాన్ని ఎదుర్కొనే శక్తిని మన శరీరంలో భగవంతుడు ముందే అమర్చాడు. అందువల్ల మనం శారీరక ఆరోగ్యానికి రెండు సూత్రాలను పాటించాలి. బాహ్యశౌచం, ఆంతర రోగనిరోధకశక్తి.

ఒకే వాతావరణంలో ఉన్నా, అందరి ఆరోగ్యం ఒక్కలాగా ఉండదు. ఉదాహరణకు కుళాయి నీళ్ళు తాగినా బాగానే ఉంటారు కొంతమంది, మినరల్ వాటర్ తాగినా అడ్డం పడతారు కొంతమంది. ఎందుకీ వ్యత్యాసం? అది వారి శారీరక ఆరోగ్యంమీద ఆధారపడివుంది. ఒకరికి రోగనిరోధకశక్తి ఎక్కువ ఉంటే, మరొకరికి తక్కువ ఉంటుంది.

ఇదే సూత్రాన్ని మానసిక ఆరోగ్యానికి కూడా విస్తరింపజేయాలి. మానసిక ఆరోగ్యం అంటే మనస్సులో కలిగే భయం, ఆందోళన, కోపం, ఒత్తిడి, ఈర్ష్య, అసూయ, ఆత్మన్యూనతాభావాలు లేకపోవటం; కామక్రోధలోభమోహ మదమాత్సర్యాలు అనే షడ్వికారాలు లేకపోవటం.

మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడేటప్పుడు, సాధారణంగా బాహ్యప్రపంచాన్ని నిందిస్తాము. మన బాధకు కారణంగా ఎవరినో వేలెత్తి చూపిస్తాము. భార్యనో, పిల్లలనో, తల్లిదండ్రులనో, ఎవరినో ఒకరిని నిందిస్తాము, కాని అది పొరపాటు. మానసిక ఆరోగ్యానికి కూడా రెండు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి అంటుంది శాస్త్రం. అది బాహ్యప్రపంచం, మన మానసికస్థితి.

మనస్సు ఒక్కటే కారణం కాదు కాని మనస్సు కూడా ఒక ముఖ్యమైన కారణం. మానసికఆరోగ్యం బాగుండాలంటే, బాహ్యంగా చూస్తాము. భార్యనో, పిల్లలనో మార్చటానికి ప్రయత్నిస్తాము, మన చుట్టూ ఉన్నవారిని మార్చటానికి ప్రయత్నిస్తాము, ప్రభుత్వాన్ని కూడా మార్చాలనుకుంటాము. అంటే ఎంతసేపూ బాహ్యంగా చూస్తున్నాము సమస్యను.

కాని మన మనస్సుకు ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనే శక్తి ఉందో లేదో గమనించము. మన మానసిక ఆరోగ్యం బాగుంటే, బయట వాతావరణం శుభ్రంగా లేకపోయినా, మన రోగనిరోధకశక్తి ఎంత బాగుంటుందంటే, మనకు ఏ రోగాలూ రావు.

ఆరోగ్యకరమైన శరీరం అని ఎప్పుడు చెప్పగలము? తరచు రోగాలు రాకపోవటం; వచ్చినా వాటి తీవ్రత తక్కువ ఉండటం; అవి ఉండే సమయం తక్కువ ఉండటం; అవి వచ్చివెళ్ళాక అట్టే అవస్థ పడకపోవటం. ఇదే సూత్రాన్ని మనస్సుకు ఉపయోగిస్తే మనస్సు దృఢంగా ఉంటే, ఇంతకుముందు చూసిన భయం, ఆందోళన, కోపం ఒత్తిడి, ఈర్ష్య, అసూయ, ఆత్మన్యూనతలాంటి మానసిక వికారాలు తరచు రావు. తరచు రాకపోతే, కుటుంబం అదృష్టం బాగుంది అని చెప్పవచ్చు. మనకు కోపం ఎక్కువ రాకపోతే, మన మానసిక ఆరోగ్యం మాట ఎలా ఉన్నా కుటుంబం హాయిగా ఉంటుంది. శారీరక ఆరోగ్యవిషయంలో లాగానే, మానసిక ఆరోగ్యము బాగుంటే కోపంలాంటి అనారోగ్యాలు కూడా తరచు రావు, వచ్చినా వాటి తీవ్రత తక్కువగా ఉంటుంది; అవి నిలిచే సమయం కూడా తక్కువ ఉంటుంది.

**ఉత్తమే తు క్షణం కోపో మధ్యమే ఘటికాద్వయమ్।**
**అధమే స్యాదహోరాత్రం పాపిష్టే మరణాంతికః॥**

**ఉత్తమే తు క్షణం కోపః** – ఉత్తమునికి కూడా కోపం వస్తుంది. కాని అతని ఆరోగ్యచిహ్నం ఏమిటి? అతని కోపం క్షణకాలమే ఉంటుంది. వెంటనే మర్చిపోతాడు.

**మధ్యమే ఘటికాద్వయమ్** – అంటే మధ్యమునికి కోపం ఒకటిన్నర గంటలు ఉంటుంది.

**అధమే స్యాత్ అహోరాత్రమ్** – అధముని కోపం ఒక రాత్రి, పగలు అంటే 24 గంటలు ఉంటుంది.

**పాపిష్టే మరణాంతికః** – పాపి కోపం అతను మరణించేవరకూ పోదు. అంటే అతను క్షమించనే లేడు.

అందువల్ల ఆరోగ్యకరమైన మనస్సు అంటే కోపం తరచు రానిది, వచ్చినా తీవ్రరూపం దాల్చనిది, ఎక్కువ కాలం కోపం నిలవనిది, కోపం పోయాక దాని ప్రభావం ఉండనిది. కొంతమందికి నిరాశానిస్పృహలు కలిగితే, ఒక పట్టాన పోవు. నెలల తరబడి, సంవత్సరాల తరబడి అందులో కూరుకుపోతారు.

అందువల్ల ఆరోగ్యకరమైన మనస్సుకు రెండు అంశాలు కలవాలి. బాహ్యప్రపంచం, ఆంతరికశక్తి. మనుష్యులు ఎంతసేపూ బాహ్యప్రపంచం గురించే మాట్లాడతారు. ఉద్యోగవాతావరణం బాగుండకపోతే, ఉద్యోగం మారు; భార్యతో పడకపోతే వేరే పెళ్ళి చేసుకో; ఇల్లు బాగుండకపోతే వేరే ఇంటికి మారు అంటూ సలహాలు ఇస్తారు. కాని వేదాంతం మిమ్మల్ని మీరు మార్చుకోండి అంటుంది. మన మానసిక స్థితిని స్థిరపరచుకుంటే, బాహ్యంగా ఎన్ని ఒడిదుడుకులు ఏర్పడినా కూడా మనం చలించము.

బాహ్య అంశాలు కలగజేసే మానసిక ఆందోళనలనుంచి విముక్తి పొందటమే మోక్షం. ఆ విషయం కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో చెబుతాడు.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥** – 2.56

జ్ఞాని కూడా జీవితంలో సవాళ్ళను, కష్టనష్టాలను ఎదుర్కొంటాడు, కాని అతని మనస్సు స్థిరంగా ఉండటంవల్ల కష్టనష్టాలకు కృంగిపోడు.

**భగవద్గీత సారాంశం – బాహ్యప్రపంచాన్ని మార్చటం కాదు, ఆంతరికశక్తిని పెంపొందించటం**

భార్యను, ఇంటిని, ఆఫీసును, కారును, ప్రభుత్వాన్ని మార్చమని చెప్పదు గీత. గీత మనలోని ఆంతరికశక్తిని వెతికి పట్టుకుని, దాన్ని దృఢపరచుకునే పద్ధతిని నేర్పి, మానసిక ఆందోళనలను పారద్రోలుతుంది. దీన్ని మోక్షం అంటారు. అందువల్ల భగవద్గీతను **మోక్షశాస్త్రం** అంటారు. రోగనిరోధకశక్తిని పెంపొందిస్తుంది – శారీరకంగా కాదు, మానసికంగా.

ఈ మానసిక శక్తిని ఎవరికి ఇస్తుంది భగవద్గీత? తనకు మానసిక బలహీనత ఉందని గుర్తించినవానికి. తనకు కామక్రోధాలు, రాగద్వేషాలు ఉన్నాయని, అవి తరచు బయటపడుతున్నాయని, వాటివల్ల తనవారు బాధపడతున్నారని గ్రహించినవానికి చెబుతుంది. అంటే తనలోని బలహీనతను గుర్తించాలి, దానినుంచి మనస్సును గట్టిపరచుకోవాలనే ఆసక్తి ఉండాలి.

భగవద్గీత మొదటి అధ్యాయం, అర్జునుడు అలా తన బలహీనతను గుర్తించేలా చేస్తుంది. మనలో బలహీనత ఉందని గుర్తిస్తే, ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నించే బదులు, మనలో శక్తి పెరగటానికి ప్రయత్నించాలి. శారీరక ఆరోగ్యానికి చ్యవనప్రాశ్, టానిక్కో తీసుకుంటాము; మానసిక ఆరోగ్యానికి జ్ఞానమనే టానిక్ తీసుకోవాలి. మొదటి అధ్యాయంలో అర్జునుడు తన బలహీనతను గుర్తించాడు. తరువాత ఆధ్యాత్మిక సాధకునిగా మారి, కృష్ణపరమాత్మను శరణు వేడుతాడు. అప్పుడు కృష్ణపరమాత్మ జ్ఞానమనే టానిక్‌ను ఇస్తాడు. ఇదీ గీతయొక్క నేపథ్యం.

గీత మొదటి అధ్యాయంలో అర్జునుని సమస్యను చూస్తాము.

మొదటి అధ్యాయాన్ని ప్రధానంగా ఐదు భాగాలుగా విభజించ వచ్చు.

| | | |
|---|---|---|
| **1. సందర్భం** | – | **శ్లోకాలు 1-19** |
| **2. ఒక మలుపు** | – | **శ్లోకాలు 20-25** |
| **3. అర్జునుని రాగం సమస్య** | – | **శ్లోకాలు 26-28( మొదటి పాదం)** |
| **4. అర్జునుని శోకం సమస్య** | – | **శ్లోకాలు 28(రెండవ పాదం) – 35** |
| **5. అర్జునుని మోహం సమస్య** | – | **శ్లోకాలు 36 – 47** |

### 1. సందర్భం శ్లోకాలు 1-19

అర్జునుడు విషాదంలో పడ్డ సందర్భాన్ని వివరిస్తున్నారు వ్యాసాచార్యులు. ఎవరికైనా, ఏదైనా అనారోగ్యం వస్తే ఏమంటారు? 'అదుగో ఆ నదిలో స్నానం చేశాను,' అనో 'ఫలానా కూర తిన్నాను' అనో అంటారు. అలాగే ఇక్కడ అర్జునుడు సంసారమనే సాగరంలో పడ్డ సందర్భాన్ని వివరిస్తున్నారు. సందర్భం మహాభారత యుద్ధభూమి.

కురుక్షేత్రంలో కౌరవులు, పాండవులు యుద్ధం చేయటానికి సమావేశమయ్యారు. యుద్ధభూమికి వచ్చినప్పుడు అర్జునుని వివేకం బాగానే పనిచేస్తున్నది. అతనికి స్వజనులతో యుద్ధం చేయబోతున్నాననే బెంగ లేదు. ఎందుకు? తాము అంతకుముందే దుర్యోధనాదులమీద సామదానభేద ఉపాయాలన్నీ ప్రయోగించారు. చివరి ప్రయత్నంగా శ్రీకృష్ణుడిని రాయబారానికి పంపారు. ఎందుకు? అప్పుడు కూడా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని, కాని వారేం చేశారు? కృష్ణపరమాత్మను చంపటానికి ప్రయత్నించారు. దూతకు హాని చేయకూడదు, కాని వారు దాన్ని లెక్క చెయ్యలేదు. అందువల్ల ధర్మయుద్ధం చేయటానికి, స్పష్టమైన అవగాహనతోనే యుద్ధభూమికి వచ్చాడు అర్జునుడు.

మొదటి 20 శ్లోకాల్లో యుద్ధభూమిలో ఏం జరిగిందో వివరించారు వ్యాసాచార్యులు. ముందుగా దుర్యోధనుడు తన గురువైన ద్రోణాచార్యుని దగ్గరికి వెళ్ళి ఇరువైపుల బలాబలాలు బేరీజు వేసి, తమ సైన్యం బలహీనంగా ఉంది అన్నాడు. నిజానికి నిష్పక్షపాతంగా చూస్తే, దుర్యోధనుని సైన్యం 11 అక్షౌహిణులు ఉంటే, పాండవుల సైన్యం 7 అక్షౌహిణులు మాత్రమే ఉంది. కాని దుర్యోధనుడు డీలా పడ్డాడు అంటే, అతను అధర్మం వైపు ఉన్నాడు. అతని నిరుత్సాహం చూసి, అతనిని ఉత్తేజపరచటానికి భీష్మాచార్యులు తన శంఖాన్ని పూరించారు. అది చూసి ఇరువైపుల యోధులు శంఖనినాదాలు చేశారు. యుద్ధానికి సంసిద్ధతను ఇరువైపుల యోధులు సూచించారు. అంటే అసలు సమయం ఆసన్నమైంది. యుద్ధసన్నాహాలు జరిగాయి.

### 2. ఒక మలుపు శ్లోకాలు 20-25

ఇంతలో ఒక మెరుపు మెరిసినట్టు అర్జునునికి ఒక ఆలోచన వచ్చింది. తను ఎవరితో యుద్ధం చేయాలో వారిని దగ్గరనుంచి చూడాలనిపించింది. నిజానికి అది అవసరం లేదు. బహుశ అది అనుకోని వరమేమో! చూడటానికి ప్రతికూలనిర్ణయంగా కనిపించినా, దానివల్ల మేలే జరిగింది. అర్జునుడు శోకంలో మునిగిపోయాడు కాని ఆ శోకంవల్లనే, ఇంత గొప్ప బోధ భగవద్గీత రూపంలో వెలువడింది.

**అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।**

**ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥** - 1.20

**హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే ।** - 1.21

అథ పదం మలుపు తెస్తుంది. అథ అంటే చెబుతున్న అంశంలో కాని, ఉన్న సందర్భంలో కాని మార్పును సూచిస్తుంది. కృష్ణా, రథాన్ని ఇరువైపుల సైన్యాల మధ్యలో నిలుపు, నేను వారిని స్పష్టంగా చూస్తాను అన్నాడు.

అప్పటికి కృష్ణుడు గురువు కాదు, అర్జునుడు శిష్యుడు కాదు. అందువల్ల అర్జునుని ఆజ్ఞను పాటించాడు కృష్ణుడు. కాని తన లీల ప్రదర్శించాడు అందులో. రథాన్ని దుర్యోధనుడు, కర్ణుల ముందు నిలిపివుంటే మహాభారతయుద్ధం వెంటనే జరిగివుండేది. భగవద్గీత ఉద్భవించేది కాదు. ఎవరిమీదైతే అర్జునునికి అనురాగం ఉందో, వారి ముందు తీసుకువెళ్ళి నిలిపాడు. పార్థసారథి గీతాచార్యునిగా మారే సందర్భానికి అది బీజం అయింది. కృష్ణుడు జగద్గురువు అయ్యాడు. అర్జునుడు కౌరవులను దగ్గర్నుండి చూసే సందర్భం రెండవ అంశం.

### 3. అర్జునుని రాగం సమస్య శ్లోకాలు 26-28( మొదటి పాదం)

మూడవ అంశం, అర్జునుని బలహీనత. దాన్ని రాగం అంటారు. ఇది శాస్త్రీయసంగీతంలో చూసే రాగం కాదు, ఇది అనురాగం, బంధకత్వం. బాహ్యవస్తువులమీదో, మనుష్యులమీదో మానసికంగా ఆధారపడటం. దీన్ని బలహీనత అని ఎందుకన్నామంటే, ఎప్పుడైతే బాహ్యవస్తువులమీదో, మనిషిమీదో మనం ఆనందంకోసం ఆధారపడతామో, అవి కనుమరుగైన మరుక్షణం కృంగిపోతాము. అంటే మన ఆనందం బాహ్యప్రపంచంమీద ఆధారపడివుంది. బాహ్యప్రపంచం మన అధీనంలో లేదు. మన కుటుంబసభ్యులు, మన పిల్లలే మన అధీనంలో లేరు – మన అధీనంలో లేనివాటిమీద ఆధారపడితే, మన జీవితం ప్రమాదంలో పడుతుంది. ఎందుకంటే మన ఆనందాన్ని అవి నిశ్చయిస్తాయి.

'మా పిల్లవాడు నా మాట వినటం లేదు, అందువల్ల నాకు దుఃఖం కలుగుతోంది,' అని మనమంటే వేదాంతం, 'మీ సమస్యను ఎలా చెప్పాలో తెలియటం లేదు మీకు,' అంటుంది. మాట వినని కొడుకు కాదుట సమస్య! మరైతే సమస్య ఏమిటి? నా కొడుకు నా మాట వింటే నాకు ఆనందం కలుగుతుంది అనుకోవటం సమస్య. మాట వినని కొడుకు అంటే సమస్యను బాహ్యంగా చూపిస్తున్నాము. అతను నా మాట వినటంమీద నా ఆనందం ఆధారపడివుంది అని మనం అంటే అది తట్టుకోలేని మన మనస్సులో ఉంది సమస్య .

ఇప్పుడు చెప్పండి, సమస్య మనలో ఉందా, బాహ్యంగా ఉందా? మనం ఏ సమస్యను చెప్పినా, వేదాంతం మనం సమస్యను సరిగ్గా అర్థం చేసుకోవటం లేదు అంటుంది. కరెంటు పోయింది, నాకు బాధ వేసింది అని మనం అంటే, కరెంటు ఉంటే నాకు ఆనందం కలుగుతుంది అనుకోవటం సమస్య. ఈ విధంగా బాహ్యవస్తువు నేను కోరుకున్నట్టు ఉంటే నాకు ఆనందం కలుగుతుంది అనుకోవటం రాగం. రాగం అంటే ఆధారపడటం, బంధం పెంచుకోవటం, వారినుంచి లేదా వాటినుంచి ఏదో ఆశించటం.

అర్జునుడు ఈ రాగం అనే బంధంలో పడిపోయాడు. తన వారు అనుకున్నవారు తనతో శాశ్వతంగా ఉండాలి అనుకున్నాడు. వారు తనతో ఇకముందు ఉండబోరు అనే ఊహనే భరించ లేకపోయాడు. అర్జునుడు భీష్ముడు లేని జీవితాన్ని, ద్రోణుడు లేని జీవితాన్ని, మరికొంతమంది లేని జీవితాన్ని ఊహించుకోలేకపోయాడు. దానివల్ల రాగంలో పడిపోయాడు. ఇది సంసారానికి ప్రాథమిక సూత్రం.

**కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ ।** – 1.28

శరీరపరంగా మనం బాహ్య ప్రపంచంమీద ఆధారపడక తప్పదు. మన ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, గూడు బాహ్యంగానే దొరుకుతాయి. దానికి ఇతరుల సహాయసహకారాలు అవసరం కూడా. అందువల్ల శారీరక స్వేచ్ఛ గురించి వేదాంతం ఎన్నడూ చెప్పదు. మానసికంగా ఆధారపడవద్దని చెబుతుంది. ఎందుకంటే అది అవసరం లేదు కూడా.

**ఆత్మని ఏవ ఆత్మనః తుష్టః**

జ్ఞాని ఆత్మలో రమిస్తాడు. ఇది భగవద్గీత సారాంశం. బాహ్యవిషయాలు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా కూడా ఆనందంగా ఉండగలము అంటుంది గీత. కర్ర పట్టుకుని నడిచే వ్యక్తి, కర్ర లేకపోతే తను విడిగా ఎన్నటికీ నడవలేను అనుకుంటాడు. ధూమపానం చేసే వ్యక్తి అది లేని జీవితాన్నే ఊహించుకోలేదు. నిజానికి అతనే ఉన్నాడు, సిగరెట్టుకి బానిస కాకముందు. అది గుర్తుండదు. అలా త్రాగుడుకు బానిస అవుతారు కొందరు. మందు లేకపోతే జీవితం లేదు అనుకుంటారు. అది కేవలం వారి ఊహ, నిజం కాదు! అలాగే ఎవరిమీదా మానసికంగా ఆధారపడకుండా హాయిగా ఉండగలము. మూడవ అంశం **రాగం సమస్య.**

### 4. అర్జునుని శోకం సమస్య శ్లోకాలు 28(రెండవ పాదం) – 35

రాగంయొక్క పరిణామం శోకం. దీన్ని విషాదం అని కూడా అంటారు. అందువల్లనే ఈ అధ్యాయానికి అర్జున విషాదయోగం అనే పేరు వచ్చింది. బాహ్యవస్తువుమీద మన ఆనందంకోసం ఆధారపడితే, శోకం తప్పదని చూశాము. ఎందుకు? ఆ బాహ్యవస్తువు శాశ్వతం కాదు. నిజానికి మనం ఆధారపడ్డ వస్తువు మన నుంచి దూరమవనవసరం లేదు, అది దూరమవుతుందేమోననే ఆలోచనే చాలు, మనం దుఃఖంతో కృంగిపోవటానికి. నిజానికి భీష్మద్రోణులు మరణించలేదు; తను యుద్ధం చేస్తే మరణిస్తారు అనే ఊహనే భరించలేకపోయాడు అర్జునుడు.

సిగరెట్టులాంటి అలవాట్లు వదులుకోవటం కష్టమని చూశాము. కాని నిజంగా వదులుకుందామని ప్రయత్నించే అతని అవస్థ చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ అలవాటు అలవాటయిన కొత్తల్లో మానటానికి ప్రయత్నిస్తే, కొంచెం తేలికగా మానవచ్చు. దానికి బానిస అయితే, బయట పడటానికి చాలా శ్రమ పడాల్సి ఉంటుంది. అంటే రాగం ఎంత తీవ్రంగా ఉంటే, శోకం అంత ఎక్కువగా ఉంటుంది. అర్జునుని విషయంలో రాగం ఎంత తీవ్రంగా ఉందంటే, శోకం అతని శరీరానికి కూడా ప్రవహించింది.

**గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।**
**న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥** – 1.30

ఆ విధంగా తీవ్రమైన శోకాన్ని పొందాడు అర్జునుడు. నాలుగవ అంశం **శోకం సమస్య.**

## 5. అర్జునుని మోహం సమస్య శ్లోకాలు 36 – 47

ఈ శ్లోకాల్లో చివరి అంశాన్ని చూస్తాము. రాగం, శోకాల తదుపరి పరిణామం మోహం. మనస్సు కలతచెందేసరికి, బుద్ధి పనిచేయటం మానేస్తుంది. అంటే అవివేకంలో పడిపోతుంది. అర్జునుడు కూడా ఆ అవివేకంలో పడిపోయాడు. యుద్ధం చేయాలా, వద్దా అనేది అతని సమస్య. మోహంవల్ల అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకుంటాడు.

**ఎ) అధర్మయుద్ధం** – ఈ మోహంవల్ల ధర్మయుద్ధాన్ని అధర్మయుద్ధంగా భావించాడు. యుద్ధరంగానికి రాకముందు ఈ అయోమయం లేదు. అతనికి ఇది ధర్మయుద్ధం అని స్పష్టంగా తెలుసు. ఈ యుద్ధం చేయాలనే నిర్ణయాన్ని రాత్రికి రాత్రి తీసుకోలేదు. 13 సంవత్సరాలు అడవిలో అవస్థలు పడుతుండగా, ఆలోచించి తీసుకున్న నిర్ణయం. అది కూడా తను ఒక్కడూ తీసుకోలేదు. ధర్మరాజు, భీముడు, నకులుడు, సహదేవుడు, కృష్ణపరమాత్మ, ద్రౌపది, కుంతిలాంటి ముఖ్యులతో సంవత్సరాల తరబడి చర్చించాక, సంఘటితంగా తీసుకున్న నిర్ణయం అది. అంత స్థిరమైన నిర్ణయం తీసుకున్నాక కూడా, అర్జునుని మనస్సు ఊగిసలాడి, ధర్మయుద్ధాన్ని అధర్మయుద్ధంగా భావించేలా చేసింది.

**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః ।।** – 1.36

ఈ వాక్యం అతను మోహంలో పడ్డాడని చూపిస్తున్నది. ఒకపక్క వారిని ఆతతాయిలు అంటూనే, వారిని చంపితే మహాపాపం అన్నాడు. ఇదెలా ఉందంటే, నేరస్థులకు నేను శిక్ష విధిస్తే అది మహాపాపం అని న్యాయాధికారి చెప్పినట్టు ఉంటుంది. నేరస్థుణ్ణి శిక్షించటం తప్పుకాదు. అలాగే అర్జునుడు క్షత్రియుడుగా యుద్ధం చేసి తీరాలి, కాని ఈ నేరస్థులను చంపితే నేను పాపం మూటగట్టుకుంటాను అన్నాడు.

**బి) ప్రత్యవాయ పాపం** – పాపాలు రెండు రకాలుగా ఉంటాయి. చేయవలసిన కర్మను చేయకపోతే ఒక పాపం, చేయకూడని కర్మను చేస్తే అది ఇంకొక పాపం. చేయవలసిన కర్మను చేయకపోతే దాన్ని ప్రత్యవాయ పాపం అంటారు. అర్జునుడు క్షత్రియుడు కాబట్టి ధర్మయుద్ధం చేయాలి. కాని తాను యుద్ధం చేయను, చేస్తే అది పాపం అవుతుంది అంటున్నాడు. అంటే అతను పాపాన్ని పుణ్యంగా, పుణ్యాన్ని పాపంగా చూస్తున్నాడు. తప్పును ఒప్పుగా, ఒప్పును తప్పుగా చూడటమే మోహం. అంటే ధర్మ–అధర్మ–అవివేకంలో పడిపోయాడు. అతని మోహం ఎంతగా ఉందంటే, అది అతని బుద్ధిలోకి కూడా ప్రవేశించింది.

అసలైతే బుద్ధి చెప్పినట్టు మనస్సు బుద్ధిగా వినాలి. మనస్సు పగ్గాలు బుద్ధి చేతిలో ఉండాలి. కాని మనస్సు రాగం–శోకం–మోహంలో పడిపోతే, దానితో బుద్ధి వాదించలేదు. అణగద్రొక్కిచూడు లేదా అణగిపో సూత్రం ప్రకారం బుద్ధి చెప్పి చూస్తుంది, మనస్సు వినకపోతే, బుద్ధే బుద్ధిగా మనస్సుకు లొంగిపోతుంది. లొంగిపోవటమే కాకుండా, మనస్సు చర్యను సమర్థించటానికి చూస్తుంది. అర్జునుడు ఇప్పుడు అదే స్థితిలో ఉన్నాడు.

**సి) కులక్షయం –** తన మోహంలో కృష్ణపరమాత్మకు కులక్షయం గురించి పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు.

**కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।**
**ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మోఽభిభవత్యుత ॥** – 1.40

ఈ వాదనల్లో కుటుంబంయొక్క ప్రాముఖ్యతను నొక్కివక్కాణించాడు అర్జునుడు. నిజమే, మన సంస్కృతి కుటుంబంమీద ఆధారపడివుంది. అందువల్ల కుటుంబాన్ని గౌరవించని చోట సంస్కృతి నిలబడదు. వెంటనే కాదు, ఒక తరం పడుతుంది. కుటుంబం నశిస్తే ఎలాంటి సమస్యలు వస్తాయో వివరించాడు అర్జునుడు. పితృదేవతలకు తర్పణాలు వదలరు, కర్మలమీద, ధర్మంమీద, యజ్ఞయాగాదులమీద, మతంమీద, భగవంతునిమీద– ఒక్కటేమిటి, అన్నిటిమీదా నమ్మకం పోతుంది ముందు తరాలవారికి. ఇవి నిజమే కాని, అర్జునుడు ఇవి చెప్పాల్సిన సందర్భం కాదు అది. ఐదవ అంశం **మోహం సమస్య.**

**రాగం + శోకం + మోహం = సంసారం**

బంధకత్వం, దానివల్ల దుఃఖం, దానివల్ల బుద్ధి నాశనం ఎవరినైనా సంసారంలో పడవేస్తుంది. మామూలుగా సంసారి అని లేదా గృహస్థని అంటారు. కాని ఏ ఆశ్రమధర్మంలో ఉన్నా ఈ మూడింటి ప్రభావంలో పడితే అతను కూడా సంసారే అవుతాడు. పక్కా సన్న్యాసి కూడా తన ఆశ్రమంమీద రాగం పెంచుకుని, తన తరువాత ఎవరు చూస్తారు ఆశ్రమాన్ని అనే శోకం పెంచుకుంటే అతను కూడా సంసారే. కాషాయవస్త్రాలలో ఉన్న సంసారి. దానికి భిన్నంగా గృహస్థుగా ఉండి పిల్లలు, మనవళ్ళు ఉన్నా కూడా రాగ–శోక–మోహాలు దరిదాపుల్లోకి రానివ్వని వ్యక్తి విముక్తి పొందినట్టే. భగవద్గీతలో అనేకచోట్ల కృష్ణపరమాత్మ ఈ రెండు విషయాలను నొక్కి చెబుతాడు. సన్న్యాసి అయినా, రాగం ఉంటే సంసారి – సంసారి అయినా ఆంతరిక స్వేచ్ఛ పొందితే సన్న్యాసి– ఆంతరికస్వేచ్ఛ ముఖ్యం.

అర్జునుడు తన సమస్యను కనుగొన్నాడు. ఏమిటది? సంసారం, కాని, దానికి పరిష్కారం వచ్చేముందు, ఇంకో రెండు దశలు దాటాలి అతను. ఏమిటవి? నిస్సహాయత, శరణాగతి. అప్పుడు కృష్ణుడు గీతోపదేశం చేస్తాడు. ఇప్పుడు నాలుగు దశలనూ ఒకసారి చూస్తే – సంసార దుఃఖం, కార్పణ్య అవస్థ, శరణాగతి, ఆత్మబోధ. మొదటి అధ్యాయంలో సమస్యను మాత్రమే చూశాము.

ఇంకా అర్జునుడు నిస్సహాయస్థితికి రాలేదు. మన దైనందిన జీవితంలో కూడా చూడండి – ఏదో ఒక రోగం వచ్చిందని ముందు తెలుసుకుంటాము. అది మొదటిదశ. కాని రోగం రాగానే డాక్టరు దగ్గరికి వెళ్ళము. ముందు స్వంతంగా ఏదో మాత్ర వేసుకుంటాము, లేదా బామ్మ వైద్యం ప్రయత్నిస్తాము. కాదంటే కషాయం తాగి చూస్తాము. అలాగే ఒక సమస్యను కనుగొన్నాక కూడా వెంటనే ఎవరినీ సలహా అడగము. మనమే రకరకాల ఆలోచనలు చేస్తాము. రకరకాల పరిష్కారాలు ప్రయత్నిస్తాము. ఊబిలో కూరుకుపోయిన వ్యక్తిని, అదే ఊబిలో ఉన్న వ్యక్తి రక్షించలేదు. బయట స్థిరంగా ఉన్న భూమిమీద నిలబడ్డ వ్యక్తే రక్షించగలడు. అతనిని నిస్సహాయస్థితిలో సహాయం కోరుతాడు. ఇది రెండవ స్థితి. దీన్ని వేదాంతం దైన్యభావన లేదా కార్పణ్యం అంటుంది.

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥** – 2.7

మన సమస్యను మనం పరిష్కరించుకోలేము అనే నిస్సహాయస్థితికి చేరినప్పుడు, ఏం చేస్తాము? దాన్ని తీర్చగల సమర్థుణ్ణి శరణు వేడుతాము. మూడవ దశ శరణు వేడటం. నాలుగవ దశ దానికి పరిష్కారం చూపటం. ఇక్కడ అర్జునుడు మొదటి అధ్యాయంలో మొదటిదశలోనే ఉన్నాడని చూశాము. రెండు, మూడు దశలను రెండవ అధ్యాయం మొదట్లో చూస్తాము. అతను ఆ దశలు కూడా దాటేదాకా కృష్ణపరమాత్మ నోరు విప్పడు. కృష్ణపరమాత్మ నోరు విప్పలేదు కాబట్టి తన నిర్ణయం సబబే అనుకున్నాడు అర్జునుడు. ధనుర్బాణాలను త్యజించి, శోకంతో రథంలో చతికిలబడ్డాడు అర్జునుడు.

**ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।**
**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥** – 1.47

శోకంతో ఉన్నాడు అంటే తక్కిన రెండూ కూడా కలుపుకోవాలి. అవి రాగం, మోహం. ఇటువంటి పరిస్థితిలో మొదటి అధ్యాయం ముగిసింది.

ఈ నేపథ్యంతో రెండవ అధ్యాయంలోకి అడుగుపెట్టాలి. రెండవ అధ్యాయాన్ని సంక్షిప్త అధ్యాయం అనవచ్చు. భగవద్గీత సారమంతా ఆ ఒక్క అధ్యాయంలో అద్భుతంగా వస్తుంది.

రెండవ అధ్యాయంలో నాలుగు అంశాలు ఉన్నాయి. అవి – అర్జునుని శరణాగతి, కర్మయోగం, జ్ఞానయోగం, స్థితప్రజ్ఞుని లక్షణాలు.

1. **అర్జునుని శరణాగతి**

**ఎ) సంసార దుఃఖం–** అర్జునుడు తన సమస్యను తెలుసుకున్నాడు కాని, ఇంకా నిస్సహాయస్థితికి చేరుకోలేదు. అందువల్ల మొదటిభాగంలో అతనిలోని ఘర్షణను చూస్తాము.

**బి) కార్పణ్య అవస్థ–** అర్జునుడు యుద్ధరంగంనుంచి విరమించు కుందామని అనుకున్నాడు కాని ఎక్కడో అతని అంతరాత్మ అది తప్పని వేలెత్తి చూపుతోంది. అతనికి వచ్చిన ఆలోచన సరియైనదే అని నమ్మకం కలిగివుండి ఉంటే, వెంటనే యుద్ధభూమినుంచి పారిపోయి ఉండేవాడు. కాని ఎక్కడో ఏదో తప్పనిపిస్తోంది. కొన్ని సంవత్సరాలుగా ప్రణాళిక వేసుకున్న యుద్ధరంగంనుంచి పారిపోవటం సబబేనా? అతని అంతరాత్మ అతను తీసుకున్న నిర్ణయం తప్పనీ, అతను అయోమయంలో పడ్డాడనీ చెబుతున్నది.

అప్పుడు నిస్సహాయస్థితిని అనుభవిస్తాడు. తన సమస్యను తను పరిష్కరించుకోలేనని గ్రహిస్తాడు.

**న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః ।**
**యానేవ హత్వా న జిజీవిషామః తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥** – 2.6

ఓ కృష్ణా, నేను యుద్ధం చేయటం శ్రేష్ఠమా? లేక చేయకపోవటం శ్రేష్ఠమా? నేను ఎటూ తేల్చుకోలేక పోతున్నాను. ఒకవైపు మేము చేసేది ధర్మయుద్ధం, అందువల్ల నేను యుద్ధం చేయాలి అని బుద్ధి చెబుతున్నది. కాని నా మనస్సు నీ గురువును, నీ స్వజనులను ఎలా చంపుతావంటున్నది. నేనేం చేయాలి? అప్పుడు అర్జునుడు తన నిస్సహాయస్థితిని గుర్తించాడు.

**సి) శరణాగతి–**

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ –** 2.7

నేను ధర్మాధర్మాల విచక్షణను కోల్పోయాను. ఎప్పుడైతే తన నిస్సహాయతను గుర్తించాడో, ఇంక ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయలేదు అర్జునుడు. సాక్షాత్తూ జగద్గురువే అతని కళ్ళ ముందు ఉన్నాడు. మనమంటే గురువును వెతుక్కోవాలి కాని అర్జునునికి ఆ సమస్య లేదు. అందుకని రెప్పపాటుకాలంలో అర్జునుడు 'ఓ కృష్ణా, నాకు శ్రేయస్కరమైనది ఏదో నువ్వే చెప్పు,' అన్నాడు. మూడవదశలోకి వచ్చాడు. శరణాగతి దశ.

**డి) ఆత్మబోధ –** దానికి కృష్ణపరమాత్మ పరిష్కారం చూపాలి. సంసారమనే రోగానికి **సంసార నివారణ ఔషధం** ఇస్తాడు కృష్ణపరమాత్మ. గీతాశాస్త్రాన్ని **భవరోగ ఔషధం** అంటారు. అర్జున శరణాగతి మొదటి అంశం.

2. **కర్మయోగం – జ్ఞానయోగ్యతా ప్రాప్తి –** డాక్టరు దగ్గరకి శుక్లాల జబ్బుతో ఒక వ్యక్తి వెళ్ళాడనుకోండి. డాక్టరు ఏం చేస్తాడు? ముందు అతని ఆరోగ్యం ఎలావుందో పరీక్షిస్తాడు. అంటే ఆపరేషన్ చేయించుకునే యోగ్యత ఉందా లేదా చూస్తాడు. అంటే బిపి, షుగరు ఉన్నాయా, ఉంటే కంట్రోల్లో ఉన్నాయో లేదో చూశాక, అపరేషన్ చేస్తాడు. ఆధ్యాత్మిక సాధనలో జ్ఞానం ఆపరేషన్ అయితే, కర్మయోగం జ్ఞానయోగ్యతాప్రాప్తి.

3. **జ్ఞానయోగం – బ్రహ్మజ్ఞానప్రాప్తి, జ్ఞాననిష్ఠ.**

4. **స్థితప్రజ్ఞుని లక్షణాలు – పూర్ణత్వం, సమత్వం –** రాగశోకమోహాలను పోగొట్టుకుని, జ్ఞానయోగ్యతాప్రాప్తి పొంది, బ్రహ్మజ్ఞాన ఔషధం పొందిన స్థితప్రజ్ఞుని లక్షణాలు ఎలా ఉంటాయో చూస్తాము.

**నందతి నందతి నందత్యేవ – భజగోవిందం**

ఆనందమే ఆనందం. శారీరక ఆరోగ్యం ఉన్న వ్యక్తి ఎలా జీవితాన్ని అనుభవిస్తాడో, అలా మానసిక ఆరోగ్యం ఉన్న వ్యక్తి ఆత్మలోనే రమిస్తాడు. పూర్ణత్వాన్ని, సమత్వాన్ని పొందుతాడు.